జె. కృష్ణమూర్తి

ఈ విషయమై ఆలోచించండి

రెండవ భాగము

కృష్ణమూర్తి ఫౌన్‌డేషన్ ఇండియా

EE VISHAYAMAI ALOCHINCHANDI — Part Two
Telugu Translation of the book appearing in Two titles :
in England as *This Matter of Culture* &
in U.S.A. as *Think on these Things.*

Translation into Telugu by
C. Hanumantha Rao.

Copies can be had at:
Krishnamurti Foundation India,
64, Greenways Road, Madras - 600 028.

First Edition - 1991

Laser Typesetting and Printed by:
GEE BEE GRAPHICS
40/3, Mint Subbarayalu Naidu St.,
Madras - 600 021.
Ph: 555542.

ప్రస్తావన

జె. కృష్ణమూర్తి (1895 - 1986) విశ్వవిఖ్యాత తత్త్వవేత్త. ప్రపంచంలోని వివిధ దేశాలను పర్యటిస్తూ, అరవయి సంవత్సరాలపాటు ప్రజలకు జీవనసందేశాన్ని తమ ప్రసంగాల ద్వారా అందజేశారు.

"ఒక నిర్దిష్టమైన మార్గం ద్వారా 'సత్యాన్ని' చేరలేము. 'సత్యం' అనేది మార్గంలేని ప్రదేశం. సంస్థల ద్వారా, నమ్మకాల ద్వారా, పూజా పునస్కారాల ద్వారా, గురువుల ద్వారా దాని చెంతకు చేర లేము. ఆధ్యాత్మిక బోధనలవల్ల, మానసిక వికాసానికై చేసే ప్రక్రియల వల్ల దానిని అందుకోలేము. ఇతరులతో గల పరస్పర సంబంధాలు అనే దర్పణం సహాయంతో మనలను మనము పరిశీలన చేసుకొని అర్థం చేసుకొనడం ద్వారా మాత్రమే యీ పని సాధ్యం అవుతుంది." — అని వక్కాణించారు.

కృష్ణమూర్తి వుపన్యాసాలు, రచనలు అన్నీ యింగ్లీషులోనే సాగాయి. భారతీయ భాషలు కొన్నింటిలోకి కొన్ని ప్రసంగాల, పుస్తకాల అనువాదం యిప్పటికే జరిగింది. కృష్ణమూర్తి ఆలోచనా స్రవంతిని యథాతథంగా, యితర భారతీయ భాషలలో సరళమైనశైలిలో అందించాలనే వుద్దేశ్యంతో కృష్ణమూర్తి ఫౌండేషన్ యిండియా స్వయంగా అనువాద కార్యక్రమాలను ఆరంభించింది. ఆ ప్రయత్నంలో భాగంగా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో అనువాదాల ప్రచురణను మద్రాసు కేంద్రంగా చేసుకొని నిర్వహిస్తున్నాము.

ఈ పుస్తకాల సహాయంతో కృష్ణమూర్తి ఆశించిన నవ మానవ ఆవిర్భావం, నవ్య సమాజ అవతరణ గురించి చదువరులు తమ తమ భాషల్లోనే చదివి అర్థంచేసుకొనడానికి వీలవుతుందని ఆశిస్తున్నాం. కృష్ణ మూర్తి తత్త్వదర్శనాన్ని తరచి చూసుకొని, అవగాహన చేసుకొనడానికి, ఆచరణలోనికి తీసుకొనిరావడానికి యీ పుస్తకాలు దోహదం చేస్తాయి. పాఠకులు వీటిని ఆదరిస్తారని నమ్ముతున్నాము.

వసంత విహార్,
గ్రీన్ వేస్ రోడ్డు,
మదరాసు - *600 028.*

సమన్వయ కర్త
దక్షిణ భాషల అనువాద విభాగం
కృష్ణమూర్తి ఫౌండేషన్, ఇండియా

* * *

అనువాదకుని

తొలిపలుకు

జిడ్డు కృష్ణమూర్తి ప్రతిసంవత్సరము తాను చేసెడి ప్రపంచ పర్యటనలో ఒక భాగముగా నవంబరు-ఫిబ్రవరి నెలల మధ్య షుమారు మూడు నెలలపాటు భారతదేశములో పర్యటిస్తూ వుండేవారు. వారి ప్రసంగాలు సాధారణంగా ఢిల్లీ, వారాణసి, మద్రాసు, రిషివ్యాలీ, బొంబాయిలలో జరుగుతూ వుండేవి. వారాణసిలోను, రిషివ్యాలీలోను వారు చేసిన ప్రసంగాలు ప్రధానంగా అక్కడున్న తమ పాఠశాలలలోని విద్యార్థుల నుద్దేశించి చేసినవి.

వారాణసిలోని తమ రాజ ఘాట్ బెసంట్ స్కూలు విద్యార్థుల నుద్దేశించి 1954వ సంవత్సరము డిసెంబరు నెల 27వ తేదీ మొదలుకొని 1955వ సంవత్సరము ఫిబ్రవరినెల 8వ తేదీ వరకు ఆయన మొత్తం 27 ప్రసంగాలు చేసియుండిరి. ఇంత దీర్ఘకాలము వారొకేచోట నిలిచి ప్రసంగించిన సందర్భములరుదు. ఆ 27 ప్రసంగాలున్ను పరిష్కరింపబడి This Matter of Culture అనే పేరుతో ఇంగ్లండులోను, Think on These Things అనే పేరుతో అమెరికాలోను ప్రచురింపబడినవి. వాటి కనువాదమే యీ పుస్తకము.

ఒక భాషలోనుండి మఱియొక భాషలోనికి సరియైన అనువాదము సుకరము కాదని అందరికిని తెలిసిన విషయమే. అందులోను కృష్ణజీ రచనలు అనువాదానికి సులభముగా లొంగునవి కావు. అయినా ఈ ప్రస్తుతానువాదములో మూలమునకు న్యాయము చేకూర్చడానికై యథాశక్తి ప్రయత్నింపబడినది.

ఈ ప్రసంగాలు పేరుకు విద్యార్థులనుద్దేశించి చేసినవే యైనప్పటికిన్ని పెద్దలకు గూడ, కృష్ణజీని అర్థము చేసికొనడంలో మిక్కిలి తోడ్పడగలవు. సోదరులైన తెలుగుదేశ ప్రజలు ఈ యనువాదమువలన ప్రయోజనము పొందగలరని ఆశిస్తున్నాను.

1.
2.
3.
4.
5.
6.
7.
8.
9.
10.
11.
12.
13.

N.
చదివితే
పెట్టివే

విషయ సూచిక

N.B. చాల మెల్లగా, ఒక్కొక్క వాక్యమునే అర్థము చేసికొంటూ చదివితేనే గాని కృష్ణజీ రచనలు బోధపడవు. గబగబా చదివి దూరంగా పెట్టివేయ దగినవి కావివి.

మాట్లా
మనకు
మన
కష్టమ
నాటు
విధంగా
దానిని
మనస్సు
మివ్వక
అవసర

కార
కలిసి
అనుభ
మనం
ఎట్టి
వుండ
పించో
ప్రపం
యడం
ఒకవే

1

పరస్పర సహకారము

మన మనేక విషయాలగురించి అనేక జీవిత సమస్యల గురించి మాట్లాడుతూ వచ్చాము కదా. కాని అసలు 'సమస్య' అంటే యేమిటో మనకు నిజంగా తెలుసునా యని నా అనుమానం. సమస్యలను మనం మన మనస్సులో వేరునాటుకోనిస్తే పిదప వాటిని పరిష్కరించడం చాల కష్టమవుతుంది. సమస్యలను సృష్టించేది మనస్సే, మరల అవి వేరు నాటుకోడానికి తగిన మన్నుగా ఉపయోగపడేది గూడ మనస్సే. ఆ విధంగా ఒకసారి ఒక సమస్య మన మనస్సులో బాగా నాటుకొన్నదంటే దానినింక సమూలంగా పెళ్ళగించివేయడం చాల కష్టం. అందువలన మనస్సు స్వయంగా సమస్యను గుర్తించి అది పెరగడానికి అవకాశ మివ్వకుండడం అది వేరునాటుకోడానికి దోహదమీయకుండడం చాల అవసరం.

ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో నొకటి సహ కార సమస్య. సహకారమనే మాటకు అర్థమేమి? సహకరించడమంటే కలిసి పనిచేయడం, కలిసి నిర్మించడం, సుఖదుఃఖములను సమంగా కలిసి అనుభవించడం. మనందరిలో సమానంగా ఏదైనా వుంటే, అప్పుడే మనందరం స్వేచ్ఛగా కలిసి పనిచేయగలం. కాని మనుషులు సహజంగా, ఎట్టి నిర్బంధం లేకుండా, సంతోషంగా కలిసి పనిచేయడానికి సుముఖులై వుండరు; బెదిరించో, భయపెట్టో, దండించో లేదా యేదైనా యెరచూ పించో ఏదో విధంగా వారిచేత బలవంతంగా పనిచేయిస్తారు. ఇది ప్రపంచమంతటా వుండే తీరు. క్రూరప్రభుత్వాల క్రిందనైతే కలిసి పనిచే యడం కోసం దయాదాక్షిణ్యాలు లేకుండా మిమ్ము బలవంత పెడతారు. ఒకవేళ మీరు సహకరించకపోతే, మిమ్మసలు భూమిమీద లేకుండా చేసి

వాండ్లు కేవలం సహాయపడగోరుతారు. వాండ్లు సహజంగా ఒకరికొకరు సహాయంచేసికొంటారు. కలిసి మెలిసి వుండడం, కలిసి మెలిసి చేయడమనేది వారికొక వినోదంగా వుంటుంది. కాని మనం, పెద్దవాండ్లం, పిల్లలలోని ఆ సహజ గుణాన్ని పరస్పరము సహకరించుకొనే ఆ సహజ స్వభావాన్ని నశింపజేస్తాం. "నీవిది చేస్తే అది నీకిస్తా", "ఇది చేయకపోతే నేను నిన్ను సినిమాకు తీసికొని పోను" — అని యిట్టి ప్రలోభనములతో, బెదరింపులతో వారియందలి స్వతఃసిద్ధమగు సహకార గుణాన్ని మనం నశింపజేస్తాం, వారిలోకి అవినీతిని ప్రవేశ పెడతాం.

కాబట్టి నిజమైన సహకారమనేది, ఏవేవో పెద్దపెద్ద పనులను — ప్రాజెక్టులను — కలిసి చేద్దామని అనుకోవడంలో లేదు. మనమంతా కలిసి వుందామనే భావనలో అప్పుడుండే ఆనందములో నిజమైన సహకారము ఉంటుంది. అట్టి ఏకాత్మ భావనలో వ్యక్తిగతమైన ఆలోచనల గురించిగాని వ్యక్తిగతమైన అభిప్రాయంగురించి గాని పట్టుదల చూపడం జరగదు.

అటువంటి సహకారం గురించి మీరెరిగినచో, అదెప్పుడేయరాదో గూడ మీకు తెలుస్తుంది. ఇది తెలుసుకోవడం గూడ ముఖ్యమే. ఏమి, అర్థమవుతున్నదా? ఇటువంటి సహకార ప్రవృత్తిని అందరిలోను మేల్కొలపడం చాల అవసరం. అప్పుడు కేవలం మనం చేసికొన్న యేర్పాట్లవలన గాని, ఒడంబడికల వలన గాని, కాదు మనం సహకరించుకొనేది; ఏదో ప్రతిఫలం లభిస్తుందనే ఆశచేతగాని, దండనం లభిస్తుందనే భయంచేతగాని మనము సహకరించుకోము. మనమంతా ఒకటే అనే భావన, ఒకటిగా వుండడంలో, ఒకటిగా పని చేయడంలో కలిగే ఆనందం — ఇవి మాత్రమే మనమొకరికొకరు సహకరించుకోడానికి కారణాలౌతాయి. ఇది చాల ముఖ్యమైన విషయం. అయితే ఎప్పుడు సహకరించుకొనరాదో తెలిసికొనడం కూడ అంతే ముఖ్యం. ఎందుకంటే, మనలో వివేకమేగనక లేకపోతే, అవివేకులకు సహకారమందిస్తాం. విలక్షణములైన ప్రణాళికలు వేస్తూ, విద్యూరములైన ఆలోచనలు చేస్తూ వుండే అత్యాశాపరులైన నాయకులకును, హిట్లరులాంటి క్రూర నియంతలకును సహకారమం

దిస్తాం. ఇటువంటి వారు మనకు ప్రతియుగమందును కనబడుతుంటారు. కాబట్టి యెప్పుడు మనం సహకరింపరాదో తెలిసికోవడం గూడ ముఖ్యమే. అయితే నిజమైన సహకారము వలన కలిగే ఆనందమును రుచిచూచిన వారికే ఎప్పుడు సహకరింపరాదో గూడ తెలుస్తుంది.

మనం చర్చించుకోవలసిన చాల ముఖ్యమైన విషయమిది. మనం కలిసి పని చేద్దామని అనగానే దానిపై బహుశా మీ మొట్టమొదటి ప్రశ్న యెట్లావుంటుందో తెలుసా? "ఎందుకోసం? మనం కలిసి యేంపని చెయ్యాలి?" అని అంటారు. అంటే, దాని అర్థం చేయవలసిన పని ప్రధానమవుతున్నది; కలిసిమెలిసి వుండడం, కలిసి మెలిసి పని చేయడమనే భావన అప్రధానమవుతున్నది. చేయవలసిన పని — అంటే, మనం వేసే ప్రణాళిక, మనం చేసే ఆలోచన, మనం ఆదర్శంగా పెట్టుకొనే భూలోకస్వర్గం — ఇవి అన్నిటికంటే ప్రధానమవుతాయి. అప్పుడు నిజమైన సహకారముండదు. అటువంటప్పుడు మనలను కలిపి వుంచేది ఆ ఉద్దేశ్యము, ఆ లక్ష్యము మాత్రమే. అప్పుడు ఒక ఉద్దేశం మనలను కలిపి వుంచితే, మరొకటి మనలను వేరు చేస్తుంది! కాబట్టి ఆ సహకార భావం మనలో మేల్కొనడం; కలిసి మెలిసి వుండడంలో, కలిసి మెలిసి పనిచేయడంలోను కలిగే ఆనందాన్ని రుచి చూడడం, దండన మండనముల గురించిన ఆలోచనయే లేకపోవడం — ఇవి ప్రధానంగా కావలసిన విషయాలు. ఇట్టి సహకారప్రవృత్తి చాల మంది చిన్నపిల్లలలో సహజంగానే వుంటుంది — దానిని వారి పెద్దలు అణచివేయకుండా వుంటే.

1. ప్రశ్న:- మన మానసిక చింతలకు కారణములైన పరిస్థితులను తొలగించుకోలేకపోతే, ఆ చింతలు మనలనెట్లా వదిలిపోతాయి?

కృష్ణమూర్తి:- అలాంటప్పుడు మీరు వాటిని ఎదుర్కొనవలసిందే! లేకుంటే మరేం చేస్తారు? మామూలుగానైతే మీరు మీ చింతలనుండి విముక్తులు కావడం కోసం వాటికి కారణములైన సమస్యలనుండి మీరు

పారిపోతారు; మీరు గుడికైనా పోతారు, సినిమాకైనా పోతారు, లేదా ఏదైనా వారపత్రికో మాసపత్రికో తీసికొని చదవడం మొదలు పెడతారు, లేదా రేడియో పెట్టుకొంటారు, ఇవేవీకాక పోతే మనస్సును మరొక దానిమీదికి మళ్ళిస్తారు. కాని యిట్లు సమస్యల నుండి తప్పించుకొని పారిపోవడం వలన సమస్యలు పరిష్కారమౌతాయా? కావు. మీరు మళ్ళీ తిరిగి రాగానే అవి మీ యెట్టయెదుట మళ్ళీ సాక్షాత్కరిస్తాయి. అందుకని మొట్టమొదటనే వాటినెదుర్కోవడం మంచిదికాదా?

సరే, — అసలు 'చింత' అంటే యేమిటి? పరీక్షలు పాసవుతామో లేదో అనేది మీ చింత; పాసు కామేమో యని మీభయం. ఆ భయం వలన మీ ఒళ్ళు చెమటలు పోస్తుంది. రాత్రిళ్ళు నిద్ర పట్టదు. మీరు పాసుకాకపోతే మీ తల్లి దండ్రులకెంతో ఆశాభంగం. "నేను సాధించాను, పరీక్షలన్ని పాసయినాను" — అని ఘరానాగా చెప్పకోవాలని మీకోరిక. ఈ విధమైన చింత పరీక్షలు వ్రాసే దినం వరకు వుంటుంది. ఆ తర్వాత మళ్ళీ పరీక్షా ఫలితాలు వచ్చేటంత వరకు గూడ అది అట్లే కొనసాగుతూ వుంటుంది. దీని నుండి మీరు తప్పించుకోగలరా? ఈ పరిస్థితి నుండి పారిపో గలరా? వాస్తవానికి మీరా పని చేయలేరు, కాదంటారా? అందు వలన దాని నెదుర్కోవడం తప్పదు. దానికింత చింతించడ మెందుకు? మీరు బాగానే చదివినారు, చేయగల్గినదంతా చేసినారు — పాసయినా సరే, కాకపోయినా సరే. దానికోసం బాధ పడడమెందుకు? మనస్సులో మీరెంతగా బాధపడుతూ వుంటే అంతగా భయమెక్కువౌతూ వుంటుంది, జంకు ఎక్కువవుతుంది — ఆలోచన మట్టమవుతుంది. దాంతో, పరీక్షనాడు అసలేమీ వ్రాయలేరు, కేవలం గడియారంవంక చూస్తూ వుండిపోతారు. నావిషయంలో జరిగిన దదే!

ఒక సమస్యను గూర్చి మనస్సు అదే పనిగా ఆలోచిస్తూ వుంటే, విడవకుండా దాన్నే పట్టుకొని వుంటే, అప్పుడు దానినే 'చింత' అని అంటాం, అవునా కాదా? సరే. మరి, మనమాచింత నుండి విముక్తులమెట్లు కాగలము? మొట్టమొదట, అసలు సమస్య యేదైనా సరే, అది మన మనస్సులో వేరూని నాటుకోకుండా చూచుకోవాలి. అది

నాటుకోడానికి తగిన భూమిగా మన మనస్సు ఉపయోగ పడరాదు. ఇది చాల ముఖ్యం.

మనస్సంటే యేమిటో మీకు తెలుసునా? పెద్ద పెద్ద మనస్తత్త్వవేత్తలు అనేక సంవత్సరాలపాటు మనస్తత్త్వాన్ని పరిశీలిస్తూ గడిపినారు; దాని మీద అనేక ఉద్గ్రంథాలు వ్రాసినారు. కాని తదేక ధ్యానంతో పరిశీలించి చూచుకొన్నట్టయితే మనస్సన నేమిటో తెలిసికోవడం అంత కష్టంకాదు. మీ మనస్సును మీరెప్పుడైనా పరిశీలించి చూచుకొన్నారా? మీరింత వరకు ఏమేమి నేర్చుకొన్నారో అదంతా, మీకు కలిగిన చిన్న చిన్న అనుభవాల స్మృతులూ, మీ తల్లి దండ్రులు ఉపాధ్యాయులు మీకు చెప్పిన విషయాలూ, పుస్తకాలలో చదివినదీ, చుట్టూరా వున్న ప్రపంచంలో మీరు స్వయంగా చూచి తెలిసికొన్నదీ — ఇవన్నీ కలిస్తే మనస్సు అవుతుంది. పరిశీలించేది, వివేచించేది, నేర్చుకొనేదిన్నీ ఈ మనస్సే. మంచి గుణాలనబడే వాటిని అలవాటు చేసికొనేదీ, తన ఉద్దేశాలను ఇతరులకు తెలియజేసేదీ కూడా ఈ మనస్సే. దీనిలో కోర్కెలున్నాయి, భయాలున్నాయి. మనస్సంటే పైపైన మనకు కనబడేది మాత్రమే కాదు, దానిక్రిందలోతైన పొరల అడుగున వుండే అంతశ్చేతన (unconscious mind) కూడ మనస్సే. ఈ అంతశ్చేతనలోనే జాతి గతములైన ఆశలు, ఆకాంక్షలు, ప్రేరణలు, ప్రబోధనలు, సంఘర్షణలు నిగూఢములై వుంటాయి. ఇదంతా కలిసి మనస్సు అవుతుంది. దీనినే చేతన (consciousness) అని కూడ అంటారు.

సరే, మన మనస్సెప్పుడూ నిశ్చలంగా వుండదు, ఎప్పుడూ ఏదో యొక ఆలోచనతో, ఏదో యొక చింతతో వ్యాపృతమై (occupied) వుండగోరుతుంది. తల్లి తన పిల్లల గురించి, ఇల్లాలు తన వంటగది గురించి, రాజకీయ నాయకుడు తన పలుకుబడిని గురించి లేదా లోకసభ (Parliament)లో తన స్థానము గురించి, నిరంతరము చింతామగ్నులైవున్నట్లే, మనస్సు కూడ నిరంతర మేదో యొక చింతలో నిమగ్నమై వుండగోరుతుంది. ఆ విధంగా వ్యాపృతమై యున్న మనస్సు ఏ సమస్యనూ పరిష్కరింపజాలదు, ఏమి, మీకు బోధ పడుతున్నదా?

అవ్యాపృతమగు మనస్సే — అంటే చింతాక్రాంతముకాని మనస్సే ప్రసన్నముగనుండి సమస్యల నర్థముచేసికొన గలదు.

మీ మనస్సును మీరు పరిశీలించి చూచుకోండి — అదెంత చంచలంగా వున్నదో! దానికెప్పుడూ తీరిక వుండదు. ఎప్పుడును ఏదో ఆలోచనలో నిమగ్నమై వుంటుంది. నిన్న యెవరో అన్నమాటలు, ఇప్పుడే మీరు నేర్చుకొన్న విషయాలు, రేపు మీరేమి చేయబోతున్నారో అది — ఇట్లాగా ఏదో యొకదానితో మనస్సు ఎప్పుడూ నిండి వుంటుంది. అదెప్పుడూ ఖాళీగావుండదు. అంటే దాని అర్థం గతిరహితమై నిశ్చలంగా స్థిరంగా వుండిపోతుందని గాని, దానిలో ఒకవిధమైన శూన్యత యేర్పడుతుందని గాని కాదు. అయితే అత్యుత్తమమైన దానితో గాని, అధమాధమమైనదానితో గాని, దేనితోనైనా సరే ఆలోచనతో నిండివున్న మనస్సు అల్పమైనది, క్షుద్రమైనది. క్షుద్రమగు మనస్సు ఏ సమస్యనూ పరిష్కరింపజాలదు. అది ఆ సమస్యతో పూర్తిగా ఆక్రమింపబడి దానితో కుస్తీపడుతూ వుంటుంది, అంతే. సమస్య ఎంత పెద్దదైనా అది మనస్సును ఆక్రమించగానే అదికూడ క్షుద్రమైపోతుంది. క్షుద్రమగు మనస్సు ఎంత పెద్ద సమస్యనైనా క్షుద్రముగానే మార్చివేస్తుంది. అనాక్రాంతమై, అందువలన నిశ్చలంగా, ప్రసన్నంగా వుండే మనస్సు మాత్రమే సమస్యలనెదుర్కొని వాటిని పరిష్కరింప గలుగుతుంది.

అయితే మనస్సు దేనిచేతను ఆక్రాంతము కాకుండా, ఏ ఆలోచనా లేకుండా వుండడం చాలకష్టం. మీరెప్పుడైనా ఏటిగట్టున గాని, మీగదిలో గాని ప్రశాంతంగా కూర్చుండి మిమ్ములను మీరు పరిశీలనగా చూచుకోండి. మీరు గమనిస్తూ వున్న ఆ కొద్ది పాటి స్థలము, — దేనినైతే మనము మనస్సని పిలుస్తామో అది — త్రోసుకొని వస్తూవున్న ఆలోచనలతో ఎట్లా నిరంతరము నిండిపోతూ వుంటుందో మీకు తెలుస్తుంది. ఈ విధంగా మనస్సు ఏదోయొక దానితో నిండి వున్నంతవరకు, ఆక్రాంతమై వున్నంత వరకు — ఆ మనస్సు గొప్ప శాస్త్రజ్ఞునిది కానీయండి, లేదా వంటచేసికొనే యిల్లాలిది కానీయండి — అది అల్పమైనది, క్షుద్రమైనది, అదియేసమస్యను తీసికొన్నా పరిష్కరింప జాలదు. అట్లుగాక దేని

చేతను ఆక్రాంతముగాని మనస్సులో తగినంత 'అవకాశము' (చోటు, జాగా, space) ఉండడం చేత, అది సమస్యనెదుర్కొని పరిష్కరింప గలదు. అట్టి మనస్సు కడిగివేయబడినట్లు నిర్మలముగా వుండడం వలన, పారంపర్యంగా తనకు సంక్రమించివున్న ప్రాతకాలపు స్మృతులు సంప్రదా యముల మాధ్యమమున గాకుండా, సరిక్రొత్తరీతిని సమస్యనెదుర్కొన గలదు, కాన పరిష్కరింపగలదు.

2. ప్రశ్న:- మనలను మనమెట్లు తెలిసికొనగలము?

కృష్ణమూర్తి:- మీ ముఖాన్ని మీరు అద్దంలో చాలసార్లు చూచు కొనే వుంటారు కాబట్టి అదెట్లా వుంటుందో మీకు బాగా తెలుసు. అయితే, మిమ్ము మీరు పూర్తిగా చూచుకోవాలంటే ఉపయోగపడే అద్దం వేరొకటెవ్వుంది. అందులో మీ ముఖాన్ని కాదుగాని, మీ యాలో చనలను, మీ భావాలను, మీ యుద్దేశాలను, మీ తీరనికోరికలను, మీలో గల్గెడి ప్రేరణలను, భయాలను అన్నిటిని చూచుకోగలరు. అదే పర స్పర సంబంధమనే అద్దము. అంటే, మీకును మీ తల్లిదండ్రులకును మధ్య, మీకును మీ ఉపాధ్యాయులకును మధ్య, మీకును నదికిని, వృక్ష ములకును, భూమికిని మధ్య, మీకును మీ యాలోచనలకును మధ్య గల సంబంధమే ఆ అద్దము. ఈ పరస్పర సంబంధమనే అద్దంలో మిమ్ము మీరు యథాతథంగా చూచుకోగలరు కాని, మీరు కోరుకొనే విధంగా అందులో చూచుకోలేరు. మామూలు అద్దంలో చూచుకొనేట ప్పుడైనా, ఇంకొంత అందంగా కనబడితే బాగుండునని నేననుకోవచ్చు, కాని అది అట్లా జరుగదు గదా. ఆ అద్దంలో నా ముఖం ఎట్లా వుందో అట్లానే కనబడుతుందిగాని, నేను కోరుకొన్న రీతిగా కనబడదు గదా. ఈ విషయంలో నన్ను నేను వంచించుకోలేను గదా. అదే విధంగా ఇతరులతో నాకు గల సంబంధమనే అద్దంలో నన్ను నేను ఉన్నదున్న ట్లుగా చూచుకోగలను. నేనితరులతో ఎట్లా మాట్లాడుతున్నానో, ఎవరి వల్లనైనా నాకు కొంత ప్రయోజనముంటుందని తోస్తే వారితో ఎంత మర్యాదగా మాట్లాడుతానో, ఏమీ ప్రయోజనం లేదని తోస్తే వారితో

ఎంత మొరటుగా, ఎంత తృణీకారభావంతో మాట్లాడుతానో గమనించగలను. నేనెవరికి భయపడతానో వారియెడల చాల జాగ్రత్తగా వుంటాను. ఎవరైనా గొప్పవాండ్లు వస్తే లేచి నిలబడతాను. కాని నౌకరెవరైనా వస్తే అతని గురించి అసలేమీ పట్టించుకోను. ఈ విధంగా పరస్పర సంబంధమనే అద్దంలో నన్ను నేను గమనించి చూచుకొంటే, ఇతరులను నేనెంత కృత్రిమంగా గౌరవిస్తానో తెలిసిపోతుంది, ఏమి తెలిసిపోదా? మనుషులతోనే కాదు, చెట్లతో, పక్షులతో, అభిప్రాయాలతో, పుస్తకాలతో నాకు గల సంబంధాన్ని బట్టి నా గురించి నేను ఎన్నో విషయాలు తెలిసికోగలను.

ప్రపంచంలో వుండే విద్యాయోగ్యతలన్నీ మీకుండవచ్చు గాక, కాని మీగురించి మీకు తెలియకపోతే మీరు వట్టి బుద్ధిహీనుల క్రింద లెక్క. తన్నుదాను తెలిసికొనడమే విద్య యొక్క ప్రధానప్రయోజనము. ఇట్టి ఆత్మజ్ఞానము లేకుండా, కేవలం పరీక్షలు పాసవడం కోసం ఏవేవో విషయాలు సేకరించడం, వాటి గురించి నోట్సు వ్రాసికోవడం తెలివి తక్కువ పని. మీరు భగవద్గీత నుండిగాని, ఉపనిషత్తుల నుండిగాని, కొరాను నుండిగాని, బైబిలు నుండిగాని, ధర్మసూక్తులను ఉటంకించవచ్చు, కాని మిమ్ము మీరు తెలిసికోకపోతే మీరు మాటలాడ నేర్చిన చిలుకలవంటివారు; మీరు మాట్లాడే దేదో మీకే తెలియదు. అట్లుగాక, ఎంత స్వల్పంగానైనా సరే మిమ్ము మీరు తెలిసికోవడం ఆరంభించిన క్షణమునుండి మీలో అసాధారణమైన సృజనాత్మకత వికసించడం మొదలుపెడుతుంది. మీరెంత పిసినిగొట్టులో, ఎంత జగడాలమారులో, ఎంత కోపిష్ఠులో, ఎంత అసూయాపరులో, ఎంత తెలివిమాలినవారో, ఉన్నదున్నట్లుగా, మీ నిజస్వరూపం హఠాత్తుగా బయటపడుతుంది. అది మీకొక అద్భుత దర్శనము. మీరొక క్రొత్త విషయాన్ని అకస్మాత్తుగా కనిపెట్టినట్టు. ఉన్నవాస్తవికాన్ని మార్చివేయడానికి ప్రయత్నించకుండా, మీ రెట్లాంటివారో యథాతథంగా చూచి తెలిసికోవడం మీకొక అద్భుతమైన కనువిప్పులాంటిది. అటనుండి మీరింకా లోలోతుకు పోయి చూస్తూ వుంటే అనేక విషయాలు తెలుస్తూ వుంటాయి. దీనికంతము లేదు.

ఆత్మజ్ఞానమునకు హద్దెక్కడిది?

ఇట్టి ఆత్మజ్ఞానము ద్వారా దేవుడన నెవరో, సత్యమననేమో, త్రికాలాతీత స్థితి యననేదో మీకు తెలియడం మొదలు పెడుతుంది. మీ ఉపాధ్యాయుడు, తాను తన ఉపాధ్యాయునినుండి సంపాదించు కొన్న జ్ఞానమంతా, మీకు అందజేయవచ్చు, మీరు మీ పరీక్షలలో బాగా వ్రాయవచ్చు, డిగ్రీ సంపాదించవచ్చు, ఇంకా ఏవేవో చేయవచ్చు; కాని అద్దంలో మీ ముఖాన్ని మీరు చూచుకొన్నంత స్పష్టంగా మిమ్ములను మీరు చూచుకోలేకపోతే మీరు సంపాదించుకొన్న తదితర జ్ఞానమంతా వ్యర్థము. తమ్ము దామెరుగని – అంటే, ఆత్మజ్ఞానములేని – విద్యా వంతులు నిజానికి విద్యావంతులు కారు. వాండ్లకు ఆలోచించడమంటే యేమిటో తెలియదు. జీవితమంటే యేమిటో తెలియదు. అందు వల్లనే మునుముందుగా విద్యాబోధకునకు దానియొక్క నిజమైన అర్థంలో విద్యాబోధన జరుగవలసి యున్నది. అంటే, దాని అర్థం అతనికి అతని మనోహృదయములు పని చేసే తీరు, – వాటి వ్యాపారములు – తెలియవలసి యున్నది. ఇతరులతో తనకుగల సంబంధమనే అద్దంలో అతడు తన్నుదాను, యథాతథంగా, చూచుకోవలసి యున్నది. ఇట్టి ఆత్మజ్ఞానమే వివేకోదయమున కారంభము. తన్నుదాను తెలిసికొంటే విశ్వమంతా తెలిసికొన్నట్టే; అట్లే మానవజాతి యొక్క సంఘర్షణలన్నీ ఆత్మజ్ఞానాంతర్గతములే; అన్నియు దాని పరిధిలోనివే.

3. ప్రశ్న :- మనకు ప్రేరణనిచ్చే వ్యక్తి లేకుండా, మనలను మనము తెలిసికోగలమా?

కృష్ణమూర్తి :- మీ గురించి మీరు తెలిసికోవాలంటే, మీకు ప్రేరణ నిచ్చే వ్యక్తి అవసరమా? మిమ్ము తొందర చేయడానికి, మీకు చుఱుకు పుట్టించడానికి, మిమ్ము ముందుకు త్రోయడానికి ఎవరైనా ఉండవలెనా? ప్రశ్నను చాల జాగ్రత్తగా వినండి, వింటే మీకే జవాబు తెలుస్తుంది. సమస్యను సరిగ్గా చదివి అర్థం చేసికొంటే సగం సమస్య

పరిష్కరింపబడినట్లే కదా? కాని దానికి జవాబు తెలిసికోవాలనే ఆదుర్దాతో మీ మనస్సంతా నిండిపోయి వుంటే అసలు మీ రాసమస్యనే సరిగ్గా చదువలేరు.

ప్రశ్న యేమిటనగా, మనలను మనం తెలిసికోవాలంటే అందుకోసమై మనలను ప్రేరేపించేవాడు ఎవడైనా ఉండనక్కరలేదా అని.

అయితే, మీకు ప్రేరణ యివ్వడానికి ప్రోత్సాహమివ్వడానికి, మీరు బాగా పని చేస్తున్నారని చెప్పడానికి ఒక గురువు కావలసి వస్తే, దాని అర్థం, మీరామనిషి మీద పూర్తిగా ఆధారపడుతున్నారన్నమాట. అందువలన ఎప్పటికైనా ఆ మనిషి వెళ్ళిపోతే, మీగతి దుర్గతే! ప్రేరణకోసం మీరొక మనిషిమీద గాని, ఒక భావనమీదగాని ఆధారపడితే, అక్షణమునుండి భయము తప్పదు. అందువలన అది నిజానికి ప్రేరణ కాదు. అట్లుగాక ఒక శవాన్ని తీసికొని పోతూవుంటే, లేదా ఇద్దరు మనుషులు కొట్లాడుకొంటూ వుంటే చూచినప్పుడు ఆ దృశ్యములు మీలో ఆలోచనలను రేకెత్తించవా? పెద్ద పెద్ద ఆశలు పెట్టుకొన్నవానిని చూచినప్పుడుగాని, మీ రాష్ట్రగవర్నరు వస్తే అతని కాళ్ళకు మీరంతా ఎట్లా మొక్కుతారో గమనించినప్పుడుగాని ఏమిటి ఇదంతా అని తర్కించుకోరా? అందువలన దేనిని చూచినా ప్రేరణ కలుగవచ్చు — చెట్టునుండి ఆకురాలడం, పిట్ట కూలి నేలపడడం, మనిషిపోయే వింతవింత పోకడలు — ఇట్లా దేనిని చూచినా ప్రేరణ కల్గుతుంది. మీరు వీటినన్నిటిని గమనిస్తూవుంటే, మీరెల్లప్పుడు నేర్చుకొంటూనే వుంటారు, అనేక విషయాలు గ్రహిస్తూ వుంటారు. అట్లుగాక మీరెవరినో ఒక మనిషిని గురువుగా భావించి అతని మీదనే మీ భారమంతా వుంచేటట్లయితే మీరెంతో నష్టపోతారు. ఆ మనిషి మీకు సింహస్వప్నమై కూర్చుంటాడు! అందువలన ఎవరినైనా అనుసరించడం పనికిరాదు. ఎవరినో ఒక గురువును అనుసరించే బదులు పారుతున్న యేటిని, పూచిన పువ్వులను, పచ్చని చెట్లను, బరువుమోస్తున్న అబలను, మీకుటుంబ సభ్యులను, మీలో పుడుతున్న ఆలోచనలను — వీటి అన్నిటినుండి మీరు నేర్చుకోవచ్చు గదా? ఈ చదువు మీయంతట మీరు చదువుకొనే చదువు; ఇతరులు చెప్పేదికాదు. అందులో

వున్న అందమే అది! దీనికి కావలసింది నిత్యజాగరూకత, నిరంతర పరిశీలనాసక్తమగు మనస్సున్ను. జాగ్రత్తగా గమనించడం ద్వారా, సంఘర్షణతో గూడిన తీవ్రప్రయత్నం ద్వారా, ఆనందము ద్వారా, అశ్రువులు రాల్చడం ద్వారా నేర్చుకొనవలసి వుంటుంది.

4. ప్రశ్న :- తనలో ఎన్నో పరస్పర వైరుధ్యములుంటూ వుండగా అస్తిత్వము, ఆచరణము రెండును ఒకేసారి ఎట్లా సాధ్యములౌతాయి?

కృష్ణమూర్తి:- పరస్పరవైరుధ్యమంటే యేమిటో మీకు తెలుసునా? జీవితంలో నేనొక పని చేయదలచుకొంటాను. అదే సమయంలో మా తల్లిదండ్రులను కూడ సంతోషపెట్ట దలచుకొంటాను. కాని వాండ్లు నన్ను మరింకేదో పని చేయమంటారు. అప్పుడు నాలో ఘర్షణ ఆరంభమౌతుంది. అదే పరస్పరవైరుధ్యమంటే. దానినెట్లా నేను పరిష్కరించుకోవలె? నాలోని యీ పరస్పర వైరుధ్యాన్ని నేను పరిష్కరించుకోలేకపోతే, అప్పుడు నాయొక్క అస్తిత్వానికిన్ని ఆచరణకున్ను ఏకవాక్యత కుదరదు, రెండును ఒకటిగా ఉండవు; ఆ రెండింటిలో ఒకదాని కొకటి పొసగదు. అందువలన మొట్టమొదట నేను నాలోని పరస్పర వైరుధ్యాన్ని తొలగించుకోవలసి వుంటుంది.

చిత్రకళ అంటే మీకు జీవితంలో ఎంతో ఆనందాన్నిచ్చే విషయం. అందువలన చిత్రకళను అధ్యయనం చేద్దామని మీరనుకొంటారు. కాని మీతండ్రి మిమ్ము లాయర్లో, వ్యాపారస్థులో కండిఅని ఆదేశిస్తాడు. దానికి మీరొప్పుకోకపోతే, మిమ్ము నరికి పోగులుపెడతాడు; మీ చదువుకు డబ్బు పంపడు. అప్పుడు మీలో పరస్పర వైరుధ్యమేర్పడుతుంది. సరే, అప్పుడు మీలోని పరస్పర వైరుధ్యాన్ని మీరెట్లా తొలగించుకొంటారు? ఆ మానసిక ఘర్షణనుండి, ఆ బాధనుండి మీరెట్లా విముక్తులౌతారు? అట్టి పరస్పర విరుద్ధ స్థితిలో చిక్కుకొన్నప్పుడు మీరు సరిగా ఆలోచన చేయలేరు. ఆ స్థితి తొలగిపోవాలి; అదో, యిదో, యేదో ఒక పనే చేయాలి. దేనిని చేస్తారు? మీ తండ్రికి లొంగిపోతారా? మీ తండ్రికిష్టమైన పనినే చేసేటట్లయితే మీ ఆనందానికి భంగమన్నమాట —

ప్రేమించని మనిషిని పెండ్లిచేసికొని బాధపడుతున్నట్లు! పోనీ, అట్లైనా మీలో కలిగిన పరస్పర వైరుధ్యము తొలగిపోతుందా? అట్లుగాక మీరు మీతండ్రిమాట కెదిరించి నిలబడితే – "క్షమించండి, పస్తుండవలసి వచ్చినాసరే, బిచ్చమెత్తుకోవలసి వచ్చినా సరే, ఏమైనా సరే, నేను లక్ష్యపెట్టను. నేను చిత్రకళను నేర్చుకొని తీరతాను" — అని మీరన గలిగితే అప్పుడు మీలోని పరస్పరవైరుధ్యము తొలగిపోతుంది. అప్పుడు మీ అస్తిత్వము, ఆచరణ ఒకటిగా వుంటాయి. ఎందువల్లనంటే, మీ కేపని చేయడం ఇష్టమో మీకు తెలుసు; దానిని మీరు హృదయపూర్వకంగా చేస్తారు కూడ. అట్లుగాక ఇష్టం లేకపోయినా లాయర్లో, వ్యాపారస్థులో మీరయినట్లయితే, చిత్రకారులు కావలెననే మీకోరిక మిమ్ము లోలోపల తినివేస్తూ వుంటుంది. మీ శేష జీవితమంతా ఆశాభంగంతో తీవ్ర మనోవ్యాధితో, దైన్యంతో, ఎట్టి చుఱుకుదనము లేక, బుద్ధిమందగించి, మిమ్ముమీరు నాశనం చేసికొంటూ, ఇతరులను నాశనం చేస్తూ, ఈసు రోమని దినాలు లెక్కపెట్టుకొంటూ కాలం గడుపుతారు.

ఇది మీరాలోచించుకోవలసిన చాలముఖ్యమైన సమస్య. ఎందు కంటే, మీరు పెద్దవారైన తరువాత మీచేత కొన్ని పనులు చేయిద్దామని మీతల్లిదండ్రుల కోరిక. ఈ లోపల మీరు భవిష్యత్తులో చేయదల చిన పని నిజంగా మీకిష్టమైనది యేదో స్పష్టం చేసికోకపోతే, వారు మిమ్ము కసాయివాని దగ్గరకు గొఱ్ఱెను నడిపించుకొని పోయినట్లుగా తమ యిష్టప్రకారం మిమ్ము నడిపించుకొని పోతారు. అట్లు గాక మీరు మీకిష్టమైనపని యేదో తెలిసికొని, దానిని చేయడంకోసం ఎంత త్యాగా నికైనా మీరు సిద్ధపడితే, దానికోసం మీరు మీ జీవితాన్ని త్యాగంచేయ గలిగితే, అప్పుడందులో విసంవాదముండదు, పరస్పర వైరుధ్యముండదు. అట్టి స్థితియందు మీ అస్తిత్వమే మీ ఆచరణము.

5. ప్రశ్న :- మాకిష్టమైన పనిని మేము చేయడంకోసం తల్లిదండ్రుల యెడ మాకుగల బాధ్యతలను వారియెడ మాకుగల కర్తవ్యాలను మేము వదులుకోవలెనా?

కృష్ణమూర్తి:- 'కర్తవ్య'మని మీరొక అద్భుతమైన పదాన్ని వాడుతున్నారే, ఏమిటి మీ వుద్దేశం? ఎవరి యెడల ఆ కర్తవ్యం? మీ తల్లిదండ్రులయెడ, మీ ప్రభుత్వమునెడ, మీరున్న సమాజమునెడలనా? మీరొక లాయరుకావాలని మీరు తమ్ము బాగా చూచుకోవాలని, అది మీ ధర్మమని, మీ కర్తవ్యమని మీ తల్లిదండ్రులు మీతో అంటే, మీకు మాత్రం మనస్సులో సన్న్యాసం తీసికోవాలని కోరిక వుంటే, అప్పుడు మీరేం చేస్తారు? బహుశా భారతదేశంలో సన్న్యాసిగా జీవించడం ఇబ్బందిలేని పని కాబట్టి, గౌరవింపబడే వృత్తి కాబట్టి మీ తండ్రి దానికంగీకరింపవచ్చునేమో! కాషాయ వస్త్రాలు ధరించగానే మీరు గొప్ప వారైపోతారు! మీతండ్రి యిక దానిమీద వ్యాపారం చేయడం మొదలుపెట్టవచ్చు! అట్లుగాక మీరు మీ చేతులతో పనిచేయదలిస్తే, ఒక మామూలు వడ్రంగిగాని, మట్టితో అందమైన వస్తువులు చేసే కుమ్మరిగాని కాదలిస్తే, అప్పుడు మీ కర్తవ్యం మాట ఏమౌతుంది? ఎవరైనా ఇతరులు మీ కీవిషయంలో ఏమి చెప్పగలరు? అందులో ఏమేమి యిబ్బందులుంటాయో చూచి, జాగ్రత్తగా ఆలోచించి, మీ యంతట మీరు తేల్చుకోవలసిన విషయంకాదా యిది? అట్లా తేల్చుకొని, "ఇదిగో, ఇదే నా ధర్మమని అనుకొంటున్నాను. దీనికి నేను కట్టుబడివుంటాను మా తల్లిదండ్రులు అంగీకరించినా సరే, లేకున్నా సరే", -- అని మీ రనగలిగియుండాలి. మీ తల్లిదండ్రులున్ను మీరున్న సమాజమున్ను మిమ్మేది చేయమంటే అది, మారుమాటాడక, చేయడంకాదు కావలసింది. మీరు మీ కర్తవ్యమనుకొనే దానిలో ఇమిడియున్న కష్టనష్టాలేవో బాగా ఆలోచించి చూచుకొని, ఏది సత్యమో స్పష్టంగా తెలిసికొని, ఆ సత్యాన్ని వదలక యావజ్జీవము అంటిపెట్టుకొని వుండగలగాలి. తిండి లేక పస్తుండవలసి వచ్చినా, ఎంతో దీనస్థితిలోకి పడిపోయినా, మృత్యువు ఎదురయినా లెక్క సేయరాదు. దీనికి ఎంతో ప్రజ్ఞ, ఎంతో తెలివి, అంతర్దృష్టి, ప్రత్యక్షజ్ఞానము (perception), కావాలి. వీనితో బాటు అవ్యాజమైన ప్రేమ వుండాలి. మా తల్లిదండ్రులను పోషించడం కేవలం మా బాధ్యత, మా విధి, మా కర్తవ్యం అని తలచి పోషిస్తున్నట్లయితే, ఆ పోషణ

సంతలోని సామానువంటిది. దానికి పెద్ద విలువలేదు -- అది ప్రేమతో గూడినది కాదు కాబట్టి.

6. **ప్రశ్న :- ఇంజనీరును కావాలని నేనెంత కోరుకొన్నా, మా తండ్రి కది యిష్టంలేకపోతే, ఆయన నా చదువుకు సహాయపడడు. అప్పుడు నేనెట్లు ఇంజనీరింగు చదువగలను?**

కృష్ణమూర్తి:- ఇంజనీరు కావాలని మీరు గట్టిగా పట్టుబట్టితే, మీతండ్రికది యిష్టంలేక, మిమ్ము ఇంట్లో నుంచి బయటికి వెళ్ళ గొడితే, మరిమీకింక ఇంజనీరింగు చదవడానికి దారే కనబడదంటారా? యోచించండి, స్నేహితుల దగ్గరికి పోండి. అయ్యా, జీవితమనేది ఎంతో వింతైనది. మీరు చేయదలచినదేదో అది మీకు స్పష్టమై వుంటే, ఇక అన్నీ వాటికవే అనుకూలంగా జరుగుతూ వుంటాయి. జీవితమే మీకు సహాయపడుతుంది -- ఎవరో స్నేహితుడో, బంధువో, ఉపాధ్యాయుడో, మీ బామ్మో, మామ్మో లేదా మరొకరో మీకు సహాయమందిస్తారు. కాని మీ తండ్రి మిమ్ము ఇంట్లోనుండి బయటికి తరిమివేస్తాడేమోననే భయంతో మీరసలు ప్రయత్నమే మానుకొంటే మీరే నష్టపోతారు. భయంచేత ఇతరుల ఒత్తిడికి ఊరక లొంగిపోయేవారికి జీవిత మెన్నడును సహాయపడదు. అట్లుగాక, "ఇదీ -- నేను నిజంగా చేయగోరింది. దీనికోసం ఏమైనాసరే, గట్టిగా ప్రయత్నిస్తాను" అని మీరంటే అప్పుడొక అద్భుతం జరగడం మీరు చూడగలరు. మీకు తిండి దొరకకపోవచ్చు, ముందుకు అడుగువేయాలంటే ఎంతో తంటాలు పడవలసిరావచ్చు. అయితే యేమి, మీ జీవితం సార్థకమవుతుంది. మీ జన్మ చరితార్థ మవుతుంది. అది దేనికిసీ నకలు కాదు; అదే అందులోని విశేషం, అదే దాని మహిమ.

చూడండి, మనలో చాలమందిమి ఒంటరిగా నిలబడాలంటే భయ పడతాం. అందులోను మీలాంటి చిన్నపిల్లలకది మరీ కష్టమని నాకు తెలుసు. అమెరికాలోను, ఐరోపాలోను వున్నట్లు ఈ దేశంలో చిన్నపిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. ఇక్కడ జనాభా చాల ఎక్కువ. అందుచేత

ప్రతివాడు త్వరగా లొంగిపోతాడు. "మా గతి యేమవుతుందో?" అని మీరంటారు. కాని మీరు గట్టిగా నిలబడితే, ఎవరోయొకరు మీసహాయానికి వచ్చితీరుతారు. పదిమంది నుండి వచ్చే వత్తిడికి మీరు నిజంగా తట్టుకోగల్గితే, అప్పుడే మీరు స్వతంత్రవ్యక్తులు; అప్పుడే జీవితము మీ సహాయానికి వస్తుంది.

చూడండి, జీవశాస్త్రం (Biology)లో 'ఖేల' (sport) అనే ఒక వింతదృశ్యమున్నది. మామూలుగా వుండే ఒక జాతి ప్రాణులలో అనుకోకుండా ఏదో వింత మార్పొకటి కనబడుతుంది. ఉదాహరణకు, మీరొక పూలతోట వేశారనుకోండి. అందులో ఒక పూలజాతిని మీరు పెంచుతూవుంటారు. ఇట్లా వుండగా, తటాలున ఒక ఉదయం మీరు పోయిచూస్తే, ఆ పూలమధ్య సరిక్రొత్త పూవొకటి కనిపిస్తుంది. అది ఆ పూలజాతికి సంబంధించినదేయైనా, వాటి మాదిరిగా వుండదు. క్రొత్తగా కనిపిస్తుంది. దానినే 'ఖేల' (sport) అంటారు. అది క్రొత్తగా వింతగా వుంటుంది. కాబట్టే దాని నందరు వెంటనే గుర్తించగలరు. తోటమాలి దాని గురించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తాడు. జీవితం కూడ అటువంటిదే. మీరు సాహసించి ముందడుగు వేస్తే, తక్షణమే మీలోను, మీ చుట్టు ప్రక్కలను మార్పులు రాసాగుతాయి. జీవితము అనేక రూపాలలో, అనేక విధాలుగా వచ్చి మీకు సహాయ పడుతుంది. అది మీవైపు ఏరూపంలో వస్తుందో మీకు నచ్చకపోవచ్చు. అది దైన్యము, సంఘర్షణ, ఆకలిబాధ — ఏదైనా కావచ్చు. కాని మీరెప్పుడైతే జీవితాన్ని ఆహ్వానిస్తారో అప్పటి[illegible] [illegible]ంతలు జరగడం ఆరంభమవుతుంది. కాని చూడండి, మనం జీవితాన్ని ఆహ్వానింపగోరం. ఒడుదుడుకులు లేని సాదాజీవితం గడుపగోరుతాం, సులభమైన ఆట ఆడగోరుతాం. అట్లా సులభమైన ఆట ఆడేవారు సులభంగానే మృత్యువువాత బడతారు — అది నిజం కాదా? అతిభద్రంగా ఆడడం మొదలు పెడితే అతిభద్రంగానే చచ్చిపోతాం.

జనవరి 19, 1955

2

జరామరణములు లేని మనస్సు

మొన్న ప్రొద్దున ఒక శవాన్ని దహనం చేయడం కోసం తీసికొని పోతూవుంటే నేను చూడడం తటస్థించింది. దానికి తళతళ మెరుస్తున్న ఒక ఎఱ్ఱరంగు గుడ్డను చుట్టబెట్టినారు. దాన్ని మోస్తూవున్న నలుగురు మనుషులు లయబద్ధంగా నడుస్తూవుంటే అది కూడా అదే లయలో వూగుతూవుంది. అటువంటి శవాన్ని చూస్తే ఎవరికైనా ఏమనిపిస్తుంది? అసలేదైనా ఎందుకు క్షీణిస్తుందో మీకెప్పుడూ అనుమానం రాలేదా? మీ మనస్సులో జిజ్ఞాస కలుగలేదా? సరిక్రొత్త మోటారు కారును కొన్నారనుకోండి; అది కొన్ని సంవత్సరాలలోనే అరిగి డొక్కై పోతుంది. అదే విధంగా మన శరీరం కూడా క్రమంగా ఉడిగిపోతుంది, క్షీణిస్తుంది. మరి కొంత లోతుకుపోయి, మన మనస్సెందుకు క్షీణిస్తుందో ఆలోచించవద్దా? ముందో వెనుకో ఈ శరీరానికి మృత్యువంటూ తప్పదు. కాని మనలో చాలమంది మనసులిప్పటికే మృత ప్రాయములై పోయినాయి. క్షీణించడం ఇప్పటికే ఆరంభమయింది. మరి మన మనస్సు ఎందుకు క్షీణించాలి? శరీరము క్షీణిస్తున్నదంటే కారణమున్నది — మనం మన శరీరాన్ని నిత్యమూ ఉపయోగిస్తున్నాం. సహజంగా భౌతిక శరీరం అరుగుతుంది, తరుగుతుంది. వ్యాధి, ప్రమాదములు, వార్ధక్యము, దుష్టాహారము, వంశానుగతమగు బలహీనతలు — ఇవన్నీ శరీర క్షయమునకు మృత్యువుకున్ను కారణాలు. కాని మనస్సెందుకు క్షీణించాలి? దానికి ముసలితనమెందుకు రావాలి? అది యెందుకు బరువెక్కాలి? చులుకుదన మెందుకునశించాలి?

మృత శరీరాన్ని చూచినప్పుడు మీకీ ఆలోచనలెన్నడూ రాలేదా? శరీరాలు మరణించడం తప్పదు, కాని మనస్సెందుకు క్షీణించాలి? మీకీ

ప్రశ్నయెప్పుడునూ తట్టులేదా? అయితే మనస్సు క్షీణించకుండా వుండడం లేదు. ఇది వృద్ధుల లోనేకాదు, యువకులలోను మనం చూస్తాం. యువకులలోను అప్పుడే మనస్సు చురుకుదనం లేక, భారమెక్కువై కొండుపారిపోతున్నది. సంవేదనలకు స్పందించడం మానినది. మరి మనస్సెందుకు క్షీణిస్తుందో మనం తెలిసికోగల్గితే, దానితోబాటు, అవినాశి యైనదేదో అది మనం తెలిసికోగలము. అదే శాశ్వతమైన జీవితము, దానికంతములేదు. అది కాలమునకు అతీతమైనది, ఎన్నటికీని వికారము చెందనిది, దూషితము కానిది, మామూలు శరీరమువలె క్షయించనిది. మామూలు శరీరమైతే అది క్షయించి, స్మశానమునందు దహనం చేయ బడుతుంది. దాని అవశేషాలు ఏటగలుపబడతాయి.

మరి, మన మనస్సెందుకు క్షీణిస్తుంది? దీని గురించి మీరెప్పుడైనా ఆలోచించారా? మీరింకను చిన్నపిల్లలు కాబట్టి — మీరున్న సంఘము మీ తల్లిదండ్రులు మీ పరిస్థితుల మూలాన ఇప్పటికే మీ మనస్సు మొద్దు బారిపోకుండా వున్నట్టయితే — అది నవనవోన్మేషమై ఔత్సుక్యము కలిగి ప్రతిది తెలిసికోవాలనే జిజ్ఞాసతో వుంటుంది. నక్షత్రాలంటే యేమిటి? అవెందుకున్నాయి? పక్షులెందుకు మరణిస్తాయి? చెట్టునుండి ఆకులు ఎందుకు రాలుతాయి? జెట్ విమానమెట్లా ఎగురుతుంది? — ఈ విధంగా ఎన్నో విషయాలు మీరు తెలిసికొనగోరుతారు. కాని అటువంటి తీవ్రమైన జిజ్ఞాస, ప్రతిదీ తెలిసికోవాలనే కోరిక అణచివేయబడుతుంది. ఏమి, అది నిజంకాదా? భయము, సంప్రదాయము యొక్క బరువు, అద్భుతమైన యీ జీవితాన్ని ఎదుర్కొనడానికి తగిన శక్తి లేకపో వడం — ఇవన్నీ దానికి కారణాలే. మనస్సును చురుక్కుమని పించే ఒకమాట, అలక్ష్యంగా చూసిన ఒక చూపు, చేసిన చేష్ట, పరీక్షల భయం, తల్లిదండ్రుల బెదరింపు — ఇటువంటి వాటితో మీ కుతూహలమంతా క్షణంలో నీరుగారిపోతుంది. మీ మెత్తని మనస్సుకు ఆఘాతం తగిలి మొద్దుబారిపోతుంది!

మనస్సు మొద్దుబారడానికి మరియొక కారణం అనుకరణ; దానికి

కారణం సంప్రదాయం. గతము (Past) యొక్క భారానికి మీరు లొంగి పోయి, అది గీచిన గీత దాటరు. అట్టి అంధానుకరణంలో మనస్సు తన భద్రతను చూచుకొంటుంది; తాను సురక్షితంగా వున్నట్లు భావించుకుం టుంది. అట్టి మనస్సు బాగా చమురు వేసిన మెత్తని గాడిలో మెల్లగా పోతున్న బండి చక్రం వలె ఎట్టి ఒడుదుడుకులు లేకుండా అలవాటు పడిన మార్గంలో నిశ్శంకంగా పోతూ వుంటుంది. మీ చుట్టూరా వున్న పెద్ద వాండ్లను చూడండి. వారి ఆలోచనలకు భంగము కలగడం వారి కిష్టముండదు. వాండ్లకు శాంతి కావాలి! అది మృత్యుశాంతి యైనా సరే. కాని నిజమైన శాంతి దీనికి పూర్తిగా భిన్నమైనది.

మనస్సు ఒక గాడిలో స్థిరపడిపోయినప్పటినుండి, ఒక పద్ధతికి కట్టు బడిపోయినప్పటినుండి, ఎల్లప్పుడూ భద్రత గురించిన కోరికయే దానిలో ప్రధానంగా పని చేస్తూ వుంటుంది — మీరు గమనించలేదా? అందు వల్లనే మనస్సు ఒక ఆదర్శాన్ని, ఒక ఒరవడిని, ఒక గురువును అనుసరిస్తూ వుంటుంది. దానికి కావలసినది భద్రత; దాని నెవరును కదిలించకూడదు, దాని శాంతికి భంగము రాకూడదు. అందువల్లనే అది అనుకరిస్తూ వుంటుంది. మీరు మీదేశ చరిత్రకు సంబంధించిన పుస్తకాలను చదివిన ప్పుడు అందులో చెప్పబడిన గొప్పగొప్ప నాయకులవలె, మహాత్ములవలె, యుద్ధవీరులవలె జీవించాలని మీరనుకోరా? వారిని అనుకరించగోరరా? ప్రపంచంలో గొప్పవారు లేరని కాదు. కాని గొప్పవారిని అనుకరించడం వారి మాదిరి వుండాలని ప్రయత్నించడం — ఇది మనలోని ఒక సహజ గుణం (Instinct). మనస్సు ఆ విధంగా అనుకరించడమనే మూసలో పడిపోతుంది కాబట్టి దాని క్షీణతకు ఇది కూడ ఒక కారణమే.

అంతే గాకుండ అప్రమత్తులు, సూక్ష్మబుద్ధులైన క్రాంతి వాదులు సమాజమున కక్కరలేదు. పరంపరాగతమైన సంఘవ్యవస్థలో వారు ఇమ డరు, ఇముడలేరు; వారా సంఘ వ్యవస్థను భంగము చేయవచ్చును గూడ. అందువల్లనే సంఘము మీ మనస్సును తన కట్టుబాటులో నిలిపి వుంచుకోవడానికి ప్రయత్నిస్తుంది. మీరు చదివే చదువు కూడ

అనుకరించడాన్ని, అనుసరించడాన్ని, సంప్రదాయానికి అనుకూలంగా నడుచుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది.

మరి, మనస్సు అనుకరించడాన్ని మానివేయగలదా? అంటే అలవాట్లు చేసికోవడం మానివేయగలదా? అలవాట్లలో ఇంతకు ముందే చిక్కుకొన్న మనస్సు ఆ యలవాట్లనుండి విముక్తము కాగలదా?

మనస్సంటే అలవాటు యొక్క ఫలితమే కాదా? అది సంప్రదాయము యొక్క ఫలితము, కాలము యొక్క ఫలితము. కాలమంటే పునః పునరావృత్తి — గతము (Past) వర్తమానమునందు కొనసాగడం. మరి మనస్సు -- అంటే మీమనస్సు — గతించిన వాటిని గూర్చి మరియు రాబోయే వాటిని గూర్చి ఆలోచించడం మానివేయగలదా? నిజానికి, గతకాలమేకదా వర్తమానము ద్వారా రాబోయేకాలముగా (Future) కొనసాగుతుంటుంది! మీ మనస్సు అలవాట్లనుండి విముక్తమై మరల అలవాట్లు చేసికోకుండా వుండగలదా? చాల లోతుగా పోయి ఆలోచించిచూస్తే అది సాధ్యమేయని మీరు గ్రహించగలరు. ఆ విధంగా మనస్సు క్రొత్త అలవాట్లు చేసికోకుండా వుంటే, క్రొత్తపథకాలు వేయకుండావుంటే, మరల అనుకరించడమనే గాడిలో పడకుండా వుంటే అప్పుడా మనస్సు నిత్యనూతనమై వృద్ధాప్యమంటూ లేనిదై పసిబిడ్డ మనస్సువలె అమాయికముగ నిర్మలముగ వుండిపోతుంది. అట్టి మనస్సునకుగల అవగాహన శక్తి అమితము.

అట్టి మనస్సుకు మృత్యువులేదు. ఏలయన అది తనలో దేనినీ ప్రోగు చేసికొంటూ కూడబెట్టుకొంటూ వుండదు. ఈ ప్రోగుచేసికొని కూడబెట్టుకొనే విధానమే అలవాట్లు ఏర్పడడానికి, అనుకరణ కొనసాగడానికి కారణము. ప్రోగుచేసికొంటూ, నిలువ చేసికొంటూ వుండే మనస్సు క్రమంగా క్షీణించి మృత్యువు వాత పడుతుంది. అట్లుగాక వాటిని వీటిని ప్రోగుచేసికోకుండా కూడబెట్టి నిలువ జేసికోకుండా వుండే మనస్సునకు అంటే ప్రతిదినమును ప్రతిక్షణమును మరణిస్తున్న మనస్సునకు చావులేదు. అది నిర్మలమైన అనంతాకాశరూపంలో వుండిపోతుంది.

కాబట్టి మనస్సు తాను కూడబెట్టుకున్న వానికెల్ల మరణించాలి. అంటే అన్నివిధములైన అలవాట్లనుండి, ఇతరులను చూచి అభ్యాసంలో పెట్టుకొన్న సద్గుణములనుండి, తనకు భద్రత లభిస్తుందని వేటివేటిమీద ఆధారపడివున్నదో వాటినన్నిటినుండి మనస్సు విముక్తిపొందాలి. అప్పుడా మనస్సు తన ఆలోచనలనే వలలో తాను చిక్కుకోదు. ఈ విధంగా క్షణ క్షణము మరణిస్తూ అంటే గతమునుండి విడివడుతూ వున్న మనస్సు నిత్యనూతనముగా వుంటుంది. కాబట్టి దానికెన్నటికిని క్షయము లేదు. దానిలోనుండి చీకటి తెరలు వచ్చి క్రమ్ముకొనవు.

1. ప్రశ్న:- మీరు చెప్పే విషయాలను మేమేవిధంగా ఆచరణలో పెట్టగలము?

కృష్ణమూర్తి:- మీరేదో వింటారు, అది చాల బాగుందని అనుకొంటారు. దానిని మీరు మీ దైనిక జీవితంలో అమలులో పెట్టవలెననుకొంటారు. అంటే మీ ఆలోచనకున్నూ ఆచరణకున్నూ మధ్య వ్యవధియున్నది. ఏమి, లేదంటారా? మీరనుకొనేదొకటి చేసేది మరియొకటి. కాని మీరేమనుకొన్నారో దానినే ఆచరణలో పెట్టాలని మీ కోరిక. ఈ విధంగా ఆచరణకున్నూ ఆలోచనకున్నూ మధ్య ఎడమున్నది, అంతరమున్నది. ఈ రెండింటికి మధ్యగల అంతరాన్ని ఎట్లా అతిక్రమించగలం? ఎట్లా దాటగలం? ఈ అంతరం లేకుండా ఎట్లా చేసికోగలం? ఆలోచనను ఆచరణతో కలిపి వేసే దెట్లాయని మీ ప్రశ్న.

మరి మీరు దేనినైనా చేయవలెనని గట్టిగా కోరుకొంటే దానిని మీరు చేసితీరుతారు — ఏమి చేయరా? పోయి క్రికెట్టు ఆడదామని గట్టిగా అనుకొంటే లేదా మీకు బాగా ఇష్టమున్న పనిని దేనినైనా సరే చేయదలచుకొంటే, దానిని ఎట్లాగైనా సరే చేయడానికి దారులు వెదుకుతారు. దానినెట్లా చేయాలి, ఎట్లా ఆచరణలో పెట్టాలి అని మీరడగనే అడగరు. మీకు దానిలో ఔత్సుక్యముండడంచేత మీ మనస్సు మీ హృదయం మీ సర్వస్వమున్నూ అందులో వుండడం చేత దానిని మీరు

చేస్తారు.

కాని యీ రెండో విషయంలో మీరు చాల చాతుర్యం చూపి స్తారు. మీరనుకొనే దొకటి, చేసేది యింకొకటి. "ఆహా! మీరు చెప్పినవిషయం ఎంత బాగుందో! బౌద్ధికంగా దానిని మేము ఎంతో మెచ్చుకుంటాం కాని దాని గురించి యేమి చేయవలెనో మాకు తెలి యదు. దానిని ఎట్లా ఆచరణలో పెట్టవలెనో దయచేసి తెల్పండి" — అని మీరంటారు. అంటే దానిని చేయవలెనని అసలు మీ మన స్సులో లేదన్నమాట! ప్రస్తుతానికి ఆ పనిని ఆపివేద్దామని మీ వుద్దేశం. కొంచెం ఈర్ష్య కొంచెం అసూయ లేదా మరింకొకటి కలిగి వుంటేనే మేలని మీతలంపు; "ఇతరులందరిలోను ఈర్ష్య వున్నది. నాకెందుకు వుండరాదు?" అని మీవాదము. దానితో మీ జీవితం ఎప్పటి మాదిరి గానే గడుస్తూవుంటుంది. అందులో మార్పురాదు. అట్లుగాక నిజంగానే ఈర్ష్య అనేది పనికిరాదని మీరనుకొంటే, కండ్లయెదుట త్రాచుపామును చూచినంత స్పష్టంగా మీరు ఈర్ష్యను చూడగలిగినట్లయితే యిక మీ రప్పటినుండి ఈర్ష్యాపరులై వుండరు. అంతటితో అది సరి. ఈర్ష్య నుండి ఎట్లా విముక్తిని పొందాలి? అని మళ్ళీ మీరడగరు.

ఇంతకు దేనినైనా సరే స్పష్టంగా చూడడం, అంటే అందరి సత్యాన్ని గ్రహించడం ప్రధానంగాని దానిని ఆచరణలో ఎట్లా పెట్టడ మనే ప్రశ్న కాదు ప్రధానం. మీ రా ప్రశ్న వేసినారంటే దాని భావం మీరందరి సత్యాన్ని స్పష్టంగా చూడలేదని. దారిలో త్రాచుపామెదురైతే ఇప్పుడు నేనేమి చెయ్యాలి? అని మీరడుగరు. త్రాచుపామువలన కలిగే ప్రమాదమేమో మీకు స్పష్టంగా తెలుసు. కాబట్టి వెంటనే దానినుండి తొలగిపోతారు. ఈర్ష్యవలన కలిగే ఫలితాలనన్నింటిని మీరు యథార్థంగా పరీక్షించి చూడలేదు; దానిగురించి మీతో ఎవరూ మాట్లాడి యుండ లేదు; మీతో బాటు లోతుగా దానిని పరిశీలించి యుండలేదు. ఈర్ష్య పనికిరాదని మీతో చెప్పినారే గాని స్వయంగా మీరు దాని స్వరూప స్వభావాలను అధ్యయనం చేసి గ్రహించి యుండలేదు. దాని మీద —

ఏదో స్థితికి చేరుకోవాలనే కోరిక మీద — సమాజమున్ను వ్యవస్థీకృతమైన అన్ని మతములున్ను ఆధారపడి వున్నాయని మీరెన్నడును గమనించలేదు. అట్లుగాక ఈర్ష్య అంటే యేమిటో, దాని సత్య స్వరూపాన్ని మీరు స్పష్టంగా చూచిన క్షణమే, ఆ యీర్ష్య మీనుండి తొలగిపోతుంది.

"నేనది యెట్లా చెయ్యాలి?" — అనే ప్రశ్న ఆలోచనారహితంగా అడిగిన ప్రశ్న. ఎట్లా చేయవలెనో తెలియని ఏవిషయాన్నైనా తెలిసికోవాలని మీకు నిజంగా అభిరుచి వున్నట్లయితే, దానిగురించి విడువక పరిశీలించి దాని అంతు తేల్చుకొంటారు. అట్లుగాక, తీరికగా కుడిచి కూర్చుండి, "నాలోని లోభగుణాన్ని పోగొట్టుకోవడం కోసం ఏదైనా ఆచరణ యోగ్యమైన మార్గాన్ని ఒకదానిని తెల్పండి" అని మీరంటే మీనుండి ఆ లోభగుణము ఎన్నటికిని పోదు. మీరు లోభులుగానే వుండిపోతారు. అట్లుగాక, హెచ్చరికగల మనస్సుతో, ఎటువైపునకును మొగ్గ జూపకుండా, అనన్యభావముతో లోభమంటే యేమిటో లోతుగా విచారించి చూస్తే మీకు దాని సత్యస్వరూపము అవగతమవుతుంది. ఆ సత్యదర్శనమే మీకు లోభాన్నుండి విముక్తి నిస్తుంది. అంతేగాని దాని నుండి విముక్తిపొందడం కోసం మీరు మార్గాన్ని వెదుకుతూ వుంటే మీకు విముక్తి లభింపదు.

2. ప్రశ్న:- *మనకోరికలెన్నటికిని పూర్తిగా నెరవేరవు, ఎందువలన? పూర్తిగా మన యిష్టానుసారమే పనిచేయవలెనంటే ఎప్పుడూ ఏవో ఆటంకాలు వస్తూనే వుంటాయి, ఎందువలన?*

కృష్ణమూర్తి:- ఏదైనా పని చేయవలెననే మీకోరిక అఖండమై వున్నట్లయితే, — అంటే భయములేకుండా, ఫలితమును గూర్చిన ఆలోచనలేకుండా, ఏదో సాధించవలెని కోరుకోకుండా వున్నట్లయితే, — మీ మనోహృదయములందులో వున్నట్లయితే అప్పుడాటంకముండదు. మీ కోరిక ఖండితమై వున్నప్పుడు, అందులో అంతర్వైరుధ్యమున్నప్పుడు ఆటంకముంటుంది. మీరేదో చేయవలెననుకొంటారు కాని అది చేయడానికి భయపడతారు లేదా మరేదో చేయవలెనని అసంపూర్ణమైన కోరికొకటి

వుంటుంది. ఇదంతా అటుంచి అసలు మీ కోరికలన్నీ యెప్పటి కైనా నెరవేరడమంటూ వుంటుందా? ఏమి, మీకర్థమవుతున్నదా? వివరిస్తా నుండండి.

సంఘమన్నా సమాజమన్నా మనిషికిని మనిషికిని మధ్యగల సమష్టి సంబంధము. అది మీరు పూర్ణకాములవడాన్ని[1] హర్షింపదు. మీరు పూర్ణ కాములయినట్టయితే, మీరు సమాజానికొక పీడగా తయారవుతారు, ప్రమా దకరంగా పరిణమిస్తారు. ఒక వేళ కావాలంటే, తృష్ణ, ఈర్ష్య (పేరాశ, ఓర్వలేనితనం) లాంటి గౌరవనీయమైన కోరికలను పెట్టుకోవచ్చు, సంఘం వాటిని అనుమతిస్తుంది. అందుకేమీ యిబ్బంది వుండదు. ఈర్ష్యాళువుల తోను తృష్ణాళువులతోను, అంధవిశ్వాసముగల వారితోను అంధానుకరణము చేయువారితోను సమాజమేర్పడినది కాబట్టి ఈర్ష్య, తృష్ణ (ambition), అంధ విశ్వాసము, అంధానుకరణములను — అవి మనిషిలో వుండే భయాన్ని సూచిస్తున్నప్పటికిన్ని వాటిని – సమాజ మనుమతిస్తుంది. మీ ఆశలు, ఆశయాలు పరంపరాగతమైన సంప్రదాయమనే చట్రంలో ఇమిడి పోగల్గి యున్నంతవరకు — సమాజానికి విరుద్ధంగా లేనంతవరకు – మీరు గౌరవనీయులైన పౌరులుగానే లెక్కింపబడతారు. కాని యెప్పుడైతే మీరు సంఘమర్యాదకు భిన్నంగా పూర్ణకాములౌతారో, అప్పుడు మీరు సమాజానికి ప్రమాదకరంగా పరిణమిస్తారు. అందువలన మీరు పూర్ణ కాములు కాకుండ నిరోధించడంకోసం సమాజము మిమ్మొక కంట కనిపెడుతూ వుంటుంది. సంపూర్ణమై విసంవాదములేని ఆ మీ కోరిక మీ సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది. కాబట్టి అది సమాజములో క్రాంతిని తేగలదు.

అస్తిత్వమును (Being) పరిణామమును (Becoming) — ఇవి రెండును పూర్తిగా భిన్నములైన క్రియలు. అస్తిత్వరూపమైన క్రియ సమూలపరివర్తనము తెస్తుంది. కావున సమాజము దానిని నిరాక రిస్తుంది; అది (సమాజము) కేవలము పరిణామరూపమైన క్రియను

---

1. 'ఇది చేస్తాను, అది చేస్తాను గొప్పవాణ్ణి అవుతాను' — ఇట్టి పరిణా మమును (Becoming) సూచించెడి కోరికలు లేని వారే పూర్ణకాములు.

మాత్రమే ప్రోత్సహిస్తుంది. ఈ క్రియ సమాజపు చట్రములో ఇమిడి పోగలదు. కావున సమాజమునకు ఆదరణపాత్రమవుతుంది. అయితే ఇట్టి పరిణామ రూపమైన క్రియ ద్వారా వ్యక్తమగు కోరిక ఒక విధమైన తృష్ణారూపము (ambition). అటువంటి కోరిక యేదైనాసరే పూర్తిగా నెరవేరడమంటూ ఎన్నటికిని జరుగదు. ముందో, వెనుకో, దాని కాటంకము కలుగుతుంది. విఘాతము కలుగుతుంది. వైఫల్యము ప్రాప్తమవుతుంది. కోరిక విఫలముకాగానే, ఆ వైఫల్యమునకు వ్యతిరేకంగా మనము హానికరమగు మార్గములతో తిరుగబడతాము.

ఇది మనం చర్చింపవలసిన చాల ముఖ్యమైన ప్రశ్న. మీ కోరికలేవీకూడా ఎప్పటికిని పూర్తిగా నెరవేరవనే చేదు నిజాన్ని మీరు పెద్దవారయ్యేకొలది గ్రహిస్తారు. కోరికల యొక్క సాఫల్యంలోనే వైఫల్యపు నీలినీడలు కనిపిస్తూ వుంటాయి. అందువలన మీ హృదయంలో సాఫల్యం వలన కలిగే ఆనంద గీతమునకు బదులు వైఫల్యపు నీలి నీడల వలన కలిగే శోకగీతమే వినిపిస్తుంటుంది. గొప్పవాణ్ణికావాలని, గొప్ప యోగిని కావాలని, యిట్లా ఏదేదో కావాలని కోరే కోరికకు అంతము లేదు. కాబట్టి పూర్ణకామత్వమంటూ వుండదు. ఇంకా ఎక్కువ కావాలి, ఇంకా గొప్ప కావాలి అనే కోరిక వుంటూనే వుంటుంది. అట్టి తీరనికోరిక వలన మనోవేదన, దైన్యము, యుద్ధములు కలుగుతాయి. అయితే ఇటువంటి 'పరిణామము' పొందవలెననే కోరికనుండి పూర్తిగావిడుదల పొందితే 'అస్తిత్వ' రూపమైన క్రియ సిద్ధిస్తుంది. ఇది పరిణామ క్రియకు పూర్తిగా భిన్నమైనది. అస్తిత్వమంటే కేవలం 'ఉనికి', దానిలో పరిణామము లేదు — మార్పులేదు. దీనికి కాలముతో సంబంధము లేదు. ఇందు దేనినో సాధించాలని, సాఫల్యంపొందాలనే కోరిక వుండదు. అసలు అస్తిత్వమంటేనే పూర్ణకామత్వము.

3. ప్రశ్న:- నేను మందమతినని నాకు తెలుసు. కాని నేను తెలివిగలవాణ్ణని ఇతరులు అంటారు. దేని ప్రభావం నామీద ఎక్కువగా వుంటుంది? నేను చూడడమా, వారు చెప్పడమా?

కృష్ణమూర్తి:- సరేగాని ముందు మీరు ప్రశ్నను చాల జాగ్రత్తగా చాల ప్రశాంతంగా వినండి. జవాబు కోసం ప్రయత్నించకండి. "నీవు తెలివిగల వాడ"వని మీరు నాతో అంటే, కాని నేను పట్టి మందమతినని నాకు బాగా తెలిసివుంటే, అప్పుడు మీరు చెప్పేమాట నామీద ఏమైనా ప్రభావం చూపిస్తుందా? తెలివిగలవాణ్ణిగా వుండడం కోసం ప్రయత్ని స్తూవుంటే, అప్పుడు మీరు చెప్పేమాట నామీద ప్రభావం చూపిస్తు న్నట్లే! అప్పుడు మీరన్నమాటకు నేను ఉబ్బిపోతాను, మీరన్నమాటకు నేను లొంగిపోతాను. కాని నిజంగా మందమతియైన వాడు తాను తెలివి గలవాడు కావడం కోసం ప్రయత్నించడంచేత ఎప్పటి మందమతిగానే వుంటా డన్న విషయాన్ని నేను గ్రహిస్తే అప్పుడేం జరుగుతుంది?

నిజంగానే నేను అల్పబుద్ధినై కుశాగ్రబుద్ధిని కావడంకోసం ప్రయ త్నిస్తూవుంటే, నేను అల్పబుద్ధిగానే వుండిపోతాను. ఎందువల్లనంటే, ఇంకోవిధంగా వుండడంకోసం, ఇంకోవిధంగా మారిపోవడం కోసం ప్రయ త్నించడం, ఆ అల్పబుద్ధితనంలో ఒక భాగం!! అల్పబుద్ధియైనవాడు తెలివితేటల లక్షణాలు కొన్ని సంపాదించుకోవచ్చు; ఏవోకొన్ని పరీక్షలు పాసవవచ్చు, ఉద్యోగం సంపాదించుకోవచ్చు. కాని దానితో వాడు అల్ప బుద్ధికాకుండా పోడు — దయచేసి దీనిని సరిగా అర్థంచేసికోండి; ఇదినేను నిరాశావాదినై చెప్పే మాట కాదు. కాని మనిషి తానల్పబుద్ధినని, మూఢుడనని తెలిసికొని, కుశాగ్రబుద్ధిగా వుండడంకోసం ప్రయత్నించ కుండా, తన అల్పబుద్ధితనాన్ని తన మూఢత్వాన్ని పరీక్షించి చూచుకొని దానిని అర్థంచేసికోవడానికై ఆరంభిస్తే ఆ యారంభించిన క్షణమునందే అతని తెలివి వికసింపసాగుతుంది, అతని ప్రజ్ఞ జాగృతమవుతుంది.

ఉదాహరణకు అత్యాశ అనే గుణాన్ని తీసికోండి. అత్యాశ అంటే యేమిటో మీకు తెలుసునా? కావలసిన దానికంటే ఎక్కువ తిండి తినడం, ఆటలలో తక్కినవారికంటె గొప్పగా వుండాలని కోరుకోవడం, ఇతరులకంటే ఇంకా ఎక్కువ ఆస్తికావాలని, వాండ్లకున్న కారుకంటే పెద్ద కారు కావాలని కోరుకోవడం, ఇదంతా అత్యాశనే సూచిస్తుంది. అయితే

అత్యాశ మంచిది కాదని చెప్పి మీరు ఔదార్యాన్ని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తారు — ఇది వట్టి తెలివితక్కువ పని. అత్యాశ లేనివాడుగా వుండడం కోసం ప్రయత్నించడం చేత అత్యాశ గుణమెన్నటికిని నశించదు. అట్లుగాక అత్యాశలో గర్భితములైయున్న విషయాలనన్నిటిని మీరర్థం చేసికోసాగితే, అందలి సత్యాన్ని తెలిసికోవడం కోసం మీరు మీ మనోహృదయాలను అర్పిస్తే అప్పుడు మీరు అత్యాశనుండియే గాక, ఔదార్యమునుండియు విముక్తి పొందుతారు. అప్పుడే మీరు నిజమైన తెలివిగల మానవులు. ఎందువల్ల నంటే మీరప్పుడు వాస్తవస్థితితో వ్యవహరిస్తున్నారే గాని, ఉండగోరిన స్థితిని అనుకరించడం లేదు.

కాబట్టి మీరు మందబుద్ధులై వున్నట్లయితే, తెలివిగల వాండ్లుగా, గడసరి వాండ్లుగా వుండడం కోసం ప్రయత్నించకండి. దానికి బదులు మీ రెందుకు మందబుద్ధులుగా వున్నారో అర్థంచేసికోండి. అనుకరించడం, భయపడడం, ఎవరిమాదిరిగానో వుండడానికై ప్రయత్నించడం, ఒక ఆదర్శాన్ని, ఒక ఒరవడిని అనుసరించడం — వీటన్నింటి చేత మనస్సు మొద్దుబారిపోతుంది. ఇతరులను అనుసరించడం మానినప్పుడు, మీకు భయమంటూ లేనపుడు, మీలో మీరు స్పష్టంగా ఆలోచించుకో గలిగినపుడు — మీరెంతో బుద్ధివికాసము గలమానవులు కారా? అట్లుగాక, మీరు మందబుద్ధులై, తెలివిగా వుండడం కోసం ప్రయత్నిస్తూ వుంటే, పైకి మాత్రం తెలివిగా కనబడుతూ, నిజానికి అతిమందబుద్ధులైన వారి కోవలో చేరతారు.

4. ప్రశ్న:- మేమెందుకు కొంటెపనులు చేస్తూవుంటాము?

కృష్ణమూర్తి :- మీరు కొంటెపనులు చేసేటప్పుడు ఈ ప్రశ్నవేసికొంటే అప్పుడది సార్థక మవుతుంది, దాని కప్పుడు అర్థముంటుంది. ఉదాహరణకు, మీకు కోపం వచ్చిందనుకోండి. ఆ సమయంలో నాకెందుకు కోపం వచ్చింది? అని యెప్పుడూ ప్రశ్నించుకోరు, ఏమి ప్రశ్నించుకొంటారా? కోపం తగ్గిపోయిన తరువాత ఆ ప్రశ్న వేసికొంటారు. "ఎంత

తెలివి తక్కువ పని చేశాను? నేను కోపం తెచ్చుకోకుండా వుండవల సింది!" అని అనుకొంటారు. అట్లుగాక కోపం వచ్చిన క్షణమందు, దానిని ఖండించకుండా, కేవలం గమనించి చూచినట్లయితే, దాని మీదికి మీ ఆలోచనను పోనిచ్చినట్లయితే, మీ మనస్సులోకి ఈ సంక్షోభం, ఈ తుఫాను వచ్చినప్పుడు మీరు పూర్తిగా దాని యెదుట నిలిచినట్లయితే, ఆ కోపం ఎంతత్వరగా నమసిపోతుందో మీరే గమనించగలరు.

ఒక వయస్సులో పిల్లలు కొంటెపనులు చేస్తూవుంటారు. అయితే అది కూడ అవసరమే — ఎందుకంటే వాండ్లకా వయస్సులో ఉత్సాహం ఉఱకలు వేస్తూవుంటుంది. చైతన్యం తొణికిసలాడుతూ వుంటుంది. చుఱుకు పాలు చిమచిమలాడుతూ వుంటుంది. అదంతా ఏదో విధంగా బ్రద్దలు చేసికొని బయటపడాలి. అందుకోసం అల్లరిపనులు చేస్తారు. కాని చూశారా, యిదంతా నిజంగా ఒక క్లిష్టమైన సమస్య. ఈ కొంటె తనానికి, ఈ తుంటరిపనులకు దోషభూయిష్ఠమైన ఆహారం కారణం కావచ్చు. నిద్రలేకపోవడంగాని, భద్రతాభావము లోపించడంగాని, ఇంకా ఏవేవో కారణాలుండవచ్చు. అందువలన దానికి మూలమైన కారణాలన్నీ సరిగా అర్థం చేసికోకపోతే, ఆ పిల్లలు చేసే తుంటరితనం, సమాజ బంధములనుండి వారికి విముక్తి లేనందున, దానికి వ్యతిరేకంగా జరిగే తిరుగుబాటుగా పరిణమిస్తుంది.

బాల నేరస్థులంటే మీకు తెలుసునా? అనేకరకాల దారుణమైన పనులు చేసే పిల్లలు వాండ్లు. జీవిత సమస్యలను అర్థంచేసికోడానికి వాండ్లకెవరును తోడ్పడలేదు. వాండ్లకు వారుండే సమాజమే ఒక చెఱ సాల. అందులోనే వారు తిరగబడతారు. వాండ్లలో ఎంతో శక్తివున్నది. వాండ్లలో కొందరు అసాధారణమైన ప్రజ్ఞావంతులు. వాండ్లు తిరుగుబాటు చేస్తున్నారంటే దానిభావం — "ఈ నిర్బంధాలను ఈ దారుణమైవ అంధానుసరణాన్ని అర్థంచేసికోడానికి, వాటినుండి విడుదల పొందడానికి మాకు తోడ్పడండి" — అని చెబుతున్నారన్నమాట. అందువలన ఈ ప్రశ్న విద్యాబోధకునికి చాల ముఖ్యమైనది. పిల్లల కంటే గూడ అతనికే

ఈ విషయమై బోధన జరుగవలసి యున్నది.

5. ప్రశ్న:- నాకు తేనీరు (టీ) త్రాగే అలవాటున్నది. అది చెడ్డ అల వాటని ఒక ఉపాధ్యాయుడు అంటాడు. మరియొక ఉపాధ్యాయుడు వర్వాలేదులే అంటాడు.

కృష్ణమూర్తి:- మీరేమని అనుకొంటారు? ఇతరులేమంటారనే విషయం అట్లా వుంచండి. అది వారి వారి యిష్టాన్ననుసరించి వుంటుంది. దాని సంగతి వదలి, అసలు ప్రశ్న యేమిటో చూడండి. టీ త్రాగడం, పొగపీల్చడం, పోటీలుపడి తిండి తినడం — ఇంకా ఇలాంటివే ఏవేవో అలవాట్లకు లొంగిపోయిన పిల్లవాని గురించి మీరేమని అనుకొం టారు? కాటికి కాళ్ళు చాచుకొన్న డెబ్బై యెనభైయేండ్ల ముసలివాడికి ఏవేవో అలవాట్లున్నాయంటే వుండనీయండి. కాని మీరింకా చిన్నపిల్లలు, జీవితారంభ దశలో మున్నవారు. ఇప్పటికే మీకు కొన్ని అలవాట్లు స్థిర పడిపోయినాయంటే, అదెంత ఘోరం? అవునా, కాదా? ఇది ముఖ్యమైన ప్రశ్న. కాని, మీరు టీ త్రాగవచ్చునా, త్రాగకూడదా అనేది కాదు.

చూడండి, మీరొక అలవాటుకు లొంగిపోయినారంటే దాని అర్థం మీమనస్సు మృత్యుముఖంవైపుకు పోతూవున్నట్లే. హిందువులమని, కమ్యూనిష్టులమని, క్యాథలిక్కులమని, ప్రొటెస్టంట్లమని మీరనుకోసాగి నట్లయితే, మీ మనస్సు అప్పుడే పతనము పొందుతున్నట్లే, క్షీణముఖం పట్టినట్లే. అట్లుగాక మీ మనస్సు హెచ్చరిక గలిగియుండి ఏదైనా అలవాటుకు మీరెందుకు లొంగిపోయినారో, ఒక నిర్దిష్టమైన మార్గాననే మీరెందుకు ఆలోచిస్తూ వున్నారో విచారించి తెలిసికోగల్గినట్లయితే పొగ పీల్చ వచ్చునాలేదా, టీ త్రాగవచ్చునా లేదా — ఇటువంటి గౌణ ప్రశ్నలకు సమాధానం కనిపెట్టడం కష్టం కాదు.

20 జనవరి, 1955

3

జీవితప్రవాహము

మీరెప్పుడైనా ఏటిగట్టుకు విహారార్థము (షికారుగా) వెళ్ళినప్పుడు అక్కడ ఏటిలో నీటిజాలు ప్రక్కననే పొడుగ్గా సన్నగా వుండే నీటిగుంట నొకదాన్ని చూసివున్నారా? దానిని బహుశా బెస్తవాండ్లు త్రవ్వివుండ వచ్చు. దానికి ఏటి నీటితో ఎలాంటి సంబంధము లేదు. ఏఱు లోతుగా, విశాలంగా, నిరాటంకంగా ప్రవహిస్తూ వుంటుంది. కాని యీ నీటిగుంటకు ఏటి నీటితో – నదీ జీవనముతో — సంబంధము లేదు. కాబట్టి అందలి నీరు మురిగిపోయి మడ్డి తేరి, కదలిక లేక, బరువెక్కి వుంటుంది. అందులో చేపలుండవు. అది ఒక నిలువనీటి గుంట. అయితే దాని నానుకొని నిరాటంకంగా వేగంగా ప్రవహిస్తున్న ఆ లోతైన నది మాత్రము చైతన్య పూరితమై జీవశక్తితో తొణికిసలాడుతూ వుంటుంది.

మరి మానవులు గూడ ఆ నీటిగుంటలాంటి వారేయని మీరను కోరా? వేగముగా పారెడి జీవిత ప్రవాహానికి దూరంగా తమకొక చిన్న నీటిగుంటను త్రవ్వుకొని అందులోనే నిలిచిపోయి, మురిగిమురిగి నశిస్తుంటారు. ఇట్లా మురిగిపోవడాన్నే, యిట్లా క్షయం పొందడాన్నే మనము జీవించడమంటాము. అంటే మనమందరము స్థిరమైన స్థితిని కోరుకొంటాము; మనం కోరుకొనే కొన్ని కోరికలు శాశ్వతంగా కొన సాగాలని, మన మనుభవించే ఇంద్రియ సుఖాలకు అంతముండరాదని మన అభిలాష. మనమొక చిన్న బొరియ త్రవ్వుకొని, దానికి మన సంసారాలతో, మన పేరాశలతో, మన సంస్కృతీ సంప్రదాయాలతో, మన భయాలతో, మన దేవీ దేవతలతో, వివిధ పూజా విధానాలతో మనకు మనం అడ్డుకట్టలు వేసికొంటాం. తుదకు గతిశీలము, నిరంతర

పరివర్తన శీలము, అతివేగవంతము, అత్యంత గంభీరము, అసామాన్య చైతన్య శోభితము, అలౌకిక సౌందర్య భూషితమగు జీవితమును జార విడుచుకొంటాం, స్వయంగా మృత్యుముఖం ప్రవేశిస్తాం.

ఏటి గట్టున నిశ్శబ్దంగా కూర్చుంటే, మీకు ఏటినీటి పాట — అందలి నీరు గట్టుకు తపతప కొట్టుకోవడం, అందలి జాలు జలజల ప్రవహించడం — మధురంగా వినబడుతుంది ఇదంతా మీరు గమనించ లేదా? అతి విశాలమును అత్యంత గంభీరమునగు గమ్యస్థానమును దేనినో వుద్దేశించి అది చేయు అద్భుతమగు ప్రయాణమును, ఒక విధ మైన గతిశీలతను అందులో మనము గమనింపగలము. కాని ఆ చిన్ననీటి గుంటలో ఎట్టి కదలిక కనబడదు. అందున్నది నిలువనీరు. అటువంటి స్థితినే మనలో చాలమంది కోరుకొంటారనేది మీకు పరిశీలించి చూస్తే తెలుస్తుంది. ఉరకలువేసే జీవిత ప్రవాహానికి దూరంగా నిలవనీటి మురికి గుంటలవలె జీవించడమే మనము కోరుకొనేది. ఈ మురికి గుంటలాంటి జీవితాన్ని మనము సమర్థిస్తాం; అదే మంచిదంటాం. దానిని సమర్థిం చడం కోసం, ఒక శాస్త్రాన్ని రచిస్తాం; దాని కనుకూలంగా ధార్మిక సిద్ధాంతాలను, ఆర్థిక సాంఘిక రాజకీయ నైతిక సిద్ధాంతాలను ప్రతిపా దించి విస్తృత పరుస్తాం. దీనికెవరైనా అడ్డు చెప్పితే ఓర్చుకోలేము. మన నమ్మకానికి భంగము కలుగరాదు. ఎందుకంటే, మనం కోరుకొనేది ఇంతకూ మనం శాశ్వతంగా వుంటామనే భావననే కాదా?

శాశ్వతత్వాన్ని కోరుకోవడమంటే అర్థమేమిటో మీరెరుగుదురా? మన మనుభవించే ఇంద్రియ సుఖాలు ఎడతెగకుండా అట్లే కొనసాగాలని, అటువంటి సుఖమునీయునివన్నీ వీలైనంత త్వరలో అంతం కావాలని కోరుకోవడమన్నమాట. మన పేరు పదిమందికి తెలియాలని, మన కుటుంబంద్వారా, మన ఆస్తిద్వారా మనపేరు శాశ్వతంగా నిలబడి పోవాలని కోరుకొంటాం. ఇతరులతో మనకు గల సంబంధాలలోను, మన కార్యకలాపాలలోను శాశ్వతత్వాన్ని కోరుకొంటాం. అంటే అర్థమేమిటి? మనమున్న మురికి గుంటలోనే మనం చిరకాలం జీవించాలని మధ్యలో ఈ

జీవితానికి భంగం రాగూడదని ప్రయత్నిస్తున్నామన్నమాట. అందులో నిజంగా మార్పులు రావాలని కోరుకోము. అందువలన మన ఆస్తికి, మన పేరుకు, ప్రఖ్యాతికి శాశ్వతత్వాన్ని ఆమోదించే సమాజాన్ని, ఆ విషయంలో మనకు భరోసా (అభయం) యిచ్చే సమాజాన్ని మనం నిర్మించుకొన్నాం.

కాని, చూడండి, జీవితమంటే అటువంటిది కానేకాదు. జీవితానికి శాశ్వతత్వమంటూ లేదు. చెట్టునుండి ఆకులు రాలునట్లు అన్నీ పోయేవే; ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు, ఏదీ కలకాలముండదు. అన్నియు పరిణామ శీలములే, అన్నియు తుదకు నశించేవే. ఆకులన్నీ రాలి, ఆకాశంలో నగ్నంగా నిలిచి వున్న చెట్టు ఎంత అందంగా వుంటుందో ఎప్పుడైనా గమనించారా? దాని కొమ్మలన్నీ బొమ్మలో గీచిన గీతలవలె అందంగా వుంటాయి. దాని నగ్నతలో కవిత్వమున్నది, గానమున్నది. ప్రతియొక్క ఆకు దానిని వదిలిపెట్టి వెళ్ళినది. అది యిప్పుడు వసంత ఋతువుకోసం ఎదురుచూస్తూ వున్నది. వసంత ఋతువు రాగానే అది ఆ చెట్టును మరల ఆకులతో కలకల లాడునట్లు చేసి, దానిచేత ఆనందగీతమును పాడిస్తుంది. కాలము పరిపక్వము కాగానే మరల ఆకులన్నీ రాలి, గాలికి కొట్టుకొని పోయి, చెట్టు మోడై నిలబడుతుంది — ఇదీ జీవితమంటే.

కాని మనకటువంటిదేమీ అక్కరలేదు. మనం మన పిల్లలను, మన సంప్రదాయాలను, మన సమాజాన్ని, మన పేర్లను, మనం చేసే చిన్నచిన్న పుణ్యకార్యాలను అంటి పెట్టుకొని వదలం; మనకు కావలసింది శాశ్వతత్వం కదా? అందువల్లనే చావుకు భయపడతాం. మన మెరిగివున్న వాటినెల్ల పోగొట్టుకొంటామేమోయని మన భయం. కాని జీవితమంటే మనం కోరుకొన్న తీరున నడవదు. జీవిత మెన్నటికిని శాశ్వతము కానేకాదు. పక్షులు మరణిస్తాయి, మంచు కరిగిపోతుంది, చెట్లను నరికి వేస్తారు, లేదా గాలివానకు విరిగి పడిపోతాయి. ఇట్లాగా ఏది శాశ్వతం? కాని మనం, మనకు సంతోషాన్ని కలిగించేది ఏదైనా

సరే, శాశ్వతంగా వుండాలని కోరుకొంటాము. మన హోదా, మన అంతస్తు, ప్రజలమీద మనకున్న అధికారము — ఇవన్నీ చిరకాలము కొనసాగాలని కోరుకొంటాము. అంటే వాస్తవానికి జీవితాన్ని యథాతథంగా (ఉన్నదున్నట్లు) మన మంగీకరించము.

అసలు విషయమేమంటే జీవితమొక నది వంటిది — నిరంతరము కదిలిపోతూ, అన్వేషిస్తూ, పరిశోధిస్తూ, ముందుకు త్రోసికొనిపోతూ, గట్లు పొర్లిపారుతూ, ఎక్కడ సందున్నా జొరబడుతూ, నీళ్ళతో నింపుతూ ప్రవహిస్తూ వుంటుంది. కాని, చూశారా, మన మనస్సుకు తానా విధంగా (నదివలె) వుండడం నచ్చదు. శాశ్వతమూ స్థిరమూ కానట్టి యే విధమైన భద్రతా లేనట్టి స్థితిలో జీవించడమంటే మనస్సుకు చాల ప్రమాదకరంగా తోస్తుంది. అందువలన తన చుట్టూ తానొక గోడను నిర్మించుకొంటుంది; అదే సంప్రదాయమనే గోడ, వ్యవస్థీకృత మతమనే గోడ, సాంఘిక రాజకీయ సిద్ధాంతములనే గోడ. కుటుంబము, పేరు ప్రతిష్ఠలు, ఆస్తిపాస్తులు, అలవరచుకొన్న కొన్ని సద్గుణములు — ఇవన్నీ, జీవితానికి దూరంగా, ఆ గోడలలో చేరి వుంటాయి. కాని, జీవితమో — కదిలిపోతూ వుంటుంది; అది స్థిరంగా, శాశ్వతంగా ఒకేచోట అట్లే నిలిచివుండదు. అది యీ గోడలలోనికి ప్రవేశించి, వాటిని కూల ద్రోయడం కోసం నిరంతరము శాయశక్తులా ప్రయత్నిస్తూనే వుంటుంది. ఆ గోడల వెనుక గందరగోళము, కలవరపాటు, దైన్యమున్ను రాజ్యం చేస్తూ వుంటాయి. అక్కడి దేవతలు దొంగ దేవతలు; వారి శాస్త్ర గ్రంథములు, వేదాంతములును అర్థము లేనివి, బూటకములు. జీవితము వీటి కన్నింటికిని అతీతము.

అయితే అటువంటి అడ్డుగోడలు లేని మనస్సునకు, తానార్జించి కూడబెట్టుకొన్న విషయముల చేతను తన జ్ఞాన వైదుష్యముల భారము చేతను క్రుంగిపోని మనస్సునకు, కాలమునకు అతీతంగా వుంటూ, తనకు భద్రతను కోరుకోకుండా జీవించెడి మనస్సునకు జీవితమనేది ఒక అద్భుతమైన విషయంగా తోస్తుంది. అసలా మనస్సే జీవితము; మనస్సు

తప్ప జీవితానికి వేరే నీడలేదు. కాని మనలో చాలమందికి నీడ కావాలి, విడిది కావాలి — అది ఒక చిన్నయిల్లో, పేరు ప్రతిష్ఠలో, పదవులో — ఏదైనా కావచ్చును. అందువల్ల మనకివన్నీ చాల ముఖ్యమైనవిగా తోస్తాయి. మనం స్థిరంగా, శాశ్వతంగా వుండడం గోరుతాము. దాని కనుకూలమైన సంస్కృతినే అభివృద్ధి పరుస్తాము. అందుకోసం దేవత లను సృష్టిస్తాము. కాని నిజానికి వారు దేవతలు కానేకారు; వారు మన కోరికలకు మారు రూపములు — అంత మాత్రమే.

శాశ్వతత్వాన్ని కోరే మనస్సు త్వరలో మురిగిపోతుంది. ఏటి ప్రక్కన వుండే నీటిగుంటవలె క్రుళ్ళి, భ్రష్టమై క్షయం పొందుతుంది. చుట్టు గోడలు లేని, నిలువ నీడ కోరని, అడ్డు తడికెలుండని, విశ్రాంతి స్థానమక్కరలేని మనస్సు మాత్రమే పూర్తిగా జీవిత ప్రవాహముతోబాటే కదులుతూ, కాలగమనముతో సంబంధము లేకుండా, ముందు ముందుకు త్రోసుకుపోతూ, అన్వేషణ గావిస్తూ భగ్గుమని ప్రజ్వరిల్లుతూ బ్రద్ద లవుతూ వుండే మనస్సు మాత్రమే ఆనందమునకు నిలయమవుతుంది. అటువంటి మనస్సు సృజనాత్మకము కాబట్టి అది నిత్యనూతనము; దానికి వార్ధక్యము రాదు.

నేనేమి చెబుతున్నానో మీకర్థమవుతున్నదా? ఇదంతా మీరు తప్పక అర్థం చేసికోవాలి, ఇది నిజమైన విద్యలో నొక భాగము. ఇది మీ కర్థమైతే మీ జీవితమే మారిపోతుంది. ప్రపంచంతోను, మీ యిరుగు పొరుగువారితోను, మీ భార్య లేక భర్తతోను గల సంబంధమునకు అర్థమే వేరుగా కనబడుతుంది. అప్పుడు మీరు ఏ విధంగానైనా సరే కోరికల నీడేర్చుకొందామని ప్రయత్నించరు; అట్టి ప్రయత్నము వలన దైన్యదుఃఖ ములను కొని తెచ్చుకోవడమే జరుగుతుంది. అందువలన మీరిదంతా మీ ఉపాధ్యాయుల నడిగి తెలిసికోవాలి, వారితో కలిసి చర్చించుకోవాలి. ఇది గనక మీకర్థమైతే, అద్భుతమైన జీవిత సత్యాన్నే అర్థంచేసికోసాగినట్లు. ఆ యవగాహనలో గొప్ప సౌందర్యమున్నది, ప్రేమ వున్నది, దానితో మీలోని మంచితనము వికసిస్తుంది. కాని భద్రత అనే నీటిగుంట

కోసం, శాశ్వతత్వం కోసం మనస్సు పారాడసాగితే తుదకు అంధ కారంలో చిక్కుకొని చెడి పోతుంది. ఒక్కసారి మనస్సు నిలువ నీటి గుంటలో నిలిచిపోయినట్లైతే, అది మరల బయటికి రావడానికే భయ పడుతుంది; బయటనేమున్నదో చూడడానికే జంకుతుంది. కాని సత్యము, దేవుడు, పరమార్థము — లేదా మరేపేరుతో పిలిచినా సరే — అది ఆ నీటిగుంటకు వెలుపలనే వున్నది.

నిజమైన మతమంటే యేమిటో మీకు తెలుసునా? అది స్తోత్రాలు చేయడంలో లేదు, పూజా విధానంలో లేదు, మరే యితర కర్మకాండ లోను లేదు. డబ్బారేకు దేవుళ్ళనో, రాతి విగ్రహాలనో ఆరాధించడంలో లేదు. గుడులలో లేదు, చర్చిలలో లేదు. బైబిలునో భగవద్గీతనో చదవడంలో లేదు. ఏదో పవిత్రనామ మనబడేదానిని పదే పదే పలకడంలో లేదు. మానవుడు కల్పించుకొన్న మరే మూఢవిశ్వాసాన్నైనా సరే పాటించడంలో లేదు. ఇదేదీ నిజమైన మతము కాదు.

నిజమైన మతమంటే నదివలె సజీవమై నిరంతరము ప్రవహించెడి ప్రేమ భావము లేదా కరుణ. అట్టి స్థితిలో అన్ని ప్రయత్నములున్ను ఆగి పోయెడి క్షణము, అన్ని విధములైన అన్వేషణలు నిలిచిపోయెడి క్షణము — ఒకటి వస్తుంది. ఇట్లు అన్వేషణ అంతమవడమే అనూహ్యమైన మరియొకదానికి ఆరంభము. నిజమైన మతమంటే దేవుని కొఱకు సత్యము కొఱకు అన్వేషణ, వెలితిలేని కారుణ్య భావము — అంటే కారుణ్య భావాన్ని వినమ్రతాభావాన్ని ప్రయత్నంచేసి సాధించడంకాదు — మనస్సు కల్పించుకొనే వాటికి, దాని చమత్కారములకు అతీతంగా నున్నదేదో దాని కొఱకు అన్వేషణ సాగించడం, దానియందు రమించడం, దానిలోనే జీవించడం, తద్రూపమై పోవడం — ఇదీ నిజమైన మత మంటే. అది మీరు చేయవలెనంటే మీరు మీకోసం త్రవ్వుకొన్న నీటి పడియను వదలిపెట్టి జీవితము యొక్క ప్రవాహంలోనికి ప్రవేశించ వలసి వుంటుంది. అప్పుడు అద్భుతంగా మీ రక్షణ బాధ్యతను జీవితమే తీసి కొంటుంది. ఎందువల్లనంటే అప్పుడు మీ రక్షణ బాధ్యతను మీరు తీసి

కోవడమంటూ వుండదు గదా. అప్పుడు జీవితం మిమ్ము తన యిష్టం వచ్చిన చోటికి తీసికొని పోతుంది. అసలప్పుడు మీరు జీవితంకంటె భిన్నము కాదు. మీరును ఆ జీవిత ప్రవాహంలో నొక భాగమే. అందుచేత అప్పుడిక మీకు భద్రత యెట్లో, ప్రజలు ఏమంటారో, ఏమనరో — ఇటువంటి సమస్యలేవీ వుండవు. అదే జీవితమందలి సౌందర్యము.

1. ప్రశ్న:- ఎందువలన మనం మృత్యువంటే భయపడతాము?

కృష్ణమూర్తి:- చెట్టునుండి రాలే ఆకు చావుకు భయపడుతుందని మీరనుకొంటారా? పక్షి మృత్యు భయంతో జీవిస్తూ వుంటుందని మీరను కొంటారా? మృత్యువు వస్తే దానిని స్వీకరిస్తుంది. అంతేగాని యెప్పుడూ మృత్యువును గూర్చి ఆలోచిస్తూ వుండదు. దాని మనస్సంతా జీవించడం మీద లగ్నమై వుంటుంది — అంటే, పురుగులను పట్టుకోవడం, గూడు కట్టుకోవడం, పాట పాడుకోవడం, కేవలం ఆనందం కోసం గాలిలో ఎగరడం — వీటిమీద లగ్నమై వుంటుంది. ఆకాశంలో చాల ఎత్తుకెగిరి, రెక్కలాడించకుండా అట్లే గాలిలో తేలాడుతూ వుండే పక్షులను మీరెప్పుడైనా గమనించినారా? అవి యెంత ఆనందంగా వున్నట్లు కనబడుతాయో! వాటికి మృత్యువుతో సంబంధము లేదు, అవి మృత్యువును పట్టించుకోవు. మృత్యువు వస్తే రానీ, మంచిదే; అంతటితో వాటి జీవితం సరి. తరువాత ఏమి జరుగుతుందో అనే భయం వాటికి లేదు. ఏ క్షణానికి ఆ క్షణమే అవి జీవిస్తూ వుంటాయి. మరుక్షణం గురించి ఆలోచిస్తూ కూర్చోవు, కాదా? మనం మనుషులం మాత్రమే, ఎప్పుడూ మృత్యువు గురించే ఆలోచిస్తూ వుంటాం. దానికి కారణం, మనం జీవించడం మానివేసినాము. అసలు ఇబ్బంది అక్కడ ఉన్నది. మనం మరణిస్తూ వున్నాముగాని జీవిస్తూ లేము. వృద్ధులు కాటికి కాళ్ళు చాచుకొని వున్నారు నిజమే; కాని పడుచువాండ్లు కూడ మృత్యువుకంత దూరంగా లేరు.

మృత్యువు వస్తే మన మెరిగిన వాటి నన్నిటిని, మనం కూడబెట్టు

కొన్న వాటినన్నింటిని పోగొట్టుకొంటామని మన భయం. అందుచేత మన మనస్సంతా చావును గూర్చిన భయాందోళనలతో నిండిపోయి వుంటుంది. మన భార్య లేక మన భర్త, మనబిడ్డ లేక మన స్నేహితుడు ఇక మనకుండరని మన భయం. మనం చదువుకొన్న చదువు, కూడబెట్టుకొన్న జ్ఞానం మనవి కాకుండా పోతాయని మన భయం. అయితే మనం కూడబెట్టుకొన్న వాటినన్నింటిని — మన స్నేహితులను, మన ఆస్తులను, మన సద్గుణాలను, మన నడతను — మనతోబాటు తీసికొనిపోవడానికే గనక వీలుంటే అప్పుడు మనం చావుకు భయపడతామా? భయపడం. అందువల్లనే మనం మరణమును గూర్చి, మరణానంతరస్థితిని గూర్చి ఏవేవో సిద్ధాంతాలను కల్పించుకొన్నాం. కాని వాస్తవమేమంటే, మరణమనగా అంతమవడం, ముగింపు. ఈ తథ్యాన్ని యెదుర్కోడానికి మనలో చాలమంది కిష్టముండదు. మనకు తెలిసిన దానిని వదులుకోవడమంటే మన కిష్టముండదు. అందువలన దానినే పట్టుకొని వేలాడుతూ, అదెక్కడ పోతుందోయని భయపడుతూ వుంటాం. అంతేగాని మనకు తెలియని దాని గురించి — అవ్యక్తము గురించి — భయపడడం లేదు. తెలిసిన దాని సహాయముతో — అంటే వ్యక్తముతో — తెలియని దానిని - అంటే అవ్యక్తమును – దర్శించ లేము. వ్యక్తము యొక్క పరిధిలో అవ్యక్తము లేదు. వ్యక్తమునుండి విడివడితే అవ్యక్తము ప్రత్యక్షమవుతుంది. కాని మనస్సంటే కేవలము వ్యక్త విషయముల సంపుటి. దానినుండి విడివడడమంటే మనోవ్యాపారము నిలిచిపోవడం. కాబట్టి "నేను అంతమవుతున్నా" నని మనస్సు తలచి భయపడుతుంది.

మరి మీరు ఏ క్షణమున కాక్షణము నిండుగా జీవిస్తూ, భవిష్యత్తును గూర్చి ఏమీ పట్టించుకోకుండా వుండగలిగితే, రేపటిని గూర్చి ఎట్టి ఆలోచన పెట్టుకోకుండా జీవింపగల్గితే — అంటే దాని అర్థం, కేవలం ఈనాటి విషయాలతో మనస్సంతా పైపైన నింపుకోవడమని కాదు — మీరు గ్రహించుచున్న విషయజ్ఞానమెల్ల క్రమముగా మీ మనస్సు

నందెట్లు ముద్రితమగుచున్నదో స్పష్టంగా చూస్తూ, అట్లు చూడడం ద్వారా ముద్రితమగుచున్న విషయజాతాన్ని సంపూర్ణంగా మనస్సు నుండి తుడిచి వేయగల్గితే, దానిని పూర్తిగా వదులుకొంటే, అప్పుడొక అద్భుతం సంభవించడం మీరు కనుగొనగలరు. ముందుగా ఒకరోజు దీనిని ప్రయత్నించి చూడండి. మీకు తెలిసినదెల్ల — జ్ఞాతవిషయ జాతమును — ఒకప్రక్క నుంచండి, దానిని మరచిపొండి. అప్పుడేమి జరుగుతుందో చూడండి. మీ చింతలను ఒకనాటి నుండి మరియొక నాటికి, ఒక గంట నుండి మరియొక గంటకు, ఒక క్షణాన్నుండి మరి యొక క్షణానికి మోసికొని పోవద్దు; అన్నింటిని ఎక్కడికక్కడ వదిలి వేయండి. అప్పుడు మనస్సు నిర్మలముగ వుంటుంది — సర్వబంధ విము క్తమవుతుంది. అట్టి విముక్త స్థితిలో నుండునది అద్భుతమైన జీవితము. అందులో జీవన్మరణములు రెండును పడుగు పేకలవలె కలిసివుంటాయి. అందు మరణమనగా ఏదైనా కేవలం అంతమవడం; ఆ అంతమవడం లోనే నూతనారంభము — సృష్టి — వుంటుంది.

2. ప్రశ్న:- మనందరిలోను సత్యమున్నదని, అది శాశ్వతమని త్రికాలా బాధితమని అంటారు. కాని మన జీవితమే అశాశ్వతమైనప్పుడు అందులో శాశ్వతమైన సత్యమెట్లా వుంటుంది?

కృష్ణమూర్తి:- చూడండి, మనం సత్యాన్ని ఒక శాశ్వతమైన, స్థిర మైన పదార్థంగా చేసివేసినాం. కాని నిజంగా సత్యము శాశ్వతమైనదా? మారనిదా? శాశ్వతమే యైనట్లైతే అది కాలము యొక్క పరిధిలోనే వుంటుంది. దేనినైనా సరే శాశ్వతమైనదని అంటున్నామంటే, అది యెడతెగకుండా అట్లే వుంటుందని భావము. కాని అట్లా ఎడతెగకుండా కొనసాగేది సత్యముకాదు. అదే అందులోని అందము. సత్యాన్ని క్షణ క్షణము దర్శిస్తూ వుండాలి, అంతేగాని అది జ్ఞాపకముంచుకొనేది కాదు. జ్ఞాపకముంచుకొన్న సత్యము మృతప్రాయము. కాని అసలు సత్యము సజీవము, ఎప్పుడూ ఒకే విధముగా వుండదు, అది నిత్యనూతనము.

దానిని క్షణక్షణమును అనుసంధానము చేస్తూ వుండాలి, దర్శిస్తూ వుండాలి. అయితే ఎప్పుడు దానిని దర్శించినా అది అట్లే వుంటుంది.

సత్యమును గురించి యేదైనా సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం కాదు ముఖ్యము. మనలో వున్న సత్యము శాశ్వతమైనది, స్థిరమైనది అని యీ విధంగా ఏదేదో చెప్పడంగాదు కావలసినది. ఇదంతా గూడ జీవ న్మరణములు రెండింటిని గూర్చి భయపడిన మన పూర్వులు కల్పించిన కల్పన. సత్యము శాశ్వతమైనదని, మీరు మరణము లేని ఆత్మ స్వరూపులు కాబట్టి దేనికిని భయపడనక్కఱలేదని — ఇటువంటి చిత్రవిచిత్ర సిద్ధాంతములు భయగ్రస్థులైన మానవులచే కల్పింపబడినవి. వారి మనస్సులు క్షయశీలములు, వారి శాస్త్రములు నిరాధారములు, బలములేనివి. వాస్తవ మేమంటే సత్యమే జీవితము, జీవితానికి శాశ్వతత్వములేదు. క్షణక్షణమును, దినదినమును జీవితమును దర్శిస్తూ వుండాలి. దాని తెర యెప్పటికప్పుడు తొలగించి చూస్తూ వుండాలి. అది యింతే యని గ్రుడ్డిగా నమ్మి వూరుకోక, నిత్యము అనుసంధానము చేస్తూ వుండాలి. జీవితమంటే యేమిటో తెలుసులే అని మీరనుకొంటే, మీరు జీవించడంలేదు, మీ జీవించడం నిజంగా జీవించడం కాదు. రోజుకు మూడు పూటలు తినడానికి తిండి, కట్టడానికి గుడ్డ, ఉండడానికి నీడ, కామ వాంఛలు దీర్చుకోవడం, మీ వుద్యోగము, మీ వినోదములు, మీ ఆలోచనల తీరు — మార్పులేని యీ దైనిక జీవితము జీవితము కాదు. జీవితమనేది దర్శించవలసినది. మీ "అహం" తొలగకపోతే, మీ సొంతమనుకొన్న వాటినన్నిటిని, తెలిసికొన్నామని మీరనుకొన్న వాటి నన్నిటిని దూరంగా విడిచిపెట్టకపోతే, మీకు జీవితము సాక్షాత్కరించదు, దానిని మీరు దర్శించలేరు. నేను చెప్పేదానిని పరీక్ష చేసి చూచుకోండి. మీ శాస్త్రాలను, మీ మతాలను, మీ ఆచారాలను, మీ మీ జాతిగత విధినిషేధాలను — ఇంకా ఇటువంటి వాటినన్నిటిని దూరంగా విడిచి పెట్టండి. అవి జీవితం కాదు. మీరు వాటిల్లో చిక్కుకొన్నట్లయితే మీరు జీవితాన్ని ఎన్నటికిని దర్శింపలేరు. నిజానికి విద్యయొక్క పరమ

ప్రయోజనము జీవితమును సదా దర్శింప గల్గడంలో మీకు తోడ్పడమే.

తనకిదంతా తెలుసుననుకొనేవాడు ముందే మృతప్రాయుడు. తన కేమీ తెలియదని గ్రహించి, అందుకోసమై అన్వేషణ గావించేవాడు, వేరే కోరిక యేమీలేనివాడు, ఏదో యొక స్థితిని అందుకోవాలనిగాని, మరొక రుగా పరిణతి చెందాలనిగాని తలచనివాడు — అట్టి మానవుడు నిజంగా జీవిస్తున్న మానవుడు; ఆ జీవించడమే సత్యము.

3. ప్రశ్న:- సమగ్రత లేక పరిపూర్ణత (Perfection) అంటే యేమిటో మేము మనస్సులో ఒక అభిప్రాయం ఏర్పఱచుకోగలమా?

కృష్ణమూర్తి:- బహుశా ఏర్పఱచుకోవచ్చు. సమగ్రత అంటే యెట్లుం టుందో ఉజ్జాయింపుగా ఊహించుకొనిగాని, అది ఇట్లావుండాలి అని నూతనంగా కల్పించుకొనిగాని అందుకోసమై పథకాలు, ప్రణాళికలు వేసి కొనిగాని, "ఇది బాగా లేదు, అందవికారంగా వున్నది. కాని అది చాల బాగా ఉండవలసిన తీరున వున్నది" — అని అనుకొంటూ గాని సమగ్రతను గూర్చి మీరొక అభిప్రాయానికి రావచ్చు. దాని గురించి మనస్సులో మీరొక ఊహా ప్రతిమను నిర్మించుకోవచ్చు. కాని దేవుని గూర్చిన మీ నమ్మకానికి అర్థమెట్లా లేదో అట్లే, సమగ్రతను గూర్చిన మీ అభిప్రాయానికిన్ని ఏమీ అర్థముండదు. ముందు ప్రయత్న మేమీ లేకుండానే ఆలోచనలన్నీ వాటంతటఅవి నిలిచిపోయిన ఒక క్షణకాలము పాటు జీవించిన జీవితము సమగ్రజీవితము. ఆ క్షణమట్లే కొనసాగడమంటూ లేదు. అందువలన సమగ్రతను ముందుగా ఆలో చించి సంపాదించుకోనూ లేము, వచ్చిన దానిని శాశ్వతం చేసికోనూ లేము. ఎట్టి ఆలోచనలు లేకుండా, నూత్న కల్పనలు చేయకుండా, పథకాలు ప్రణాళికలు వేయకుండా మిక్కిలి ప్రశాంతంగా వున్న మనస్సు మాత్రమే సమగ్రతను పొందిన క్షణమును, పరిపూర్ణతను పొందిన క్షణ మును గుర్తించగలదు.

4. ప్రశ్న:- మనలను కొట్టినవాణ్ణి మళ్ళీ కొట్టి, వాడిమీద పగతీర్చు కొందామని మనమెందుకు కోరుకొంటాము?

కృష్ణమూర్తి:- ఆ లక్షణము ప్రాణి సహజ లక్షణము — పుట్టుకతో వచ్చినది. అది బ్రతకడం కోసం ప్రాణి చేసే ప్రతిక్రియ, అవునా కాదా? కాని వివేకవంతమగు మనస్సు, ప్రబుద్ధమైన మనస్సు, ఎంతో దూరమాలోచింపగల మనస్సు మరల ఎదురుదెబ్బ కొట్టాలని కోరుకోదు. దానికి కారణం, ధర్మనిష్ఠమగు మనస్సు — అనే పేరు సంపాదించుకొందామనిగాని, క్షమా గుణమును పెంపొందించుకొందామనిగాని కాదు. దానికి కారణం ఎదురుతిరిగి దెబ్బకొట్టడం అవివేకమని, దాని కర్థం లేదని గ్రహించడమే. కాని, చూశారా, అది గ్రహించాలంటే ధ్యానమవసరమవుతుంది.

5. ప్రశ్న:- ఇతరులను ఏడ్పించడమంటే నాకెంతో సరదా. కాని అదే పని యితరులు చేస్తే నాకెంతో కోపం వస్తుంది.

కృష్ణమూర్తి:- పిల్లల విషయంలోనే కాదు, పెద్ద వాండ్ల విషయంలోను అంతేయని నా అనుమానం. మనలో చాలమందికి ఇతరులను దోపిడీ చేయడమంటే వారిని తమ స్వార్థానికై వుపయోగించుకోవడమంటే ఎంతో యిష్టం. కాని అదేపని మనకెవరైనా చేస్తే మాత్రం ఒప్పుకోము, కోపం వస్తుంది. ఇతరులను పీడింప గోరడం, వాండ్లను ఏడిపించాలని, విసిగించాలని అనుకోవడం మనకితరుల యెడ గల నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది, కాదా? స్వార్థపూరితమైన జీవితములో నుండి అట్టి గుణము తల యెత్తుతుంది. ఏడిపింపబడడం మీకిష్టం లేనట్లే మీ యెదుటి వానికిన్నీ ఇష్టముండదు. కాబట్టి మీ యిద్దరున్నూ ఆ పనిని మానివేయడం మంచిది కాదా? దాని అర్థం, మీరిద్దరున్నూ ఇతరుల కష్టసుఖాలను గుర్తించగల్గి వుండాలి, పరాయివాడి బాధను తన బాధగా ఎంచుకో గల్గి వుండాలి.

6. ప్రశ్న:- మానవుని కర్తవ్యమేమిటి?

కృష్ణమూర్తి:- మీరేమని అనుకొంటారు? చదువుకోవడం, పరీక్షలు పాసవడం, ఉద్యోగం సంపాదించుకోవడం, ఆ మీదట జీవిత పర్యంతం ఆ వుద్యోగం చేసికొంటూ బతకడం — జీవితంలో చేయవలసిన పని యిదేనా? లేక, గుడికి పోవడం, గుంపుల్లో జేరడం, రకరకాలైన సంస్కారణలు చేయబూనడమా? తన తిండికోసం, పాలకోసం జంతువులను చంపడం మనిషి చేయవలసిన పనేనా? రైళ్ళు దాటడంకోసం నదిమీద వంతెనను నిర్మించడం, నీరులేని చోట బావులను త్రవ్వడం, గనులలో నుండి చమురు తీయడం, కొండల నెక్కడం, భూమ్యాకాశములను స్వాధీనం చేసికోవడం, కవితలల్లడం, కమనీయ వర్ణచిత్రాలను గీయడం, ప్రేమించడం, ద్వేషించడం — ఇవన్నీ మానవుడు చేసేపనులు కాదా? ఏ కొన్ని శతాబ్దాలలోనో ఎట్లాగూ కూలిపోయే నాగరికతలను నిర్మించడం, యుద్ధాలను లేవదీయడం, తన రూపంలో దేవుని సృష్టించుకోవడం, మతం పేరిటగాని రాష్ట్రం పేరిటగాని ప్రజలను హింసించడం, ఇతరుల రాజ్యాలను అన్యాయంగా ఆక్రమించడం, ఇతరుల యెడ నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం — వీటితోబాటు శాంతి సౌభ్రాతృత్వముల గురించి గొప్పగా ఉపన్యసించడం — ఇవన్నీ మన చుట్టూ వున్న మానవుడు చేసే పనులు అవునా, కాదా? ఇవి వాస్తవంగా మానవుడు చేయవలసిన పనులేనా?

ఈ పనులన్నీ వినాశనానికి, దైన్యానికి, సంక్షోభానికి, నైరాశ్యానికి దారితీయడం మీరు చూస్తూనే వుంటారు. అత్యంత భోగమయ జీవితంతో బాటు కటిక దారిద్ర్యం తాండవం చేస్తూ వుంటుంది. తీవ్రమైన వ్యాధులు, ఆకలి చావులతో బాటు శీతలీకరణ యంత్రములు (రిఫ్రిజిరేటర్లు), జెట్ విమానాలు సహజీవనం చేస్తూవుంటాయి. ఇదంతా మానవుడు చేసినపనికాదా? మీరిది చూసినప్పుడు, "ఏమిటి ఇదంతా? ఇదేదీ కాకుండా మానవుడు చేయదగిన మంచిపని యింకేమీ లేదా?" అని మీలో మీరు ప్రశ్నించుకోరా? మానవుడు చేయదగిన మంచిపని

యేమిటో మనం తెలిసికోగల్గితే, అప్పు డీ జెట్ విమానాలు, గుడ్డ లుతికే యంత్రాలు (Washing machines), వంతెనలు, వసతి గృహాలు — వీటికన్నింటికి పూర్తిగా వేరే అర్థం వస్తుంది. మనిషి చేయవలసిన పని యేమిటో తెలిసికోకుండా కేవలం సంస్కరణలు కొనసాగించడంలో, మానవుడు తానంతకుముందు చేసిన వాటికెల్ల మారు రూపమీయడంలో (వాటినెల్ల మార్చి వేయడంలో) ఆసక్తుడైతే, ఫలితమేమీ వుండదు.

అయితే యింతకున్నూ మానవుని కర్తవ్యమేమిటి? అతడు చేయ వలసిన నిజమైన పని యేమిటి? వాస్తవంగా అతడు చేయవలసిన పని యేమిటంటే దేవుని అంటే సత్యాన్ని ప్రత్యక్షం చేసి కోవడం. అంటే మానవుడు తనకును ఇతరులకును మధ్య అడ్డుగోడలు పెట్టుకోరాదు, ఇతరులనుండి తన్ను వేరుచేసే పనులలో చిక్కుకోరాదు. ప్రేమిం చాలి, ప్రేమ స్వరూపుడై మెలగాలి — అదే అతడు చేయవలసిన పని. సత్యదర్శనములోనే ప్రేమ వున్నది. మనిషికిని మనిషికిని మధ్య గల సంబంధములో ప్రకటితమగు ఆ ప్రేమయే సరిక్రొత్త నాగరికతను, సరిక్రొత్త ప్రపంచాన్ని నిర్మించగలదు.

7. ప్రశ్న:- దేవుని మనమెందుకు పూజిస్తాము?

కృష్ణమూర్తి:- నిజానికి మనం దేవుని పూజించడం లేదని నా అనుమానం. (సభలో నవ్వులు) నవ్వకండి. చూడండి, మనం దేవుని ప్రేమించడంలేదు. మనమే గనక నిజంగా దేవుని ప్రేమిస్తే 'పూజ' అని పిలువబడే యీ తంతు అసలుండనే వుండదు. మనకు దేవు డంటే భయం. మన హృదయాలలో నెలకొని వున్నది భయంగాని ప్రేమకాదు. అందువల్లనే దేవుని పూజిస్తున్నాము. గుడి, గుడిలోని పూజ, మెడలోని జందెం — వీటితో దేవునికి ఏమీ సంబంధంలేదు. ఇవన్నీ మనిషి తన దర్పానికి చిహ్నంగాను, భయమువలనను నిర్మించు కొన్నవి. దుఃఖంతోను, భయంతోను నిండినవారే దేవుని పూజిస్తారు. ఐశ్వర్యము, అంతస్తు, అధికారము గలవారు సుఖజీవులు కారు. తృష్ణా

పరులు (పేరాశలు పెట్టుకొన్నవారు) అత్యంత దుఃఖజీవులు. వాటన్నింటి నుండి విముక్తి పొందినప్పుడే సుఖసంతోషాలు సిద్ధిస్తాయి. అప్పుడు మీరు దేవున్ని పూజించరు. అతి దీనులు, అత్యంత పీడితులు, నిరాశా పూరితులు మాత్రమే గుడి సన్నిధికి చేరతారు. కాని ఈ పూజ అనే తంతును వదిలిపెట్టి తమ దైన్యాన్ని తామర్థం చేసికొంటే అప్పుడు వారు, — స్త్రీలుగాని, పురుషులు గాని — సుఖమయ జీవితాన్ని గడుపుతారు. దానికి కారణమేమంటే వారప్పుడు సత్యమును — అంటే దేవుని — దర్శింపగలరు; సత్యమంటే యేమిటో, దేవుడంటే యెవరో తెలిసికొనగలరు.

21 జనవరి, 1955

4

మనస్సులోని ఆకాశము

మీరెన్నడైనా గుడిగంటలు మ్రోగుతూ వుంటే ఆ మ్రోత మీదికి మనస్సు పోనిచ్చారా? పోనిస్తే అప్పుడు మీరు వినేదేమిటి? వివిధములైన ధ్వనులనా లేక ఆ ధ్వనులమధ్య నుండే నిశ్శబ్దాన్నా? నిశ్శబ్దమే గనక లేకపోతే ధ్వనులుంటాయా? మీరు నిశ్శబ్దాన్ని గనక వింటూవుంటే, అప్పుడు ధ్వనులింకా స్పష్టంగా, లోలోతులకు చొచ్చుకొని పోతున్నట్లుగా, వేరొక విధంగా వినబడవా? కాని, చూశారా, మన మనస్సును దేనిమీదికైనా సంపూర్ణంగా ఎప్పుడోగాని పోనివ్వం. ఇంతకు దేనిమీదికైనా మన మనస్సును పోనివ్వడమంటే యేమిటో తెలిసికోవడం చాల అవసరం. మీ ఉపాధ్యాయుడు గణితంలోని ఏదైనా లెక్కను వివరిస్తూ వుంటే, లేదా మీరు దేశచరిత్రను చదువుతూ వుంటే, లేదా మీ స్నేహితుడొకడు మీతో మాట్లాడుతూవుంటే, మీకొక కథను చెప్తూ వుంటే లేదా మీరొక నది ప్రక్కన నిలబడి నీళ్ళు గట్టుకు తపతప కొట్టుకుంటూ వుండడం వింటూవుంటే, మీ మనస్సు అంతగా వాటి మీదికి పోదు. అట్లా దేనిమీదికైనా మన మనస్సును పూర్తిగా పోనివ్వడమంటే యేమిటో మనం తెలిసికోగల్గితే అప్పుడు నేర్చుకోవడమనే దానికి సరిక్రొత్త అర్థం వస్తుంది, నేర్చుకోవడం సులభమవుతుంది.

తరగతిలో సావధానంగా వుండండి అని మీ ఉపాధ్యాయుడంటే, ఆయన వుద్దేశమేమిటి? కిటికీ గుండా బయటికి చూడవద్దని, తక్కిన అన్ని విషయాల మీదినుండి మనస్సును మరల్చి, అప్పుడు మీరు చదువుతున్న పాఠ్యభాగమేదో దానిమీదనే మీ మనస్సునంతా పూర్తిగా కేంద్రీకరించమని ఆయన వుద్దేశం. అథవా మీరేదైనా నవల చదవడంలో నిమగ్నమైపోతే, అప్పుడు మీ మనస్సంతా దానిమీదనే కేంద్రీకృతమై, ఆ

క్షణంలో మరి దేనిమీదికిన్ని మనస్సుపోరదు. ఇది మరియొక విధమైన అవధానము (attention). కాబట్టి సాధారణార్థంలో, అవధానమంటే సంకుచితపరచే ప్రక్రియ కాదంటారా?

కాని యిదికాక, పూర్తిగా వేరు విధమగు అవధాన మొకటి వున్న దని నేననుకొంటాను. సాధారణంగా అందరున్ను సమర్థించేది, ఆసక్తి చూపేది, అమలులో పెట్టేది అయిన అవధానప్రక్రియలో మనస్సును క్రమంగా సంకోచింపచేస్తూ తుదకొక బిందువుమీద దానిని కేంద్రీక రింపజేయడం జరుగుతుంది. దీనిని నిరోధ ప్రక్రియ అనవచ్చును. ఎందువల్లనంటే అవధానంకోసం అంటే మనస్సు నొకదానిమీద కేంద్రీ కరింపజేయడం కోసం ప్రయత్నిస్తున్నారంటే దాని అర్థం నిజంగా మీరు దేనినో నిరోధిస్తున్నారన్నమాట, అడ్డు పెట్టుతున్నారన్నమాట. కిటికీ గుండా బయటికి చూద్దామనే కోరికను, ఎవరు లోపలికి వస్తున్నారో కనిపెడదామనే కోరికను — ఇంకా ఇటువంటి కోరికలను నిరోధిస్తున్నా రన్నమాట. ఇట్లా నిరోధించేటప్పుడు మీ శక్తిలో కొంతభాగము వ్యయమైపోతూ వుంటుంది. ఏదో యొక వస్తువుమీద మనస్సును పూర్తిగా కేంద్రీకరింపజేయడం కోసం ఆ మనస్సు చుట్టూ మీరొక అడ్డుగోడను కడతారు. అట్లా కట్టడానినే అవధానంకోసం మనస్సును క్రమశిక్షణలో పెట్టడమని మీరంటారు. ఏ ఆలోచనమీదనైతే మీరు మనస్సును కేంద్రీకరింపజేయ దలుస్తారో ఆ యాలోచనను తప్ప మిగతా వాటినన్నిటిని మనస్సులో నుండి బహిష్కరింప జేయడానికై, బయటికి త్రోసివేయడానికై ప్రయత్నిస్తారు. దానినే అవధానమని, మనస్సు నిల్ప డమని చాలమంది తలుస్తారు. కాని తద్భిన్నంగా మరొక విధమైన అవధానమున్నదని నా తలంపు. అది నిరోధ ప్రక్రియ కాదు, నిషేధ ప్రక్రియ కాదు. అందులో దేనిని లోపలికి రాకుండ అడ్డుపెట్టడం లేదు. అందువలన అధికమైన అవధానం చూపడానికి మనస్సు కెక్కువ శక్తి వుంటుంది. కాని ఎట్టి నిరోధములేని అవధానమంటే, ఏదైన పనిలో నిమగ్నమైనప్పుడు కలిగెడి అవధానంకాదు.

నేను మీతో చర్చింపదలచిన అవధానానికిన్ని మామూలుగా అందరున్ను తలచే అవధానానికిన్ని చాలా తేడా ఉన్నది. నేను చెప్పే అవధాన విధానంలో నిరోధ నిషేధములు లేవు కాబట్టి అది యెంతో బలవత్తరమైనది. ఎంతైనా ఎన్నైనా సాధించడానికి వీలున్నది. ఏదైనా విషయంమీదనో, సంభాషణమీదనో, ప్రసంగంమీదనో మీ మనస్సు కేంద్రీకరింప బడినట్లయితే, అప్పు డితరాలోచనలు చొచ్చుకొని రాకుండ, బుద్ధిపూర్వకంగాగాని అబుద్ధిపూర్వకంగాగాని మీరు అడ్డుగోడ నొకదానిని నిర్మించుకొంటారు. అందువలన మీ మనస్సు ఉద్దేశించిన విషయంమీద పూర్తిగా లగ్నమై వుండదు; ఏదో కొంత భాగము మాత్రమే దానిమీద కేంద్రీకరింపబడి వుంటుంది. మిగతా భాగమంతా వేరే ఆలోచనలు లోపలికి త్రోసుకొని రాకుండా నిరోధిస్తూ మీ ధ్యానము చెదరిపోకుండడం కోసం, విక్షేపములు కలుగకుండడం కోసం ప్రయత్నిస్తూ వుంటుంది.

ఈ విషయాన్నే మరియొక విధంగా ఆలోచిద్దాం. మీకు విక్షేపమంటే యేమిటో తెలుసునా? మీరు మీ చదివేదానిమీద మనస్సును లగ్నం చేద్దామని అనుకొంటారు. కాని గది బయట ఏదో చప్పుడై మీ మనస్సు చెదిరిపోతుంది. కిటికీ నుంచి బయటికి చూస్తారు. అంటే, దేనిమీదనో మనస్సును లగ్నం చేద్దామని మీ కోరిక, కాని మీ మనస్సు చెదిరిపోతుంది. అట్లా మనస్సు చెదిరిపోవడాన్నే విక్షేపమని అంటారు. ఆ విక్షేపమును నిరోధించడంలో మీ మనశ్శక్తి కొంత వ్యయమైపోతుంది. అట్లుగాక ఏ క్షణమున కాక్షణము మీ మనస్సు ఎట్లా పనిచేస్తున్నదో మీరు గమనిస్తూ వుంటే అప్పుడు విక్షేపమనబడేదే వుండదు. దేనినీ నిరోధించడం లేనందున మీ మనశ్శక్తి వృథా అయిపోదు. అందువలన నిజమైన అవధానమంటే యేమిటో తెలిసికోవడం చాల అవసరం.

ఎవరైనా గంటను మ్రోగిస్తున్నప్పుడు, ఆ ఘంటా నాదంతోబాటు, ఆ గంటమీద కొట్టేడి దెబ్బల మధ్యగల నిశ్శబ్దాన్ని గూడ మీ రాలకిస్తూ వుంటే, అదంతా కలిసి అవధాన మనిపించుకొంటుంది. అదే విధంగా ఎవరైనా మాట్లాడుతూ వున్నప్పుడు, వారు మాట్లాడే

మాటలనే గాకుండా, ఆ మాటల మధ్య గల నిశ్శబ్దాన్ని గూడ మీరు వింటూవుంటే, అదే అవధానము. మీరు దీనిని అమలులో పెట్టి చూస్తే మీకే తెలుస్తుంది మీ మనస్సు ఎట్టి విక్షేపంగాని, ఎట్టి నిరోధం (resistance) గాని లేకుండా ఎంత బాగా అవధానంలో నిలువగలదో!

"కిటికీ గుండా బయటికి చూడరాదు; గదిలోకి వచ్చే పోయేవారిని గమనిస్తూ వుండరాదు; ఇంకో పనిమీదికి మనస్సు పోతూవున్నా, పోనివ్వకుండా, దానిని మరల్చి పాఠంమీదనే లగ్నం చేయాలి" — ఈ విధంగా అనుకొని మనస్సును వశం చేసికొందామని, దానిని క్రమశిక్షణలో పెట్టుకొందామని తలిస్తే అప్పుడు మనస్సు రెండు భాగాలౌతుంది. దానివలన చాల నష్టమున్నది. అది మానసిక శక్తిని వృధా చేస్తుంది. కాని మనస్సులో ఎట్టి విభజనముగాని, దాని ఫలితమగు నిరోధము గాని లేకుండా సర్వమును పూర్తిగా మీరు వినసాగితే అప్పుడు ప్రయత్న రహితంగానే మీ మనస్సులో అవధానము సిద్ధించడం చూడగలరు; దేని మీదనైనను మనస్సును సంపూర్ణంగా నిల్పగలమని తెలిసికోగలరు. ఈ విషయాన్ని మీరు ఆకళింతకు తెచ్చుకోగలిగినారా? నేను మీకిది అర్థ మయ్యేటట్లు స్పష్టంగా చెప్పగలిగితినా?

అవధానము సిద్ధించడం కోసమై మనస్సును క్రమశిక్షణలో పెట్ట సాగితే, దానివలన మానసిక శక్తి క్షీణిస్తుంది. అంటే నా వుద్దేశం మనస్సును కోతివలె ఎటుబడితే అటు స్వేచ్ఛగా తిరుగనిమ్మని కాదు. ఏ పనిలోనైనా లీనమైపోవడం చేత వచ్చే అవధాన స్థితి కాకుండా మనకు తెలిసినవి మరి రెండు మానసిక స్థితులున్నాయి. ఒకటి, మన మనస్సు అటునిటు చలించి పోవడానికి వీలులేకుండా వుండడం కోసమై దానిని చాల కఠోరమైన క్రమశిక్షణలో పెట్టడానికి ప్రయత్నించడం. రెండవది, దానిని ఎటుబడితే అటు పోవడానికి స్వేచ్ఛగా వదలడం. అయితే నేను మాట్లాడేది యీ రెంటిమధ్య రాజీమార్గం కాదు, రెండింటిని సమన్వయపరచడంకాదు. పైగా నేను చెప్పేదానికిని ఆ రెండింటికిని మధ్య సంబంధమేలేదు. నేను చెప్పే మార్గము సరిక్రొత్త మార్గము. దీని

ప్రకారం మీ మనస్సు సదా జాగరూకమై సావధానంగా వుంటుంది; దేనినీ నిరోధించడంగాని, బహిష్కరించడంగాని లేదు. మీ మనస్సు ఎల్లప్పుడు ప్రతిదానిని మెలకువతో — అప్రమత్తతతో — గమనిస్తూ వుంటుంది.

నేను చెప్పేదానిని ప్రయత్నం చేసి చూడండి — అప్పుడు మీ మనస్సు దేనినైనా ఎంత వేగంగా నేర్చుకో గలుగుతుందో మీరే చూడ గలరు. ఏదైనా పాటనుగాని, మ్రోతనుగాని విన్నప్పుడు దానితో మీ మనస్సును నింపివేయండి. అందులో నేర్చుకొనడానికి ప్రయత్నమంటూ వుండదు. ఇంతకు మీ ఉపాధ్యాయుడు ఏదైనా చారిత్రక విషయము చెబుతున్నప్పుడు దానినెట్లా వినవలెనో మీకు తెలిసివుంటే మీ మనస్సులో ఖాళీ స్థలము (ఆకాశము) మరియు నిశ్శబ్దత ఉండడం చేత విక్షేపము పొందక అందుచేత నిరోధముఖు లేక, మీరు వినగల్గివుంటే అప్పుడు మీరా చారిత్రక విషయాన్నే గాకుండా, మీ ఉపాధ్యాయుడు ఆ విషయమై ఎంత పక్షపాత బుద్ధితో వున్నదిన్ని, దానికి మీ మనస్సులో ఎట్టి ప్రతిస్పందన కలుగుతున్నదిన్ని కూడ తెలిసికోగలరు.

మీకొక విషయం చెబుతాను. ఆకాశమంటే మీకు తెలుసు. ఆకాశమంటే ఖాళీస్థలము లేదా ఎడము. ఈ గదిలో ఖాళీస్థలమున్నది. ఇక్కడికిని మీ హాస్టలుకును మధ్య, మీ యింటికిని వంతెనకును మధ్య, నదిలో ఈ గట్టుకును ఆ గట్టుకును మధ్య ఖాళీస్థలమున్నది. అదే విధంగా మీ మనస్సులో ఖాళీ స్థలమున్నదా? లేక ఏవేవో ఆలోచనలతో నిండిపోయి, మీ మనస్సులో ఎడమే లేదా? మీ మనస్సులో గనక ఖాళీ స్థలముంటే, అందులో నిశ్శబ్దత వుంటుంది. ఆ నిశ్శబ్దతలో నుండియే ప్రతిది వస్తుంది. అటువంటి నిశ్శబ్దతలో మీరు వినగలరు, ఎట్టి నిరోధము లేకుండా మనస్సును లగ్నము చేయగలరు, అవధానత సిద్ధింప గలదు. అందువలన మనస్సులో ఖాళీస్థల ముండడం చాల అవసరం. మనస్సు రకరకాల ఆలోచనలతో ఎల్లప్పుడు క్రిక్కిరిసి వుండక, ఏమాత్ర మైనా ఖాళీస్థల ముంటే, ఎడముంటే, అప్పుడది ఆ కుక్క మొరగడాన్ని వినగలదు, దూరంగా వంతెనను దాటుతున్న రైలు మ్రోతను వినగలదు.

అదే సమయంలో ఇక్కడ మాట్లాడుతున్న మనిషి యేమి చెబుతున్నాడో అది గూడ గ్రహించగలదు. అట్టి మనస్సే సజీవమైన మనస్సు, అది నిర్జీవము కాదు.

1. **ప్రశ్న:- నిన్న మనం కలిసికొని విడిపోయిన తరువాత మీరక్కడ రోడ్డు ప్రక్కన ఆడుకొంటూ వున్న యిద్దరు పాలంకావు పిల్లలను — బీదతనానికి దృష్టాంతము లన్నట్లు వున్నవారిని — గమనిస్తూ నిలబడడం మేము చూసినాము. వాండ్లను చూస్తూవున్న సమయములో మీ మనస్సులో ఎటువంటి భావాలు ఉద్భవిల్లినాయో తెలిసికొందామని కోరిక.**

కృష్ణమూర్తి:- నిన్న సాయంకాలం చాలమంది విద్యార్థులు రోడ్డు మీద నన్ను కలిసికొన్నారు. వాండ్లు వెళ్ళిపోయిన తరువాత తోటమాలి పిల్లలిద్దరు ఆడుకొంటూవుండడం చూశాను. ఆ పిల్లలను చూస్తూ వున్న సమయంలో నాలో కల్గిన భావాలేవో ఈ ప్రశ్న వేసిన వ్యక్తి (పృచ్ఛకుడు) తెలిసికొనగోర్తాడు.

బీదపిల్లలను చూసినప్పుడు మీలో ఎటువంటి భావాలు కలుగుతాయి? నాలో కల్గిన భావాలను తెలిసికోడం కంటె మీలో కల్గెడి భావాలను మీరు తెలిసికోడం చాల ముఖ్యము. లేకపోతే, హాస్టలుకుగాని, తరగతులకుగాని పోతూ పోతూ ఆ పిల్లలను గమనించి చూడడానికే తీరిక దొరకలేదా?

ఆ బీద స్త్రీలు సంతకు పెద్ద పెద్ద బరువులను మోసికొని పోతూ వుంటే చూచినప్పుడు గాని, ఆ బీద రైతుపిల్లలు ఆడుకోవడానికి మరిం కేమీ లేక, మట్టితో ఆడుకొంటూ వుంటే గమనించినప్పుడుగాని మీ మనస్సులో ఎట్టి ప్రతిస్పందన కలుగుతుంది? ఆ పిల్లలకు మీ మాదిరి చదువుకోవడానికా అవకాశంలేదు. ఉండడానికా మంచి యిల్లులేదు. పరిశుభ్రత నెరుగరు. చాలీచాలని గుడ్డలు చాలీచాలని తిండి ఇదంతా మీరుగమనించినప్పుడు మీలో కల్గెడి ప్రతిక్రియ యేమిటి? మీ ప్రతిక్రియ యేమిటో మీకు మీరు తెలిసికోవడం చాల ముఖ్యం. నా ప్రతిక్రియ

యేమిటో నేను చెబుతాను.

ఆ పిల్లలకు నిద్రపోవడానికి సరియైన చోటు లేదు. వాండ్ల తల్లి దండ్రులు సెలవంటూ లేకుండా దినమంతా పనిచేస్తూనే వుంటారు. ఆ పిల్లలకు ఎవరి ప్రేమా తెలియదు. వాండ్లను గురించి ఎవరూ శ్రద్ధ తీసికోరు. వాండ్ల తల్లిదండ్రులు వాండ్లను దగ్గర కూర్చోబెట్టుకొని ఈ అందమైన భూమి గురించి గాని, ఆకాశం గురించిగాని కథలెన్నడూ చెప్పరు. ఈ ప్రపంచంలో ఒక ప్రక్క ఏది కోరుకొంటే అది సంపాదించుకోగల అత్యంత ధనవంతులున్నారు. మరియొక ప్రక్క దేనికినీ నోచుకోని బాల బాలికలున్నారు. ఇటువంటి పరిస్థితులకు కారణమైన యీ సమాజమేమి సమాజము? ఇటువంటి సమాజానికి కారకులెవరు? మీరు విప్లవం తీసుకురావచ్చు. ఈ సమాజాన్ని తల క్రిందులు చేయవచ్చు. ఈ సమాజచక్రాన్ని విరుగ గొట్టవచ్చు. కాని ఆ విరుగగొట్టడంలో దీనికి మారురూపమైన మరియొక క్రొత్త సమాజం పుట్టుక వస్తుంది. ఇందులోను ప్రభుత్వాధి కారులకు పల్లెపట్టులందు ప్రత్యేక బంగళాలుంటాయి. వారికి జరగవలసిన ప్రత్యేక మర్యాదలుంటాయి. ప్రత్యేక అధికారాలుంటాయి. ప్రత్యేకమైన యూనిఫారం దుస్తులుంటాయి. ఈ విధంగా పైనుండి క్రిందికి అర్హతలు అధికారాలు వుంటూనే వుంటాయి. ఫ్రెంచి విప్లవంగాని, రష్యన్ విప్లవం గాని, చైనా విప్లవంగాని — ఏ విప్లవం తరువాతనైనా సరే, ఇది యిట్లే జరిగినది. ఇటువంటి అవినీతి, భ్రష్టాచారము, దైన్యమున్నులేని సమాజాన్ని నిర్మింపగలమా? ఇటువంటి సమాజాన్ని నిర్మింపవలెనంటే మనవంటి వ్యక్తులు, సమిష్టి నుండి తెగతెంపులు చేసికొని బయట పడాలి. స్వయంగా గొప్ప వాండ్లం కావాలని అత్యాశలకు పోరాదు. తృష్ణను విసర్జించాలి. ప్రేమించడమంటే యేమిటో తెలిసివుండాలి. ఇదంతా అప్పుడు నా మనస్సులో తట్టిన ప్రతిక్రియ యొక్క సారాంశం.

ఇంతకు నేను చెప్పినదంతా మీరు వింటున్నారా?

2. ప్రశ్న:-మన మనస్సు ఒకేసారి అనేక విషయాలను ఎట్లా వినగ లదు?

కృష్ణమూర్తి:- అది కాదు నేను చెబుతూ వుండినది. ఒకేసారి అనేక విషయాలమీద మనస్సును నిలుపగల సమర్థులు కొందరుండవచ్చు. అది కేవలం అభ్యాసం మీద, మనస్సున కిచ్చిన శిక్షణ మీద ఆధారపడి వుంటుంది. అటువంటి దాని గురించి కానేకాదు నేను మాట్లాడుతూ వుండినది. నేను మాట్లాడుతూ వున్నది ఎట్టి అడ్డుగోడలు నిర్మించుకోని దేనినీ నిరోధించని మనస్సును గురించి. అట్టి మనస్సులో ఖాళీ ప్రదేశ ముండడంచేత, నిశ్శబ్ద ముండడం చేత అది వినగలదు. ఆ నిశ్శబ్దములో నుండియే ఆలోచనలన్నీ పుట్టుకొని వస్తుంటాయి.

3. ప్రశ్న:- ఏమీ పని చేయకుండ, సోమరితనంగా వుండాలని మన కెందుకు బుద్ధి పుడుతుంది?

కృష్ణమూర్తి:- సోమరితనంవలన దోషమేమి? కదలకుండా ఒకచోట కూర్చుండి, దూరంగావున్న ధ్వని రానురాను దగ్గరి దగ్గరికి వస్తూవుంటే వింటూ వుండడంలో తప్పేమున్నది? లేదా, ప్రొద్దుటి పూట పక్కమీదనే పడుకొని లేవకుండా, దగ్గరలోనే వున్న చెట్టుమీది పక్షులను గాని, తక్కిన అన్ని ఆకులు కదలక మెదలక వుంటే, ఒక్క ఆకు మాత్రం చల్లని గాలికి కదులుతూ వుండడాన్ని గాని గమనిస్తూ వుండడంలో దోషమే మున్నది? మనము సోమరితనాన్ని నిందిస్తాము — దానికి కారణం మన దృష్టిలో సోమరితనం చెడ్డది. అసలు సోమరితనమంటే యేమిటో ఆలోచిద్దాం. నాకారోగ్యం బాగానే వుండి, మామూలుగా లేవవలసిన సమయానికి లేవకుండా పక్కలోనే పడుకొని వుంటే అది సోమరితనమని కొందరంటారు. శరీరంలో తగినంత ఉత్సాహం లేకగాని, శక్తి లేకగాని లేదా మరే యితర ఆరోగ్య కారణాల చేతనైనా సరే చదువుకోడానికైనా, ఆడుకోడానికైనా మీ కిష్టం లేకపోతే దానిని గూడ కొందరు సోమరితనమనే అంటారు. అసలింతకు సోమరితనమంటే యేమిటి?

ఏ మనస్సైతే వివిధములైన ప్రేరణలకు తాను చేయు ప్రతిక్రియలను, తన సూక్ష్మమైన కదలికలను తాను గమనించి చూస్తూ వుండక, వాటి గురించి అసావధానంగా వుంటుందో ఆ మనస్సే సోమరితనము గల మనస్సు; అదియే అజ్ఞానముతో గూడిన మనస్సు. మీరు పరీక్షలు పాసుకాలేకపోతే, ఏవేవో పుస్తకాలు చదవనందున అందలి విషయాలేవీ మీకు తెలియకపోతే అది అజ్ఞానము కాదు. మీ గురించిన జ్ఞానము మీకు లేకపోతే, మీ మనస్సు ఎట్లా పని చేస్తున్నదో మీ వుద్దేశాలు, మీ ప్రతిక్రియలు ఎట్లాంటివో మీకు తెలియకపోతే అదియే నిజమైన అజ్ఞానము. అదే విధంగా మనస్సు నిద్రమత్తులో పడివుండడమున్ను సోమరితనమే. నిజానికి చాలమంది మనుష్యుల మనస్సులు ఎల్లప్పుడు నిద్రమత్తులో వుంటాయి. వారి మనస్సులు ఏవేవో శాస్త్ర గ్రంథాలో లేదా శంకరాచార్యులో మరియొకరో చెప్పిన విషయాలతో ఇంకా అనేక విధాలుగా కూడబెట్టుకొన్న జ్ఞానంతో మత్తుమందు దిన్నట్లు పడివుంటాయి. వారేదో యొక శాస్త్రాన్నో, వాదాన్నో అనుసరిస్తూంటారు. ఏదో యొక విధమైన క్రమశిక్షణను పాటిస్తుంటారు. అందువలన వారి మనస్సులు, పొంగిపొరలుతున్న నదులవలె నిండుగా నుండి ఆంతరిక సౌందర్యముతో నొప్పుచుండుటకు బదులు సంకీర్ణములై, సంవేదనా రహితములై మొద్దుబారి వుంటాయి. అట్టి మనస్సులు సోమరితనమునకు నెలవులు. అంతేకాదు, గొప్పవారము కావాలనే కోరిక గలిగి, ఒక ఫలితాన్ని ఆశించి పనిచేస్తూ వుండే మనస్సు నిజానికి చురుకైన మనస్సు కాదు. అది పైకి చూడడానికి చురుకుగా పనిచేస్తూ వున్నట్లు, చొరవ గల్గియున్నట్లు తన కోరికను సాధించుకోవడం కోసం దినమంతా పని చేస్తూ వున్నట్లు కనబడవచ్చుగాక. కాని లోలోపల నిరాశా నిస్పృహల భారంతో, భంగపాటుతో, ఆశాభంగమువలన కలిగెడి చిరాకుతో నిండి, క్రుంగిపోతూ వుంటుంది.

అందువలన నిజంగా మనలో సోమరితనమున్నదా లేదా యనే విషయాన్ని మనం చాల జాగ్రత్తగా గమనించి చూచుకోవాలి. సోమరిపోతులని — సోంబేరులని — మిమ్మెవరైనా అంటే, మనమంతేనేమో

యని సమాధాన పడనవసరంలేదు. సోమరితనమంటే యేమిటో లోతుగా పోయి విచారించండి. ఏది చెప్పితే అది గ్రుడ్డిగా నమ్మేవాడు లేదా గ్రుడ్డిగా నిరాకరించేవాడు లేదా గ్రుడ్డిగా అనుకరించేవాడు, భయంచేత రక్షణం కోసం తనకొక గాడి త్రవ్వుకొని అందులోనే నడిచిపోయేవాడు — ఇటువంటి వారందరు సోమరులు. వీరి మనస్సు క్రమంగా క్షీణించి ముక్కలు ముక్కలై పోతుంది. కాని నిత్య జాగరూకుడైన మనిషి సోమరి కానేకాడు. కాని తరచుగా నతడు పైకి చూడడానికి సోమరివలె కనబడుతూ ప్రశాంతంగా కూర్చుండి చెట్లను, పక్షులను, ప్రజలను, నక్షత్రములను, మౌనముగా ప్రవహించు నదిని మేల్కొనియున్న మనస్సుతో గమనిస్తూ వుంటాడు.

4. ప్రశ్న:- సంఘానికి వ్యతిరేకంగా విప్లవం తీసికొని రావాలని మీరంటారు. కాని కోరిక పనికిరాదని గూడ మీరే అంటారు. అయితే సంఘాన్ని బాగుపరచవలెననే కోరిక కోరిక కాదా? అది పేరాశ కాదా?

కృష్ణమూర్తి:- విప్లవమంటే నా వుద్దేశమేమిటో చాల జాగ్రత్తగా వివరించాను. దానిని ఇంకా విశదం చేయడం కోసం రెండు వేర్వేరు పదాలను వాడతాను. సంఘంలోనే వుంటూ, దానిని ఇంకొంచెం బాగుపరచడం కోసం, అందులో కొన్ని సంస్కరణలు తేవడం కోసం ప్రయత్నించడం ఎట్లాంటిదంటే ఖైదీలు జైలులోనే వుంటూ అందులోని తమ జీవితాన్ని బాగుపరచుకోవడం కోసం ప్రయత్నించడం లాంటిది. అట్టి విప్లవము విప్లవమే కాదు. దానిని తిరుగుబాటు (mutiny) అనవచ్చు. ఈ రెండింటికిని గల తేడా మీరు గ్రహించారా? సంఘంలో విప్లవమంటే చెఱసాలలోని ఖైదీలు మంచి తిండికోసం తమ్ము బాగా చూచుకోవడం కోసం అధికారులకు వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటు లాంటిది. కాని అవగాహన వలన కలిగిన విప్లవమేదంటే సంఘాన్నుండి తెగత్రెంపులు చేసికొని వ్యక్తి బయట పడడం. అదియే సృజనాత్మకమైన విప్లవము లేదా క్రాంతి.

అయితే మీరొక వ్యక్తిగా సంఘాన్నుండి విడివడి బయటికి వచ్చి వేస్తే, ఆ పని మీరేదో ఆశపెట్టుకొని చేసినట్లా? ఏదో విధంగా గొప్పవారు కావాలనే కోరికతో చేసినట్లా? ఒకవేళ అట్టి కోరికతో మీరా పని చేసివున్నట్లయితే మీరు సంఘాన్నుండి విడివడనట్లే! మీరింకా చెఱసాలలోనే వున్నట్లు. ఎందువల్లనంటే అసలు సంఘానికి ప్రాతిపదిక అట్టి కోరికయే! గొప్పవాళ్ళం కావాలనే కోరిక, అంతా మనకే వుండాలనే కోరిక, స్వార్థము, లోభము — ఇట్టి గుణాలమీదనే సంఘము ఆధారపడి వుంటుంది. ఇదంతా అర్థము చేసికొని మీ మనో హృదయములలో సంపూర్ణ పరివర్తనమును గొనిరా గల్గినచో అప్పుడు మీలో తృష్ణలేనట్లు, మహత్త్వాకాంక్ష లేనట్లు. అప్పుడు మీరు చేసిన పనికి ఈర్ష్యాసూయలుగాని, లోభము గాని, సంగ్రహణ శీలతగాని కారణములు కానేరవు. అందుచేత వాటిమీద ఆధారపడిన సంఘమునకు మీరు వెలిగా నుంటారు. అప్పుడు మీలో సృజనాత్మకత పరిఢవిల్లుతుంది. అప్పటి మీ యాచరణలో నూతన సంస్కృతికి బీజములుంటాయి.

కాబట్టి సృజనాత్మకమైన విప్లవమునకున్ను, సంఘములోనే వుంటూ చేసెడి తిరుగుబాటునకున్ను చాల వ్యత్యాసమున్నది. కేవలము సంఘములో సంస్కరణలు కొనిరావడముతోనే మీకు సంబంధమున్నట్లయితే, చెఱసాల యొక్క కమ్మీలకు గోడలకున్ను రంగువేసి, వాటిని అలంకరించడంతోనే మీకు సంబంధమున్నట్లయితే అప్పుడు మీరు సృజనాత్మకత గలిగిన వ్యక్తులు కారు. ఒక సంస్కరణ మరియొక సంస్కరణకు దారితీస్తుంటుంది. దానితో మరింత దైన్యము, మరింత వినాశమున్ను కలుగుతుంటాయి. అట్లుగాక, (ఇంకా ఇంకా కూడబెట్టుకోవాలని కోరెడి) సంగ్రహణ బుద్ధి యొక్క లక్షణాన్ని, లోభ లక్షణాన్ని, మహత్త్వాకాంక్ష యొక్క లక్షణాన్ని అర్థము చేసికొని, వాటినన్నింటిని ఛేదించుకొని బయటికి వచ్చిన మనస్సు నిరంతరము క్రాంతి పథమున నడుస్తూ వుంటుంది. అది విశాలమై సృజనాత్మకమగు మనస్సు. కాబట్టి ప్రశాంతముగ నున్న చెరువునీటిలో రాతిని విసరినపుడు కెరటములు పుట్టి నలువైపుల వ్యాపించినట్లు సృజనాత్మకమగు మనస్సు యొక్క వ్యాపారమువలన

కలిగిన కెరటములు వినూత్నమగు నాగరికతకు ఆధారములగును.

5. ప్రశ్న:- నేను చదువుకోనప్పుడు నా మీద నాకెందుకు అసహ్యము రోత కలుగుతుంది?

కృష్ణమూర్తి:- ప్రశ్నను సరిగా వినండి. చదువుకోవలసినదేదో నేను చదువుకోనప్పుడు నా మీద నాకెందుకు అసహ్యము కలుగుతుంది? ఉండవలసిన రీతిగా నేనుండనప్పుడు నామీద నాకెందుకు రోత కలుగుతుంది? అయిష్టమేర్పడుతుంది? అంటే, దాని భావం, నా ఆదర్శములకు తగినట్లుగా నేనెందుకు నడుచుకోవడంలేదని.

అయితే, అసలా ఆదర్శములే పెట్టుకోకపోతే అది మరీ మంచిది కాదా? అదెంత సులువు? ఎంత ఇబ్బందిలేని పని? మీ రాదర్శములే పెట్టుకోకపోతే మిమ్ము మీరు అసహ్యించుకోడానికి అసలు కారణమే వుండదుగదా. కాబట్టి "నేను దయగలిగి వుండాలి, ఉదారంగా వుండాలి. ఎచ్చరిక కలిగి వుండాలి, బాగా చదువుకోవాలి" — అని యిట్లా మీరెందుకనుకోవాలి? అదెందుకో మీరు తెలిసికొని ఆదర్శాల జోలికే పోకుండా, వాటిని మానివేస్తే అప్పుడు బహుశా మీ ఆచరణలోనే తేడా వస్తుంది; మీరు వ్యవహరించే తీరే మారిపోతుంది. అదెట్లో యిప్పుడే చూపిస్తా.

మరి మీరెందుకని ఆదర్శాలు పెట్టుకొంటారు? మొట్టమొదటిది, ఏదైనా ఆదర్శాలు పెట్టుకొని వాటి ప్రకారం నడుచుకోకపోతే, మీ జీవితాలు వ్యర్థమని మీరు కొఱగాని పిల్లలని అందరు మీతో అంటూ వుంటారు. సామ్యవాద సిద్ధాంతం ప్రకారం నడిచే సంఘమైనా, పెట్టుబడి దారీ విధానం ప్రకారం నడిచే సంఘమైనా సరే, మీ ముందొక ఆదర్శాన్ని వుంచుతుంది. దానిని మీరు అంగీకరించి ఆ యాదర్శం ప్రకారం నడుచుకోవడానికి ప్రయత్నిస్తారు, ఏమి ప్రయత్నించరా? అయితే ఆ యాదర్శం ప్రకారం నడుచుకోవడానికి ప్రయత్నించే ముందు అసలు ఆదర్శాలంటూ పెట్టుకోవడం అవసరమాయని మీరాలోచించుకోవద్దా?

అసలదే తప్పకుండా మీరు చేయవలసిన తెలివిగల పని. రాముడు, సీత మీ కాదర్శ పురుషులు. ఇంకా సంఘం మీకిచ్చిన ఆదర్శాలు, మీరు స్వయంగా కల్పించుకొన్న ఆదర్శాలు ఎన్నో వుంటాయి. అవి మీరెం దుకు పెట్టుకొంటారో తెలుసునా? మీరు మీరుగానే వుండిపోవడానికి, అంటే మీ యథార్థస్థితిని చూచుకొని, భయపడుతున్నారు.

ఈ విషయాన్ని జటిలం చేయవద్దు, సరళంగానే వుంచుదాం. మీరు మీరుగానే వుండిపోవడానికి మీరు భయపడుతున్నారు. అంటే, మీలో మీకు ఆత్మవిశ్వాసంలేదు. అందువల్లనే మీరున్న సంఘముగాని, మీ తల్లిదండ్రులుగాని, మీ మత సంప్రదాయాలుగాని మీరెట్లా వుండాలో చెప్పితే, అట్లా వుండడానికి మీరు ప్రయత్నిస్తున్నారు.

మరి, మీరు మీరుగానే వుండిపోవడానికి ఎందుకు భయపడతారు? మీరున్న స్థితితోనే మీరెందుకారంభించరు? మీరెట్లా వుండవలెనని కోరు కొంటున్నారో దానితో ఎందుకారంభిస్తారు? ప్రస్తుతం మీరున్న స్థితిని అర్థం చేసికోకుండానే దానిని మీరుండదలచిన స్థితిలోనికి మార్చవలెనని ప్రయత్నం చేయడం అర్థములేని పని. అందువలన ఆదర్శాల నన్నిటిని తుడిచి పారవేయండి. దీనికి పెద్దలు సమ్మతించరని నాకు తెలుసు. అయినా ఫర్వాలేదు. అన్ని ఆదర్శాలను గోకి పారవేయండి, గంగలో ముంచి వేయండి, చెత్త బుట్టలోకి విసిరి పారవేయండి. మీరే స్థితిలో వున్నారో దానితో ఆరంభించండి — అంటేయేమిటి?

మీరు సోమరులు, చదువుకోవడానికి బొత్తిగా ఇష్టంలేదు. ఆటలు ఆడుకోవాలని, సరదాగా కాలంగడపాలని అనుకొంటారు. పిల్లలందరి స్వభావమూ అంతే. మరి దానితోనే ఆరంభించండి. సరదాగా కాలం గడపడమంటే మీ వుద్దేశమేమిటి? మీ బుద్ధినుపయోగించి పరీక్షించి చూడండి. అందులో వాస్తవంగా అంతర్భూతమైయున్న విషయమేమిటి? మీ తల్లిదండ్రులుగాని, మీ ఆదర్శాలు గాని చెప్పేమాటలకు మీరు చోటి వ్వకండి — ఆ మాటలను వినకండి. చదువుకోవడానికి ఎందుకిష్టంలేదో మీ బుద్ధి నుపయోగించి స్వయంగా తెలిసికోండి. జీవితంలో మీరేమి చేయ

దలిచినారో తెలిసికోవడంకోసం మీ మనస్సు నుపయోగించండి. మీరున్న సంఘంగాని, మీ ఆదర్శంగాని చెప్పే మాటలనటుంచి, స్వయంగా మీరు ఏమి చేయదలచినారో తెలిసికోండి. ఈ విచారణ చేయడానికై మీరు మీ మనోహృదయాలను పూర్తిగా వినియోగిస్తే అప్పుడు మీరు నిజమైన క్రాంతి వాదులవుతారు. అప్పుడు మీరు సృజనశీలురవడానికిన్ని మీ సహజస్థితిలో నుండడానికిన్ని మీకాత్మవిశ్వాసం కలుగుతుంది. అట్టి స్థితిలో మీ యందు నిత్యనూతనమగు జీవశక్తి వెల్లివిరుస్తుంది. అట్లుగాక ఎవరో మరి యొకరిమాదిరిగా వుండడం కోసం ప్రయత్నిస్తూ వుంటే మీ శక్తి సామర్థ్యాలను పాడుచేసికొంటూవుంటారు.

మీ సహజస్థితిలో మీరుండడంలోనే అందమున్నది. కాని అట్లా మీ సహజ స్థితిలో మీరుండడమంటే ఎందుకంత భయపడతారో చాల విచిత్రమైన విషయంకాదా? ఇది మీరు గమనించారా? మీరొకవేళ సోమరులే కావచ్చు, మూర్ఖులేకావచ్చు. కాని ఆ విషయం తెలిసికొని ఆ సోమరితనాన్ని, మూర్ఖత్వాన్ని మరియొక రూపంలోకి మార్చుకోడం కోసం ప్రయత్నించే బదులు ఆ సోమరితనమనగానేమో, ఎట్టిదో అర్థం చేసికొంటే, మూర్ఖత్వాన్ని ముఖాముఖి ఎదుర్కొంటే, ఆ స్థితిలో మీరెంతో భారవిముక్తులయినట్లు అనుభూతి చెందుతారు. మీ మనస్సు తేలికపడుతుంది. అందులోనే అందమున్నది. గొప్ప తెలివి వున్నది, ప్రజ్ఞ వున్నది.

6. ప్రశ్న:- ఒకవేళ ప్రస్తుతమున్న సమాజానికి విరుద్ధంగా తిరుగు బాటుచేసి నూతన సమాజాన్ని నిర్మించినా ఈ నూతన సమాజ నిర్మాణము పేరాశ యొక్క మరియొక రూపము కాదా?

కృష్ణమూర్తి:- నేను చెప్పినదానిని మీరు సరిగా వినిపించుకోలేదని నాకనుమానంగా వున్నది. సమాజము యొక్క చట్రములోనే, దాని పరిధిలోనే వుంటూ, మన మనస్సు తిరుగబడితే ఆ తిరుగుబాటు చెఱ సాలలోని అధికారులకు వ్యతిరేకంగా, అందలి కట్టుబాట్లకు విరుద్ధంగా

చేసిన తిరుగుబాటు వంటిది. అప్పుడది మరొక రూపంలో నున్న పేరాశయే అవుతుంది. కాని మనస్సు నేటి సమాజము యొక్క వినాశకరమగు ప్రవృత్తిని అర్థం చేసికొని దానినుండి బయటపడితే అప్పుడా మనసు చేసినపని పేరాశతో అంటే ఏదో పెద్ద ఆశపెట్టుకొని — చేసినదికాదు. అట్టి ఆచరణవలన క్రొత్త సంస్కృతి, ఉత్తమ సమాజ వ్యవస్థ, నూతన ప్రపంచము ఏర్పడవచ్చు. కాని దానితో ఆ మనస్సునకెట్టి సంబంధ మున్నూ లేదు. సత్యమేదో కనుగొనడంతోనే — సత్య దర్శనముతోనే — ఆ మనస్సునకు గల సంబంధము. గతిశీలమగు ఆ సత్యము వలననే నూతన ప్రపంచ నిర్మాణము జరుగుతుంది. కాని సమాజము నెదిరించి నిలిచిన మనస్సువలన కాదు.

24 జనవరి, 1955

5

రెండువిధములైన జ్ఞానము

నిన్న సాయంకాలం కనబడిన ఇంద్రధనుస్సును మీలో ఎంతమంది చూచివుంటారో నాకనుమానమే. అది సరిగ్గా నీళ్ళ మీదుగా తటాలున కనబడింది. చూడడానికి ఎంతో అందంగావుంది. ఎంతో ఆనందాన్ని కలిగించింది. దానిని చూస్తే భూమి యెంత గొప్పదో, ఎంత విశాల మైనదో, ఎంత అందమైనదో మన మనస్సుకు తట్టుతుంది. ఆ మన ఆనందాన్ని యితరులతో పంచుకోవలెనంటే – (ఇతరులకు చెప్పవలె నంటే) — మనకు భాషలోని పదపదార్థముల జ్ఞానము బాగా వుండాలి; అందుకు తగిన భాషతో బాటు అందలి లయసౌందర్యములున్ను ఎఱిగి వుండాలి; ఏమి, వుండనక్కరలేదా? కాని వీటన్నిటికంటే ప్రధానమైనది అనుభూతి, సౌందర్యము యొక్క లోతైన అవగాహన వలన గలిగే ఆనందపారవశ్యము. అయితే ఇట్టి అనుభూతి కేవలం జ్ఞానార్జన వలన గాని, జ్ఞాపక శక్తిని పెంపొందించుకొనడం వలన గాని కలుగబోదు.

చూడండి, దేనిగురించైనా మనభావాలను ఇతరులకు వ్యక్తం చేయ వలెనంటే, దేని గురించైనా మనలో మనం మాట్లాడుకోవలెనంటే దాని గురించిన జ్ఞానం మన వద్ద తగినంత వుండాలి. అట్టి జ్ఞానాన్ని అభివృద్ధి చేసికోవాలంటే మనకు జ్ఞాపక శక్తి వుండాలి. మనవద్ద తత్తద్విషయికమైన పరిజ్ఞానమే లేకపోతే విమానములను నడుపలేము. వంతెనలను గాని అందమైన భవనాలనుగాని నిర్మించలేము. పెద్ద పెద్ద రోడ్లను వేయలేము. వృక్ష సంరక్షణగాని, జంతుసంరక్షణగాని చేయలేము. నాగరికతగల మానవులముగా మనం చేయవలసియున్న వివిధ కార్యములను వేటిని గూడ మనం చేయలేము. విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయవలెనంటే, వివిధ విజ్ఞానశాస్త్ర విషయములందు కృషిచేయవలె

నంటే, వైద్యము ద్వారా మానవునికి సహాయపడవలెనంటే, ఇంకను ఇటువంటి పనులెన్నింటినో చేయవలెనంటే వీటిని గురించిన పరిజ్ఞానము మనకుండాలి. వీటిని గురించిన వివరాలను సేకరించి, వాటిని జ్ఞాపక ముంచుకోవాలి. ఇట్టి విషయాలలో మీకు వీలున్నంత అత్యుత్తమ బోధన జరగడం చాల అవసరం. అందువలన మీకు సరియైన వివరాలనందజేస్తూ, వివిధ పాఠ్య విషయాలలో సంపూర్ణ పరిజ్ఞానాన్ని సంపాదించుకోవడంలో సహాయపడడం కోసం సాంకేతికంగా సమర్థులైన ప్రథమశ్రేణి ఉపాధ్యాయులు మీకెంతో అవసరం.

కాని చూడండి, ఒక స్థాయిలో మనకు జ్ఞానమవసరమైనప్పటికిన్ని, మరియొక స్థాయిలో మనకది ప్రతిబంధకంగా తయారవుతుంది. భౌతిక ప్రపంచమునకు సంబంధించిన విజ్ఞానమెంతో మనకిప్పుడు ఉపలబ్ధమవుతున్నది. అది యింకను దినదినము వృద్ధిచెందుతూ వున్నది గూడ. అట్టి విజ్ఞానము సంపాదించుకోవడం, ధానిని లోక కల్యాణం కోసం వుపయోగించుకోవడమున్ను అత్యావశ్యకమే. అయితే మానసిక స్థాయిలో సత్యదర్శనమునకు ప్రతిబంధకముగా పరిణమించెడి మరియొక విధమైన జ్ఞానముండలేదా? ఇంతకున్ను జ్ఞానమంటే యేమిటి? ఒక విధమైన సంప్రదాయమే కాదా? పారంపర్యముగా లభించునట్టిదే కాదా? ఇక సంప్రదాయమంటే స్మృతిమూలకము, జ్ఞాపకాలపై ఆధారపడినది. యాంత్రిక విషయాలలో సంప్రదాయ మత్యావశ్యకమే. కాని అది అంతరంగ విషయాలలో – అంటే మానసికంగా – మానవునికి మార్గదర్శకమైనట్టయితే అప్పుడట్టి సంప్రదాయము అలౌకిక విషయాలను దర్శించడానికి ప్రతిబంధక మవుతుంది.

యాంత్రిక విషయాలలోను, మనదైనిక జీవితంలోను మనము మనం సమకూర్చుకొన్న జ్ఞానంమీద, మన జ్ఞాపకాల మీద ఆధారపడతాము. అట్టి జ్ఞానమే లేకపోతే మనం మన కారును నడుపలేము, ఇంకా యెన్నో పనులను చేయలేము. కాని ఆ జ్ఞానము మన మనస్సును, మన ఆత్మను, మన అంతరంగాన్ని నడిపే ఒక సంప్రదాయంగా, ఒక

నమ్మకంగా మారిపోయినట్లయితే అప్పుడది మనకొక ప్రతిబంధక మయి తీరుతుంది. అది మానవులలో విభేదము కల్పిస్తుంది. ప్రపంచమంతట ప్రజలు తమ్ము దాము హిందువులుగా, మహమ్మదీయులుగా, బౌద్ధులుగా, క్రైస్తవులుగా, ఇంకా ఎన్నో పేర్లతో పిలుచుకొంటూ, అనేక విభాగాలుగా విభజింపబడివుండడం మీరు గమనించలేదా? వారి నట్లు విభజించిన దేది? వైజ్ఞానిక పరిశోధనలుకాదు, కృషివిజ్ఞానముకాదు, వంతెన లెట్లా నిర్మించాలో, జెట్ విమానాల నెట్లా నడపాలో దానికి సంబంధించిన విజ్ఞానమున్ను కాదు. ప్రజలను విభజించేది సంప్రదాయము, నమ్మకాలున్ను. అవి మానవుల మనస్సును తమకనుకూలంగా మలచివేసుకొంటాయి, ఒక నిశ్చితమార్గంలో ప్రవర్తింపజేస్తాయి.

కాబట్టి సంప్రదాయంగా మార్పుచెందిన జ్ఞానము మనస్సునాక్రమించి, తన కనుకూలంగా దానిని మలచుకొనడంచేత అది సత్యదర్శనమునకు ప్రతిబంధకమవుతుంది. అప్పుడా జ్ఞానము ప్రజలను విభజించి వారిమధ్య విరోధమును పెంపొందింప జేయడమే గాకుండా సత్యమననేదో, జీవిత మననేమో, దేవుడనవెవరో లోతుగా విచారించి తెలిసికొన వీలులేకుండా అడ్డుపడుతుంది. దేవుడననెవరో తెలిసికొనవలెనంటే మన మనస్సు తనకు రక్షణను కల్పించెడు సమస్త సంప్రదాయమునుండి, సమస్త సంచితమునుండి, సమస్త జ్ఞానమునుండి విముక్తము కావలసి వుంటుంది.

విద్యయొక్క కర్తవ్యమేమనగా ఏయే క్షేత్రములందు మానవుని కృషి కొనసాగివున్నదో ఆయా క్షేత్రములకు సంబంధించిన పరిపూర్ణ జ్ఞానమును విద్యార్థి కందివ్వడమే గాకుండా అతని మనస్సును సమస్త సంప్రదాయమునుండి విముక్తము గూడ చేయవలసి వుంటుంది. అప్పుడు మాత్రమే అతనికి సరియైన పరిశోధన చేయడానికి గాని, లోతుగా విచారించడానికిగాని, సత్యమును దర్శించడానికిగాని, సాధ్యమవుతుంది. అట్లుగానిచో మనస్సు కేవలము యాంత్రికమై జ్ఞాన యంత్రాంగముచే బరువెక్కిపోతుంది. పేరుకొనిపోతూవుండే సంప్రదాయమునుండి ఎప్పటి కప్పుడు విడుదల పొందుతూ వుంటేనే తప్ప, దానినుండి తన్నుదాను

నిరంతరము విముక్తము చేసికొంటూ వుంటేనే తప్ప, మనస్సు శాశ్వత మగు పరమతత్త్వమును దర్శింపజాలదు. అయితే మానవుని దైనికజీవిత మున కావశ్యకములైనవి, అందుకోసం మానవుడు ఉత్పత్తి చేయవలసినవి ఏవేవైతే వుంటాయో వాటికి సంబంధించినదై విస్తృతమౌతూ వున్న జ్ఞానరాశిని అతడు సాధించి సంపాదించుకోవలసిందే — అదిమాత్రము తప్పదు.

కాబట్టి జ్ఞానసంపాదనము — అంటే జ్ఞాపకశక్తిని పెంపొందింపజేసు కోవడం — ఒక స్థాయిలో చాల అవసరము, చాల ఉపయోగకరమున్ను. కాని మరియొక స్థాయిలో అది యొక ప్రతిబంధకము. ఈ విధంగా జ్ఞాన మెక్కడ వినాశకరమో, దానినెక్కడ దూరముగా నుంచవలెనో మరియు అది యెక్కడ ఆవశ్యకమో, వీలున్నంత యెక్కువగా దానినెక్కడ ఉప యోగించుకోవలసి వుంటుందో — ఈ తేడాను గుర్తించడమే తెలివి వికసించడానికి ఆరంభము.

కాని ప్రస్తుత కాలంలో విద్య పేరిట యేమి జరుగుతూ వున్నదో తెలుసా? మీకు అనేక విషయాలలో జ్ఞానము కలుగజేయబడు తున్నది. అవునా కాదా? కళాశాలలో చదివి మీరు ఇంజనీర్లో, డాక్టర్లో, లాయర్లో అవుతారు. గణితశాస్త్రంలోనో లేదా మఱియొక శాస్త్రంలోనో పి. హెచ్. డి. తీసికొంటారు. లేదా గృహవిజ్ఞానం చదివి, కాపురమెట్లా నడుపుకోవలెనో, వంట యెట్లా చేసికోవలెనో ఇంకా ఏవేవో నేర్చుకొంటారు. కాని సమస్త సంప్రదాయమునుండి విడుదల పొందడ మెట్లో ఎవరును మీకు బోధించరు. అట్లా విడుదల పొందినప్పుడే మీ మనస్సు నిత్యనూతనముగా సదా నిర్మలముగా నుంటుంది. కుతూ హలముతో సరిక్రొత్త విషయాలను తెలిసికొనగలిగి వుంటుంది. మీరు పుస్తకాలు చదివి అలవరచుకొన్న వేదాంతాలు, సిద్ధాంతాలు, నమ్మకాలే మీకు సంప్రదాయమవుతుంది. ఆ సంప్రదాయము మీ మనస్సును సరి యైన దారిన స్వతంత్రంగా పనిచేయనీయక అడ్డుపడుతుంటుంది. మీ మనస్సు వీటి చాటున రక్షణ పొందగోరుతుంది. కాబట్టి వాటి కనుగు

ణంగా మీ మనస్సు మలచబడుతుంది, వాటికి లొంగిపోతుంది కాబట్టి సమస్త సంప్రదాయము నుండీ విముక్తి పొందడమే గాకుండ, దానితో బాటు సమస్తవిజ్ఞానము సమస్త క్రియలందు నైపుణ్యమును సాధించడం గూడ అవసరమే. ఇదియే విద్యయొక్క పరమ ప్రయోజనము.

అయితే కూడబెట్టుకొన్న జ్ఞానమునుండి మనస్సును విముక్తము చేయడం సుసాధ్యము కాదు. అది చాల కష్టముతో గూడినపని. కాని అట్లు విముక్తమగు మనస్సు మాత్రమే ఎల్లప్పుడును అపూర్వ విషయమును దర్శింప సమర్థమవుతుంది. ఒక గొప్ప గణితశాస్త్రవేత్త గణితమునకు సంబంధించిన యొక సమస్యను ఎన్ని దినములు శ్రమించినప్పటికిని పరిష్కరింప లేకపోయెనట — ప్రశ్నకు సమాధానమును సాధింపలేకపోయెనట. ఒకనాటి ఉదయం పూట ఆయన మామూలుగా చల్లగాలిని సేవించడంకోసం తిరుగుతుండగా తటాలున ఆయన మనస్సులో ఆ ప్రశ్నకు సమాధానము తట్టినదట. ఇంతకును జరిగిన దేమిటి? అతని మనస్సు ప్రశాంతంగా ఉండడంచేత సమస్యను తాజాగా, అంటే పాత ఆలోచనలతో సంబంధము లేకుండా, చూడగల్గింది. అంతట సమస్య లోనే సమాధానము కనబడినది. సమస్యను గురించిన పూర్తి భోగట్టా — అన్ని వివరాలు — తెలియడం అవసరమే. కాని దానికి సమాధానం తెలిసికోవడంకోసం ఆ తెలిసిన వివరాలనుండి మనస్సు విముక్తము కావలసి వుంటుంది.

మనలో చాలమందిమి అనేక విషయాలు నేర్చుకొంటాం. ఎంతో సమాచారాన్ని సేకరిస్తాం, జ్ఞానాన్ని సంపాదించుకొంటాం. కాని ప్రశాంతంగా వుండడమెట్లో, జీవిత క్లేశముల నన్నిటినుండి విముక్తి పొందడమెట్లో, వివిధ సమస్యలు తనలో వేరుపారకుండా ఎట్లు చేసికొనవచ్చునో మన మనస్సెన్నటికిని నేర్చుకొనదు. ఏవేవో సంఘాలలో చేరతాం, ఏదో యొక వేదాంతాన్ని అంటిపెట్టుకొని వుంటాం, ఏదో యొక నమ్మకానికి దాసులమౌతాం. కాని వీటి వలన ప్రయోజనమేమీ వుండదు; ఇవేవీ మన సమస్యలను పరిష్కరించలేవు సరిగదా, వీటివలన

మన దైన్యమింకా వృద్ధి చెందుతుంది. మన దుఃఖమింకా పెరుగుతుంది. దీనికి కావలసింది వేదాంతంగాదు, నమ్మకంకాదు. దీనికి కావలసింది విముక్తమగు మనస్సు. అట్టి మనస్సే లోతుగా తత్త్వ విచారణ చేయ గలదు, సత్యమును దర్శింపగలదు. సృజనశీలము కాగలదు.

పరీక్షలలో పాసవడంకోసం బట్టీ పడతాం, ఎంతెంతో సమాచా రాన్ని సేకరిస్తాం, అదంతా పరీక్షలలో వ్రాసి డిగ్రీ సంపాదిస్తాం. దానితో ఉద్యోగం దొరుకుతుందని, వివాహం చేసికొందామని ఆశిస్తాం. జీవిత మంటే అంతేనా? మీరు జ్ఞానాన్ని సేకరించినారు, సాంకేతిక నైపు ణ్యాన్ని సాధించినారు. కాని మీ మనస్సు మాత్రం స్వతంత్రము కాదు, విముక్తము కాదు; అందువలన ప్రస్తుతమున్న యీ సంఘవ్యవస్థకు మీరు బానిసలై పోతారు. అంటే దాని అర్థం మీరు సృజనశీలురైన మానవులు కారన్నమాట. మీరు పిల్లలను కనవచ్చు, కొన్ని వర్ణచిత్రాలు గీయవచ్చు లేదా అప్పుడప్పుడు ఏవో కొన్ని పద్యాలు అల్లవచ్చు. కాని అంతమాత్రంచేత అది సృజనాత్మకత అనిపించుకోదు. సృజనాత్మకత సిద్ధించాలంటే మొట్టమొదట మనస్సుకు స్వతంత్రముండాలి. అప్పుడు, సిద్ధించిన సృజనాత్మకతను వ్యక్తీకరింప జేయడానికి తనకు తెలిసిన విధా నమును దేనినైనా ఉపయోగించుకోవచ్చు. కాని మనస్సు సృజనాత్మకము కాకుండా, సత్యదర్శనము వలన సిద్ధించెడి అసాధారణమైన సృజనాత్మ కత లేకుండా కేవలమేదో యొక సాంకేతిక కళ తెలిసి యుండడంలో అర్థములేదు. దురదృష్టవశాత్తు మన మనస్సులు మనం కూడబెట్టుకొన్న జ్ఞానంతో, సంప్రదాయంతో, జ్ఞాపకాలతో, శంకరుడేమి చెప్పినాడో, బుద్ధు డేమి చెప్పినాడో, కార్ల్‌మార్క్స్ ఏమి చెప్పినాడో, ఇంకా ఎవరెవరేమేమి చెప్పినారో వాటన్నిటితో నిండి బరువెక్కి వుంటాయి. కాబట్టి సృజ నాత్మకత అంటే యేమిటో మనలో చాలమందికి తెలియనే తెలియదు. అట్లుగాక, మీ మనస్సు స్వతంత్రమై సత్యమును దర్శింపగల్గి యున్నట్ల యితే అప్పుడు అక్షయమై అనవద్యమైన ఆంతరిక సౌందర్యమును మీలో మీరు కనుగొన గలరు. అందులో గొప్ప ఆనందముంటుంది. అప్పుడు మీకు ప్రజలతోను, అభిప్రాయాలతోను, వస్తువులతోను గల సంబంధము

లలో నూతనమగు అర్థము స్ఫురిస్తుంది.

***1.* ప్రశ్న :- అల్లరిపిల్లవానిలో మార్పు, ప్రేమ ద్వారా వస్తుందా లేక దండనము ద్వారా వస్తుందా?**

కృష్ణమూర్తి :- మీరేమనుకొంటారు? ప్రశ్నను చాల జాగ్రత్తగా వినండి. బాగా ఆలోచించి చూడండి, మనసా అనుభూతిపొంది చూడండి. అల్లరి పిల్లవానిలో మార్పు ప్రేమద్వారా వస్తుందా? దండనం ద్వారా వస్తుందా? దండనము ద్వారా, అంటే ఒక విధమైన నిర్బంధము చేయడం ద్వారా, పిల్లవాడు మారినట్లయితే, అది నిజమైన మార్పు అవుతుందా? మీరు వయస్సులో పెద్దవారు కాబట్టి ఉపాధ్యాయునిగానో, తల్లిదండ్రులుగానో మీకు పిల్లవానిమీద అధికారం చెలాయించడానికి అవకాశముంటుంది. మీ రతనిని బెదరిస్తే, భయపెట్టితే, పాపమా పిల్లవాడు భయపడిపోయి, మీరేమి చేయమంటే అదెల్లా చేస్తాడు. కాని అది నిజమైన మార్పు అవుతుందా? ఎటువంటి నిర్బంధం ద్వారానైనా సరే మార్పు వస్తుందా? చట్టం చేయడం ద్వారా, ఏరూపంలోనైనా సరే భయపెట్టడం ద్వారా ఎన్నటికైనా నిజంగా మార్పు రాగలదా?

పోనీ, అల్లరిపిల్లవానిలో మార్పును ప్రేమ తీసికొని వస్తుందా? అని ఈ ప్రశ్నను మీరు వేసినప్పుడు, మీ వుద్దేశంలో ప్రేమ అనేమాటకు అర్థమేమిటి? ప్రేమించడమంటే అతనిని మార్చడమని కాదు; ప్రేమించడమంటే అతనిని అర్థం చేసికోవడం, అతనిలోని ఆ అల్లరితనానికి, ఆ చిలిపితనానికి గల కారణాలను అవగాహన చేసికోవడం. అట్టి అవగాహనయే పిల్లవానిలోని అల్లరితనాన్ని పోగొట్టుతుంది.

పిల్లవానిని మార్చాలని, అతనిలోని అల్లరితనాన్ని పోగొట్టాలని నేను అనుకొంటే, ఆ నా కోరికయే ఒక విధమైన నిర్బంధము, ఒక విధమైన ఒత్తిడి తేవడం కాదా? అట్లుగాక ఆ పిల్ల వాడెందుకని అల్లరి పిల్లవాడైనాడో నేను అర్థం చేసికోసాగితే, అతనిలో ఆ అల్లరితనమెందుకు వచ్చిందో దానికి గల కారణాలను కనుక్కొని వాటిని తొలగించగల్గితే

— అప్పుడా పిల్లవాడు అల్లరిపిల్లవాడుగా ఉండబోడు. దానికి కారణాలు — దూషితమైన ఆహారంకావచ్చు, నిద్రలేమి కావచ్చు, అతనియందెవ రును వాత్సల్యము చూపకపోవడం కావచ్చు, మరియొక పిల్లవాడతనిని ఏడిపిస్తూ వుండవచ్చు — ఇంకా ఏవేవో యిట్లాంటి కారణాలుండవచ్చు. అయితే కేవల మా పిల్లవానిని మార్చడమే నా ప్రధానోద్దేశమైనట్లయితే – అంటే ఒక నిశ్చితమైన చట్రంలో అతడు ఇమిడి పోవాలనే నేను కోరుకొనేటట్లయితే, — అప్పుడు నేనతనిని అర్థంచేసికోను, చేసికోలేను.

మరి చూశారా, ఈ సందర్భంలో మరియొక ప్రశ్న ఎదురవుతు న్నది. మార్పురావడమంటే మన వుద్దేశమేమిటి? ఒకవేళ మీరా పిల్లవాని యెడల చూపిన ప్రేమచేత — అంటే ఒకవిధంగా అతనిమీద మీరు ఒత్తిడి తేవడంచేత — ఆ పిల్లవాడు అల్లరితనం మానివేసినాడనుకొందాం. కాని అది నిజంగా అతనిలో మార్పు వచ్చినట్లేనా? అది ప్రేమేకావచ్చు; కాని అది కూడ — అతనిచేత ఏదైనా పని చేయించడానికి గాని, అతని స్థితిలో మార్పు తేవడానికిగాని తెచ్చిన - ఒకవిధమైన ఒత్తిడి కాదా? పైగా, పిల్లవానిలో మార్పురావాలని మీరంటే దాని భావమే మిటి? ఏ స్థితినుండి ఏ స్థితిలోనికి మారాలని మీ వుద్దేశం? ఇప్పుడున్న స్థితిలోనుండి, రేపు ఉండగోరిన స్థితిలోనికా? ఉండగోరిన స్థితిలోనికి మారడమంటే దాని భావం ఇప్పుడున్న స్థితికి కొంత మెరుగు పెట్టడమే కాదా? ఇప్పుడున్న స్థితిలోనే కించిత్ పరివర్తనము తీసికొని వచ్చినట్లు కాదా? అందువలన అది నిజమైన పరివర్తనమెట్లా అవుతుంది?

దానినే మరియొక విధంగా చెప్పదాం — నేను సహజంగా లోభినై, మీరందరు – సమాజము, ధార్మిక గ్రంథములును – లోభగుణం మంచిది కాదని, ఆ గుణాన్ని వదిలిపెట్టమని చెప్పడంచేత, నేను అలోభిని - అంటే ఉదారుడను - అయినట్లయితే నేను నిజంగా మారినట్లేనా? లేక నాకున్న లోభగుణాన్నే మరియొక పేరుతో పిలుస్తున్నానా? అట్లు గాక నాకున్న లోభగుణమనే సమస్యను గురించి లోతుగా విచారణ చేసి దానిని పూర్తిగా అవగాహన చేసికొంటే, ఆ లోభగుణమునుండి నేను

సహజంగా విముక్తుడనౌతాను. ఈ స్థితికిని అలోభినిగా – అంటే ఉదారునిగా - మారిన స్థితికిని సంబంధమే లేదు; రెండును పూర్తిగా వేర్వేరు స్థితులు.

2. ప్రశ్న :- మేము తెలివిగలవారము ఎట్లు కాగలము?

కృష్ణమూర్తి :- ఎప్పుడైతే మీరు తెలివిగలవారు కావడానికై ప్రయత్నిస్తారో ఆ క్షణమునందే మీరు తెలివిలేని వారవుతున్నారు. ఇది నిజంగా చాల ముఖ్యమైన విషయం. అందువలన దీనిమీదికి కొంచెం మనస్సును పోనిచ్చి చూడండి. నేను మందమతినై, ప్రతివాడును నాతో, "నీవు తెలివిగలవాడవు కావాలి" అని చెప్పి ప్రోత్సహిస్తూ వుంటే, సాధారణంగా జరిగేదేమిటి? తెలివిగలవాణ్ణి కావడంకోసం తంటాలుపడడం ప్రారంభిస్తాను. ఇంకా ఎక్కువగా చదువ సాగుతాను. మంచి మార్కులు తెప్పించుకోవడంకోసం ప్రయత్నిస్తాను. అప్పుడు అందరూ "నీవు చాల కష్టపడి చదువుతున్నా" వని నా వీపుతట్టి నన్ను మెచ్చుకొంటారు. కాని నా తెలివి తక్కువతనంలో మార్పురాదు. తెలివిగల వానికుండే పైపై మెరుగులు కొన్ని మాత్రం సంపాదించుకొంటాను. కాబట్టి యిప్పుడు సమస్య యేమంటే, తెలివిగల వాడను అవడం ఎట్లా అని కాదు ప్రశ్న, తెలివితక్కువతనం ఎట్లా పోతుంది అనేది ప్రశ్న. నేను తెలివితక్కువ వాడనైయుండి, తెలివిగల వాడను కావాలని ప్రయత్నించడంలో నా తెలివితక్కువతనమే బయట పడుతున్నది!

చూడండి, ఇందులో ప్రధాన సమస్య మార్పు రావడం గురించి. తెలివి అంటే యేమిటి? ఎవడైనా తెలివి గలవాడెట్లు కాగలడు?" అని మీరడిగినారంటే దాని భావం తెలివి అంటే యేమిటో దాని గురించి మీకొక అభిప్రాయమున్నదని, దాని కనుగుణంగా మారితే తెలివిగల వారవుతారని. కాబట్టి అందుకోసం మీరు ప్రయత్నిస్తారు. కాని తెలివిగల వారవడం కోసం ఒక సూత్రాన్ని కనిపెట్టి, ఒక వాదమునో, సిద్ధాంతమునో ఆశ్రయించి, ఒక కల్పన చేసికొని దానికనుగుణంగా మిమ్ము

మీరు పోతపోసికోవడం, మిమ్ము మీరు మార్చుకోవడం వట్టి తెలివి తక్కువ పని కాదా? అట్లుగాక మందమతియైన వాడు తన మందమతి తనాన్ని మరియొక రూపంలోకి మార్చుకోడానికై ప్రయత్నించే బదులు, "నేను మందమతిని, జడుడను, మూఢుడను, ఎంత ఘోరము!!" అని తన్నుదాను నిందించుకొంటూ వుండేబదులు అసలు మందమతి అంటే యేమిటో లోతుగా విచారణ చేసి తెలిసికోసాగితే ఆ చిక్కు సమస్యను విడదీయడం మొదలిడసాగితే, అతనిలో అప్రయత్నంగా ఆ మందమతి తనం తొలగిపోయి నిజమైన తెలివి వికసింపసాగుతుంది.

3. ప్రశ్న :- నేను మహమ్మదీయుడను. మా మత సంప్రదాయాలను నేను ప్రతిదినము పాటించకపోతే మా తల్లిదండ్రులు నన్ను మాయింట్లోనుండి బయటికి వెళ్ళగొడతామని బెదిరిస్తున్నారు. అందుకు నేనేమి చేయాలి?

కృష్ణమూర్తి :- మహమ్మదీయులు కాని మీరందరు, బహుశా, ఇల్లు వదిలిపెట్టి వచ్చివేయమని యితనికి సలహా యిస్తారనుకొంటా, ఏమి, యివ్వరా? కాని మీరందరు ఏయే సంప్రదాయాలకు చెందివున్నా, హిందువులు, పార్సీలు, కమ్యూనిస్టులు, క్రైస్తవులు ఇంకా ఇటువంటి పేర్లు మీరేవేవి తగిలించుకొన్నా మీకందరికి జరగబోయేది అదే! మీ అందరికి ఆ సలహా వర్తించేదే! కాబట్టి అధికులమని మీరేమీ గర్వపడనక్కరలేదు. గుఱ్ఱంమీద ఉన్నతాకాశంలో స్వారీచేయనక్కర లేదు.

అదట్లా వుంచండి. మరి మీరు ఏదేని ఒకమతంలో పుట్టిపెరిగి మీతండ్రి మీతో, "ఈ మన మతాచారాలను పాటించండి, లేకపోతే ఇల్లు వదిలి వెళ్ళిపోండి" అని మీతో అంటే ఆ మతాచారాలన్నీ పాతకాలపు మూఢ విశ్వాసాలని మీకు దృఢంగా తెలిసివుంటే, అప్పుడు మీరేమి చేస్తారు? ఆ విషయం మీరా పాత నమ్మకాలను ఎంత దృఢంగా పాటించదలచుకోలేదో దానిమీద ఆధారపడి వుంటుంది. — నిజంకాదా? "నేనీ విషయం బాగా ఆలోచించాను; మహమ్మదీయుణ్ణని, హిందు

వునని, బౌద్ధుణ్ణి అని, క్రైస్తవుణ్ణి అని – ఇంకా ఇటువంటి పేర్లతో దేనితోనైనా పిలిపించుకోవడం అర్థంలేని పని. ఇందుకోసం ఇంటిని వదిలిపెట్టవలసి వస్తే వదిలిపెడతాను. జీవితంలో ఏమి ఎదురైనా – అతి దైన్యస్థితిగాని, ఆఖరికి మృత్యువుగాని ఏది వచ్చినా — సంతోషంతో ఎదుర్కొనడానికి సిద్ధమే. ఇదే సరియైన మార్గమని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఈ విషయంమీద నేను గట్టిగా నిలబడతాను" — అని మీరు చెప్పగలరా? మీరు చెప్పలేకపోతే, మీ సంప్రదాయము, మీ సమష్టి సమాజము మిమ్ము అవలీలగా మ్రింగివేస్తాయి.

కాబట్టి మీరేమి చేయబోతున్నారు? అటువంటి దృఢవిశ్వాసాన్ని విద్య మీలో కల్గించలేకపోతే విద్య యొక్క ప్రయోజనమేమిటి? కేవలమేదో యొక ఉద్యోగం సంపాదించుకోవడంకోసం, వినాశకరమని స్పష్టంగా తెలిసిన యీ క్రుళ్ళు సమాజంలో ఒకరుగా ఇమిడిపోవడంకోసమున్నూ మిమ్ము తయారుచేయడమా విద్యయొక్క పరమప్రయోజనము? ఎవరో కొద్దిమంది మాత్రమే ఈ సమాజపు ఉచ్చులను తెగత్రెంచుకొని బయటపడగలవారని "నాలో అంతసామర్థ్యములే"దని చెప్పవద్దు. దాని మీద మనస్సు నిలపాలేగాని, ఎవరైనా త్రెంచుకొని బయటపడగలరు. సంప్రదాయముయొక్క ఒత్తిడిని అర్థం చేసికోడానికిగాని, దాని నెదిరించి నిలబడడానికిగాని, మీకు కావలసింది శరీరసామర్థ్యం కాదు, మనోధైర్యము, దృఢవిశ్వాసము. మీయంతట మీరు స్వయంగా ఆలోచించుకోవడం మీకు తెలిస్తే దానితో ప్రచండమైన మనోధైర్యము వస్తుంది. కాని చూశారా మీరు చదువుకొనే చదువు ఎట్లా ఆలోచించుకోవలెనో బోధించదు; ఏమి ఆలోచించుకోవలెనో తెల్పుతుంది. మీరు మహమ్మదీయులని, హిందువులని, క్రైస్తవులని, ఇదని, అదని మీకు బోధిస్తారు. కాని నిజమైన విద్యయొక్క కర్తవ్యమేమనగా మీయంతట మీరు స్వయంగా ఆలోచించుకో గల్గడంలో సహాయపడడం. అట్లా మీయంతట మీరు స్వతంత్రంగా ఆలోచించుకోసాగితే దానితో మీకెంతో విశ్వాసం వస్తుంది. మీకెంతో మనోధైర్యం వస్తుంది. అప్పుడే మీరు సృజనశీలురైన మానవులుగా జీవింపగల్గుతారు, బానిసలవంటి యంత్రములుగా కాదు.

4. ప్రశ్న:- అవధానములో దేనినీ నిరోధించడం పనికిరాదని మీరంటారు. అది యెట్లా సాధ్యమవుతుంది?

కృష్ణమూర్తి:- ఎటువంటి నిరోధమున్నా అది అనవధానతయే అవుతుంది, విక్షేపమవుతుంది. (distraction) అని నేను చెప్పినమాట నిజమే. కాని నేను చెప్పితినని మీరు అంగీకరించకూడదు. మీరును ఆలోచించండి. చెప్పిన వారెవరైనా సరే, ఎటువంటి వారైనాసరే, దేనినికూడ యధాతథంగా అంగీకరించకూడదు. ఆ చెప్పిన విషయాన్ని మీలో మీరు బాగా విమర్శచేసి చూచుకోండి. అదేమీ లేకుండా, చెప్పినదెల్ల యథాతథంగా అంగీకరిస్తే మీరు యంత్రములవలె చైతన్యరహితులు, జడులు, మృతప్రాయులు అవుతారు. అట్లుగాక మీరు ప్రతిదానిని విమర్శించి చూచుకొంటూ వుంటే, మీకు మీరు స్వయంగా ఆలోచించుకొంటూ వుంటే అప్పుడు మీరు సజీవులు, చైతన్య పూర్ణులు సృజనశీలురైన మానవులవుతారు.

అది సరేగాని, మరి మీరిక్కడ చెప్పుతూవున్న విషయంమీద మనస్సు లగ్నంచేస్తూనే, అదే సమయంలో గదిలో కెవరు వస్తున్నారో, వారెవరో చూడడంకోసం తలత్రిప్పకుండా, పైగా తలత్రిప్పి చూద్దామనే కోరికను నిరోధించకుండా కూడ — అంటే, ఎక్కడను ఎట్టి నిరోధమున్ను లేకుండ, — గమనింపగలరా? చూడడం కోసం తలప్రక్కకు తిరుగుతున్నప్పుడు మీరడ్డుపెట్టినట్లయితే — నిరోధించినట్లయితే, మీ అవధానం — అంటే ధ్యానము — భగ్నమవుతుంది. మీ మానసిక శక్తిని ఆ నిరోధ క్రియలో వ్యర్థము చేస్తున్నారు. కాబట్టి ఎట్టి విక్షేపము (distraction)లేని, అందువలన ఎట్టి నిరోధక్రియయు అవసరములేని పరిపూర్ణమగు అవధానత సాధ్యమేనా? అనగా దేనిమీదనైనా మీరు సంపూర్ణముగా మనస్సును లగ్నము చేస్తూ, అదే సమయంలో మీ చేతనయొక్క పైభాగము మీ చుట్టూరా మరియు మీ అంతస్సులోను ఏమేమి జరుగుతున్నదో గమనిస్తూ వుండగలదా?

చూశారా, మనస్సనేది ఒక అద్భుతమైన యంత్రము; అది నిర్వి

రామంగా ప్రతిదానిని గ్రహిస్తూ వుంటుంది. వివిధములైన రంగులను, రూపములను చూస్తూ వుంటుంది. తనమీద పడే అసంఖ్యాక సంస్కారములను గ్రహిస్తూవుంటుంది. మాటల అర్థమును, కంటిచూపు లోని భావమును ఇంకా ఇట్టివాని నన్నింటిని వెంటవెంటనే పట్టివేస్తూ వుంటుంది. మరి మన సమస్య యేమంటే, మన అంతశ్చేతనలో ముద్రిం పబడివున్న సంస్కారములను, అందలి ప్రతిస్పందనలను వాటితోబాటు మన చుట్టును జరుగుతున్న ప్రతి విషయమును మన మనస్సు తత్కా లముననే గ్రహింపగల్గి వుండాలి; అదే సమయమున మరిదేనిమీదనైనా మనము మన మనస్సును నిల్పగలిగి వుండాలి.

వాస్తవానికి నేనిప్పుడు చెబుతూవున్న యీ విషయంలో ధ్యాన ప్రక్రియ ఇమిడి వున్నది. అందులోనికి మనమిప్పుడు పోవడంలేదు. కాని ధ్యానమెట్లు చేయవలెనో తెలియనివాడు పరిపక్వముకాని మనస్సుగల మానవప్రాణి. జీవితంలోని అత్యంత ప్రధానమైన విషయాలలో ధ్యాన మొకటి. డిగ్రీ సంపాదించుకోవడం కోసం పరీక్షలు పాసవడంకంటె గూడ ఇది ప్రధానమైనది. ఉత్తమమైన ధ్యానమేదో అర్థం చేసికోవడమంటే దానిని అభ్యాసం చేయడంకాదు. ఆధ్యాత్మిక విషయాలలో అభ్యాసం చేయడమనేది — అది దేని గురించి అయినా సరే — మహా భయం కరమైన విషయము. సరియైన ధ్యానమేదో అర్థంచేసికోవాలంటే మన చేతన (consciousness) పనిచేసే తీరును మనం మన అంతర్దృష్టితో గమనిస్తూ వుండాలి. అప్పుడే సంపూర్ణమగు అవధానము సిద్ధిస్తుంది. కాని ఏ విధమగు నిరోధము (resistance) ఉన్నప్పటికిన్ని సంపూర్ణ మగు అవధానము సిద్ధించదు. కాని చూశారా, మనలో చాలమందిమి నిరోధముతో గూడిన అవధానములో శిక్షణ పొందినాము. అందువలన మన అవధానము పాక్షికము; సంపూర్ణము ఎన్నటికిని కాదు. అందు వల్లనే మనకు అధ్యయనము విసుగు పుట్టిస్తుంది, అలసట కలిగిస్తుంది, భయ పెట్టుతుంది. కాబట్టి ఆ మాటయొక్క అసలర్థంలో మనము అవధానమును కలిగివుండడం చాల అవసరము. అంటే మనం మన మనస్సు ఎట్లా పనిచేస్తున్నదో మెలకువతో గమనిస్తూ వుండాలి. ఆత్మ

జ్ఞానము — **అంటే స్వస్వరూప దర్శనము — లేనిదే సంపూర్ణమైన** అవధానము సాధ్యముకాదు. **అందువల్లనే ఆదర్శప్రాయమైన** బడిలో విద్యార్థికి వివిధ పాఠ్య విషయాలను **బోధించడంతో** బాటు అతడు తన ఆలోచనావిధాన మెట్లు సాగుతున్నదో తనకుతాను గమనించడం లోను సహాయపడాలి. అట్లా, తన్నుదాను అర్థం చేసికొనడంలో అతనికి నిర్విరోధమైన అవధానమననేమో తెలుస్తుంది. అట్లా తన్నుదాను అర్థం చేసికొనడమే ధ్యానము.

5. ప్రశ్న :- ప్రశ్నలు వేయడమంటే మాకెందుకంత ఆసక్తి ?

కృష్ణమూర్తి :- ఇది చాల సులభం. తెలిసికోవాలని ప్రతివానికి కుతూహలముంటుంది. క్రికెట్టు ఎట్లా ఆడాలో, కాల్బంతి (football) ఎట్లా ఆడాలో, గాలిపటాన్ని ఎట్లా ఎగరవెయ్యాలో మీరుమాత్రం తెలిసికొనగోరరా? ప్రశ్నలు వేయడం మానివేసిన క్షణము మీరు మృతప్రాయులు. మామూలుగా వృద్ధుల విషయంలో జరిగినదదే. వాండ్ల మనస్సులు సంపాదించుకొన్న జ్ఞానముతో ఇతరులు చెప్పిన విషయాలతో బరువెక్కిపోయి ఇక ప్రశ్నించడం మానుకొన్నారు. వారిలో ప్రశ్నించి తెలిసికోవాలనే కోరికయే పోయినది. సంప్రదాయాన్ని అంగీకరించి దానిలో కూరుకపోయినారు. మీరు ప్రశ్నిస్తూ వున్నంతకాలం దానిని భేదించుకొని ముందుకుపోతూ వుంటారు. కాని ప్రతిదానికి తలూపి అంగీకారం తెల్పడం ప్రారంభించిన క్షణంనుండి మీరు మానసికంగా మృతప్రాయులు. కాబట్టి జీవితమంతా దేనినీ గ్రుడ్డిగా నమ్మవద్దు; అనాలోచితంగా ప్రతిదానికిని తలూపి సమ్మతి తెల్పవద్దు. ప్రతిదానిని ప్రశ్నించండి. విమర్శ చేసి చూడండి. అప్పుడు మీ మనస్సు నిజంగా ఎంత అద్భుతమైనదో తెలిసికొంటారు. దానికి అంతము లేదు. అటువంటి మన మనస్సుకు జరామృత్యువు లుండవు.

25 జనవరి, 1955

6

సత్యము – సౌందర్యము

పచ్చని చేను, అందులో పసుపు పచ్చని పూలతో కళకళలాడు ఆవ పైరు. దానిగుండా గలగల పారెడి నీటి వంక — ఎంత అద్భుతమైన దృశ్యము! కాదంటారా? నేనా దృశ్యాన్ని నిన్న సాయంత్రం చూస్తూ వుంటిని. పల్లె పట్టులందు కనబడే అటువంటి అద్భుత సౌందర్యాన్ని, అందలి ప్రశాంతతను చూచినప్పుడు అసలు సౌందర్యమంటే యేమిటి అనే ప్రశ్న మన మనస్సులో తప్పక మెదులుతుంది. ఏదైనా అందమైన దానిని చూచినా అందవికారమైన దానిని చూచినా మనలో వెంటనే దానికి ప్రతిస్పందన కలుగుతుంది. ఆ ప్రతిస్పందన ప్రీతి జనకమైనా కావచ్చు, అప్రీతిజనకమైనా కావచ్చు. ఆ యనుభూతిని మనము మాట లలో వ్యక్త పరుస్తాం. — "ఇది అందంగా వున్న" దని లేదా "ఇది అందవికారంగా వున్న" దని. ఇక్కడ ప్రధాన విషయం ప్రీతిగాని అప్రీతి గాని కాదు. ప్రతి దానితోను మనకు సంపర్కముండడం, అందమైన దానికి, అందముకాని దానికీ రెండింటికిని సమానంగా ప్రతిస్పందించడ మనేది ప్రధాన విషయం.

మరి, అందమంటే యేమిటి? ఇది అత్యంత ప్రధానమై మౌలిక మైన ప్రశ్నలలో నొకటి. ఇది సార రహితమైన మామూలు ప్రశ్నకాదు. ఇది చాల లోతైన ప్రశ్న, నిర్లక్ష్యము చేయరాని ప్రశ్న. అందమంటే యేమిటో అర్థం చేసికోవడం, ఏదైనా ఒక అందమైన వస్తువుతో మన మనోహృదయములకు ఎట్టి ఆటంకంగాని ఒత్తిడిగాని లేకుండా సంసర్గము కలిగి దానివలన మన మనస్సునకు హాయి అనిపించి, "ఇది యెంత మంచిది!" అనే భావము మనలో కలగడం — ఇదీ ప్రధానం. దీనికి జీవితంలో ఎంతో విలువ తప్పక వుంటుంది. ఈ సౌందర్యాను భూతి

లేనిచో మన జీవితములు సారహీనములు. మన చుట్టును అందమైన పర్వతాలు, నదులు, పొలాలున్ను వుండవచ్చుగాక, ఎంతో సౌందర్యము మధ్యనే మనము జీవించుచుండ వచ్చుగాక. కాని ఆ సౌందర్యాని కంత కును మనము ప్రతిస్పందించనిచో, మనలో ఆ సౌందర్యానుభూతి లేనిచో, మన జీవితము నిష్ప్రయోజనము.

మీరందరు, బాలబాలికలేకాదు పెద్దలు కూడ, మీలో మీరీ ప్రశ్నను వేసికోండి — అందమంటే యేమిటి? అని. పరిశుభ్రంగా వుండడం, నీటుగా దుస్తులు ధరించడం, పెదవిపై చిరునవ్వు, సవిలా సమైన హావభావములు, నడకలో లయ, జెడలో పూలు, మంచినడత, మాటలలో స్పష్టత, దూరాలోచన, సమయపాలన, ఇతరుల కష్టసు ఖాల గురించి పట్టించుకోవడం — ఇవన్నీ సౌందర్యం లోని భాగాలే. కాని ఇదంతా పైకి కనిపించే అందం, అవునా కాదా? సౌందర్యమంటే ఇంతేనా? లేక ఇంకా ఏమైనా, లోతైన అర్థంలో సౌందర్యమున్నదా?

ఆకారంలో అందముంటుంది. ఆకార రచనలో అందముంటుంది. జీవితంలో అందముంటుంది. ఆకులతో రెమ్మలతో దట్టముగా కప్పబడి, కన్నుల విందొనరించెడి వృక్షము యొక్క సుందరాకారమునుగాని, ఆకా శములో తలయెత్తి నగ్నముగా నిలబడియున్న వృక్షము యొక్క అద్భుత లాలిత్యమునుగాని మీరెన్నడైనా గమనించి చూచినారా? ఇటువంటివన్నీ పైకి చూడడానికి ఎంతో అందమైనవి. కాని ఇవన్నీ నిగూఢమైన ఆంతరిక సౌందర్యమునకు బాహ్య చిహ్నములు మాత్రమే! కాబట్టి యింతకును సౌందర్యమని పిలువబడేది ఏది? దేనిని సౌందర్య మని అంటాము?

మీ ముఖము అందముగా వుండవచ్చుగాక, మీ ముఖ లక్షణాలు నిర్దోషములై వుండవచ్చుగాక, మీరందమైన దుస్తులు వేసికొని వుండవ చ్చుగాక, మీ ప్రవర్తన ఎంతో సభ్యతాపూర్ణమై వుండవచ్చుగాక, నయన గోచరమగు ప్రకృతి దృశ్యమునంతను సుందరవర్ణములతో మీరు చిత్రీ కరింప గలిగి వుండవచ్చుగాక లేదా ఆ ప్రకృతి దృశ్యమును అందమైన

భాషలో వర్ణింపగలిగి యుండవచ్చుగాక. కాని ఆంతరిక సౌందర్యాను భూతి లేకుండా యీ బాహ్య సౌందర్య సాధనాలన్నీ సారహీనమై సహజత్వమును కోల్పోయి కేవలం దాంభిక జీవితమునకు దారితీయునవే, నిరర్థకమైనవే.

కాబట్టి వాస్తవంగా సౌందర్యమన నేమో మనం తప్పక తెలిసికో వలసియున్నది, ఏమంటారు మీరు? తెలిసికోనక్కరలేదా? అయితే సౌందర్యము యొక్క బాహ్య లక్షణాలను నిర్లక్ష్యము చేయవలెనని నేను చెప్పడంలేదు. అది మాత్రం గుర్తుంచుకోండి. మన ప్రవర్తన చాల ఉత్తమంగానే వుండాలి, మంచీ మర్యాదా తెలిసివుండాలి, శారీరిక శుభ్రతను పాటించాలి. ఆడంబరంగా కాకుండా అందమైన దుస్తులే వేసికోవాలి. ఎప్పటి పనులప్పుడు చేస్తూవుండాలి. చేసేదేదో సక్రమంగా చెయ్యాలి, చెప్పేదేదో స్పష్టంగా చెప్పాలి. ఇంకా ఇటువంటివన్నీ వుండవలసిందే, ఇవన్నీ ఆవశ్యకమే. ఇవి ఒకమంచి వాతావరణాన్ని సృష్టిస్తాయి. కాని కేవలం వాటికవే ప్రధానంకాదు.

బాహ్య రూపమునకు, బాహ్య చేష్టలకు అందాన్ని అత్యంత సౌమ్యతను కలిగించేది ఆంతరిక సౌందర్యము. ఏది లేకపోతే జీవితము క్షుద్రము రసహీనము అవుతుందో ఆ ఆంతరిక సౌందర్యమునకు అర్థమేమిటి? ఆంతరిక సౌందర్యమనగానేమి? దీని గురించి మీరెన్నడైనా ఆలోచించినారా? బహుశా ఆలోచించి వుండరు. ఇందుకు మీకు తీరిక వుండదు. మీ చదువులతో వ్రాతలతో మీ ఆటలతో మాటలతో, మీ నవ్వడాలతో, ఒకరినొకరు ఏడ్పించుకోవడాలతో మీ మనస్సులు నిండిపోయి వుంటాయి. కాని యేది లేక పోతే, బాహ్యరూపానికిని, బాహ్య చేష్టలకును అర్థముండదో ఆయాంతరిక సౌందర్యమును దర్శించడంలో తోడ్పడడమే ఉత్తమ విద్య యొక్క ప్రధాన లక్షణము. అట్టి గాఢమైన ఆంతరిక సౌందర్యానుభూతి మీ వ్యక్తి గత జీవితంలో ఒక అత్యావశ్యకమైన భాగము.

అయితే, క్షుద్రమగు మనస్సు సౌందర్యానుభూతిని పొందగలదా?

సౌందర్యమును గూర్చి అది మాట్లాడగలదు. కాని నిజంగా అందమైన వస్తువును దేనినైనా చూచినప్పుడు పెల్లుబికి వచ్చెడి ఆనంద రసవాహి నిలో అది మునిగితేల గలదా? మనస్సు కేవలము తన విషయం తాను చూచుకొంటూ, తన ఆలోచనలలో తాను లీనమై పోతే అది సుందర మైన మనస్సు కాదు. అట్టి మనస్సేమి చేసినా, అది అసుందరమైనదే, పరిమితమైనదే. కాబట్టి సౌందర్యమంటే యేమిటో అది తెలిసికొనజాలదు. అట్లుగాక తన విషయం తాను చూచుకోనిది, ఆశలు, ఆకాంక్షల నుండి విముక్తమైనది, తన కోరికలనే వలత్రాళ్ళలో తాను చిక్కుకొననిది, ఫలాపేక్ష చేత ప్రేరేపింపబడనిది అయిన మనస్సు మాత్రమే క్షుద్రము కానిది. అట్టి మనస్సు మంచితనమున వికసిస్తుంది. కరుణారసపూర్ణ మవుతుంది. ఏమి, అర్థమవుతున్నదా? ఇట్టి ఆంతరిక సౌందర్యము మాత్రమే అందముగా లేని ముఖానికి గూడ అందము నీయగలది. ఆంతరిక సౌందర్యమున్నప్పుడు అంటే కరుణరసముతో నిండియున్న ప్పుడు — అందవికారముగా నున్న ముఖము రూపాంతరము పొందుతుంది. ఏలయన, ఆంతరిక సౌందర్యము నిజానికి చాల గాఢమైన ధార్మిక భావన.

నిజమైన ధార్మికత యనగా నేమో మీకు తెలుసునా? దానికి గుడిగంటలతో పనిలేదు — అవి దూరాన్నుండి ఇంపుగా వినబడితే విన బడుగాక — పూజలతో పనిలేదు, మతగురువులు చేసెడి కర్మకాండతో గాని ఇంకా అటువంటి యితర మత విధులతో గాని పనిలేదు. అవన్నీ అర్థములేని పిచ్చిపనులు. ధార్మికత యనగా వాస్తవికతకు స్పందిం చడం. మీ సమగ్ర వ్యక్తిత్వము – అంటే మీ శరీరము, మనస్సు, హృద యమున్ను – సౌందర్యమునకును అసౌందర్యమునకును, ఆఖరికి గుంజకు కట్టబడిన గాడిదకును, ఈ పట్టణములోని దారిద్ర్యమునకును, మాలిన్య మునకును, నవ్వుకును, కన్నీటిబిందువులకును, మీ చుట్టునున్న ప్రతి దానికిని స్పందిస్తుంది. సమస్త సృష్టి యెడలగల యీ స్పందనలోనుండి మీలో మంచితనము ప్రేమ వికసిస్తుంది. మీకు పుట్టుకతో వచ్చిన శక్తి సామర్థ్యములెన్ని యున్నను, ఎంతమంచి బట్టలు వేసికొన్నను, ఖరీదైన మోటారు కార్లలో ప్రయాణము చేసినను, మిక్కిలి జాగ్రత్తగా అన్ని

విధాల శుభ్రతను పాటించినను ఈ స్పందన లేనిదే మీలో సౌందర్యము లేదు.

ప్రేమ అనేది చాల అద్భుతమైనది, కాదా? మీ గురించి మీరు ఆలోచించుకొంటూ వుంటే మీరు ప్రేమించలేరు. అంటే దాని అర్థం మీరు మరియొకరి గురించి ఆలోచిస్తూ వుండాలని కాదు. ప్రేమ అనేది కేవలముంటుంది, అది యొక స్థితి. అంతేగాని ఇందులో ఎవరినో ప్రేమించడమనే ప్రశ్నేలేదు. ప్రేమ గల మనస్సే, నిజమైన ధార్మిక మనస్సు. ఎందువల్లనంటే, అట్టి మనస్సు గతిశీలమగు సత్యముతో పరమార్థముతో లేదా దేవునితో పయనిస్తూ వుంటుంది. [సత్యము స్థితిశీలము కాదు, అది గతిశీలము]. అట్టి మనస్సే సౌందర్యమును దర్శింపగలదు. ఏ శాస్త్ర వాదములోను తగులుకొననిది, ఏదో యొక క్రియావిధానంలోగాని విశ్వాసంలోగాని కూరుకొని పోనిది, ఆశాపాశము చేత ప్రేరేపింపబడనిది అయిన మనస్సే సంవేదన శీలమై, అప్రమత్తమై నిత్య జాగరూకమై వుంటుంది. అట్టి మనస్సే సౌందర్యము కలది.

మీరు చిన్న పిల్లలుగా వున్నప్పుడే నీటుగా శుభ్రంగా వుండడం, కదలకుండ ప్రశాంతంగా కూర్చోవడం, భోజనాల దగ్గర పాటించవలసిన మర్యాదలన్నీ పాటించడం, ఇతరుల యిబ్బందులను గమనించి మసలుకోవడం, ఎప్పుడేపనిచేయవలెనో అప్పుడా పని చేస్తూ వుండడం — ఇవన్నీ తప్పక నేర్చుకోవాలి. కాని యివన్నీ యెంతో అవసరమైన వయినప్పటికిన్నీ బాహ్యవిషయాలే, పైపై విషయాలే. లోతుగా నిగూఢమై యున్న విషయాన్ని అర్థంచేసికోకుండా కేవలం యీ పైపై విషయాలను మాత్రమే అభ్యాసం చేస్తూ వుంటే, సౌందర్యము యొక్క వాస్తవిక ప్రాధాన్యాన్ని మీరు బొత్తిగా తెలిసికొనలేరు. ఒక జాతికిగాని, సముదాయానికి గాని, సంఘానికి గాని చెందనిదై, ఎట్టి అధికారమునకు లొంగనిదై, ఆశాపాశముచే ప్రేరేపింపబడనిదై భయపీడితము కానట్టి మనస్సు నిత్యము ప్రేమలో కరుణలో, మంచితనంలో వికసిస్తూ వుంటుంది. అట్టి మనస్సు వాస్తవికతతో బాటు కదులుతూ వుండడంచేత దానికి సౌందర్యమంటే

యేమిటో తెలుస్తుంది. అది సౌందర్యమునకును అసౌందర్యమునకును రెండింటికిని స్పందించుచుండడం చేత ఆ మనస్సు సృజనాత్మక మయి నది. దానికున్న అవగాహన అంతములేనిది.

1. ప్రశ్న:- బాల్యంలో నాకేదైనా పెద్ద కోరిక వున్నట్లయితే దానిని పెద్దైన తరువాత తీర్చుకోగలనా?

కృష్ణమూర్తి:- చిన్నపిల్లల కోరికలు సాధారణంగా చాలకాలం పాటు అట్లే నిలిచివుండవు, కాదా? పసిపిల్లవాడు ఇంజను డ్రైవరు కావాలని కోరుకొంటాడు లేదా జెట్ విమానం ఆకాశంలో దూసికొని పోవడం చూచి, దానిని నడిపే పైలట్ (విమాన చోదకుడు) కావాలని కోరుకొం టాడు. లేదా ఒక రాజకీయ నాయకుడు బాగా ఉపన్యసించడం చూచి అతని మాదిరి కావాలని కోరుకొంటాడు. లేదా సన్న్యాసిని చూచి తానూ సన్న్యాసిని కావాలని కోరుకొంటాడు. పెండ్లై చాలమంది పిల్లలను కనాలని బాలిక కోరుకొంటుంది. లేదా ధనవంతుని భార్యను కావాలని పెద్ద భవనంలో నివసించాలని కోరుకొంటుంది. అది గాకపోతే, మంచి వర్ణ చిత్రాలు గీద్దామనిగాని, కవిత్వం చెపుదామని గాని కోరుకొంటుంది.

అయితే బాల్యంలో కన్న స్వప్నాలన్నీ ఫలిస్తాయా? అసలు స్వప్నాలు ఫలించడం మంచిదేనా? ఏదైన కోరిక — అది యెటువంటి కోరికైనా సరే — నెరవేరాలని కోరుకొంటే, అది చివరికి దుఃఖానికే దారితీస్తుంది. ఈ విషయం మీకింకా తెలిసియుండక పోవచ్చు, పెద్దైతే తెలిసికొంటారు. కోరికను వెన్నంటి — దాని నీడవలె — ఎల్లప్పుడు దుఃఖముంటుంది. గొప్ప ధనవంతుణ్ణి కావాలని గాని, గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదిం చాలని గాని నేను కోరుకొంటే, అందుకోసం నేనెంతో శ్రమపడతాను. ఆ నాప్రయత్నంలో ఇతరులను ప్రక్కకు త్రోసివేస్తాను. ఎందరితోనో విరోధం పెట్టుకొంటాను. తుట్టతుదకు నేననుకొన్నదానిని సాధింపగల్గినా ముందో వెనుకో ఏదో యొక కష్టం రాక తప్పదు. నేను జబ్బు పడవచ్చు లేదా ఒక కోరికను తీర్చుకొనగానే అంతకంటే పెద్ద కోరిక

పుట్టవచ్చు. ఇక మృత్యువన్ననో ఎక్కడో ఏ మారుమూలనో ఎల్లప్పుడు మనకోసం పొంచుకొనే వుంటుంది. ఆశలు ఆకాంక్షలు వాటి సాఫల్యాలు ఇవి తప్పకుండా నైరాశ్యానికి దుఃఖానికి దారితీస్తాయి. ఈ ప్రక్రియను ఈ క్రమపరిణామాన్ని మీకు మీరే గమనించి చూచుకోవచ్చు. మీ చుట్టూవున్న పెద్ద వాండ్లను, ప్రసిద్ధులైనవారిని, దేశంలో చాల గొప్పవారుగా గణన కెక్కిన వారిని, పేరు సంపాదించుకొన్నవారిని, అధికారం గలవారిని గూర్చి బాగా అధ్యయనం చేయండి. వారి మొగాలను పరికించి చూడండి — ఎంత విచారంగా వుంటారో లేదా ఎంతగా లావెక్కి డాబుగా కనబడుతారో! వాండ్ల ముఖాలమీద అంద వికారమైన రేఖలు కనిపిస్తాయి. వారి హృదయాలు దుఃఖంతో బరువెక్కి వుంటాయి. అట్టివారిలో మంచితనము, ప్రేమ, వికసించదు.

పేరాశలు పెట్టుకోకుండా మీయొక్క సహజ స్థితిలో ఈ ప్రపంచంలో జీవించడం సాధ్యం కాదా? మీరున్న స్థితిని మార్చుకోవడానికై ప్రయత్నించే బదులు, దానిని అర్థం చేసికోడానికై మొదలిడితే, అప్పుడు మీరున్న ఆ స్థితిలో సహజంగా మార్పు వస్తుంది. ఈ ప్రపంచంలో అజ్ఞాత వ్యక్తిగా ఎవరికిని తెలియబడకుండా పేరు ప్రఖ్యాతులు లేకుండా, పెద్ద పెద్ద ఆశలు పెట్టుకోకుండా, ఇతరుల యెడ కఠోరంగా వుండకుండా జీవించడం సాధ్యమేనని నేననుకొంటాను. 'అహం' కు అంటే 'నే'ననే భావనకు ప్రాముఖ్యమీయకపోతే చాల ఆనందంగా జీవితం గడపవచ్చు. ఇట్టి అవగాహన కలిగించడంకూడ ఉత్తమ విద్యలో నొక భాగమే. ప్రపంచమంతా [illegible]ధిస్తుంది. ఎవరో బీద పిల్లవాడు రాత్రులందు వీధి దీపాల క్రింద చదువుకొని పెరిగి పెద్దవాడై చివరికి ప్రధాన న్యాయాధిపతి యెట్లా అయినాడో, మరియొక పిల్లవాడు వార్తా పత్రికలను అమ్ముకొని జీవిస్తూ తుట్టతుదకు కోటీశ్వరు డే విధంగా అయినాడో — ఇటువంటి కథలు మీరు వింటూ వుంటారు. విజయము యొక్క గౌరవగానంతో మీ మనస్సులను నింపి వేస్తుంటారు. కాని గొప్ప విజయాన్ని సాధించడంతోబాటు దాని వెనువెంటనే గొప్ప దుఃఖము కూడ వుంటుంది. అయినా మనలో చాలమంది

ఏదో సాధించాలి అనే కోరికలో తగుల్కొని, దానినుండి బయటపడలేరు. దుఃఖాన్ని అర్థం చేసికోవడం, దానినుండి విముక్తి పొందడం కంటె మనకు విజయ సాధనమే ఎక్కువ ముఖ్యంగా కనబడుతుంది.

2. ప్రశ్న:- నేటి సంఘ వ్యవస్థలో మీరుచెప్పే విషయాలను ఆచరణలో పెట్టడం ఎంతో కష్టం కాదా?

కృష్ణమూర్తి:- దేని గురించైనా మీరు గట్టిగా అనుకొంటే, దానిని ఆచరణలో పెట్టడం కష్టమని తలుస్తారా? క్రికెట్టు ఆడాలని మీకు గట్టిగా అనిపిస్తే, మీరందులో పూర్తిగా లీనమై పోయి ఆడుతారు గదా, ఏమి ఆడరా? అది కష్టమని అంటారా? దేని యొక్క యాథార్థ్యమైనా సరే మీ మనస్సులో గట్టిగా నాటుకోకపోతే, అప్పుడు మాత్రమే దానిని ఆచరణలో పెట్టడం సాధ్యంకాదని అంటారు. అంటే, దాని మీద మీకప్పుడు ప్రేమలేదు. మీరు ప్రేమించే పనిని ఎంతో ఉత్సాహంతో చేస్తారు; అందులో ఆనందమున్నది. అప్పుడు సంఘమేమని చెప్పినా, తల్లిదండ్రులు ఏమని చెప్పినా, మీరు లక్ష్యపెట్టరు. కాని మీ మనస్సుకు పూర్తిగా సమాధానం కలుగకపోయినా, మీరు సరియైనదని అనుకొన్నప్పటికిని దానిని చేయడంలో మీకు సంతోషం కలుగకపోయినా లేక అది యొక నిర్బంధంగా తోచినా దాని భావం మీకందులో నిజమైన అభిరుచి లేదని. పైకి మీకున్నట్లు కనబడే ఆ అభిరుచి అసత్యమైనది, నిజమైనది కాదు. కాబట్టి అటువంటి పని మీకొక పర్వతంలాగ తోస్తుంది; ఆ పనిని చేయడం చాల కష్టమని అంటారు.

అయితే మీరు ప్రేమించిన పనిని చేయడంలో కష్టాలుంటాయి, తప్పదు. కాని మీరు వాటిని లక్ష్యపెట్టరు. అదంతా జీవితంలో ఒక భాగంగా తోస్తుంది. చూడండి, కష్టపడడం గురించి మనమొక సిద్ధాంతం లేవదీశాం. గట్టిగా ప్రయత్నం చేయడం, తంటాలు పడడం, ఎదుర్కొని నిలబడడం — ఇదంతా ఒక పుణ్య కార్యంగా ఎంచుతాం.

ప్రయత్నము ప్రయాసల ద్వారా సంపాదించుకొనే ప్రావీణ్యాన్ని

గురించి నేను మాట్లాడడం లేదు. ఏ పనినైనా చేయడంలో వుండే ప్రేమను గురించి మాట్లాడుతున్నాను. ఈ ప్రేమ మీలో లేనప్పుడు మీరు సమాజానికి విరుద్ధంగా తలపడవద్దు. చచ్చు సాంప్రదాయాన్ని ఎదుర్కొనవద్దు. ప్రేమలేని ఆ పోరాటము అర్థరహిత మైనది. దానివలన మీరు సమాజంలో ఇంకా ఎక్కువ అనర్థాన్ని సృష్టించిన వారవుతారు. అట్లుగాక సరియైన దేదో సత్యమేదో, మీ అంతస్సులో మీకు బాగా విశదమై వుంటే దానికోసం మీరొంటరిగా నిలబడగలిగితే, అప్పటి మీ ఆచరణము ప్రేమజనితం కాబట్టి, దానికి ఎంతో అసాధారణ ప్రాముఖ్యముంటుంది. అందులో జీవశక్తి వుంటుంది, సౌందర్యముంటుంది.

మీకు తెలుసునా, ప్రశాంతమైన మనస్సులో మాత్రమే ఘన కార్యములు ఉద్భవిస్తాయి. అయితే అట్టి ప్రశాంతమగు మనస్సు ప్రయత్నం చేతగాని, నియంత్రణం చేతగాని, నియమపాలనం చేతగాని, క్రమశిక్షణ చేతగాని సాధ్యమయ్యేదికాదు.

***3.* ప్రశ్న:- సంపూర్ణ పరివర్తనమనగా మీ యుద్దేశమేమి? దానిని వ్యక్తి తన జీవితంలో ఎట్లు అనుభూతికి తెచ్చుకోగలడు?**

కృష్ణమూర్తి:- సంపూర్ణ పరివర్తనం తీసికొని రావాలని ప్రయత్నిస్తే, అది వస్తుందని మీరనుకొంటున్నారా? అసలు పరివర్తనమంటే యేమిటో మీకు తెలుసునా? మీకేదో పెద్ద కోరిక వున్నదనుకోండి. ఆ కోరికతో బాటుగా వచ్చేవాటి నన్నిటిని — మీరు చూడసాగినారనుకోండి. అంటే భవిష్యత్తులో ఏదో మేలు కలుగుతుందనే ఆశ, సంతృప్తి, ఆశాభంగము, క్రూరత్వము, దుఃఖము, ఇతరుల యెడ నిర్లక్ష్యము, అత్యాశ, అసూయ, బొత్తిగా ప్రేమ అనేది లేకపోవడం ఇవన్నీని. ఈ విషయం మీకు తెలిసినప్పుడు మీరేమి చేస్తారు? ఆ కోరికలో మార్పు తేవాలని దాని రూపాన్ని మార్చివేద్దామని ప్రయత్నిస్తే అది మరియొక విధమైన కోరికయే కాదా? అంటే మరియొక విధంగావుండాలని కోరుకొనడం కాదా? మీరొక కోరికను నిరాకరించవచ్చు; కాని దానిని మీరు నిరాకరించడంలో

మరి యొక కోరికకు జన్మనిస్తున్నారు. ఈ కోరిక గూడ దుఃఖమును కొని తెచ్చేదే.

ఈ విధంగా కోరిక దుఃఖాన్ని గొని తెస్తుందని కోరికను పోగొట్టు కొందామనే కోరిక గూడ దుఃఖాన్ని గొని తెస్తుందని ఈ సత్యమును మీకు మీరు స్పష్టంగా చూడగల్గి ఎట్టి కర్మాచరణమునకున్ను పూనుకో కుండా వుంటే, మీరు గ్రహించి వున్న సత్యమునే పనిచేయనిస్తే, అప్పుడా సత్యము మీ మనస్సులో మౌలికమైన మార్పును గొని తెస్తుంది. అదే సంపూర్ణ పరివర్తనము; సమూల పరివర్తనము. కాని ఇట్టి పరివర్తనము రావలెనంటే, ఎంతో మనోయోగము, లేదా అవధానము ఎంతో సూక్ష్మ బుద్ధి ఎంతో లోచూపు వుండాలి.

మీరందరు మంచివాండ్లై ఉండాలని, మీలో ప్రేమ వుండాలని చెప్పి నప్పుడు, మామూలుగా జరిగేదేమిటి? అప్పుడు మీలో మీరనుకొంటారు గదా, "నేను మంచివాణ్ణిగా వుండడం కోసం గట్టిగా ప్రయత్నించాలి, అందుకోసం అభ్యాసం చేయాలి. నా తల్లిదండ్రులను సేవకులను ఆఖ రికి గాడిదను ఇంకా ప్రతిదానిని ప్రేమించాలి" అని. అంటే దాని అర్థం ప్రేమ చూపడంకోసం మీరు ప్రయత్నం చేస్తున్నారన్నమాట. అప్పుడా ప్రేమ కృతకమైన ప్రేమ, చౌకబారు ప్రేమ, మిక్కిలి క్షుద్రమగు ప్రేమ. ఇదే విధంగా అనంతకాలము సౌభ్రాతృత్వాన్ని అభ్యాసం చేస్తూ వుండే ఆ జాతీయవాదులను గమనించండి! ఇది వట్టి పిచ్చిపని, బుద్ధిలేని పని. ఈవిధమైన అభ్యాసాలకు కారణము కేవలము అత్యాశ. అట్లుగాక జాతీయ వాదము నందలి సత్యమును, అత్యాశయందలి సత్యమును మీరు చూడగలిగి ఆ సత్యమును మీమీద పనిచేయనిస్తే, ఆ సత్యమును తన పని తాను చేసికోనిస్తే, అప్పుడెట్టి ప్రయత్నము లేకుండానే మీలో మీరు సౌభ్రాతృత్వము కలిగి వుంటారు. ప్రేమించడాన్ని అభ్యాసం చేసే మనస్సు ప్రేమించలేదు. కాని, మీరు ప్రేమించి దాని కడ్డు పోకుండా వుంటే, అప్పుడా ప్రేమ స్వయంగా తన పని తాను చేసికొని పోతుంది.

4. ప్రశ్న:- ఏమండీ, ఆత్మ విస్తరణ మనగానేమి?

కృష్ణమూర్తి:- మీరు గవర్నరుగా గాని, ప్రసిద్ధుడైన ఒక ప్రొఫెసరుగా గాని కాగోరినట్లయితే, ఒక గొప్ప వ్యక్తిని లేదా ఒక గొప్ప వీరుని మీరు అనుకరించేటట్టయితే, మీ గురువునో లేదా ఎవరినైనా ఒక మహాత్ముడినో అనుసరించడానికి ప్రయత్నించేటట్టయితే అప్పుడట్లా కాగోరడం, అనుకరించడం, అనుసరించడమనేది ఒక విధమైన ఆత్మవిస్తరణము, అవునాకాదా? పేరాశ గల మానవుడు, గొప్పవాడు కాగోరిన మానవుడు, తన జీవితము చరితార్థమైనదని అనిపించుకోదలచిన మానవుడు "నేనీ పనిని శాంతి కోసమై చేస్తున్నాను, నాదేశం కోసమై చేస్తున్నాను" అని అంటాడు. కాని అతడు చేసే పని కూడ తన్నుదాను విస్తరింపజేసికొనడమే, ఆత్మ విస్తరణమే.

5. ప్రశ్న:- ధనవంతునికి గర్వమెందుకు?

కృష్ణమూర్తి:- ధనవంతునికి గర్వమెందుకని ఒక చిన్నపిల్లవాడు అడుగుతున్నాడు. ధనవంతునికి గర్వముండడం నీవు నిజంగా చూచినావా? బీదవానికి గూడ గర్వముండదా? మనందరిలో ఒక విశిష్టమైన దురహంకారము ఎవరిది వారికి వున్నది. దానిని అనేక విధాల బయటికి ప్రదర్శిస్తాం. ధనవంతుడు, బీదవాడు, చదువుకొన్నవాడు, సామర్థ్యం గలవాడు, భక్తుడు, నాయకుడు — వీరిలో ప్రతియొక్కనికిన్ని తాను అనుకొన్న దానినెల్ల సాధించితినని, సిద్ధసంకల్పుడనని, జీవితంలో విజయం పొందితినని, సంఘంలో తన కొక స్థానమున్నదని తానేదైనా చేయగలనని తన మనస్సులో తాను అనుకొంటూవుంటాడు. అయితే తానెవరును కాని మానవుడు, సంఘంలో తనకొక స్థానం కావాలని కోరుకొనని వాడు, తాను తానుగానే వుంటూ తన్ను దాను అర్థం చేసికొన్నవాడు — అటువంటి మానవుడు దురహంకార విముక్తుడు, గర్వరహితుడు.

6. ప్రశ్న:- మేమెల్లప్పుడును 'నేను' 'నాది' అనే భావనలో ఎందుకు

చిక్కుకొని వుంటాము? ఇటువంటి మానసిక స్థితిలో పుట్టెడి సమస్య లను మీతో జరిపెడి సమావేశాలలో మాటిమాటికి ఎందుకు తెస్తూ వుంటాము?

కృష్ణమూర్తి:- మీరు నిజంగా దీనిని తెలిసికొనగోరుతున్నారా? లేక ఎవరైనా మిమ్మి ప్రశ్న నడగమని ప్రేరేపించినారా? 'నేను' 'నాది' అనే యీ సమస్య సమానంగా మనకందరికీ సంబంధించియున్న సమస్య. నిజానికి అదే మనకున్న సమస్య. దానిగురించే మనం అనేక విధా లుగా అంతులేకుండా మాట్లాడుతూ వుంటాము — ఒక్కొక్కసారి మనం పొందిన సాఫల్యం గూర్చి, ఇంకొక్కసారి మనం పొందిన నిరాశా నిస్పృహలు, దుఃఖమును గూర్చిన్ని. కలకాలము సుఖంగా వుండాలనే కోరిక, ప్రాణం పోతుందేమో లేదా ఆస్తిపోతుందేమో అనే భయం, పొగడ్తలవలన కలిగే ప్రీతి, తెగడ్తలవలన కలిగే కోపం, "నీ దేవుడు నా దేవుడు" లేదా "నీ మతము నామతము" అంటూ కొట్లాడుకోవడం వీటన్నిటితో మన మనస్సంతా ఎప్పుడూ ఎడతెగకుండా నిండిపోయివుం టుంది. అంతకంటె ఏమీలేదు. ఆ మనస్సు శాంతిని గోరుతున్నట్లుగా, సౌభ్రాతృత్వము కలిగి వున్నట్లుగా, తనలో సౌజన్యము ప్రేమ వున్నట్లుగా నటిస్తూ వుండవచ్చు. కాని యీ మాటల తెరవెనుక అది నేను, నాది అనే సంఘర్షణలో ఎడతెరిపి లేకుండా తగుల్కొనియే వుంటుంది. అందులోనుండి అనేక సమస్యలు పుడుతూ వుంటాయి. ఆ సమస్య లనే మీరు నా ముందుకు వేర్వేరు పదములలో, వేర్వేరు రూపములలో తెస్తూవుంటారు.

7. ప్రశ్న:- స్త్రీలు తమ దుస్తుల మీద ఎందుకంత శ్రద్ధ చూపిస్తారు? ఎందుకంతగా సింగారించుకొంటూ వుంటారు?

కృష్ణమూర్తి:- మీరు వాండ్లను అడగలేదా? పక్షుల నెప్పుడూ మీరు గమనించి చూడలేదా? మామూలుగా మగపక్షికి రంగెక్కువ, చులుకు పాలెక్కువ. స్త్రీ పురుష సంబంధంలో బిడ్డలను కనడం కోసం శారీ

రికాకర్షణ ఒక భాగం. అది జీవిత ధర్మం. అయితే మగపిల్లలు కూడ అదే పనిచేస్తారు. వయస్సు వచ్చే కొద్ది అందంగా క్రొత్త పద్ధతిలో తల దువ్వుకోవడం మొదలుపెడతారు. అందమైన టోపీ పెట్టుకొంటారు. ఆకర్షకమైన గుడ్డలు ధరిస్తారు — ఇది కూడ అదే. మనముందరము గొప్పగా, డాబుసరిగా కనబడాలని కోరుకొంటాము. చాల ఖరీదైన కారులో పోయే ధనవంతుడు, అందంగా అలంకరించుకొనే బాలిక, నీటుగా చుఱుకుగా కనబడాలని ప్రయత్నించే బాలుడు — వీరందరు తమ దగ్గర యేదో ప్రత్యేకత వున్నదని గొప్పగా చూపగోరుతారు. ఇదంతా వింత ప్రపంచం. ఏమి కాదంటారా? చూడండి, కలువపూవుగాని, గులాబిపూవుగాని తన దగ్గర లేనిది వున్నట్లు ఎన్నడును నటించదు. అది యథాతథంగా, ఉన్నదున్నట్లు, కనిపించడమే అందులోని అందము.

26 జనవరి, 1955

7

నేర్చుకొనడము

నేర్చుకొనడమంటే యేమిటి? ఇది తెలిసికోడానికై ప్రయత్నిద్దాం — మీకిష్టమేనా? నేర్చుకోడం కోసం మీరు బడికి పోతారు, ఏమి పోరా? మరి నేర్చుకోడమంటే యేమిటి? ఎప్పుడైనా మీరు దీని గురించి ఆలోచించారా? బడిలో దేనినైనా మీరెట్లా నేర్చుకొంటారు? ఎందుకు నేర్చుకొంటారు? మరి మీరక్కడ నేర్చుకొనేదేమిటి? నేర్చుకోడమంటే అర్థమేమిటి? అసలు దానికున్న ప్రాధాన్యమేమిటి? చదవడం, వ్రాయడం మీరు నేర్చుకోవాలి, వివిధ పాఠ్యవిషయాలను మీరు అధ్యయనం చేయాలి. దానితోబాటు, జీవనాధారాన్ని సంపాదించుకోవడం కోసం, మీరు దేనినైనా ఒక సాంకేతిక కళను నేర్చుకోవాలి, ఏదైనా ఒక వృత్తి చేపట్టడానికి తగిన సామర్థ్యం సంపాదించుకోవాలి. ఇదంతా కలిస్తేనే, మన వుద్దేశంలో నేర్చుకోడమంటే, అంతటితో మనలో చాల మంది నేర్చుకోవడం ఆపివేస్తారు. ఏవో కొన్ని పరీక్షలు పాసై, ఏదో యొక ఉద్యోగంలో చేరగానే లేదా ఏదో యొక వృత్తిని చేపట్టగానే, మనమీ నేర్చుకోడం విషయమే మరచిపోతామని అనిపిస్తుంది.

కాని నేర్చుకోడాని కంతమంటూ వున్నదా? పుస్తకాలు చదివి నేర్చుకోవడం, అనుభవం ద్వారా నేర్చుకోవడం — ఇవి రెండున్ను రెండు వేర్వేరు విషయాలని మనమనుకొంటాం. కాని నిజంగా అవి రెండును వేర్వేరు విషయాలా? పుస్తకాలనుండి మనము నేర్చుకొనేదంతా ఇతరులు ఏమేమి వ్రాసినారో అది. ఉదాహరణకు విజ్ఞానశాస్త్ర విషయాలు. ఆ తరువాత, మన మింక సొంతంగా శాస్త్రీయ ప్రయోగాలు (experiments) చేసికొని, ఆ ప్రయోగముల ద్వారా నేర్చుకొంటూ పోతాం. ఇదిగాక, మనం మన అనుభవాల ద్వారా గూడ నేర్చుకొంటాం,

— కనీసం అట్లా అని మనమనుకొంటాం. కాని యింతకు, జీవితము యొక్క అద్భుతమైన లోతులలోనికి పోయి చూడవలెనంటే, దేవుడన నెవరో, సత్యమననేమో కనుక్కోవలెనంటే మనకు స్వతంత్రముండాలి, అది అవసరం. కాని అనుభవం ద్వారా తెలిసికోడంలో స్వతంత్రమున్నదా?

అనుభవమంటే యేమిటో దాని గురించి మీరెప్పుడైనా ఆలోచించారా? అది సవాళ్ళను ఎదుర్కొనడంలో — సమస్యలను పరిష్కరించడంలో — గల్గిన మానసికానుభూతి; కాదా? సవాలును ఎదుర్కొనడమే అనుభవము. మరి, అనుభవము ద్వారా మీరేమైనా నేర్చుకొంటారా? మీరొక సవాలును ఎదుర్కొని, దానికి సమాధానమిచ్చేటప్పుడు లేదా, ఒక ప్రేరణకు ప్రతీకారము చేసేటప్పుడు మీ సమాధానముగాని, మీ ప్రతీకారముగాని మీ సంస్కారంమీద మీరు పొందియున్న విద్యమీద, మీ సాంస్కృతిక, ధార్మిక, సాంఘిక, ఆర్థిక స్థితిమీద ఆధారపడి వుంటుంది. సవాలుకు మీరిచ్చే సమాధానము — హిందువుగానో, క్రైస్తవునిగానో, సామ్యవాదిగానో లేక మరియొకరిగానో — మీ పూర్వ సంస్కారంమీద ఆధారపడి, వుంటుంది. అయితే మీరు మీ పూర్వ సంస్కారాన్ని ఛేదించుకొని బయటికి రాకపోతే, అప్పుడు ఏ సవాలుకైనా మీరిచ్చే సమాధానము మీ పూర్వ సంస్కారమును ఇంకా బలపరచనైనా బలపరుస్తుంది, లేదా దానికి మరికొంత మెరుగు దిద్దుతుంది. ఇట్టి పరిస్థితిలో సత్యమననేమో, దేవుడననేమో అన్వేషించి కనుగొనవలెనంటే, దానిని అర్థము చేసికోవలెనంటే మీరు అందుకు నిజంగా స్వతంత్రులు కారు.

కాబట్టి, అనుభవము మనస్సును స్వతంత్రము చేయదు, దానికి విముక్తినీయదు. అనుభవము ద్వారా నేర్చుకొనడమంటే పూర్వ సంస్కారములమీద ఆధారపడిన క్రొత్త మర్యాదలను ఏర్పరచుకొనడం మాత్రమే, క్రొత్త సంస్కారములను ముద్రించుకొనడం మాత్రమే. ఈ విషయం అర్థం చేసికోవడం చాల ముఖ్యమని అనుకొంటాను. ఎందువల్లనంటే, మనం పెద్దవారమయ్యే కొలది ఏదో నేర్చుకొంటామనే ఆశతో

మనము మన అనుభవమనే కోటలో రానురాను ఎక్కువగా చిక్కుకొని పోయి అసలు బయటికి రాలేము. ఆ విధంగా మనము నేర్చుకొన్నదెల్ల మన పూర్వ సంస్కారముపై ఆధారపడినదే. అంటే ఏ అనుభవము ద్వారానైతే మనము జ్ఞానమును ఆర్జిస్తామో ఆ అనుభవము ద్వారా మనకు విముక్తి లభింపదు, స్వతంత్రము లభించదు; మన పూర్వ సంస్కారములో ఏదో కించిత్ పరివర్తనము, కొంత సవరణ మాత్రమే వుంటుంది.

సరే, మరి నేర్చుకోవడమంటే యేమిటి? చదవడం, వ్రాయడం, నిశ్శబ్దంగా కూర్చోవడం, చెప్పినమాట వినడం లేదా వినకపోవడం — వీటితో మీరు నేర్చుకోవడం ఆరంభిస్తారు. ఈ దేశ చరిత్రనో లేదా మరియొక దేశచరిత్రనో నేర్చుకొంటారు. పరస్పర వ్యవహారానికి అవసరం కాబట్టి భాషలు నేర్చుకొంటారు. జీవనాధారాన్ని ఎట్లా సంపాదించు కోవాలో పొలాలనెట్లు సారవంతం చేయవచ్చునో ఇంకా ఇటువంటివన్నీ నేర్చుకొంటారు. కాని పూర్వ సంస్కారము నుండి మనస్సు విముక్తమై యున్నస్థితిలో అన్వేషణ అంతమైయున్న స్థితిలో నేర్చుకొనడం ఉన్నదా? అసలు మీకు ప్రశ్న అర్థమైనదా?

మనము దేనినైతే నేర్చుకోవడమని అంటామో, అది ఎడతెగని ప్రక్రియ, అందులో సర్దుకోవడం, అడ్డగించడం, లొంగదీసుకోవడం జరుగుతూ వుంటుంది. మనము దేనినైనా పరిహరించడంగాని, స్వీకరించడం గాని నేర్చుకొంటాం. మరి, మనస్సు జ్ఞానార్జనకు సాధనంగా కాకుండా, కేవలం అస్తిత్వానికి సాధనంగా ఉండే స్థితి యేదైనా వున్నదా? ఇందులోవున్న తేడాను మీరు గమనించారా? మనము సంపాదించుకోవడం, పొందడం, పరిహరించడం చేస్తూ వున్నంతకాలము మనస్సు నేర్చుకొంటూ వుండవలసిందే. మరి ఆ విధంగా నేర్చుకోవడంలో మనస్సుమీద ఎల్లప్పుడు ఎంతో ఒత్తిడి వుంటుంది, మనస్సును నిరోధించడముంటుంది. జ్ఞానార్జన చేయవలెనంటె, మనస్సును కేంద్రీకరింపజేయాలి, ఏకాగ్రత కావాలి; ఏమి అక్కరలేదా? మరి ఏకాగ్రత అంటే 'యేమిటి?

దేనిమీదనైనా మీరు మీ మనస్సును కేంద్రీకరింపజేసినప్పుడు ఏం జరుగుతుందో ఎప్పుడైనా గమనించారా? మీకు చదవడానికి ఇష్టంలేని పుస్తకాన్ని మీరు చదవవలసి వస్తే, లేదా, ఒకవేళ దానిని మీరు చదవగోరినప్పటికిన్ని తక్కిన ఆలోచనల నన్నిటిని నిరోధించి, ఇతర విషయాలను ప్రక్కకు పెట్టి చదవవలసి వస్తుంది. మనస్సును ఏకాగ్రం చేయడంకోసం కిటికీగుండా బయటికి చూద్దామనే కోరికను నిరోధించవలసి వస్తుంది, ఎవరితోనైనా మాట్లాడుదామనే కోరికను నిరోధించవలసి వస్తుంది; కాబట్టి మనస్సును కేంద్రీకరింపజేయడంలో ఎల్లప్పుడు ఎంతో ప్రయత్నముంటుంది, ఉండదంటారా? ఈ విధంగా ఏకాగ్రతను సాధించడంలో దాని వలన ఏదో నేర్చుకొంటామని, తద్వారా ఏదో సంపాదించుకొంటామని ఒక ప్రేరక హేతువు, ఒక ప్రలోభనముంటుంది; అందుకోసం ప్రయత్నముంటుంది. మన జీవిత మిట్టి ప్రయత్నాల వరుస. అందులో ఎడతెగని ఒత్తిడి వుంటుంది. అట్టి స్థితిలో మనము జ్ఞానార్జనకు ప్రయత్నిస్తుంటాము. కాని అటువంటి ఒత్తిడే గనక లేకపోతే, సంపాదించుకోవడం, జ్ఞానాన్ని పొరలు పొరలుగా పేర్చుకోవడమంటూ లేకపోతే, అప్పుడు మనస్సు ఎంతో లోతుగాను శీఘ్రంగాను విషయగ్రహణము సేయగలదు, కాదా? అప్పుడు సత్యమంటే యేమిటో, సౌందర్యమంటే యేమిటో, దేవుడంటే యేమిటో తెలిసికోవడానికి ఒక సాధనంగా మనస్సు ఉపయోగపడుతుంది. అంటే దాని అర్థము, అట్టి మనస్సు దేని అధికారానికిని లొంగదు; — ఆ అధికారము జ్ఞానానిదిగాని, సమాజానిదిగాని, మతముదిగాని, సంస్కృతిదిగాని లేక పూర్వ సంస్కారములదిగాని దేనిదైనను కావచ్చును.

చూడండి, మనస్సు తాను కూడబెట్టుకొన్న జ్ఞానభారమునుండి పూర్తిగా విముక్తి పొందినపుడే సత్యమును దర్శింపగలదు. సత్యదర్శన సమయంలో మరల జ్ఞానమును కూడబెట్టుకొనడంలేదు, ఏమి, కూడబెట్టుకొంటుందంటారా? ఒకవేళ మీరు అనుభూతి పొందిన దానిని గాని, నేర్చుకొన్న దానిని గాని కూడబెట్టుకోవడానికి ఆరంభించిన క్షణమునుండి, ఆ కూడబెట్టుకొన్న జ్ఞానరాశి ఓడకు లంగరు వేసినట్లు

మీ మనస్సును పట్టియుంచి, ముందుకు సాగనివ్వదు. ఈ సత్యదర్శన ప్రక్రియలో మనస్సు ఏ దినమున కాదినము — తాను ఆర్జించుకొన్న జ్ఞానమునంతను జారవిడుస్తూ వుంటుంది. అందుచేత అది యెల్లప్పుడును నిత్యనూతనముగా, నిన్నటి అనుభవాలతో దూషితము గాకుండ వుంటుంది. సత్యము జీవముగలది, గతిశీలమైనది; అది స్థితిశీలము కాదు. అట్టి సత్యమును దర్శించే మనస్సుకూడ జీవము కలదై గతిశీలమై వుండవలె. జ్ఞానభారమునుండి, అనుభవ భారమునుండి విముక్తమై వుండవలె. అట్టి స్థితిలో మాత్రమే సత్యము సాక్షాత్కరిస్తుంది.

దీనినంతను మాటలలో చెప్పితే అర్థం చేసికొనడం కష్టంగా కనబడుతుంది. కాని మీ మనస్సును దానిపై నిల్పితే సులభంగానే అర్థమవుతుంది. జీవితములోని అగాధ విషయాలను తెలిసికోవలెనంటె మనస్సు (జ్ఞాన భార విముక్తమై) స్వతంత్రమై వుండాలి. కాని మీరు జ్ఞానార్జన చేసి, ఆ జ్ఞానమును తరువాత కొనసాగించెడి సత్యాన్వేషణకు ఆధారముగా చేసికొన్న క్షణమునుండి మీ మనస్సు విముక్తముకాదు, మీరు సత్యాన్వేషణ చేయడంలేదు.

1. ప్రశ్న:- నేర్చుకోడానికి కష్టంగా తోచినదేదైనా సరే మేమెందుకంత త్వరగా మరిచిపోతాము?

కృష్ణమూర్తి:- మీరు చదువుకొంటున్నది కేవలం పరిస్థితుల ఒత్తిడి వల్లనేనా? ఇంతకు ఇప్పుడు మీరు భౌతిక శాస్త్రాన్ని, గణిత శాస్త్రాన్ని చదువుతూవున్నా, నిజంగా మీరు న్యాయవాదులు కావాలని కోరుకొంటూ వుంటే, మీరు చదివిన భౌతికశాస్త్రాన్ని, గణితశాస్త్రాన్ని త్వరలోనే మరిచిపోతారు. చదువుకోడానికి ఏదైన ప్రలోభనము కల్పిస్తే ఆశ పుట్టిస్తే మీరు నిజంగా చదువుకొంటారా? కేవలం ఉద్యోగం సంపాదించుకోడం కోసం, పెండ్లి చేసికోడం కోసమే కొన్ని పరీక్షలు పాసుకాగోరినట్లైతే మీరు మీ మనస్సును ఏకాగ్రంచేసి చదువుకోడానికి శ్రమపడతారు. కాని ఒకసారి మీరా పరీక్షలు గనక పాసైపోతే అప్పుడిక మీకు వాటి అవ

సరముండదు గనక త్వరలోనే చదివిన చదువంతా మరిచిపోతారు — ఏమి మరిచిపోరా? ఏదో యొక స్థానాన్ని చేరడంకోసం చదువొక సాధనమే అయినట్టయితే మీరు చేరుకోదలచిన స్థానాన్ని చేరుకోగానే, దానికి సాధనమైయున్న చదువును మరిచిపోతారు. అసలు అటువంటి చదువు చదువేకాదు. కాబట్టి ఎట్టి హేతువుగాని, ఎట్టి ప్రలోభనంగాని లేకుండా కేవలం చదువుమీది ప్రేమచేతనే చదువుకొంటున్నట్టయితే అప్పుడు మాత్రమే నిజమైన చదువు కొనసాగే స్థితి వుంటుంది.

2. ప్రశ్న:- ప్రగతి అనేమాటకు గల అర్థమేమి?

కృష్ణమూర్తి:- చాలమందికున్నట్లే మీకును ఆదర్శాలుంటాయి, లేవా మీకు? ఆదర్శమనేది యథార్థమైనది కాదు, వస్తుస్థితికి సంబంధించి నది కాదు. అది మనముండగోరిన స్థితి, భవిష్యత్తుకు సంబంధించినది. మరి నేను చెప్పేదేమంటే ఆదర్శాన్ని మరిచిపోండి, ఇప్పుడు మీరున్న స్థితిని మెలకువతో గమనించి చూచుకోండి. మీరుండగోరిన స్థితి కోసం ప్రాకులాడకండి; ప్రస్తుతం మీరున్న స్థితిని అర్థం చేసికోండి. మీరెట్లా వుండాలని అనుకొన్నారో ఆ స్థితిని అందుకోడం కోసమై ప్రయత్నిం చడంకంటె, వాస్తవంగా ఇప్పుడు మీరున్న స్థితిని అర్థం చేసికోవడం ఎక్కువ ముఖ్యం. ఎందుకని? ఎందుకంటె, ప్రస్తుతం మీరున్న స్థితిని అర్థం చేసికొనడంలో అప్రయత్నంగానే మీలో పరివర్తన ప్రక్రియ — మార్పుదల — ఆరంభమవుతుంది. అట్లుగాక మీరెట్లా వుండాలని అను కొన్నారో ఆ స్థితిని ప్రయత్నించి పొందడంలో, నిజంగా మార్పేమియు లేనట్లే; అదివరకటి ప్రాత పరిస్థితియే మరియొక రూపంలో కొనసా గుతూ వుంటుంది, అంతే. మనస్సు తన అవివేకాన్ని గ్రహించి దానిని వివేకముగా మార్చుకొందామని ప్రయత్నిస్తే — అంటే అదేగదా తానుం డాలని కోరుకొన్న స్థితి, దానికై ప్రయత్నిస్తే — ఆ ప్రయత్నము దాని అవివేకాన్నే తెలుపుతుంది. ఆ ప్రయత్నానికి అర్థములేదు, అది వాస్తవ మైన మార్పుకాదు. అది తానూహించుకొన్న తన రూపమును తాను అనుసరించడం, తన ప్రస్తుత స్థితిని అర్థము చేసికొనడాన్ని వాయిదా

వేయడం మాత్రమే. మనస్సు తన తెలివి తక్కువతనాన్ని మరియొక రూపంలోనికి మార్చుకొనడం కోసం ప్రయత్నిస్తూ వున్నంతకాలము ఆ మనస్సు తెలివి తక్కువదే. అట్లుగాక "నేను అవివేకినని నాకు తెలుసు; అయితే అసలు అవివేకమనగానేమో అర్థము చేసికొనగోరుతాను, దాని గురించి లోతుగా విచారణ చేసిచూస్తాను. అది యెట్లా సంభవిస్తున్నదో పరిశీలించి చూస్తాను" అని మనస్సు అనుకొంటే, అప్పుడా మనస్సు చేసే విచారణయే — అంటే ఆత్మ పరిశీలనమే — దానిలో మౌలిక పరివర్తనమును గొని తెస్తుంది.

" 'ప్రగతి' అనే మాటకు గల అర్థమేమి?" అసలు 'ప్రగతి' అనేది దేనిలోనైనా వున్నదా? గంటకు రెండుమైళ్ళ వంతున పోయే ఎద్దుబండిని చూస్తాము, గంటకు 600 మైళ్ళు లేక ఇంకా ఎక్కువ వేగంగా పోయే అద్భుతమైన జెట్ విమానాన్ని చూస్తాము. ఇదే ప్రగతి, అవునా? ఇది సాంకేతిక శాస్త్రమందు వచ్చిన ప్రగతి. అదివరకటి కంటె మేలైన రాకపోకల సౌకర్యములు, మేలైన వార్తాప్రసార సౌకర్యములు, మేలైన ఆరోగ్య పరిస్థితులు మొదలైనవి. కాని మరియొక విధమైన ప్రగతికూడ ఏదైనా వున్నదా? కాలక్రమేణ వచ్చెడి మానసిక ప్రగతి అంటే ఆధ్యాత్మిక ప్రగతి యేమైనా వున్నదా? ఆధ్యాత్మిక ప్రగతి అనబడేది నిజంగా ఆధ్యాత్మికమా? లేక అది కేవలం మనఃకల్పితమా?

చూడండి, మౌలిక ప్రశ్నలు అడగడం చాల ముఖ్యం. కాని దురదృష్ట వశాత్తు మౌలిక ప్రశ్నలకు అతి సులభంగా సమాధానాలు ఇవ్వబడతాయి. అట్లు సులభంగా లభించెడి సమాధానంతో మన సమస్య పరిష్కారమైనట్లు మన సందేహము నివృత్తియైనట్లు తలుస్తాము. కాని అది నిజానికట్లు కాదు. మనం మౌలిక ప్రశ్నను వెయ్యాలి; వేసి ఆ ప్రశ్నను మన మనస్సుమీద పనిచేయనియ్యాలి. అందలి సత్యాన్ని తెలిసికోడం కోసం దానిని (ఆ ప్రశ్నను) మనలోపల పనిచేయనియ్యాలి.

ప్రగతి అంటే సమయంమీద ఆధారపడినది, ఏమి కాదా? ఇంతకు, ఎద్దుబండినుండి జెట్ విమానందాక రావడానికి మనకెన్నో శతాబ్దాలు

పట్టినవి. అదే విధంగా కాలక్రమేణ సత్యమును లేదా దైవమును దర్శింపగలమని మన మనుకొంటాం. మన మిక్కడ వున్నాము. దేవుడల్లంత దూరాన అక్కడనో లేదా మరెక్కడనో చాల దూరాన వున్నాడని అనుకొంటాం. ఆ దూరాన్ని గడవాలంటే, ఆ మధ్యనున్న యెడమును దాటి పోవాలంటే, మనకు సమయం కావాలని అంటాము. కాని దేవుడు గాని సత్యముగాని స్థిరపదార్థము కాదు — అట్లే మనముకూడ స్థిరముకాదు. మనము బయలుదేరడానికి ఒక స్థిర బిందువంటూ లేదు; మనము చేరవలసింది కూడ ఒక స్థిరబిందువుకాదు. కాని మానసిక భద్రత కొఱకై, మనలో ప్రతియొక్కనియందును ఒక్కొక్క స్థిరమైన బిందువున్నదని, అట్లే పరమ సత్యముకూడ ఒక స్థిరమైన బిందువని తలచి, ఆ యభిప్రాయాన్ని వదలక గట్టిగా పట్టుకొని వుంటాము. కాని యిదంతా వట్టి భ్రమ, ఇది సత్యము కాదు. మనము అంతర్గతంగా, ఆధ్యాత్మికంగా వికాసము పొందడానికి, ప్రగతిని సాధించడానికి సమయం కావాలని ఎప్పుడైతే కోరుకొంటామో ఆ క్షణమునుండి మనము చేసే పని ఆధ్యాత్మికము కాదు; కారణమేమంటే సత్యమునకు కాలముతో పనిలేదు. కాలములో చిక్కుకొన్న మనసు సత్యమును కనుగొనడానికై కాలము కావాలని అడుగుతుంది. కాని సత్యము కాలమునకు అతీతము; దానికొక స్థిరబిందువంటూ లేదు. బుద్ధి పూర్వకంగా గాని, అబుద్ధి పూర్వకంగా గాని కూడబెట్టుకొన్న సమస్త జ్ఞానరాశినుండి మనస్సు విముక్తమైతే అప్పుడు మాత్రమే అది సత్యమనేమో, దైవమనేమో తెలిసికొన సమర్థమవుతుంది.

3. ప్రశ్న:- నేను దగ్గరకు పోగానే పక్షులు ఎగిరిపోతాయి. ఎందుకని?

కృష్ణమూర్తి:- మీరు దగ్గరకు పోయినా, పక్షులు ఎగిరిపోకుండా వుంటే ఎంత బాగుంటుందో! మీరు వాటిని తాకగల్గితే, వాటితో స్నేహం చేయగల్గితే ఎంత ముచ్చటగా వుంటుందో! కాని, చూశారూ,

మానవులం మనం క్రూరులం; మనం పక్షులను చంపుతాం, నానా హింస పెడతాం, వలలు పన్ని వాటిని పట్టుకొంటాం, పంజరాలలో బంధిస్తాం. అట్లాగ పంజరంలో బంధింపబడిన అందమైన చిలుకను ఒక దానిని ఊహించుకోండి. అది ప్రతి సాయంత్రం తన జతగాని కోసం పిలుస్తూ వుంటుంది. ఇతర పక్షులు విముక్తాకాశంలో విచ్చలవిడిగా ఎగురుతూ వుంటే అది చూస్తూ వుంటుంది. ఇటువంటి పనులన్నీ మనం చేస్తూ వుంటే పక్షులు తమ దగ్గరకు మనం రావడంచూసి భయపడకుండా వుంటాయని అనుకొంటారా మీరు? అయితే ఎవ్వరూ లేనిచోట మీరొక్కరు అటునిటు కదలకుండా ప్రశాంతంగా కూర్చుండి మిక్కిలి సౌమ్యంగా — నిజంగా మంచి మనస్సుతో — వుంటే పక్షులు మీ దగ్గరకు రావడం త్వరలోనే చూడగలరు. మీ తలమీదుగా అవి చాల దగ్గరగా ఎగరడం మొదలుపెడతాయి. అవి అటు నిటు చురుకుగా కదలడాన్ని, వాటి అందమైన గోళ్ళను, అద్భుతమై బలముగల రెక్కలను, అందమైన యీకలను మీరు గమనింపగలరు. కాని అట్లా చేయవలెనంటే మీకెంతో ఓరిమికావాలి. అంటే మీలో ఎంతో ప్రేమవుండాలి, భయమంటూ వుండగూడదు. మనలోని భయాన్ని జంతువులు చాల త్వరగా గుర్తిస్తాయని అనిపిస్తుంది. మన భయాన్ని చూచి అవి భయపడి పారిపోతాయి. అందువలన మనలను మనం అర్థం చేసికోవడం చాల ముఖ్యం.

మీరొక చెట్టు క్రింద కదలకుండా కూర్చుండి అప్పుడు ప్రయత్నించండి. కాని యేదో రెండు మూడు నిమిషాలసేపు కూర్చుంటే చాలదు. అంత తక్కువ సమయంలో పక్షులు మీ కలవాటు పడవు. ప్రతి దినము అదే చెట్టు క్రిందికి పోయి ప్రశాంతంగా కూర్చుంటూ వుండండి. మీ చుట్టూ ప్రతిదీ సజీవంగా వున్నట్లు మీరు త్వరలోనే గమనింపసాగుతారు. గడ్డిపరకలు ఎండలో తళతళ మెరుస్తూ వుంటాయి. చిన్న చిన్న పిట్టలు క్షణంసేపు ఆగకుండా ఎప్పుడూ ఏదో యొక పని చేస్తూనే వుంటాయి. పాము మెరుపు మెరిసినట్లు తళుక్కుమని విలక్షణమైన కాంతితో మెరుస్తుంది. గరుడపక్షి ఆకాశంలో రెక్కలల్లార్పకుండా ఎంతో

ఎత్తున ఎగురుతూ చల్లని గాలిలో ఆనందాన్ని అనుభవిస్తూ వుంటుంది. వీటినన్నిటిని చూచి ఆనందించాలంటే ముందు మీలో నిజమైన శాంతి వుండాలి.

4. ప్రశ్న:- మీకును మాకును మధ్య గల భేదమేమి?

కృష్ణమూర్తి:- అసలు మన మధ్య మౌలికమైన భేదమేమైనా వున్నదా? మీ శరీరం తెల్లగా అందంగా వుండవచ్చు. నాది నల్లగా వుండవచ్చు. మీరు నాకంటె చతురులు, చాకచక్యం గలవారై యుండ వచ్చు, నాకంటె మీకెన్నో విషయాలు ఎక్కువగా తెలిసియుండవచ్చు. నేనేదో పల్లెలో నివసిస్తూ వుంటే మీరు ప్రపంచమంతా తిరుగుతూ వుండవచ్చు — ఇంకా ఇటువంటి తేడాలు ఏవో కొన్ని వుండవచ్చు. ఆకారంలోను, భాషలోను, సంపాదించుకొన్న జ్ఞానంలోను, నడతలోను, సంస్కృతి సంప్రదాయములలోను తేడాలుండడ మనేది అందరికీ తెలి సిన విషయం. కాని మనము బ్రాహ్మణులమైనా, అబ్రాహ్మణులమైనా, అమెరికనులమైనా, రష్యనులమైనా, జపాను వాండ్లమైనా, చైనావాండ్ల మైనా మరెవరమైనా సరే, మనందరి మధ్యగల సమానత్వమే యెక్కువ కాదా? మనందరికిని భయమున్నది, అందరికిని భద్రతకావాలి, ప్రేమ కావాలి, తిండికావాలి, సుఖం కావాలి. కాని చూశారా, మానవులముగా మనందరిమధ్య గల మౌలిక సమానత్వమును గుఱించిన ఎఱుకను, పైపై కనిపించే భేదభావము నాశనము చేస్తున్నది. ఈ సమానత్వమును అర్థము చేసికొని దానినుండి విముక్తమైతే మనలో గొప్ప ప్రేమ, గొప్ప విచార శీలత వెల్లివిరిస్తుంది. దురదృష్టవశాత్తు మనలో చాలమంది బాహ్యముగా కనిపించెడి యీ జాతి, సంస్కృతి, మత విశ్వాసములు మొదలగువా నికి సంబంధించిన క్షుద్ర భేదభావములలో తగులుకొని వాటి మూలమున విభజింపబడి యున్నారు. ఈ మతవిశ్వాసములనేవి ఒక శాపము. అవి మనుషులను వేరుచేస్తున్నాయి, పరస్పర విరోధాన్ని పెంచుతున్నాయి. అన్ని విధములైన విశ్వాసములనుండి బయటపడి, అన్ని విధములైన భేదములకును సామ్యములకును అతీతమై యుండిన మనస్సు మాత్రమే

సత్యమననేమో కనుగొనడానికి స్వతంత్రత కలిగి వుంటుంది.

5. ప్రశ్న:- నేను పొగత్రాగుతూ వుంటే మా ఉపాధ్యాయునికి నామీద కోపమెందుకు రావాలి?

కృష్ణమూర్తి:- పొగత్రాగడం చిన్నపిల్లలకు మంచిది కాదు. అందువలన పొగత్రాగవద్దని మీ ఉపాధ్యాయుడు మీతో బహూశా ఎన్నోసార్లు చెప్పియుండవచ్చు. కాని మీరు పొగత్రాగుతూనే వుంటారు, మానరు. దానిలోని రుచి అంటే మీకిష్టం. కాబట్టి ఉపాధ్యాయునికి మీమీద కోపం వస్తుంది. అదిసరే, మీరు స్వయంగా దీనిగురించి ఏమని అనుకొంటారు? ఇంత చిన్న వయస్సులో పొగత్రాగే అలవాటేకాదు, ఇంకా ఏ అలవాటైనా సరే, చేసికోవడం మంచిదంటారా? ఇంత చిన్నవయస్సులో మీ శరీరం పొగత్రాగడానికి అలవాటు పడితే, దాని అర్థం మీరొక దానికి అప్పుడే బానిసలై పోయినారన్నమాట. ఇది చాల దారుణమైన విషయంకాదా? పొగత్రాగడం బహూశా వృద్ధుల విషయంలో యుక్తమే కావచ్చు. కాని అదికూడ ఎంతో సందేహాస్పదమైన విషయం. దురదృష్టవశాత్తు రకరకాలైన అలవాట్లకు దాసులై పోవడానికి వాండ్లకేవేవో సాకులుండవచ్చు. కాని మీరు చాల చిన్న పిల్లలు, పక్వముకాని మనస్సు కలవారు, యువకులు, ఇంకా ఎదుగుతున్నవారు — అటువంటి మీరు దేనికైనా ఎందుకలవాటుపడాలి? ఏ అలవాటులోనైనా ఎందుకు చిక్కుకోవాలి? దానివలన మీ సున్నితమైన మనస్సు కొరడు పారిపోతుంది. మీ సంవేదన శీలత (సూక్ష్మ గ్రహణశక్తి) తగ్గిపోతుంది. మనస్సు దేనికైనా అలవాటుపడిన క్షణమునుండి అది ఆ గాడిలోనే పోతూ వుంటుంది. అందువలన అది మొద్దుబారి, అభేద్యమై పోతుంది, దాని సున్నితత్వము నశించుతుంది. దేవుడననేమో, అందమననేమో, ప్రేమ అననేమో తెలిసికోడానికి కావలసిన సంవేదన శీలత నశిస్తుంది.

6. ప్రశ్న:- ప్రజలు పులులను ఎందుకు వేటాడుతారు?

కృష్ణమూర్తి:- చంపడంలో వచ్చే ఉత్తేజంకోసం వాటిని చంపుతారు. అటువంటి అనాలోచిత కార్యాలు మనమెన్నో చేస్తూ వుంటాము. ఏమవుతుందో చూద్దామని రెక్కల పురుగుల రెక్కలు ఊడబెరుకుతాం. అనవసరమైన బాతాఖానీలో పరులను గూర్చి చెడ్డగా మాట్లాడుతుంటాం. మన తిండికోసం ప్రాణులను చంపుతాం. శాంతి స్థాపన కోసమని హత్యలు చేస్తాం. మనదేశం కోసం, మన నమ్మకాలకోసం ఇతరులను చంపుతాం. ఈ విధంగా మనలో క్రూర ప్రవృత్తి చాల ఎక్కువగానే వున్నది. ఏమి లేదంటారా? అది అర్థం చేసికొని, దానిని వదులుకొంటే అప్పుడు పులి తన దారిన తాను పోతూవుంటే చాల వేడుకతో చూస్తూవుంటాం. బొంబాయి దగ్గర మేమొక సాయంకాలం చాల మందిమి కలిసి, ఆ పనే చేశాం. దగ్గరగా వున్న అడవిలో పులిని చూశానని ఒకరు మాకు చెప్పితే, ఒక స్నేహితుడు మమ్మలిని తన కారులో ఎక్కించుకొని అడవికి తీసికొని వెళ్ళినాడు. మేము తిరిగివస్తూ రోడ్డుమీద ఒక మలుపు తిరిగేటప్పటికి తటాలున ప్రత్యక్షమైంది ఒక పెద్ద పులి, రోడ్డుకు మధ్యలో నిలబడి. అది పసుపు, నల్లని చారలతో నున్నగా, సన్నగా, పొడవైన తోకతో చూడడానికి అందంగా కనబడింది. దానిలో ఎంత హొయలు, ఎంత ఠీవి, ఎంత శక్తి! మా కారుకు ముందుండే ఇంజను దీపాలను ఆర్పివేసినాం. వెంటనే గుఱ్ఱుమంటూ మావైపుకు వచ్చి, మాకారును దాదాపు ఆనుకుంటూ వెళ్ళిపోయింది. అది యెంతో అద్భుతమైన దృశ్యం. చేతిలో తుపాకీ లేకుండా, అటువంటి జంతువును చూస్తూ వుంటే ఎంతో వేడుకగా, ఎంతో తమాషాగా వుంటుంది. అందులోనే గొప్ప అందమున్నది.

7. ప్రశ్న:- మనము దుఃఖభారముచే క్రుంగిపోవడానికి కారణమేమి?

కృష్ణమూర్తి:- దుఃఖమును జీవితములోని ఒక అనివార్యమైన భాగంగా మనము గ్రహిస్తాము. దానిచుట్టు తత్త్వశాస్త్రములు రచియిస్తాము, మనము దుఃఖాన్ని సమర్థిస్తాము, దేవుని దర్శించడానికి దుఃఖము ఆవశ్యకమని అంటాము, కాని నేను దానికి వ్యతిరేకిని. నేననేదేమంటే,

ఒక మనిషి మరియొక మనిషి యెడల క్రూరముగా ప్రవర్తించడం వల్లనే దుఃఖము కలుగుతున్నదని. అంతేగాక మనము జీవితంలోని అనేక విషయాలను అర్థం చేసికోము కాబట్టి వాటివలన గూడ దుఃఖము కలుగుతున్నది. ఉదాహరణకు మృత్యువు, ఉద్యోగం లేకపోవడం, చాల దైన్య స్థితిలోనున్న బీదవారిని చూడడం — ఇదంతా మనము అర్థము చేసికోము. కాబట్టి తీరని వ్యధ చెందుతుంటాము. మనస్సు ఎంత ఎక్కువ సున్నితమైనదైతే, అంత ఎక్కువ బాధపడతారు. ఇవన్నీ అర్థము చేసికొనే బదులు మనము దుఃఖమును సమర్థిస్తాము. ఈ క్రుళ్ళిన వ్యవస్థకు విరుద్ధముగా తిరుగబడి దానిని బ్రద్దలు కొట్టుకొని బయటికి వచ్చే బదులు మనము దానితో కేవలం సర్దుకొని పోతున్నాము. దుఃఖమునుండి విముక్తి పొందవలెనంటె ఇతరులకు హాని కలిగించవలెననే కోరికనుండి ముందు మనము విముక్తి పొందవలె. దానితో బాటు ఇతరులకు మంచి చేయవలెననే కోరికనుండి గూడ విముక్తి పొందవలె. ఇంతకును ఆ 'మంచి' అనబడేది గూడ మన పూర్వ సంస్కారముల ఫలితమే కదా.

27 జనవరి, 1955

8

సున్నితమైన మనస్సు

ఇక్కడికి సమీపంలో వున్న ఒక తోటలోని చెట్లనుండి పూలు త్రుంచుకొని పోవడానికి ప్రతి ఉదయం ఒక మనిషి సన్యాసి దుస్తులలో వస్తుండేవాడు. అతని చేతులు అతని కండ్లు పూలకోసరం మొగం వాచినట్లుండేవి; అందినంతవరకు ఒక్క పువ్వును గూడ వదలకుండా అన్నీ త్రుంపుకొని పోయేవాడు. వాటినన్నిటిని అతడు ప్రాణంలేని ఒక రాతి బొమ్మకు అర్పించబోతున్నాడనేది స్పష్టం. సూర్యోదయ సమయంలో అప్పుడే విచ్చుకొంటున్న ఆ లేత పువ్వులు చాల అందంగా వుండేవి. పోనీ, వాటిని మెల్లగానైనా త్రుంచడం లేదు, చెట్టునుండి నిర్లక్ష్యంగా పెరికివేసేవాడు. తోటకున్నదంతా చాల దౌర్జన్యంగా ఊడబెరుకుకొని ఖాళీ చేసేవాడు — నిలువు దోపిడీ చేసేవాడు. అతని దేవుడికి పూలరాసులు కావలసి వచ్చినాయి — ప్రాణంలేని రాతిబొమ్మకు ప్రాణమున్న వస్తువులు అవసరమైనాయి!

ఇంకొకనాడు కొందరు చిన్నపిల్లలు పూలుకోయడం చూచినాను. వాటిని వాండ్లు ఏ దేవునికిన్ని అర్పింపబోవడం లేదు. మాట్లాడుతూ మాట్లాడుతూ, అనాలోచితంగా వాటిని త్రుంచి ముక్కలుచేసి దూరంగా పారవేస్తూ వుండినారు. మీరు చేసే యీ పనిని మీరెప్పుడైనా గమనించారా? మీరెందు కటువంటి పని చేస్తారో నాకు ఆశ్చర్యం వేస్తుంది. దారిన పోతూ పోతూ మీరొక రెమ్మను విరుస్తారు, దాని ఆకులనన్నిటిని దూసి పోస్తారు, చివరి కారెమ్మను ఎక్కడో జారవిడుస్తారు. మీరు చేసే యీ అనాలోచితమైన పని మీ దృష్టికెన్నడూ రాలేదా? పెద్దవాండ్లు గూడ ఈ పని చేస్తారు. వాండ్లు తమలో వుండే పశుత్వాన్ని, ప్రాణిమాత్రుల యెడ తమకున్న దారుణమైన నిర్లక్ష్యాన్ని, తమ

తమ ప్రత్యేక ధోరణులలో తామున్న వెలిబుచ్చుతారు. ఎవరికిన్ని హాని చేయరాదని కబుర్లు మాత్రం చెబుతారు, కాని వారు చేసే ప్రతి పనీ హానికరమైనదే, నాశనం కలుగజేసేదే.

మీ తలలో తురుముకోవడం కోసంగాని ప్రేమతో ఎవరికన్నా ఇవ్వడం కోసంగాని ఒకటి రెండు పూలు కోసికోడాన్ని అర్థం చేసికోగలం. కాని వాటిని ఊరకనే పెరికి పారవేయడమెందుకు? పెద్దవాండ్లు తమకున్న పేరాశలతో అందవికారంగా కనబడతారు. వాండ్లు చేసే యుద్ధాలలో కసాయివాండ్లలాగా ఒకరి కుత్తుకల నొకరు నరుకుకొంటారు. డబ్బు చూపించి ఒకరినొకరు అవినీతిపాలు చేసికొంటారు. వారు చేసే ఘోర మైన పనులు వేర్వేరుగా వుంటుంటాయి. ఇతర దేశాలలో మాదిరిగా ఇక్కడి యువకులు కూడ వారి అడుగుజాడలలోనే నడుస్తూ వుండడం అందరికీ తెలిసిన విషయమే.

ఇటీవల ఒకనాడు నేనొక పిల్లవానితో కలిసి వాహ్యాళికి వెళ్ళుతూ వుండగా దారికడ్డంగా రోడ్డుమీద ఒక రాయి కనిపించింది. దానిని అక్కడినుండి నేను తొలగిస్తే "ఎందుకట్లా చేశా" రని ఆ పిల్లవాడడిగి నాడు. ఇది దేనిని సూచిస్తుంది? వివేచనా రాహిత్యాన్ని, నిర్లక్ష్యాన్నే గదా సూచించేది? మీరితరులకు భయంచేత గౌరవం చూపిస్తారు, నిజంకాదా? ఎవరైనా పెద్దమనిషి గదిలోకి వస్తే, వెంటనే ఎగిరిలేచి నిలబడతారు. కాని అది గౌరవం చూపడంకాదు. అది మీ భయాన్ని సూచిస్తుంది. ఎందుకంటే నిజంగా మీలో గౌరవబుద్ధే వున్నట్టయితే, మీరు పూలను ధ్వంసం చేయరు, రోడ్డుమీద అడ్డంగా పడివున్న రాతిని తొలగిస్తారు. చెట్లను పెంచుతారు, తోటను జాగ్రత్తగా చూచుకోవడంలో తోటమాలికి సహాయపడతారు. కాని, పెద్దలంగాని పిల్లలంగాని, మనలో యితరుల కష్టసుఖాలను గూర్చిన ఆలోచన బొత్తిగా వుండదు. ఎందువలన? మనకు ప్రేమ అనేది తెలియకపోవడం వల్లనా?

మామూలుగా ప్రేమ అంటే యేమిటో మీకు తెలుస్తుందా? క్లిష్టమై చిక్కుతోగూడిన స్త్రీపురుషుల ప్రేమాగాదు, దైవప్రేమాగాదు, కేవలం

ప్రేమ — అంటే ప్రతిదాని యెడల దయార్ద్ర భావంతో, నిజమైన సౌజన్యంతో వ్యవహరించడం. ఇటువంటి ప్రేమ మీ యింటివద్ద మీకెల్లప్పుడు లభింపదు, దానికి కారణం మీ తల్లిదండ్రులకు మీపై ప్రేమ చూపడానికి తీరిక వుండదు. ఇంటివద్ద మీకు నిజమైన ప్రేమ లభింపకపోవడంచేత, మెత్తని మనస్సు దయాదాక్షిణ్యములు కరువవడంచేత, కొరడుపారిన మనస్తత్వంతో మీరిక్కడికి వస్తారు; అందరిమాదిరే మీరున్ను ప్రవర్తిస్తారు. మరి మీలోకి అటువంటి సున్నితమైన మనస్తత్వాన్ని ఎట్లా తేగలము? దాని అర్థం, పూలు కోయరాదనే నియమనిబంధనలు పెట్టవలెనని కాదు. కేవలమిట్టి నియమనిబంధనలచేత మిమ్మాపనినుండి విరమింపజేసినట్టయితే అప్పుడు మీలో భయం చోటుచేసికొంటుంది. ఏ మృదుస్వభావముండడంవలన మీరు జనులకుగాని, జంతువులకుగాని, పువ్వులకుగాని హాని కలుగకుండా, అప్రమత్తంగా వుంటారో అట్టి మృదుస్వభావము మీలో ఏ విధంగా రాగలదు?

మనం మాట్లాడుకొనే ఈ విషయాలలో మీకేమైనా అభిరుచి వున్నదా? ఇందులో మీకభిరుచి వుండి తీరాలి. మృదు స్వభావం కలిగివుండడంలో మీకాసక్తి లేకపోతే మీరు జీవించుచున్నట్లు కాదు, మీరు మృతప్రాయులు. నిజానికి చాలమంది అట్టివారే. వారు దినానికి మూడు పర్యాయములు తిండి తినవచ్చుగాక, ఉద్యోగాలు చేసికొంటూ వుండవచ్చుగాక, బిడ్డలను కనవచ్చుగాక, కార్లలో ప్రయాణం చేయవచ్చుగాక, నాణ్యమైన గుడ్డలు ధరించవచ్చుగాక, అయినా వారు మృతప్రాయులే, జీవిస్తున్నవారిలో లెక్కకు రారు.

సంవేదన శీలురై వుండడమంటే యేమిటో మీకు తెలుసునా? అంటే ప్రతివస్తువునెడ దయార్ద్ర చిత్తులై వుండడం — ఏదైనా జంతువు బాధపడుతూ వుంటే చూచి దానికేదైనా చేతనైన పరిచర్య చేయడం, దారిలో అడ్డంగా పడివున్న రాతిని ప్రక్కకు తొలగించి వేయడం — ఎంతోమంది చెప్పులు లేకుండా ఆ దారి వెంబడి నడుస్తారు గదా మరి! రోడ్డుమీద పడియున్న ఋనుప మేకును తీసి దూరంగా

పారవేయడం — లేకపోతే దానిమూలాన ఎవరి కారుచక్రానికైనా రంధ్రం (పంక్చరు) పడవచ్చు గదా. సంవేదనశీలురై వుండడమంటే మానవులు, పక్షులు, పూవులు, చెట్లు — వీటన్నిటియెడ మృదువుగా ప్రవర్తించడం. వారందరు మనవారని అవన్నీ మనకు సంబంధించినవనీ కాదు, కాని వాట న్నిటిలోని అద్భుత సౌందర్యమును మనము గమనించి వుండడంచేత. మరి యిట్టి సంవేదన శీలతను ఎట్లు తీసికొనిరాగలము?

మీలో సంవేదనశీలత లోతుగా వున్నట్లయితే, ఆ క్షణము నుండి మీరు సహజంగానే పూలు త్రుంచరు. ఏ వస్తువునూ నాశనం చేయ రాదని, ఎవరినీ హింసింపరాదని సహజంగానే మీలో బుద్ధి పుడుతుంది. అంటే దాని అర్థం మీకు ప్రతిదాని యెడ నిజమైన ఆదరభావము, ప్రేమ వున్నట్లు. ప్రేమించడమనేది జీవితంలో చాల ముఖ్యమైన విషయం. కాని ప్రేమ అంటే మన వుద్దేశమేమిటి? ఒకరు మనలను ప్రేమిస్తున్నారు కాబట్టి అందుకు బదులుగా మనమా మనిషిని ప్రేమిస్తే అది ప్రేమ అనిపించుకోదు. ప్రేమించడమంటే దానికి ప్రత్యామ్నాయంగా మరి దేనినీ కోరకుండా, నిర్హేతుకమైన అద్భుతమైన ప్రేమభావాన్ని మనలో కల్గి యుండడం. మీరు చాల తెలివిగలవారు కావచ్చు, అన్ని పరీక్షలు పాసై డాక్టరేట్ డిగ్రీ పొందియుండవచ్చు, ఉన్నత పదవిని సాధించి యుండ వచ్చు. కాని యీ సంవేదనశీలత మీలో లేనట్టయితే, యీ సహజమైన ప్రేమ మీలో ఉద్బుద్ధము కాకపోతే మీ హృదయము శూన్యము, మీ జీవితము ఆనంద రహితము అవుతుంది.

కాబట్టి హృదయము ఈ ప్రేమభావంతో నిండి వుండడం చాల అవసరం. అప్పుడు మీరు దేనినీ ధ్వంసము చేయరు, ఎవరి యెడలను నిర్దయగా వ్యవహరించరు, యుద్ధములంటూ ఇక ఉండబోవు. అప్పుడు మీరు ఆనందముతో జీవితము గడపునట్టి సంపూర్ణ మానవులు. మీరా నందంగా వుంటారు కాబట్టి మీరిక ప్రార్థనలు చేయరు, దేవునికోసం అన్వేషణ కొనసాగించరు. కారణమేమనగా ఆ యానందమే గదా దేవుడు!

మరి యీ ప్రేమ అనేది యెట్లా వస్తుంది? వాస్తవానికి ఈ

ప్రేమ విద్యాబోధకుని వద్దనుండి, ఉపాధ్యాయుని వద్దనుండి ఆరంభం కావాలి. గణితశాస్త్రము, భూగోళ శాస్త్రము, దేశచరిత్ర మొదలగు పాఠ్య విషయాలను బోధించడంతో బాటు, ఉపాధ్యాయుడు ఈ ప్రేమ భావాన్ని తన హృదయంలో కలిగివుండి, దానిగురించి మాట్లాడుతూ వుంటే, పదిమంది నడిచే బాటలో అడ్డంగా పడివున్న రాతిని అతడు స్వయంగా తొలగించితే, రోత కలిగించే నీచమైన పనులను తన సేవకునిచేత చేయించకుండావుంటే, తన మాటలలో చేతలలో, మీతోబాటు ఆడుకొనేటప్పుడుగాని తిండి తినేటప్పుడుగాని, లేదా మీతో వున్నా లేక ఒంటరిగా వున్నా అతడీ అద్భుత వస్తువును కలిగియుండి, మీకు దాని గురించి తరచు గుర్తుచేస్తూ వుంటే అప్పుడు మీరుకూడ ప్రేమంటే యేమిటో, ప్రేమించడమంటే యేమిటో తెలిసికోగలరు.

మీ శరీరం శుభ్రంగా కాంతిమంతంగా వుండవచ్చు, ముఖము అందంగా వుండవచ్చు, అందమైన చీరె కట్టుకొని యుండవచ్చు లేదా గొప్ప క్రీడాకారులై యుండవచ్చు. కాని, మీ హృదయంలో గనక ప్రేమ లేకపోతే, మీరొక అందవికారమైన మానవప్రాణి. మీ అందవికారానికి అంతుండదు. అట్లుగాక మీలో ప్రేమ వున్నట్లయితే మీ ముఖము అందంగావున్నా లేకపోయినా అందులో ఒక విధమైన దీప్తి కనిపిస్తుంది. ఒక విధమైన కళ వుంటుంది. ప్రేమించడమనేది జీవితంలో అన్నిటికంటె గొప్ప విషయము. ప్రేమను గురించి మాట్లాడడం, మానసికంగా దాని అనుభూతిని పొందడం, దానిని పెంపొందించుకోవడం, ఒక నిధివలె భద్రంగా కాపాడుకోవడం ఎంతో అవసరం. అట్లు చేయకపోతే అది త్వరలో క్షీణించిపోతుంది — ప్రపంచము అతిక్రూరమైనది గదా — దానిని నాశనంచేయ జూస్తుంది. మీరు చిన్నపిల్లలుగా వున్నప్పుడే మీలో ప్రేమలేకపోతే మనుషులవైపు, జంతువులవైపు, పూలవైపు మీరు ప్రేమతో చూడకపోతే, మీరు పెద్దైన తరువాత మీ జీవితము శూన్యమని తెలిసికొంటారు. మీరొంటరిగా జీవితం గడుపుతారు. భయము యొక్క నల్లనినీడలు మిమ్ము వదలక వెన్నాడుతూనే వుంటాయి. కాని మీ హృదయంలో ఏ క్షణాన్నైతే ఈ అద్భుతమైన ప్రేమ యనెడి పదార్థము

చోటు చేసికొంటుందో, దాని లోతును మీరు తెలిసికొన గల్గుతారో, దానివలన ఆనందము కలిగి అందులో పరవశించి పోతారో, అప్పుడీ ప్రపంచమే మారిపోయినట్లుగా మీకనిపిస్తుంది.

1. ప్రశ్న:- పాఠశాలలోని ఉత్సవములకు ఎల్లప్పుడును ఎక్కువగా ధనవంతులను, ఇతర ప్రముఖులను మాత్రమే ఆహ్వానిస్తూ వుంటారు, ఎందువలన?

కృష్ణమూర్తి:- ఎందువలన అని మీరనుకొంటారు? మీ తండ్రి ఒక ప్రముఖ వ్యక్తిగా వుండాలని మీరు కోరుకోరా? ఆయన లోకసభ సభ్యుడుగా ఎన్నుకొనబడితే, ఆయన పేరు వార్తాపత్రికలలో ప్రచురింపబడితే మీరు గర్వించరా? ఉండడం కోసం మిమ్మల్ని ఒక పెద్ద బంగళాలోనికి మీ తండ్రి తీసికొనిపోతే, లేదా ఐరోపాకు వెళ్ళి, ఒకపెద్ద చుట్ట నోట్లో పెట్టుకొని గుప్పుగుప్పుమని పొగవదులుతూ తిరిగి వస్తే అప్పుడు మీకెంత సంతోషం!

చూడండి, ధనవంతులున్ను అధికారంగలవారున్ను ఇటువంటి సంస్థలకు చాల ఉపయోగం. సంస్థ వాండ్లను పొగడుతుంది; వాండ్లు సంస్థకు ఏదైనా సహాయం చేస్తారు — ఈ విధంగా ఇది ఉభయతారకం, ఇద్దరికిని సంతోషం కలిగించేది. కాని యిందులో ముఖ్యమైన ప్రశ్న, పాఠశాల తన ఉత్సవాలకు ప్రముఖ వ్యక్తులను ఎందుకాహ్వానిస్తుంది అనేదికాదు. మీరుకూడా ప్రముఖ వ్యక్తిగా వుండాలని ఎందుకు కోరుకొంటారు? బాగా డబ్బున్నవాడిని, పేరున్నవాడిని, గొప్ప అందగాడిని పెండ్లి చేసికోవాలని మీరెందుకు కోరుకొంటారు? ఎందులోనో ఒకందులో గొప్పవారు కావాలని మీరందరు కోరుకోరా? మీకాకోరికలున్నట్టయితే అప్పుడే మీలో అవినీతి బీజములు పడ్డాయన్న మాటే. నేను చెప్పేది మీకర్థమౌతున్నదా?

పాఠశాల ధనవంతులనెందు కాహ్వానిస్తుంది అనే ప్రశ్నను క్షణకాలం పాటు అటుంచండి, ఈ ఉత్సవాలలో బీదవాండ్లు కూడ ఎక్కువగానే వున్నారు. అయితే మీలో ఎవరైనా బీదవాండ్ల పక్కన కూర్చుం

టారా? పల్లెప్రజల పక్కన కూర్చుంటారా? నిజంగా ఆ పని చేయగలరా? మరియొక అసాధారణమైన విషయం — సన్న్యాసులు తాము ప్రముఖ స్థానాలలో కూర్చోవడంకోసం ఎంతగా తహతహ లాడుతారో, అందరినీ త్రోసుకుంటూ దారిచేసికొని ముందుకెట్లా వస్తారో మీరు గమనించారా? మనందరికి ప్రాముఖ్యం కావాలి, గుర్తింపు కావాలి. అసలు ఎవరినుండి ఏమిన్నీ కోరనివాడే నిజమైన బ్రాహ్మణుడు. అతడట్లు కోరకపోవడానికి కారణం అతనికున్న గర్వంకాదు, అభిమానం కాదు. దానికి కారణం అతడు తనకుతానే వెలుగు. కాని అదంతా మనమిప్పుడు పోగొట్టుకొన్నాం.

అలెగ్జాండరు భారతదేశానికి వచ్చినప్పుడు అతని గురించిన ఆశ్చర్య కరమైన కథ ఒకటి వున్నది, అది మీకు తెలుసునా? అతడు దేశాన్ని జయించిన తరువాత, ఆ దేశంలో అంతమంచి వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రజలలో నిజాయితీని పెంపొందించి, అవినీతికి ఏమాత్రమున్న అవకాశం లేకుండా పరిపాలన సాగించిన ప్రధానమంత్రిని చూడగో రినాడట. అప్పుడా దేశపురాజు ప్రధానమంత్రి ఒక బ్రాహ్మణుడని, అతడు తన గ్రామానికి వెళ్ళిపోయినాడని చెప్పగా, అతనిని పిలిపించమని తాను చూస్తానని అలెగ్జాండరు అన్నాడట. రాజు ప్రధానమంత్రి కోసం కబురు పంపగా అతడు రావడానికి ఇష్టపడలేదట. దానికి కారణం పదిమంది యెదుట తానొక గొప్పవాడుగా నిలబడి పొగడ్తలనందుకో వడం అతని కిష్టములేదు. దురదృష్టవశాత్తు మనమిప్పుడట్టి స్వభావాన్ని పోగొట్టుకొన్నాము. మనము అంతఃశూన్యులము, మంద బుద్ధులము, నిత్య దుఃఖితులము. కాన మానసికంగా భిక్షుకులమైనాము. ఎవరో ఏదో వచ్చి మనకు ఉత్సాహము నివ్వాలి, పుష్టి నివ్వాలి, ధైర్యం చెప్పాలి, మనలను ఆదుకొనాలి. అట్టి వ్యక్తులకోసం వస్తువులకోసం అన్వేషిస్తూ వుంటాము. అందువలన మనము మామూలు వ్యవహారాలను గూడ చెడగొట్టు కొంటుంటాము.

ఎవరో ప్రముఖుడైన ఒక అధికారివచ్చి ఏదో భవనానికి పునాది

రాయి వేయడంలో తప్పేమున్నది? అదిమంచిదే. కాని దానివెనుకవున్న ఉద్దేశమే చెడ్డది. మీరెప్పుడైనా పల్లె ప్రజలను చూడడంకోసం వెళ్తారా? వెళ్ళరు. వాండ్లతో మీరు మాట్లాడరు, వాండ్ల అనుభూతిని మీరు పంచుకొనరు. వాండ్లకు తినడానికి ఎంత తక్కువగా దొరుకుతుందో, దినదినము విశ్రాంతి అనేది యెరుగకుండా కలకాలమెట్లా పాటు పడుతూ వుంటారో మీరు స్వయంగా వెళ్ళి చూడరు. కాని నేను మీ దృష్టిని కొన్ని విషయాలవైపు ఆకర్షించి వుండడంచేత అది ఆధారంగా తీసికొని మీరితరులను విమర్శించడానికి మాత్రం సిద్ధమైనారు. చుట్టూ చేరి కూర్చుండి కేవలం విమర్శలు చేస్తూ వుండకండి. అది వృథా. దానిబదులు పల్లెలకుపోయి అక్కడి పరిస్థితులను స్వయంగా చూచి తెలిసికొని, అక్కడ ఏదైనా మీరు చేయగల్గినది చేయండి — ఏదైనా మొక్కను నాటండి, పల్లెప్రజలతో కలిసి మాట్లాడండి, వాండ్లనిక్కడికి ఆహ్వానించండి, వాండ్ల పిల్లలతో ఆడుకోండి. అప్పుడు దేశమంతటా ప్రేమ వెల్లివిరుస్తుంది. దానితో నూతన సమాజము ఆవిర్భవించడం మీరు చూడగలరు. ప్రేమలేని సమాజము నదులు లేని భూమివంటిది, ఎడారి వంటిది. ఎక్కడైతే నదులుంటాయో అక్కడి భూమి ధనవంతమైనది, సమృద్ధమైనది, కన్నుల విందైనది. మనలో చాలమంది ప్రేమకు నోచుకోలేదు; ప్రేమ అంటే యేమిటో యెరుగకుండానే పెరిగి పెద్దవాండ్లమైనాము. అందువల్లనే మనము నిర్మించుకొన్న సమాజము కూడ అందలి సభ్యుల మాదిరే భయంకరమైనది, అందవికారమైనదిన్ని.

2. ప్రశ్న:- చెక్కిన విగ్రహంలో దేవుడులేడని మీరంటారు. కాని అక్కడే వున్నాడని, మీ హృదయాలలో నమ్మకమున్నట్లయితే ఆ దేవుని శక్తి ప్రకటితమవుతుందని ఇతరులంటారు. మరి పూజలోని సత్యమేమి?

కృష్ణమూర్తి:- ప్రపంచంలో ఎంతమంది మనుషులున్నారో అన్ని అభిప్రాయాలుంటాయి. అభిప్రాయమంటే యేమిటో మీకు తెలుసును గదా. మీరొక విధంగా చెబుతారు, మరియొకరు మరియొక విధంగా

చెబుతారు. ఎవరి యభిప్రాయం వారిది. కాని అభిప్రాయమేదిన్నీ సత్యము కాదు. కాబట్టి ఎంత గొప్పవారి యభిప్రాయమైనాసరే వినిపించుకోవద్దు. దానిబదులు ఏది సత్యమో ఏది కాదో మీయంతట మీరే తెలిసికోండి. రాత్రికిరాత్రి అభిప్రాయాలను మార్చుకోవచ్చును. కాని సత్యమునట్లా మార్చలేము.

సరే, మరి చెక్కిన విగ్రహంలో దేవుడున్నాడా లేడా, అందులో సత్యమున్నదా లేదా అనే విషయాన్ని మీయంతట మీరు తెలిసికొనగోరుతారు, అంతేనా? చెక్కిన విగ్రహమంటే యేమిటి? అది మనస్సుతో ఊహింపబడి, కొయ్యమీదగాని రాతిమీదగాని చేతితో చెక్కబడినది. మనస్సు విగ్రహమును ఊహిస్తుంది. అట్లా మనస్సుచేత ఊహింపబడిన విగ్రహము దేవుడని ఒక లక్షమంది జనులు గట్టిగా బల్లగుద్ది చెప్పినాసరే, మీరది నిజమని అనుకొంటారా?

మనస్సుకు విగ్రహంమీద నమ్మకమున్నట్టయితే, అప్పుడా విగ్రహము మనస్సుకు శక్తినిస్తుందని మీరంటారు. అందులో మాత్రం సందేహం లేదు. మనస్సు విగ్రహాన్ని సృష్టిస్తుంది, అంతట తాను సృష్టించిన విగ్రహాన్నుండి శక్తిని పొందుతుంది. మనస్సు నిరంతరము చేస్తున్న పని అదే — ప్రతిమలను లేదా విగ్రహాలను సృష్టించడం, వాటినుండి బలాన్ని, సుఖాన్ని, ఏదైనా ప్రయోజనాన్ని పొందడం. అందువలన అట్టి మనస్సు అంతఃశూన్యమైనది, ఆంతరిక దారిద్ర్యముచే పీడింపబడునది. కాబట్టి విగ్రహం కాదు ముఖ్యం, లక్షలాది మనుష్యులు చెప్పేది కాదు ముఖ్యం, మరి ముఖ్యమేమంటే మీ మనస్సు పనిచేసే తీరును అర్థం చేసికొనడమే.

మనస్సు దేవుళ్ళను సృష్టిస్తుంది, నశింపజేస్తుంది. అది దయగలది, దయ లేనిదికూడ. అది యెంతో అద్భుతములైన కార్యములను చేయగల శక్తిగలది. అది అభిప్రాయాలను కలిగి వుండగలదు, భ్రమలను పుట్టింపగలదు, బ్రహ్మాండమైన వేగముతో ప్రయాణము చేయగల జెట్ విమానాలను నిర్మింపగలదు, అందమైన వంతెనలను కట్టగలదు, విశాల

మైన రైలు మార్గాలను వేయగలదు, మనిషికంటె మిన్నగా లెక్కలు చేయగల యంత్రాలను కనుగొనగలదు. కాని మనస్సు సత్యమును సృష్టించలేదు. అది సృష్టించ గలిగినది సత్యమును కాదు, కేవలమొక అభిప్రాయమును, ఒక నిర్ణయమును మాత్రమే. కాబట్టి సత్యమంటే యేమిటో మీయంతటు మీరు తెలిసికోవడం అవసరము.

సత్యమంటే యేమిటో తెలిసికొనవలెనంటే మనస్సు బొత్తిగా కదలకుండా సునిశ్చలంగా వుండాలి. అట్లా నిశ్చలంగా వుండడమే పూజ చేయడం. పూవుల నర్పించుదామని గుడికి పోవడంగాని, ఆ పోయే దారిలో వున్న బిచ్చగాండ్లను ప్రక్కకు త్రోసివేయడంగాని పూజకాదు. మీరు దేవతలకు భయపడతారు. కాబట్టి వారిని ప్రసన్నం చేసికొందామని ప్రయత్నిస్తారు. కాని మీరు చేసేది పూజకాదు. మీరు మీ మనస్సును అర్థము చేసికొంటే అప్పుడది పూర్తిగా నిశ్చలత్వమును పొందితే — మీరు దానిని నిలుకడ పొందునట్లు చేయడానికై ప్రయత్నించకుండా, దానంతటు అది నిలుకడ పొందితే — అప్పుడా నిశ్చలతయే, ఆ నిలుకడయే, పూజించడము. మరియును ఆ నిశ్చలతలోనే సత్యము, సుందరము, దైవమని పిలువబడునదేదో అది ప్రత్యక్షమవుతుంది.

3. ప్రశ్న:- ప్రశాంతంగా కూర్చుండి మన మనస్సు పనిచేసే తీరును గమనిస్తూ వుండమని మీరొకనాడు చెప్పియున్నారు. కాని మనం మన ఆలోచనలను జాగ్రత్తగా గమనించడం మొదలుపెట్టగానే అవి అంతర్థానమై పోతున్నాయి — ఆగిపోతున్నాయి. మనస్సే ద్రష్ట (చూచేది), మనస్సే దృశ్యము (చూడబడేది) అయినప్పుడు, మన మనస్సును మనమెట్లు దర్శింపగలము?

కృష్ణమూర్తి:- ఇది చాల జటిలమైన సమస్య; ఇందులో అనేక విషయాలు చేరివున్నాయి.

అది సరే, అసలు ద్రష్ట అనేవాడొకడున్నాడా? లేక దర్శించ

డమేనా జరుగుతున్నది? దయచేసి దీనిని చాల జాగ్రత్తగా అర్థము చేసికోండి. ఆలోచించేవాడంటూ వేరే వున్నాడా లేక కేవలము ఆలోచించడమేనా వున్నది? మొదట్లో ఆలోచించేవాడు లేడన్నది తథ్యము; మొదట్లో వున్నది ఆలోచించడమే. అప్పుడా ఆలోచించడము నుండి ఆలోచించేవాడు సృష్టింపబడినాడు. అంటే ఆలోచించడమనే ప్రక్రియ రెండుగా విభక్తమైనది. ఈ విధంగా విభజనమేర్పడినప్పుడే చూచేవాడు చూడబడునది అంటే ద్రష్ట మరియు దృశ్యమని విభేదము కనిపిస్తుంది. అందువలన యీ ప్రశ్నవేసిన వ్యక్తి అన్నట్లుగా, మీరు మీ మనస్సును గమనిస్తూ వుంటే, మీరొక ఆలోచనను కనిపెట్టి చూస్తూ వుంటే, ఆ యాలోచన అదృశ్యమై పోతుంది, మాసిపోతుంది. కాని నిజానికి వున్నది దర్శన ప్రక్రియయేగాని ద్రష్టకాదు; దర్శించడమేగాని దర్శించేవాడులేడు, చూడడం మాత్రమే జరుగుతున్నది గాని చూచేవాడు లేడు. మీరొక పూవును చూస్తున్నప్పుడు, సరిగ్గా మీరు చూస్తున్న ఆ క్షణంలో చూచే వ్యక్తి వున్నాడా? లేక చూడడం మాత్రమే జరుగుతున్నదా? పూవును చూస్తూ, "అది యెంత అందంగా వున్నది! అది నాకు కావాలి" అని మీరంటారు. అప్పుడు 'నేను' అనే భావన కలిగినట్లు. కాబట్టి చూచిన మరుక్షణం నుండి కలిగే కోరిక, భయము, ఆశ, ఆకాంక్షల ద్వారా 'నేను' అనే భావన కలుగుతున్నది. 'నేను'ను సృష్టించేవి ఈ కోరిక, భయము మొదలైనవి; అవి లేకుండా 'నేను'కు అస్తిత్వమేలేదు.

ఈ ప్రశ్ననంతను ఇంకా లోతుకుపోయి విచారిస్తే ఎప్పుడైతే మనస్సు మిక్కిలి ప్రశాంతంగా వుంటుందో, సంపూర్ణంగా నిశ్చలమైపోతుందో, ఆలోచనా ప్రవాహము పూర్తిగా ఆగిపోతుందో, అట్లాగిపోవడం వలన అనుభవించేవాడుండడో, పరిశీలించేవాడు వుండడో, అప్పుడున్న ఆ నిశ్చలతలో సృజనాత్మకమైన అవగాహన వుంటుంది. ఆ నిశ్చలతలో మనస్సు రూపాంతరం పొందుతుంది, దాని స్థితిలో మార్పు వస్తుంది. అయితే మనస్సున కట్టి నిశ్చలత ఎట్టి సాధనవలనగాని, ఎట్టి నియమపాలనం

వలనగాని, క్రమశిక్షణ వలనగాని, ఎట్టి అభ్యాసం వలనగాని రాదు. ఒక మూల కూర్చుండి ఏకాగ్రత కోసం ప్రయత్నిస్తూ వుంటే వచ్చేదికాదు ఆ నిశ్చలత. మనస్సు పనిచేసే తీరును, మనస్సు పోయే పోకడలను అర్థము చేసికోగలిగితే ఆ నిశ్చలత సిద్ధిస్తుంది. ప్రజలు ఆరాధించెడి రాతి విగ్రహమును సృష్టించినది మనస్సు. భగవద్గీతను, వ్యవస్థీకృతములైయున్న మతములను, అసంఖ్యాకములైన విశ్వాసములను సృష్టించినది మనస్సు. అందుచే సత్యపదార్థమును తెలిసికొనవలెనంటే మనస్సుచే సృష్టింపబడిన వాటినన్నిటిని అతిక్రమించి పోవలసివుంటుంది. [సత్యము వీటి కన్నిటికిని అతీతమైనది.]

4. ప్రశ్న:- మనిషంటే కేవలం మనస్సు, మెదడు లేక బుద్ధి ఇంతేనా? లేక ఇంతేమైనా అదనంగా వున్నదా?

కృష్ణమూర్తి:- ఇదెట్లా తెలిసికోగలరు? శంకరుడో బుద్ధుడో లేక మరియొకరో చెప్పినదానిని నమ్మితే, దానిపై ఊహాపోహలు సిద్ధాంతాలు చేస్తే లేదా వారు చెప్పినదానిని అంగీకరిస్తే, దానికి మీ సమ్మతి తెల్పితే మీరు సత్యాన్వేషణ చేస్తున్నట్లుకాదు, సత్యమేదో తెలిసికోడానికి ప్రయత్నిస్తున్నట్లుకాదు.

మీకున్న పనిముట్టు ఒకేయొకటి, అది మీ మనస్సు. మరి మనస్సే మెదడు లేక బుద్ధి కూడ. కాబట్టి యీ విషయము యొక్క యాథార్థ్యమును తెలిసికోవాలంటే మీరు మీ మనస్సు పనిచేసే తీరును అర్థము చేసికోవలసి వుంటుంది, ఏమి అక్కరలేదా? కుటిలమగు మనస్సు ఋజువుగా చూడనే లేదు. పరిమితమగు మనస్సు అపరిమితమును అనంతమును చూడలేదు. సావధికమగు మనస్సు నిరవధికమగు దానిని చూడలేదు. మనస్సే బోధ కలుగుటకు సాధనము. సత్యబోధ కలుగవలెనంటే, సత్యమును దర్శింపవలెనంటే, తత్సాధనమైన మనస్సు ఋజువుగా నుండవలె, దానిలోని పూర్వసంస్కారములను కడిగివేయవలె, దానినుండి భయమును తొలగించవలె. సంపాదించుకొన్న జ్ఞానమునుండి

కూడ మనస్సు విముక్తము కావలె; లేనిచో ఆ సంచితమైన జ్ఞానము మనస్సును మరల్చి మరియొక దిశలో పోనిస్తుంది, సర్వమును వికృతముగా — అంటే సత్యమును అసత్యముగా, అసత్యమును సత్యముగా — చూపిస్తుంది. మనస్సు నూతనములైన వాటిని కల్పింపగలదు, లేనివాటిని ఊహింపగలదు, అంచనాలు వేయగలదు, ఆలోచనలు సాగింపగలదు. మనస్సునకున్న యిట్టి అద్భుతమైన సామర్థ్యమును దూరముగా ఒక ప్రక్కకుంచితేనే గదా అది మిక్కిలి నిర్మలమై మిక్కిలి సరళమై వుండగలిగేది? ఏలయన నిర్దోషమై, అమాయికమైన మనస్సు మాత్రమే, ఎంతో అనుభవ జ్ఞానమును సంపాదించియుండియు దానినుండి సద్యో విముక్తి పొందగల మనస్సు మాత్రమే, తనకును మెదడుకును — లేదా బుద్ధికిని పరముగా నున్నదేదో దానిని దర్శింపగలదు. అట్లుగానిచో మీరు దర్శించునట్టిది, మీ యనుభవ జ్ఞానముచే రంజితమై వుంటుంది. మరి మీ యనుభవజ్ఞానమో, మీరు పొందిన సంస్కారముల ఫలితమే గదా!

5. ప్రశ్న:- ఆవశ్యకతకును అత్యాశకునుగల తేడా యేమిటి?

కృష్ణమూర్తి:- తేడా మీకు తెలియదా? మీకున్న అవసరాలు ఎప్పుడు తీరినదిన్నీ మీకు తెలియదా? మీరు అత్యాశ కలిగివుంటే, ఆ విషయమై ఏదో మీకు చెప్పుతున్నట్లనిపించదా? ఏదైనా చాల చిన్న వస్తువుతో ఆరంభించి చూడండి, మీకు దీని సత్యం తేటపడుతుంది. మీకు గుడ్డలు, నగలు, మరేదైనా సరే చాలినన్ని మాత్రమే వున్నప్పుడు మీరు దానిగురించి పెద్దగా తర్కించరు, తర్కించవలసిన అవసరం కనబడదు. అది మీరెరుగుదురు. కాని యెప్పుడైతే అవి అవసరాన్ని మించి వుంటాయో, ఆవశ్యకత తన క్షేత్రమును దాటి అత్యాశ యొక్క క్షేత్రములోనికి అడుగుపెడుతుందో ఆ క్షణమునుండి మీరు మీ అత్యాశను గూర్చిన వేదాంతం మొదలుపెడతారు, దానిని గూర్చిన సిద్ధాంతములు లేవదీస్తారు, కారణములు చూపి సమర్థించుకోవడం మొదలుపెడతారు, అందులో తప్పులేదని తగిన వివరణలు ఇచ్చుకొంటారు. ఉదాహరణకు,

ఒక మంచి ఆస్పత్రికి ఎన్నో పడకలు కావలసి వుంటాయి. ఉత్తమ ప్రమాణంలో శుభ్రతను పాటించవలసి వుంటుంది. క్రుళ్ళిపోకుండ జేసెడి మందులు, విషక్రిములను నశింపజేసెడి మందులు మొదలగునవెన్నో కావలసి వుంటాయి. ప్రయాణం చేయవలసిన మనిషికి బహూశా ఒక కారు, ఒక ఓవరుకోటు మొదలైనవి కావలసి వుంటాయి. ఇవన్నీ ఆవశ్యకతలు. మీ వృత్తిని మీరు కొనసాగించాలంటే దానికి సంబంధించిన కొంత జ్ఞానము, కొంత నేర్పు కావలసి వుంటాయి. మీరు ఇంజనీర్లు అయినట్టయితే మీకు కొన్ని విషయాలు తెలిసి వుండాలి. కాని ఆ జ్ఞానమే అత్యాశకు సాధనం కావచ్చును. అత్యాశ కారణంగా మనస్సు ఆవశ్యకములైన వస్తువులను తన స్వార్థసాధనకై, తన అభివృద్ధికై ఉపయోగించుకొంటుంది. ఇది చాల సరళమైన ప్రక్రియ అని, జాగ్రత్తగా పరిశీలించి చూస్తే మీకే తెలుస్తుంది. మీకు వాస్తవంగా ఆవశ్యకమైన సామగ్రి యేదో మీకు తెలిసివుండి, దానితోబాటు అత్యాశ యేవిధంగా ఆరంభమవుతుందో, మనస్సు ఆవశ్యక సామగ్రిని తన ప్రాముఖ్యాన్ని పెంచుకోవడం కోసం ఎట్లా వుపయోగించుకొంటూ వుంటుందో, మీరు చూడగల్గితే అప్పుడు అత్యాశకును ఆవశ్యకతకును గల భేదమును తెలిసికోవడం ఏమంత కష్టము కాదు.

6. ప్రశ్న:- మనస్సున్ను బుద్ధిన్ని (brain) ఒకటే అయినట్టయితే, ఏదైనాఒక తలంపో లేదా ఒక తీవ్రమైన కోరికయో తలెత్తినపుడు, బుద్ధి అది మంచిదికాదని, అసుందరమైనదని హెచ్చరిస్తూవున్నా, మనస్సు వాటివెంబడే మామూలుగా పోతూవుంటుంది. ఎందువలన?

కృష్ణమూర్తి:- వాస్తవంగా జరిగేదేమిటి? ఒక గుండుసూది మీ చేతికి గ్రుచ్చుకొన్నట్టయితే, నాడులు ఆ సంవేదనను మెదడుకు తీసికొనిపోతాయి. మెదడు దానిని నొప్పిగా తెలియజేస్తుంది. అప్పుడు మనస్సు ఆ నొప్పికి వ్యతిరేకంగా తిరుగబడుతుంది. అప్పుడు మీరు ఆ గుండుసూదిని అక్కడి నుంచి తీసివేస్తారు, లేదా మరేదైనా ప్రతిక్రియ

చేస్తారు. అదే విధంగా కొన్ని కొన్ని విషయాలు అసుందరములని, మూర్ఖములని తెలిసినప్పటికిన్ని మనస్సు వాటిని వదిలిపెట్టదు. పొగ త్రాగడం నిశ్చితంగా చెడ్డ అలవాటని మనస్సుకు తెలిసినా, మనిషి దానిని విడిచిపెట్టడు. ఎందుకని? పొగత్రాగడంవలన కలిగెడి సంవేదన మనస్సుకు ప్రీతిని కలిగిస్తుంది, అంతే. అంతకంటె వేరే కారణం లేదు. గుండుసూదితో గ్రుచ్చినప్పుడు దానివలన కలిగెడి నొప్పిని మనస్సు ఎంత తీవ్రంగా గ్రహించిందో అంత తీవ్రంగా పొగత్రాగడము నందలి తెలివితక్కువను గూడ మనస్సు గ్రహిస్తే, — అది, పొగత్రాగడాన్ని వెంటనే ఆపివేస్తుంది. కాని ఆ తెలివితక్కువతనాన్ని అంత స్పష్టంగా చూడడం మనస్సున కిష్టము లేదు. కారణమేమంటే పొగత్రాగడం దాని కొక ప్రీతిదాయకమైన అలవాటుగా పరిణమించినది. ఇదే విధంగా లోభ విషయంలోను, హింస విషయంలోను, — మీచేతిమీద గుండుసూదితో గ్రుచ్చినపుడు ఎంత బాధ కలిగిందో అంత బాధ లోభమువలన గూడ మీకు గలిగితే, మీరు వెంటనే లోభమును వదిలిపెడతారు. దానిని సమర్థించడానికి ప్రయత్నించరు, దానిని గూర్చి సిద్ధాంతములు చేయరు. అదే విధంగా హింసయొక్క పూర్తి పరిణామ మెట్లుంటుందో మీకు నిజంగా తెలిసివుంటే, అహింసను గూర్చి పెద్ద పెద్ద గ్రంథములను మీరు వ్రాయరు, వ్రాయవలసిన పనిలేదు. ఆ వ్రాత అంతా అర్థము లేనిపని; అది మానసికంగా మీరు అనుభూతి చెందినది కాదు. కేవలం దానిగురించి మాట్లాడతారు — అంతే. మీరేదైనా తిన్నప్పుడు తీవ్రమైన పొట్టనొప్పి వస్తే, మీరింకా దానినే తింటూ వుంటారా? తినరు గదా. దానిని వెంటనే ప్రక్కకు త్రోసివేస్తారు. అదే విధంగా, ఈర్ష్య మరియు పేరాశ విషపూరితములని, దుష్టమైనవని, క్రూరములని, త్రాచుపాము కాటువలె ప్రాణాంతకములని మీరొక్కసారి గ్రహిస్తే, అప్పటినుండి వాటియెడ మెలకువతో వుంటారు. కాని, చూశారూ, మనస్సు ఈ విషయముల గురించి అంత సూక్ష్మ పరిశీలన చేయగోరదు. ఈ విషయాలలో మనస్సుకు కొంత స్వార్థమున్నది, కొంత ప్రయోజనమున్నది. పేరాశ, ఈర్ష్య, అత్యాశ, స్త్రీ వ్యామోహము విష

పూరితములనే విషయాన్ని అంగీకరించడానికి మనస్సు నిరాకరిస్తుంది. అందువలన "అలోభమును గూర్చి, అహింసను గూర్చి చర్చిద్దాం. వాటిని ఆదర్శాలుగా పెట్టుకొందాం" అని అంటుంది. ఈ లోపల యీ విష పదార్థాలతో తనపని తాను చేసికొంటూ పోతుంది. అందువలన యీ గుణములెంత దుష్టములో, ఎంత వినాశకరములో, ఎంత విషపూరిత ములో మీయంతట మీరు తెలిసికొంటే, వెంటనే వాటిని మీరు వదిలి పెడతారు. అట్లుగాక కేవలం "నేనట్లా చేయగూడదు" అని మాత్రం అంటూ, పూర్వపద్ధతిని మాత్రం వదలక, యథాప్రకారం మీదారిన మీరు పోతూవుంటే మీరు దంభవ్రతులన్నమాట; మీరు చెప్పేదానికి, చేసేదా నికిన్ని పొత్తుండదు. కాబట్టి, మీరేదో ఒకదారి త్రొక్కండి — అటో, యిటో, — వేడిదారిగాని, చల్లనిదారిగాని.

31 జనవరి, 1955

9

ఏకాంత వాసము

నేటి ప్రపంచంలో కాలక్షేపం కోసం, మనోరంజనం కోసం, ఏర్ప డిన సాధనములకు అంతమే లేదు. అయితే వాటిల్లో పాల్గొనే నటీ నటులు మాత్రం చాల తక్కువ. దాదాపు అందరూ ప్రేక్షకులే, చూచి ఆనందించువారే, మనస్సు ఉల్లాస పరచుకొనువారే. ఇది చాల ఆశ్చ ర్యకరమైన విషయం కాదా? ఏమాత్రం తీరిక దొరికినా, మనస్సున కుల్లాసం కలిగించే వినోదములు, వేడుకలకోసం ప్రాకులాడుతాం. మన స్సును ఆకట్టుకొనే యేదైనా పుస్తకాన్నో, నవలనో, పత్రికనో తీసికొని చదవడం మొదలుపెడతాం. అమెరికాలోనైతే రేడియో పెట్టుకొంటాం, టెలివిజన్ చూస్తాం. ఇవేవీ కాకపోతే అంతులేని బాతాఖానీలోకి దిగిపోతాం, అనవసరమైన ముచ్చటలాడుకొంటూ కాలక్షేపం చేస్తాం. మనకెప్పుడూ ఏదోయొక వినోదమో, వేడుకో వుండాలి. ఎంత సేప టికీ మననుండి మనం పారిపోజూస్తాం. మనం ఒంటరిగా వుండడానికి భయపడతాం. ఎవరూ తోడులేకపోతే, ఏదోయొక కాలక్షేపం లేకపోతే — యేమి చేయాలో తోచక - భయపడతాం. పొలాల వెంబడి, అడవుల వెంబడి నడుస్తూ ఏమీ మాట్లాడకుండా పాటలు పాడకుండా, పూర్తి మౌనంతో, మనకు బయటా, మనలోపలా వున్న ప్రపంచాన్ని జాగ్రత్తగా గమనిస్తూ వాహ్యాళి పోయేవారు చాల అరుదు. మనం అటువంటి పనిచేయం. ఎందుకంటే చూడండి, మనలో చాలమందిమి విసుగెత్తి అలసిపోయి వుంటాం. ఎప్పుడూ చదువుకోవడమో, చదువు చెప్పడమో, లేకపోతే ఇంటి పనులు చూచుకోవడమో, ఉద్యోగం చేసికోవడమో — ఇటువంటి నిరానందకరమగు దినచర్యలో పాతుకొనిపోతాం. అందు వలన తీరిక సమయంలో మనకేదో వినోదం కావాలి -- తేలికైనదిగాని,

తీవ్రమైనదిగాని. అందుకోసమని పుస్తకాలు చదువుకొంటాం, లేదా సినిమాకు పోతాం లేదా మతం వైపుకు మనస్సు మరలిస్తాం. ఇవన్నీ ఒకే రకమైనవి. మతంకూడా ఒక విధమైన కాలక్షేప సాధనంగా, మనోరంజన సాధనంగా పరిణమించినది. అది యిప్పుడు విసుగుదలనుండి, నిత్యముచేసే వాడుక పనులనుండి తప్పించుకోడానికొక సాధనంగా ఉపయోగపడుతున్నది.

ఇదంతా మీరు గమనించినారో లేదో నాకు తెలియదు. ఎక్కువ మంది ప్రజలు ఏదో యొక పనిలో ఎల్లప్పుడూ నిమగ్నమై వుంటారు — పూజలు చేయడంలోనో, ఏవో కొన్నిమాటలను పలుమారు ఉచ్చరించడంలోనో - జపం చేయడంలోనో, ఏదో యొకదాని గురించి అదేపనిగా చింతిస్తూ వుండడంలోనో మునిగిపోయివుంటారు. దానికి కారణం వారు ఏకాంతంలో వుండడానికి భయపడడమే, ఎట్టి కాలక్షేపము లేకుండా ఏకాంతంగా వుండడానికి మీరు ప్రయత్నించి చూడండి — అప్పుడు తెలుస్తుంది మీకు, ఎంత త్వరగా మీనుండి మీరు పారిపోవాలని చూస్తారో! మీ స్థితిని మీరు మరిచిపోవాలని చూస్తారో! అందువల్లనే నేటి నవ నాగరక సమాజంలో అదియొక వృత్తిగా వ్యాపారంగా నడిపెడి వినోద కార్యక్రమములు, యాంత్రికమైన కాలక్షేపములు ప్రధాన పాత్రవహిస్తున్నాయి, పెద్దయెత్తున సాగింపబడుతున్నాయి. పరిశీలించి చూస్తే ప్రపంచమంతటా ప్రజలు రానురాను కాలక్షేపములకు లొంగినవారుగా, కృత్రిమ స్వభావులుగా, కేవలము లౌకిక దృష్టిగలవారుగా మారుతున్నట్లు కనిపిస్తుంది. పెరిగిపోతున్న వేడుకలు విలాసములు, అచ్చవుతున్న అసంఖ్యాకములైన పుస్తకములు, క్రీడావిషయములతో నిండిపోతున్న వార్తాపత్రికల పుటలు — ఇవన్నీ మనము మన మనస్సులను నిరంతరము ఉల్లాసపరచే వేడుకల కొఱకై యెంతగా తపిస్తున్నామో తప్పక సూచిస్తాయి. మనము అంతర్గతముగా శూన్యులము, సంవేదనారహితులము, అల్పబుద్ధిగలవారము; మనకితరులతో గల సంబంధాలను, మన సాంఘిక సంస్కారణలను మననుండి మనం తప్పించుకొని పారిపోవడానికి సాధనా

లుగా ఉపయోగించుకొంటున్నాము. ఎక్కువమంది జనులు ఎంతగానో మానసికమైన ఒంటరితనమును అనుభవిస్తున్నారు. దీనిని మీరు గుర్తించి నారో లేదో నాకనుమానం. ఆ ఒంటరితనమునుండి తప్పించుకొనడానికై దేవాలయాలకో, చర్చిలకో, మసీదులకో పారిపోతాం, నీటుగా దుస్తులు ధరించి సాంఘిక సమావేశాలకు హాజరవుతాం, టెలివిజను చూస్తాం, రేడియో వింటాం, పుస్తకాలు చదువుతాం – ఇంకా ఇటువంటి పను లెన్నో చేస్తుంటాము.

ఒంటరితనమంటే యేమిటో మీకు తెలుసునా? మీలో కొందరికి ఆమాట క్రొత్తగా కన్పించవచ్చు. కాని దాని భావం మాత్రం మీకు బాగానే తెలిసివుంటుంది. ఒంటరిగా బయటికి వాహ్యాలికి పోవడానికి ప్రయత్నించి చూడండి. లేదా పుస్తకమేదీ లేకుండా, మాట్లాడించేవాండ్లు ఎవ్వరూ లేకుండా ఒంటరిగా వుండడానికి ప్రయత్నించండి. అప్పుడు మీకు తెలుస్తుంది ఎంత త్వరగా విసుగు పుడుతుందో. అప్పుడు కలిగే మానసికానుభూతి మీకు బాగానే తెలుస్తుంది. కాని ఎందుకు విసుగు పుట్టుతుందో తెలియదు. దాని గురించి మీరు దర్యాప్తు చేయలేదు, లోతుగా విచారించి చూడ లేదు. విసుగుదల అంటే యేమిటో కొంత లోతుగాపోయి విచారించి చూస్తే దానికి కారణము ఒంటరితనమని మీకు తేలుతుంది. ఈ ఒంటరితనమునుండి తప్పించుకోవడం కోసమే మనమందరం కలిసివుందామని కోరుకొంటాం, మనల నెవరైనా రంజింప జేయాలని రకరకాలైన వినోదములు, వేడుకలు కావాలని కోరుకొంటాం. గురువులను, మతమునకు సంబంధించిన కార్యకలాపములను, ప్రార్థనలను లేదా అధునాతనమైన నవలలను ఆశ్రయిస్తాం. మనం మన ఆంతరిక జగత్తులో ఏకాకుల మవడంచేత - ఒంటరితనాన్ని అనుభవిస్తూ వుండడంచేత - బాహ్య జగత్తులో కేవలం ప్రేక్షకులంగానే వుండిపోతాం. అట్లుగాక మనం మన ఒంటరితనాన్ని అర్థం చేసికొని, దానిని అతిక్రమించి ముందుకుపోతే అప్పుడు మాత్రమే మనమీజీవితంలో స్వతంత్రులమగు నటులమౌతాం, ఆట ప్రదర్శించే ఆటగాళ్ళమవుతాం.

ఇంతకున్నూ ఎక్కువమంది ప్రజలు ఒంటరి జీవితమెట్లు నడుపు కొనవలెనో తెలియకనే పెండ్లిండ్లు చేసికొంటారు. ఇంకా యితర విధ ములైన సాంఘిక సంబంధాల కోసం ప్రయత్నిస్తారు. అయితే మనిషి పెండ్లి చేసికోకుండా ఒంటరి జీవితమే నడుపవలెనని కాదు. కాని ప్రేమ లభిస్తుందని పెండ్లి చేసికొన్నా, జీవితంపై విసుగుపుట్టి మీరు చేసే వుద్యోగాన్ని మనోరంజనకొక సాధనంగా వుపయోగించుకొంటున్నా అప్పుడు మీ జీవితమంతా కేవలము కాలక్షేపముల కోసమై చేసే అంతులేని అన్వేషణయైనట్లు గమనింపగలరు. ఒంటరితనము వలన కలిగే యీ విల క్షణమైన భయమును అతిక్రమించి పోగల్గినవారు చాలా తక్కువమంది. కాని దీనిని అతిక్రమించి పోవడం చాల అవసరం. అట్లు అతిక్రమించి పోగల్గినవారే దానికావలనున్న అమూల్య నిధిని పొందగలవారు.

ఒంటరితనానికిన్ని, ఏకాంతవాసానికిన్ని చాల వ్యత్యాసమున్నది – మీకు తెలుసునా? కొందరు బాల విద్యార్థులకు ఒంటరితనమంటే యేమిటో యింకా తెలియకపోవచ్చు. కాని వయస్సు వచ్చిన పెద్దవారికది తెలిసిన విషయమే. ఒంటరితనమంటే అందరితోను అన్నిటిలోను సంబం ధము తెగిపోయినట్లనిపించడం, తగిన కారణం లేకుండానే అకస్మాత్తుగా భయమావహించడం. మనస్సు తాను దేనిమీదను ఆధారపడలేనని తన కే ఆధారమున్ను లేదని, తనలో క్రమ్ముకొని వచ్చుచున్న శూన్యతా భావాన్ని ఏ కాలక్షేపమున్ను తొలగించలేదని గ్రహించిన క్షణమునందు దానికి భయముయొక్క తీవ్రత యెట్టిదో తెలుస్తుంది. అదే ఒంటరితన మంటే. కాని ఏకాంతమనేది దీనికి పూర్తిగా భిన్నమైనది. అది ఒంట రితనాన్ని జాగ్రత్తగా పరీక్షించి చూచి అనుభవంద్వారా దానిని అర్థము చేసికొంటే వచ్చెడి విముక్తస్థితి. అట్టి స్థితిలో మీరు ఇంద్రియ సుఖం కోసం, హాయిగా సకలసౌకర్యాలతో జీవించడంకోసం, ఆత్మ తృప్తికోసం ప్రాకులాడరు. కాబట్టి మానసికంగా మీ రెవరిమీదను, దేనిమీదను ఆధా రపడరు, పడనవసరంలేదు. అప్పుడు మాత్రమే మనస్సు సంపూర్ణమగు ఏకాంతస్థితిలో నుంటుంది. అట్టి మనస్సే సృజనాత్మకమైనది.

మన అందరికీ తెలిసినదేయైన యీ ఒంటరిపాటు యొక్క వ్యథను, యీ విలక్షణమైన శూన్యతానుభూతిని ఎదుర్కొనడం, అది వచ్చినప్పుడు భయపడకుండడం, రేడియో పెట్టుకోవడమో, సినిమాకు పారిపోవడమో లేదా ఏదో పనిలో నిమగ్నమై పోవడమో చేయకుండ, దానివైపు మనదృష్టిని పోనిచ్చి పరీక్షించి చూచి, దాని లోతుపాతులు తెలిసికోవడం, దానిని పూర్తిగా అర్థం చేసికోవడం — ఇదంతా విద్యలో నొకభాగము. వణుకు పుట్టించే ఆ వ్యథను, ఆ యారాటమును చవిజూడని మానవుడు ఇంతవరకు లేడు, ఇకమీదట ఉండబోడు. కామసుఖము, దేవుడు, వివిధములైన పనులు, మద్యపానము, కవితలల్లడము, కంఠస్థము చేసిన పదములను కొన్నిటిని మాటిమాటికి ఉచ్చరించడము -- భజనలు చేయడము ఇటువంటి వివిధ కాలక్షేపముల ద్వారా, వాటి వలన కలిగెడి ఆత్మతృప్తి ద్వారా ఒంటరిపాటు వ్యథనుండి పారిపో జూస్తుంటాము. కాబట్టి ఆ వ్యథ, ఆ యారాటము మనల నావహించినపుడు దానిని మనమెన్నటికిని అర్థముచేసికొనము.

అందుచేత, ఒంటరిగా వుండడం వలన వచ్చే బాధనుండి తప్పించుక పారిపోదామనే ఆలోచన పెట్టుకోకుండ, దానిని ఎదుర్కొని, పరీక్షించి చూడండి. మీరు పారిపోతే, దానిని మీ రెప్పటికిని అర్థము చేసికోలేరు. అది మీ కోసం ఒకమూలన ఎప్పటికిని కాచుకొనే వుంటుంది. అట్లుగాక ఆ ఒంటరిపాటును అర్థం చేసికొని, దానిని దాటి ముందుకుపోగల్గితే అప్పుడు మీకు పారిపోవలసిన అవసరమే కనబడదు. ఆత్మతృప్తికోసం, మనోరంజనం కోసం ఆరాటపడరు. ఎందువల్లనంటే, మీ మనస్సు అవినాశ్యమైన అమూల్యమైన అక్షయమైన సంపదనొకదానిని కనుగొన్నది!

ఇదంతా విద్యలో నొక భాగము. బడిలో మీరు మీ పరీక్షలలో పాసవడం కోసమై మీ పాఠాలను మాత్రం చదువుతూ వుంటే. అప్పుడా చదువే ఒంటరితనమునుండి తప్పించుకోడానికి ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. కొంచెమాలోచిస్తే ఈ విషయం మీకే తెలు

స్తుంది. మీ విద్యా బోధకులతో ఈ విషయమై చర్చించండి — వారెంత ఏకాకులుగా నున్నారో, మీరెంత ఏకాకులుగా నున్నారో మీకే తెలుస్తుంది. కాని ఎవరైతే ఆంతరికంగా ఏకాంతమందున్నారో, ఎవరి మనో హృదయములు ఒంటరితనము వలన కలిగెడి వ్యథనుండి విముక్తములో వారే నిజమైన మానవులు; వారే సత్యమును సాక్షాత్కరింపజేసి కొనగలరు; త్రికాలాబాధితమైనదేదో దానిని పొందగలరు.

1. ప్రశ్న:- ఎఱుక (awareness) *కును. సంవేదనశీలత* (sensitivity) *కును గల భేదమేమి?*

కృష్ణమూర్తి:- అసలా రెండింటి మధ్యను ఏమైన భేదమున్నదా యని నా అనుమానము. చూడండి, మీరొక ప్రశ్న వేసినప్పుడు మీయంతట మీరే అందలి సత్యమును కనుక్కోడం ముఖ్యం. అంతేగాని ఎవరో చెప్పినదానిని గ్రుడ్డిగా అంగీకరించడం కాదు ముఖ్యం. అందువలన ఎఱుక గలిగివుండడమంటే యేమిటో మనం కలిసి విచారిద్దాం.

వర్షము కురిసి వెలిసిన పిదప నిగనిగలాడుతూ వున్న ఆకులతో అందంగా వున్న చెట్టును మీరు చూస్తారు. నీళ్ళమీదను, రంగురంగుల పక్షుల యీకలమీదను మిలమిల మెరుస్తూవున్న సూర్యకాంతిని చూస్తారు. బరువైన మూటలను నెత్తిపై పెట్టుకొని పట్టణానికి నడిచిపోతూవున్న గ్రామీణులను చూస్తారు. వారు పకపక నవ్వుకోడం వింటారు. కుక్క మొఱుగడం వింటారు; అంబాయని దూడ తల్లిని పిలవడం వింటారు. ఇదంతా యెఱుకలోని ఒక భాగమే. అదంతా మీ చుట్టు ప్రక్కల నున్న పరిసరముల గురించిన యెఱుక, కాదా? ఇంకా దగ్గరికి వచ్చి చూస్తే, ప్రజలతోను, వివిధములైన అభిప్రాయాలతోను, రకరకాల వస్తువులతోను మీకు గల సంబంధమెట్టిదో మీరు గమనిస్తూ వుంటారు. ఉండే యింటిని, నడిచే బాటను మీరేదృష్టితో చూసేదిన్నీ మీరు గమనిస్తూ వుంటారు. ప్రజలు మిమ్ము అనే మాటలకు మీ ప్రతిక్రియ

లెట్లావుంటాయో, మీ మనస్సు ఎల్లప్పుడు ప్రతిదానికిని విలువ గట్టడం, మంచిచెడ్డలు నిర్ణయించడం, ఒక దానిని మరియొక దానితో పోల్చడం, తప్పని నిందించడం — ఇవన్నీ ఎట్లా చేస్తూ వుంటుందో మీరు గమనిస్తూనే వుంటారు. ఇది గూడ మీ యెఱుకలో నుండేదే, దానిలోని ఒక భాగమే. ఈ "ఎఱుక" పైపై వాటితో ఆరంభించి, లోలోతుకు పోతూ వుంటుంది. కాని మనలో చాలమందికి గల ఎఱుక ఎక్కడనో ఒక చోట ఆగిపోతుంది. ఏవేవో చప్పుళ్ళు, పాటలు, అందమైన దృశ్యాలు, అందంకాని దృశ్యాలు - ఇట్లాంటి వెన్నో వింటూ, చూస్తూ వుంటాము. కాని వాటికి మన ప్రతిక్రియలు ఎట్లా వుంటాయో అవి మన యెఱుకలోకి రావు. "అది అందంగా వున్నది" లేదా "అది అందవికారంగా వున్నది" అంటూ మనము వాటిని దాటవేసికొని పోతాం. కాని అందమంటే యేమిటో అందవికారమంటే యేమిటో మనము విచారించం. వాస్తవానికి, ప్రేరణలకు మీ ప్రతిక్రియ లెట్లా వుంటున్నాయో చూడడంగాని, మీ ఆలోచనయొక్క ప్రతి కదలికను, పోనుపోను, ఎక్కువ జాగ్రత్తగా గమనించడంగాని, మీ తల్లిదండ్రులు, మీ ఉపాధ్యాయులు, మీ జాతి, మీ సంస్కృతి — వీటి అన్నిటి ప్రభావముచే మీ మనస్సు లెట్లా మలచబడుతున్నాయో తెలిసికొనడంగాని — ఇదంతా ఎఱుకలోని భాగమే కాదా?

మనస్సు తన ఆలోచనాస్రవంతిలోనికి ఎంత లోతుగా దిగిపోయి చూస్తుందో అంత స్పష్టంగా వివిధ రూపాలలోనున్న తన ఆలోచనలన్నీ సంప్రదాయాదుల చేత నిబద్ధములైనవని, గ్రహింపగలదు. ఆ యవగాహనతో మనస్సు సహజంగా — తనకు తానే — నిశ్చలమైపోతుంది. అంటే మనస్సు నిద్రలోకి జారుకొంటుందని కాదు. పైగా, మనస్సప్పుడు అసాధారణమైన అప్రమత్తత కలిగి వుంటుంది, నిత్యాజాగ్రదవస్థలో వుంటుంది. దానినింక మంత్రములు గాని, జపములు గాని, క్రమశిక్షణ గాని మత్తులోకి దిగజార్చలేవు. మౌనముతో గూడిన ఈ అప్రమత్తత (alertness) గూడ ఎఱుకలోని భాగమే. ఇంకను మీరు లోతుగా పోయి

చూస్తే ఎఱుకగల వ్యక్తికిని, దేనిగురించిన యెఱుక గల్గి యున్నాడో దానికిని మధ్య భేదము లేదని గూడ తెలిసికొనగలరు.

సరే, మరి సంవేదనశీలత అంటే యేమిటి? రంగును రూపమును గుర్తించడం, ప్రజలు ఏమంటారో దానికి మీ ప్రతిస్పందన మెట్లుం టుందో గ్రహించడం, ఇతరులయెడ సానుభూతి కలిగి వారి కష్టసుఖా లను పట్టించుకోవడం, ఉత్తమాభిరుచి కలిగి యుండడం, శిష్టాచారమును (good manners) పాటించడం, మొరటుగా ప్రవర్తించక పోవడం, ఎవరి నైనా సరే శారీరికంగాగాని, మానసికంగాగాని హింసించక పోవడం, అట్లు హింసించాలనే ఆలోచన గూడ లేకపోవడం, ఏదైనా అందమైన వస్తువును చూచి అట్లే చూస్తూ వుండిపోవడం, ఎవరైనా ఏదైనా చెప్పుతూవుంటే, విసుగు చెందకుండా, వారు చెప్పినదంతా పరీక్షా దృష్టితో వినడం, తద్వారా మనస్సు సూక్ష్మము, సునిశితమున్నూ అవడం — ఇదంతా సంవేదనశీలత కాదా? కాబట్టి సంవేదనశీలతకున్నూ ఎఱుకకున్నూ పెద్ద తేడావున్నదా? ఉన్నదని నేను అనుకోను.

చూడండి, మీ మనస్సు నిందిస్తూ, తప్పొప్పులు నిర్ణయిస్తూ, అభి ప్రాయాలు ఏర్పఱచుకొంటూ, తీర్మానాలు చేసికొంటూ వున్నంతకాలము అది సంవేదనశీలమూ కాదు, ఎఱుక గలదిన్నీకాదు. మీరు మనుషులయెడ మొరటుగా ప్రవర్తిస్తూవుంటే, పువ్వులు త్రుంచి వాటిని దూరంగా పార వేస్తూవుంటే, జంతువులకు బాధకలిగిస్తూ వుంటే, కుర్చీలు, బెంచీలు మొదలగు వానిమీద మీ పేర్లు చెక్కుతూవుంటే, కుర్చీలకాళ్ళు విరగగొ ట్టుతూ వుంటే, భోజనానికి వేళకు పోకుండా ఆలస్యంగా పోతూవుంటే, మామూలుగా మంచి మర్యాదా లేకుండా చెడ్డగా ప్రవర్తిస్తూవుంటే, అదంతా మీలో సంవేదనశీలత లేకపోవడాన్నే సూచిస్తుంది, కొరదుపారిన మనస్తత్వాన్ని తెలియచేస్తుంది — ఏమి తెలియజేయదంటారా? అది అప్ర మత్తంగా వుండి తగినట్లు సర్దుకపోవడం చేతగాని మనస్సును సూచిస్తుంది. మృదు స్వభావము కలిగి సంవేదన శీలుడవడంలో విద్యార్థికి విద్య తోడ్పడ వలసి యున్నది. విద్యలో అదియొక ముఖ్య భాగము. సంవేదనాపర్యుడైన

విద్యార్థి దేనినీ గ్రుడ్డిగా అనుసరించడు, దేనినీ గ్రుడ్డిగా వ్యతిరేకించడు. జీవిత గమనమునంతను మెలకువతో గమనిస్తూ వుంటాడు. కొరడుపారిన మనస్తత్త్వంగల వారికంటె మృదుస్వభావము గలవారు జీవితంలో బహుశా యెక్కువ బాధలను అనుభవింపవలసి రావచ్చు. కాని వారు తమ బాధానుభవాన్ని అర్థంచేసికొని, దానిని దాటి ముందుకు పోగల్గినచో వారు అద్భుత విషయాలను దర్శింపగలరు.

2. ప్రశ్న:- ఎవరైనా కాలుజారి పడితే మనమెందుకు నవ్వుతాము?

కృష్ణమూర్తి:- అది యొక విధమైన కొరడుపారిన మనస్తత్త్వం కాదా? 'సేడిజమ్' అనేది కూడ ఒకటి కలదు. ఆ మాటకు అర్థమేమిటో తెలుసునా? మార్క్విస్ డి సేడ్ అనే ఒక ఫ్రెంచి రచయిత 1814లో ఒక నవల వ్రాసినాడు. అందులో నొకపాత్ర మనుష్యులను హింసించి వాండ్లు బాధపడుతూవుంటే చూచి తాను ఆనందిస్తూ వుంటుంది. దానిని బట్టి ఆ రచయిత పేరుమీదుగా సేడిజం అనేమాట వచ్చింది. ఆ మాటకు అర్థమేమంటే యితరులు బాధపడుతుంటే చూచి తాను ఆనందించడం. కొంతమంది మనుష్యలకు ఇతరులు బాధపడుతుంటే చూచి ఒక వింత తృప్తి కలుగుతుంది. మీలో ఈ స్వభావముందేమో బాగా పరిశీలించి చూచుకోండి. అది పైకి కనబడకపోవచ్చు. కాని అది వున్నట్లయితే, యెవరైనా పడిపోయినప్పుడు నవ్వుదామని బుద్ధి పుట్టడంలో అది వ్యక్తమవుతుంది. అధి మీరు గమనించవచ్చు. ఉన్నత స్థితిలో నున్న వారిని క్రిందికిలాగి పడగొట్టుదామని మీకు బుద్ధి పుడుతుంది. ఇతరులను విమర్శిస్తారు, వాండ్లను గురించి లేనిపోని మాటలు చెప్పకొంటారు. ఇదంతా కొరడుపారిన మనస్తత్త్వాన్ని, ఇతరులను హింసించుదామనే ఒక విధమైన కోరికను సూచిస్తుంది. కొందరు కావలెనని పగబట్టి ఇతరులకు హాని కలిగిస్తారు. మరికొందరు తెలియక, అనాలోచితంగా, ఏదో ఒక మాట అని, ఒక సైగ చేసి, లేదా ఒక చూపుచూచి హాని కలిగించవచ్చు. కాని ఏ విధంగా హాని కల్గించినా అందులో ఇతరులను

హింసించుదామనే ప్రేరణ అంతర్గతంగా వుంటూనే వుంటుంది. ఈ విధంగా విపరీతమార్గాన ఆనంద మనుభవిద్దామనే కోరికను మనలో చాల తక్కువమంది మాత్రమే పూర్తిగా సమూలంగా మానుకోగలరు.

3. ప్రశ్న:- మా ప్రొఫెసరుగారొకరు మీరు చెప్పే విషయాలు పూర్తిగా ఆచరణ యోగ్యములు కావని అంటారు. *120* రూపాయల జీతంమీద ఆరుగురు మగపిల్లలను, ఆరుగురు ఆడపిల్లలను పెంచి పెద్ద చేయుమని మిమ్మలిని సవాలు చేస్తున్నారు. ఈ విమర్శకు మీ సమాధానమేమి?

కృష్ణమూర్తి:- మొట్టమొదటిది, నాకేగనక 120 రూపాయల జీతమే అయినట్లయితే నేను ఆరుగురు మగపిల్లలను, ఆరుగురు ఆడపిల్లలను అసలు కననే కనను. ఇక రెండవది, నేనొక ప్రొఫెసరును అయినట్టయితే నాపనికి నేను అంకితమైపోతాను. అంతేగాని దానినొక నౌకరీగా, ఒక ఉద్యోగంగా భావించను. ఈ రెంటికిన్ని గల తేడా మీకు తెలుస్తుందా? ఏ స్థాయిలోనైనా సరే విద్యాబోధనము ఒక వృత్తిగాదు, కేవలం కూలీకోసం చేసే పనికాదు. అది ఒకదానికి అంకితమై పోవడం. 'అంకిత' మనేపదానికి అర్థం మీకు తెలునునా? అంకితమవడమంటే దేనికో ఒక దానికి సంపూర్తిగా, బదులు కోరకుండా, తన్నుదాను సమర్పించుకోవడం; ఒక యతిలాగా, ఒక తపస్విలాగా, ప్రసిద్ధులైన గొప్ప విద్యాబోధకులలాగా, గొప్ప విజ్ఞానవేత్తలలాగా జీవించడం. అంతేగాని, ఏవో కొన్ని పరీక్షలు పాసై తమ్ముదాము ప్రొఫెసర్లమని చెప్పకొనే వారిలాగా జీవించడం కాదు. నేను మాట్లాడేది విద్యాబోధనకై తమ్ముదాము అంకితము చేసికొన్నవారి గురించి, డబ్బుకోసం గాకుండా, అది తాము కోరుకొన్న వృత్తి కాబట్టి, దానియందు తమకు ప్రేమవున్నది కాబట్టి ఉపాధ్యాయులైన వారి గురించి. అటువంటి ఉపాధ్యాయులెవరైనా వున్నట్టయితే వారు నేను మాట్లాడే విషయాలన్నీ బాలబాలికలకు మిక్కిలి ఆచరణ యోగ్యమగు రీతిలో బోధింపవచ్చునని తెలిసికోగలరు. ఎవరికైతే

విద్యా బోధనము కేవలం జీవనాధారాన్ని సంపాదించుకోడానికి పనికివచ్చే ఉద్యోగంగా, నౌకరీగా వుంటుందో అటువంటి ఉపాధ్యాయులు, విద్యాబోధకులు, ప్రాచార్యులు (ప్రొఫెసర్లు) మాత్రమే నేను చెప్పే విషయాలు ఆచరణ యోగ్యములు కావని చెబుతారు.

ఇంతకున్నూ ఆచరణయోగ్యమంటే యేమిటి? ఆలోచించి చూడండి. ఇప్పుడు మనము జీవిస్తున్న పద్ధతి, విద్య బోధిస్తున్న పద్ధతి, మన ప్రభుత్వములు అవినీతితోను, అంతములేని యుద్ధములతోను నడుపబడుతున్న రీతి — ఇవన్నీ ఆచరణ యోగ్యములంటారా మీరు? పేరాశ (ambition), ఆచరణయోగ్యమా? అత్యాశ (greed) ఆచరణ యోగ్యమా? పేరాశవలన స్పర్ధలు పోటీలు పెరుగుతాయి; దానితో మానవత నశిస్తుంది. మానవులకు నష్టం కలుగుతుంది. అత్యాశ మీదను సంగ్రహణశీలత మీదను, అధికారదాహము మీదను ఆధారపడి కొనసాగే సంఘములో యుద్ధపిశాచము ఎల్లప్పుడు పొంచివుంటుంది. ఘర్షణ, దాని వెంబడి దుఃఖానుభవము తప్పదు. ఇదంతా ఆచరణ యోగ్యమేనా? కాదనుట స్పష్టంకదా. ఆ విషయమే నా యీ అన్ని ప్రసంగాలలోను మీకు తెలియజెప్పడానికై ప్రయత్నిస్తున్నాను.

ప్రపంచంలో ప్రేమ యొక్కటే మిక్కిలి ఆచరణ యోగ్యమైనది. ప్రేమించడము, దయార్ద్ర చిత్తుడై వుండడము, అత్యాశకు పోకపోవడము, పేరాశలు పెట్టుకోకుండడము, ఇతరుల ప్రభావమునకు తలయొగ్గకుండ స్వయంగా ఆలోచించుకోవడము — ఇవన్నీ పూర్తిగా ఆచరణ యోగ్యములైన పనులు. ఇవియే ఆచరణ ప్రధానమును ఆనందమయమును అగు సమాజమును సృష్టింపగలవు. కాని ఏ యుపాధ్యాయుడైతే తన వృత్తికి దాను అంకితము కాడో, ఎవడైతే ప్రేమించడో, ఎవడైతే తనపేరు చివర కొన్ని అక్షరాలు తగిలించుకొని కేవలం పుస్తకాలనుండి గ్రహించిన సమాచారాన్ని పిల్లల కందించే వ్యాపారంకొనసాగిస్తూ వుంటాడో, అతడు మాత్రమే ఇదంతా ఆచరణ సాధ్యముకాదని చెబుతాడు. అందుకు కారణము అతడు దీనిగురించి అసలు ఆలోచించకపోవడమే.

స్వతంత్రంగా నిలబడడం బొత్తిగా చేతగానట్టి, ఏ సమస్యనైనా సరే స్వతంత్రంగా ఆలోచించుకొనలేనట్టి పౌరులను తయారుచేయు నేటి నామమాత్ర విద్యా విధానము యొక్క అసమంజసమగు, అస్తవ్యస్తమగు ఆచరణ యోగ్యత కంటే, ప్రేమించడమనేది ఎన్నోమడుంగు లెక్కువగా ఆచరణ యోగ్యమైనది.

చూడండి, ఆ మూల నున్నవారు కొందరు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వుండడాన్ని మనం గమనిస్తూనే, మన గాంభీర్యాన్ని వదలక కొనసాగించడమున్ను ఎఱుకలో నొకభాగమే.

పెద్దవాండ్లతో వచ్చిన కష్టమేమంటే, వాండ్లు తమ జీవిత సమస్యనే తాము పరిష్కరించుకోలేక పోయినా, మీతో "ఏది ఆచరణ యోగ్యమో ఏది కాదో మేము మీకు చెబుతాము, రండి" అని అంటారు. ఉపాధ్యాయవృత్తి యీదినములలో అధమ వృత్తిగా పరిగణింప బడుతున్నా, నిజానికది జీవితంలో అన్నిటికంటె ఉత్తమమైన వృత్తి. అంతకంటే ఉన్నతమైనది, ఉత్కృష్టమైనది, పవిత్రమైనది మరి యొకటిలేదు. కాని ఉపాధ్యాయుడు పూర్తిగా దానికి అంకితమై పోవాలి. తన్నుదాను పూర్తిగా సమర్పించుకోవాలి, తన మనస్సుతో తన హృదయంతో తన జీవిత సర్వస్వంతో విద్యాబోధనము గావించాలి. అట్టి అంకితభావమున్నచోట ఏదైనా సంభవమే — సంభవము కానిదంటూ వుండదు.

4. ప్రశ్న:- ఆధునిక ప్రపంచంలోని విలాస వస్తువుల ప్రభావముచేత మేము విద్యను పొందుతున్న సమయంలోనే వినాశమును గూడ పొందుతున్నట్లయితే, అట్టి విద్యవలన గలుగబోవు ప్రయోజనమేమి?

కృష్ణమూర్తి:- మీరు మీ ప్రశ్నలో సరియైన పదములను ఉపయోగించ లేదేమో యని భయపడుతున్నాను. ప్రతివానికిని కొంతసుఖము, కొంత సౌకర్యము కావాలి, అక్కర లేదా? మనమొక గదిలో ప్రశాంతంగా కూర్చుండినప్పుడు, ఆ గదిలో ఒక్క చాపతప్ప మరేసామాను

లేకపోయినా, అది శుభ్రంగా, నీటుగా వుంటే బాగుంటుంది. దాని కొలతలు ఒకదాని కొకటి అనురూపముగా వుండాలి. తగిన పరిమాణంలో కిటికీలుండాలి. ఆ గదిలో ఏదైనా పటమున్నట్లయితే అది అందంగా వుండాలి. ఆ గదిలోని పూలపాత్రలో పూవులున్నట్లయితే అవి వానిని తెచ్చి పెట్టిన వ్యక్తియొక్క మంచి మనస్సును ప్రతిఫలింప జేయాలి. ఎవ రికైనా తినడానికి మంచి తిండి వుండాలి. నిద్రించడానికి ప్రశాంతమైన ప్రదేశం ఉండాలి. ఇవన్నీ ఆధునిక ప్రపంచం ప్రసాదించిన సౌకర్యములు. ఈ సౌకర్యములవలన కలిగే సుఖం విద్యావంతు డనబడేవానిని చెడగొ ట్టుతుందా? లేక విద్యావంతు డనబడేవాడే తన పేరాశ, తన అత్యాశ ద్వారా ప్రతి మానవునికుండే మామూలు సుఖ సౌకర్యములను గూడ చెడగొట్టుతున్నాడా? అభివృద్ధి చెందిన దేశాలలో ఆధునిక విద్య మను జులను భౌతిక వాదులనుగా మార్చివేయడంచేత, అన్ని సౌకర్యములతో గూడిన భోగమయ జీవితము, అది యేరూపములోనున్నను, మనస్సును కలుషితముచేసి, నశింపజేస్తుంది. ఇక భారతదేశములాంటి బీద దేశము లలో బోధింపబడే విద్య సరిక్రొత్త సంస్కృతిని సృష్టించడానికి మిమ్ము ప్రోత్సహించడం లేదు. క్రాంతివాదు లగుటకై మీకు తోడ్పడడము లేదు. క్రాంతివాదులు కావడమంటే, నా వుద్దేశమేమిటో నేనిదివరకే వివరించియున్నాను. అది బాంబులు విసరడం కాదు, హత్యలు చేయ డంకాదు. అట్లా చేసేవారు నిజమైన క్రాంతివాదులుకారు. నిజమైన క్రాంతివాది యెవరంటే వివిధవిధ ప్రలోభనముల నుండి విముక్తుడు, సమాజము యొక్క ఆదర్శముల నుండి విముక్తుడు. సమాజమనగా పెక్కుర సమష్టి సంకల్పమునకు వ్యక్తరూపము, దాని బంధములనుండి విముక్తుడైనవాడే క్రాంతివాది. అట్టి క్రాంతివాది కావడానికై మీరు చదివే చదువు తోడ్పడడం లేదు. పైగా సమాజమున కనుకూల ముగా పొమ్మని, లేదా, అంతగానయితే దానిలో కొంత సంస్కారము, కొంతమార్పు మాత్రం తేవచ్చునని బోధిస్తుంది.

కాబట్టి మీరు పొందుతున్న విద్య కాని విద్య మిమ్ము వినాశ

పథమువైపు తీసికొనిపోతూ వున్నది గాని ఆధునిక ప్రపంచ మొసంగిన సుఖసాధనములు కాదు. కార్లు, మంచిరోడ్లు ఎందుకుండ గూడదు? కాని చూడండి, ఆధునిక సాంకేతిక విద్య, నూతన యంత్రసామగ్రి అన్నీగూడ అటు యుద్ధానికైనా ఉపయోగపడుతున్నాయి లేదా, ఇటు కేవలం వినోదం కోసం, తమనుండి తాము తప్పించుకొని పారిపోవడం కోసం ఉపయోగపడుతున్నాయి. అందువలన మనస్సు నూతన యంత్ర పరికరముల మధ్య మరుగుపడి పోతున్నది. వంట చేయడానికి, గదులు ఊడ్వడానికి, గుడ్డలు ఇస్త్రీ పట్టడానికి, లెక్కలు వేయడానికి ఇంకా యిటువంటి అవసరమైన రకరకాల పనులెన్నో చేయడానికి ఉపకరించే నూతన యంత్రపరికరాలను, యంత్రాలను, వాటి విడిభాగాలను నిర్మించడమే ఆధునిక విద్యయంటే. ఇటువంటి యంత్రపరికరాల వలన ఆ యా నిత్యావశ్యక కార్యములను చేసికొనడంలో మనకు కాలము కలిసి వస్తున్నది, ఆ పనులు చేసికోవడం తేలికవుతున్నది గూడ. పూర్తిగా క్రొత్తదైన క్షేత్రంలో మన మనస్సు పనిచేయడానికి గాను దానికి కొంత తీరుబాటు లభించడం కోసం, ఆయా యంత్ర పరికరము లుండవలసినదే. కాని, వాటిమధ్య చిక్కుకొని మన మనస్సు దారితప్పరాదు.

5. ప్రశ్న:- నా ఒడలి చర్మము చాల నల్లగా వుంటుంది. కనీసం చామన చాయ రంగైనట్టయితే చాలమంది మెచ్చుకొంటారు. నేను వాండ్ల మెప్పును ఎట్లు పొంద గలను?

కృష్ణమూర్తి:- మీ చర్మం రంగును మార్చడానికి సహాయపడేవి, మీ ముఖానికి వన్నెదెచ్చేవి వేరే మైపూతలు, క్రీములు, పరిమళ ద్రవ్యములు వుంటాయని నానమ్మకం. కాని దానితో మీ సమస్య తీరుతుందా? ఇంకా ప్రజలమెప్పు పొందాలనే కోరిక, సంఘంలో గొప్పగా వుండాలనే కోరిక వుంటూనే వుంటుంది. పదవి కోసం, ప్రతిష్ఠకోసం ప్రాకులాడుతూనే వుంటారు. మెప్పుదల కావాలని కోరుకోవడంలో, ప్రాముఖ్యం కోసం ప్రాకులాడడంలో దుఃఖచ్ఛాయలు గాలంలాగా పట్టుకొని వదలవు. మీరు

సంఘంలో మెప్పుదల పొందాలని, ప్రముఖులు కావాలని కోరుకొంటూ వున్నంతకాలము మీరు చదువుకొనే చదువు మిమ్ము నాశనం చేస్తుంది. అది, క్రుళ్ళి భ్రష్టమైపోయిన యీసంఘంలో ఒక స్థానాన్ని పొందడానికి మీకు సహాయపడి, తద్వారా మిమ్ము నాశనం చేస్తుంది. మనము మన లోభము, మన అత్యాశల ద్వారా, మన ఈర్ష్యాసూయల ద్వారా, మన భయాల ద్వారా యీ వినాశకరమైన సంఘాన్ని సృష్టించినాము. దాని గురించి మాకు తెలియదంటూ దాటవేసినా, అదంతా భ్రమ భ్రాంతి అని అంటూ త్రోసివేసినా, ఆ సంఘములో మార్పు రాబోదు; అది మారదు. కేవలము సరియైన విద్యమాత్రమే అత్యాశను, భయమును అధికార దాహమును మన మనస్సుల నుండి తుడిచి వేయగలదు; అప్పుడు మనము సరిక్రొత్త సంస్కృతికి పునాదివేయగలము, నూతన ప్రపంచాన్ని స్థాపింపగలము. దీని కంతకును మూలమగు సరియైన విద్య, — మన మనస్సు తన్నుదాను నిజంగా అర్థము చేసికొనగోరితే, భయమునుండి విముక్తిని పొందగోరితే, — అప్పుడు మాత్రమే సాధ్యము.

1 ఫిబ్రవరి, 1955

10

క్రమశిక్షణ — శక్తిక్షీణత

మనకున్న చాల పెద్ద సమస్యలలో నొకటి క్రమశిక్షణ సమస్య. ఇది నిజంగా చాల చిక్కుతో గూడిన సమస్య. చూడండి, సంఘము ప్రతిపౌరుని అదుపులో పెట్టవలెనని, క్రమశిక్షణలో వుంచవలెనని, కొన్ని ధార్మిక సాంఘిక నైతికార్థిక మర్యాదల ననుసరించి అతని మనస్సును మలచవలెనని అనుకొంటుంది.

అయితే మరి, క్రమశిక్షణమనేది అసలంటూ అవసరమా? వెంటనే అవును, కాదు అని చెప్పకండి; ముందు దయచేసి జాగ్రత్తగా వినండి. మనలో చాలమంది, ముఖ్యంగా మనం చిన్నపిల్లలంగా వున్నప్పుడు, అసలు క్రమశిక్షణ అనేది ఉండగూడదని, ఎవరి యిష్టం వచ్చిన పని వారిని చేసికోనివ్వాలని, అదే స్వతంత్రమని అనుకొంటాము. కాని, క్రమశిక్షణ సమస్యనంతను పూర్తిగా అర్థము చేసికోకుండా, ఊరక, క్రమశిక్షణ ఉండాలని, లేదా అక్కరలేదని, మనం స్వతంత్రంగా వుండాలని ఇట్లా చెప్పడంలో అర్థమేమున్నది?

శ్రద్ధగల క్రీడాకారుడెల్లప్పుడు తన్నుదాను క్రమశిక్షణలో పెట్టుకొంటూ వుంటాడు, నిజంకాదా? ఆటలాడడంలో అతనికి కలిగే ఆనందము, అందుకు తన్ను యోగ్యునిగా చేసికోవలసిన ఆవశ్యకత — వీటి మూలాన అతడు పెందలకడ నిద్రపోతాడు, పొగత్రాగడం మానివేస్తాడు, సరియైన తిండి తింటాడు. మామూలుగా పాటించవలసిన ఆరోగ్య నియమాలనన్నిటిని పాటిస్తాడు. అతడు పాటించే క్రమశిక్షణ ఇతరుల చేత విధింపబడినది కాదు, దానితో అతనికి ఘర్షణ లేదు; క్రీడలలో అతనికిగల అభిరుచి ఆనందముల యొక్క సహజ ఫలితమే

యిది.

సరే, మరి మానవునిలోని శక్తిని క్రమశిక్షణ హెచ్చిస్తుందా, తగ్గిస్తుందా? ప్రపంచమంతటా మానవులు ఏ మతానికి చెందినవారైనా, ఏ వేదాంత సంప్రదాయానికి చెందిన వారైనా తమ మనస్సుపై తాము క్రమశిక్షణను విధించుకొంటారు, తమ మనస్సును తాము అనుశాసించుకొంటారు. అంటే అందులో అదుపులో పెట్టుకోవడం, నిరోధించడం, సరిదిద్దుకోవడం, అణగద్రొక్కడం ఇవన్నీ వుంటాయి. మరి యిదంతా అవసరమేనా? ఈ క్రమశిక్షణ వలన, ఈ అనుశాసనమును పాటించడం వలన మానవశక్తి వృద్ధి పొందేటట్టయితే అప్పుడది వుండవలసినదే. అప్పుడా క్రమశిక్షణకు అర్థమున్నట్లే. కాని అది మానవశక్తిని కేవలం అణచి వేసేటట్టయితే అప్పుడది చాల ఘోనికరము, వినాశకరము. మన అందరిలోను శక్తి వున్నది. కాని యిప్పుడు ప్రశ్న యేమంటే, ఆ శక్తిని క్రమశిక్షణ ద్వారా ఇంకను బలవత్తరము, సమృద్ధము, అధికము చేయగలమా లేక మనకున్న శక్తిని కాస్తా ఆ క్రమశిక్షణ నాశనం చేస్తుందా యని. ఇదే ప్రధాన సమస్యయని నేననుకొంటున్నాను.

చాలామంది మనుష్యులకు ఎక్కువ శక్తి వుండదు. వాండ్లకున్న ఆ కొంచెం శక్తిని వారున్న సమాజము తన విద్యావిధానంతో, అదుపాజ్ఞలు, బెదరింపులు, నిషేధముల ద్వారా అణచివేసి, నశింపజేస్తుంది. తత్ఫలితంగా, వారా సమాజములో చైతన్యములేని అనుకరణ శీలురైన పౌరులుగా జీవిస్తారు. పోనీ, ఆరంభంలో మరికొంత యెక్కువగా శక్తిగల వ్యక్తికి ఈ క్రమశిక్షణ వలన ఏమైనా మేలు కలుగుతుందా? అతని శక్తి వృద్ధి అవుతుందా? అది అతని జీవితాన్ని సమృద్ధము, జీవశక్తి సంపూర్ణము చేయగలదా?

మీరిప్పుడున్నట్లే చాల చిన్నపిల్లలుగా వున్నప్పుడు మీలో చాల శక్తి వుంటుంది, ఏమి లేదా? ఆడుకోవాలని, అటునిటు పరుగెత్తాలని, మాట్లాడాలని అనిపిస్తూ వుంటుంది; కదలకుండా ఒకేచోట కూర్చోలేరు; మీలో జీవచైతన్యము నిండి తొణికిసలాడుతూ వుంటుంది. అప్పుడేమి

జరుగుతుందో తెలుసునా? మీరు పెరిగి పెద్దవారయ్యే కొద్దీ, మీ ఉపాధ్యాయులు మీ శక్తికాక విశేషరూపము నిస్తూ, వివిధములైన అచ్చులలో పోతపోస్తూ ఆ శక్తిని తగ్గించి వేస్తారు. చివరకు మీరు స్త్రీలు, పురుషులుగా పెరిగి పెద్దవారయ్యేటప్పటికి మీలో అప్పటికింకా మిగిలివున్న కొంచెం శక్తిని సంఘము, మీరు ఉత్తమ పౌరులుగా జీవించాలని, ఇట్లా ప్రవర్తించాలని, అట్లా ప్రవర్తించాలని ఆదేశిస్తూ త్వరలోనే పూర్తిగా అణచివేస్తుంది. ఈ విధంగా మీరు చిన్నపిల్లలుగా వున్నప్పుడు మీలో పొంగిపొర్లుతూ వుండే శక్తి, పేరుకు మాత్రమే విద్యయనిపించుకొనెడి విద్యద్వారా, సంఘము మీమీద తెచ్చిపెట్టు ఒత్తిడుల ద్వారా క్రమంగా నాశనం చేయబడుతుంది.

మరి మీకిప్పుడున్న శక్తిని క్రమశిక్షణ ద్వారా బలపరచుకోవడానికి వీలున్నదా? ఇప్పుడు మీలో కొంచెమే శక్తి వున్నట్లయితే దానిని క్రమశిక్షణ ద్వారా వృద్ధిపొందించుకో వీలున్నదా? అట్లా చేయగల్గితే అప్పుడా క్రమశిక్షణకు అర్థమున్నట్లు. అట్లుగాక క్రమశిక్షణ వాస్తవానికి మీ శక్తిని నశింపజేస్తూ వుంటే అప్పుడు క్రమశిక్షణతో మనకు పనిలేదు. దానిని వదులుకోవడం మంచిది.

మనందరిలోను వున్న ఈ శక్తి యేమిటి? శక్తి అంటే ఆలోచించడం, మానసికానుభూతి పొందడం; మఱియును అభిరుచి, ఉత్సాహము, అత్యాశ, ఔత్సుక్యము, మోహము, ఆకాంక్ష, విద్వేషము ఇవన్నీని. ఇంకా బొమ్మలకు రంగులు వేయడం, నూతన యంత్రాలను కనుగొనడం, వంతెనలు కట్టడం, బాటలు వేయడం, పొలాలను సాగుచేయడం, ఆటలాడడం, పాటలు పాడడం, పద్యాలు వ్రాయడం, నాట్యం చేయడం, గుడికి పోవడం, పూజలు చేయడం — ఇవన్నీ శక్తిని తెలియజేసేవే. మరియును ఆ శక్తి భ్రమను పుట్టిస్తుంది, భ్రాంతిని కలుగజేస్తుంది, అనర్థాన్ని, హానిని, దైన్యాన్ని, దుఃఖాన్ని గూడ కలిగిస్తుంది. అత్యుత్తమ గుణములేకాదు, అతి దారుణ గుణములుకూడ మానవునిలోని శక్తిని వ్యక్తీకరింపజేసేవే. కాని, చూడండి, ఆ శక్తిని

అదుపులో పెట్టడం, క్రమశిక్షణలో వుంచడం, ఒక దిశగా పోనివ్వడం, మఱియొక దిశకు పోకుండా నిరోధించడం — ఈ పనులన్నీ సమాజము యొక్క సౌకర్యము కొఱకే జరుపబడుతుంటాయి. మనస్సు ఆయా విశేష సంస్కృతుల కనుకూలంగా మలచబడుతుంటుంది. అందువలన దానియొక్క శక్తి క్రమేపి వ్యర్థమైపోతుంది.

కాబట్టి ప్రస్తుతం మన సమస్య యేమంటే, ఈ శక్తిని — ఎక్కువగానో, తక్కువగానో ప్రతివానిలోను ఏదో యొక రూపంలో ఉన్నట్టి దానిని — వృద్ధి చేసికోగలమా? దానికి మరికొంత యెక్కువ చైతన్యాన్ని ఇవ్వగలమా? ఒకవేళ ఇవ్వగలిగి నట్టయితే, అది యెందుకోసం? ఏమి పని నిమిత్తం? శక్తి దేనికుపయోగపడడానికి? దాని ఉపయోగము యుద్ధము చేయడానికా? జెట్ విమానాలను ఇంకా అసంఖ్యాకములైన తదితర యంత్రాలను కనిపెట్టడానికా? ఎవరో యొక గురువును పట్టుకొని, అతని వెంటబడడానికా? పరీక్షలు పాసవడానికా? పిల్లలను కనడానికా? ఏదో యొక తీరని సమస్యను పట్టుకొని, దానిగురించి రాత్రింబగళ్ళు ఎడతెరిపిలేకుండా చింతిస్తూ కూర్చోడానికా? ఇదంతా కాకపోతే, యీ శక్తిని మఱియొక దిశలో మనము ఉపయోగించుకోగలమా? అనగా సర్వకర్మాతీతమైనదేదో దానితోడి సంబంధము చేత మన కర్మలన్నీ సార్థకములగునట్లు మన శక్తిని మనముపయోగించుకొనగలమా? నిజానికి, అత్యాశ్చర్యకరమగు ఆ శక్తికి స్థానముగానున్న మానవుని మనస్సు, సత్యమును అంటే దేవుని అన్వేషింపసాగనిచో, అప్పుడా మనస్సులోని శక్తి యేరూపమున బయటికి వచ్చినను అది వినాశమును, దైన్యమును, దుర్గతిని తప్పక కలిగిస్తుంది. సత్యాన్వేషణకు అపారమగు శక్తి అవసరము. మనిషి ఆ పని (సత్యాన్వేషణ) చేయనిచో, అతడు తన శక్తిని అనర్థకరమార్గములందు వ్యర్థము చేసికొంటాడు. అందువలన అట్టివానిని సమాజము అదుపులో పెట్టవలసి వస్తుంది. మరి దైవమును లేదా సత్యమును అన్వేషించుటకై శక్తిని విడుదల చేస్తూ, ఆ సత్యదర్శన ప్రక్రియలో, జీవితము యొక్క మౌలిక సమస్యలను గూడ అర్థము చేసికొని, సమాజము చేతిలో నాశనము పొంద వీలులేని పౌరుడుగా గూడ

వుండగలగడం సాధ్యమా? ఇది మీ కర్థమవుతున్నదా, లేక కొంత క్లిష్టంగా వున్నదా?

చూడండి, మనిషి అంటేనే శక్తి. మరి, మనిషి సత్యమును అన్వేషించకపోతే ఆ శక్తి వినాశకరంగా పరిణమిస్తుంది. అందువలన సమాజమట్టివానిని అదుపులో పెట్టి, అతనిని తన కనుకూలముగా మలచి వేసికొంటుంది. దానితో అతని శక్తి అణగారిపోతుంది. ప్రపంచమంతట ఎక్కువమంది పెద్దవాండ్లకు జరిగినదే అది. బహూశా, ఈ సందర్భంలో, మీరు మరియొక ఆసక్తిదాయకమైన సాధారణ విషయమొకటి గమనించి వుంటారు. అదేమిటంటే, ఏదైనా పని చేయవలెనని మీరు నిజంగా సంకల్పించుకొన్నట్లయితే, ఆక్షణమందే, ఆ పనిచేయడానికి తగిన శక్తి మీకుంటుంది. ఏదైనా ఆట ఆడదామని మీరు చాల ఉత్కంఠతో వుంటే ఏమవుతుంది? మీలో వెంటనే దానికి కావలసిన శక్తి వుంటుంది, ఏమి వుండదా? అప్పుడా శక్తియే తన్నుదాను అదుపులో వుంచుకొనే సాధనం కూడ అవుతుంది. కాబట్టి మీకప్పుడు బాహ్యమునుండి విధింపబడు క్రమశిక్షణ అక్కరలేదు. సత్యాన్వేషణ జరుగు సమయాన ఆశక్తి తన క్రమశిక్షణను తాను విధించుకొంటుంది. సత్యాన్వేషణ చేయు వ్యక్తి సహజంగానే ఉత్తమ పౌరుడౌతాడు. అయితే అతడేదో యొక సమాజ విశేషమునకుగాని, ప్రభుత్వమునకుగాని చెంది వుండడు.

కాబట్టి యథార్థ తత్త్వమును, దేవుని లేక సత్యమును కనుగొనడానికై అవసరమగు ఈ ప్రచండమైన శక్తిని విడుదల జేయడంకోసం విద్యార్థులును వారితో బాటు ఉపాధ్యాయులును కలిసి పనిచేయవలసి వుంటుంది. అట్టి సత్యాన్వేషణ చేయడంలో క్రమశిక్షణ వుంటుంది. దానితో మీరు నిజమైన మానవులౌతారు, సంపూర్ణ వ్యక్తిత్వముగల వారవుతారు. అంతేగాని కేవలం హిందువని, పార్సీ అని అయా విశిష్టసమాజమునకుగాని సంస్కృతికిగాని పరిమితమై యుండరు. ప్రస్తుతము జరుగుతున్న విధంగా విద్యార్థియొక్క శక్తిని క్షీణింపజేసే బదులు, సత్యాన్వేషణకై అతడు తన శక్తిని జాగృతము చేసికొనడంలో పాఠశాల

సహాయపడగలిగితే అప్పుడు క్రమశిక్షణకు గల అర్థమే వేరుగా కనిపిస్తుంది.

ఇంటిలోను, తరగతి గదిలోను, వసతి గృహంలోను ఏమి చేయవలెనో, ఏమి చేయరాదో మీ కెల్లప్పుడును ఎవరో ఒకరు చెబుతూనే వుంటారు; దానికి కారణమేమై వుంటుంది? నిజానికి దానికి కారణము మీ తల్లిదండ్రులున్ను, మీ ఉపాధ్యాయులున్ను — సమాజంలోని తక్కిన వారివలెనే — మానవుని అస్తిత్వమునకు గల ఒకేయొక పరమోద్దేశమగు దేవుని కనుగొనడం, అంటే సత్యమును సాక్షాత్కారింప జేసికొనడమన్న విషయాన్ని గ్రహింపకపోవడమే. ఏ కొద్దిమంది విద్యాబోధకులైనా సరే, దీనిని అర్థం చేసికొని సంపూర్ణ మనోయోగముతో సత్యాన్వేషణకై పూనుకొంటే, అట్టివారే నూతన విద్యావిధానమునకు కారకులై, సరిక్రొత్త సమాజమును సృష్టింపగలరు.

మీ చుట్టూ వున్న మనుషులలో పెక్కుమంది — మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సహా — ఎంత అల్పశక్తిమంతులో మీరు గమనించలేదా? వారి శరీరములు ఇంకను వయసు మీరినవి, ముసలివి కాకపోయినా, వారుమాత్రం మానసికంగా అప్పుడే మెల్లమెల్లగా మరణిస్తున్నారు. ఎందువలన? వారు సంఘము చేతిలో బాగా దెబ్బలు తిని దానికి పూర్తిగా లొంగిపోయి నందువలన. చూడండి, మన మనస్సు ఒక అద్భుతమైన వస్తువు; దాని శక్తి అమోఘము. అది అణుశక్తి చాలిత జలాంతర్గాములను, అతివేగవంతములగు జెట్ విమానములను నిర్మింపగలదు. అద్భుతమగు గద్యపద్యములను రచింపగలదు. అది యీ ప్రపంచమును సౌందర్య శోభితము గావింపగలదు, సమూల విధ్వంస మొనరింపగలదు గూడ. అటువంటి అసాధారణ సామర్థ్యము గల మనస్సును అర్థము చేసికొనడం మరియు దేవుని లేక సత్యమును సాక్షాత్కారింప జేసికొనడం — ఇదే మానవుని శక్తికి ప్రధాన ప్రయోజనము. అట్టి ప్రధాన ప్రయోజనమును విస్మరిస్తే ఆ శక్తి విధ్వంసక శక్తిగా పరిణమిస్తుంది. అప్పుడా సమాజము "వ్యక్తి యొక్క శక్తిని అనుకూలముగా మలచి, అదుపులో నుంచవలె" నని అంటుంది.

కాబట్టి ప్రేమను, సత్యమును లేదా దేవుని అన్వేషించడంలో వ్యక్తిలోని శక్తిని విడుదల జేయడమే విద్య యొక్క పరమ ప్రయోజనమని నాకనిపిస్తున్నది. తద్వారా విద్య, వ్యక్తిని ఉత్తమ మానవునిగా, కాబట్టి ఉత్తమ పౌరునిగా సరిదిద్దగలదు. కాని యిదంతా పూర్తిగా అవగాహన చేసికోకుండా, కేవలము క్రమశిక్షణను పాటించడం అర్థం లేనిపని. అది అత్యంత వినాశమును తెచ్చి పెడుతుంది. మీలో ప్రతియొక్కడు ఉత్తమ విద్యను పొంది, బడివదలి, బయటి ప్రపంచంలోనికి అడుగిడినప్పుడు, మీరు పూర్ణ చైతన్యవంతులు, ప్రజ్ఞావంతులుగా వుండకపోతే, సత్యదర్శనమునకై మీయందు శక్త్యుత్సాహములు పొంగిపొరలుచుండకపోతే, మీరు సంఘముచేత కబళింపబడతారు; మీరు ఊపిరాడకుండా అణగద్రొక్కబడి నాశనము చేయబడతారు; జీవిత శేషమంతా దుఃఖదైన్యములతో గడుపుతారు. నదీ ప్రవాహము తన గట్టులను తాను నిర్మించుకొన్నట్లే సత్యాన్వేషణ జరుపుతున్న శక్తి గూడ తన క్రమశిక్షణను తాను సృష్టించుకొంటుంది; దానికి బయటినుండి యేరూపంలోనైనా సరే విధింపబడు క్రమశిక్షణతో పనిలేదు. నది సముద్రమును జేరినట్లుగా ఆ శక్తి తన విముక్తిని తన స్వాతంత్ర్యమును తాను పొందుతుంది.

1. ప్రశ్న:- బ్రిటిషువారు భారతదేశమును పాలించడానికై ఎందువలన వచ్చిరి?

కృష్ణమూర్తి:- చూడండి, ఎక్కువ శక్తి, ఎక్కువ చైతన్యము, ఎక్కువ సామర్థ్యము, ఎక్కువ ఉత్సాహము కలవారు తక్కువ బలముగల పొరుగువారికి అటు అంతులేని దుఃఖమునైనా కలిగిస్తారు, ఇటు ఎనలేని సుఖమునైనా కలిగిస్తారు. ఒకప్పుడు భారతదేశము ఆసియా ఖండమంతటా భగ్గుమని ఒక వెలుగు వెలిగినది. అప్పుడు భారతీయులలో సృజనాత్మకమైన ఉత్సాహము పొంగిపొరలినది. వారు చైనాకు, జపానుకు, ఇండోనేషియాకు, బర్మాకు మతమును దెచ్చి వ్యాప్తిగావించిరి. తక్కిన జాతులు వర్తకవ్యాపారము కొనసాగించెడివి. అది కూడ అవసరమైయుండి యుండవచ్చు. అయితే దానితోబాటు వచ్చే దుఃఖదైన్యములు

దానికున్నాయి — కాని జీవితము నడిచే తీరే అట్టిది. అందులో వింత యేమిటంటే, సత్యమును లేదా దేవుని అన్వేషించేవారు అంతకంటె మించి ప్రజ్వరిల్లుతారు. వారు తమలోనే కాదు ఇతరులలోను గూడ అసాధారణమైన శక్తిని విడుదల చేస్తారు. నిజమైన క్రాంతి వాదులంటే వారే; సామ్యవాదులు కాదు, సమాజవాదులు కాదు, కేవలం సంఘ సంస్కర్తలున్ను కాదు. విజేతలు, పరిపాలకులు వస్తారు, పోతారు. కాని మానవ సమస్యలో ఎన్నటికిని మార్పురాదు. మనమందరము ఇతరుల మీద అధికారము చెలాయించగోర్తాము, లేదా ఇతరులకు లోబడగోర్తాము లేదా ఇతరులను నిరోధింపగోర్తాము. కాని సత్యాన్వేషకుడైన మానవుడు సర్వసంఘములనుండి, సర్వసంస్కృతులనుండి విముక్తుడు. పూర్ణ స్వేచ్ఛగలవాడు.

2. ప్రశ్న:- ధ్యాన సమయములోనైనా సత్యమును దర్శింపగలమని మాకు తోచదు. అందువలన సత్యమంటే యేమిటో మీరు దయచేసి చెప్పగలరా?

కృష్ణమూర్తి:- క్షణకాలం పాటు సత్యమును గూర్చిన ప్రశ్న నటుంచి ముందు ధ్యానమననేమో విచారిద్దాం. మీ గ్రంథములు, మీ గురువులు మీకు బోధించే ధ్యానమునకును నా ధ్యానమునకును చాల భేదము న్నది; అవి రెండును పూర్తిగా వేరైనవి. ధ్యానమంటే మీ మనస్సును మీరు అర్థము చేసికొనే ప్రక్రియ. మీ ఆలోచనా ప్రక్రియను మీరు అర్థము చేసికోకపోతే అంటే మిమ్మలిని మీరు అర్థం చేసికోకపోతే — మీరేమి ఆలోచించినా అదెల్ల నిరర్థకము. అట్టి ఆత్మజ్ఞానమనే పునాది లేకుండా, చేసిన ఆలోచన ఉపద్రవము తెచ్చి పెడుతుంది, అనర్థమునకు దారి తీస్తుంది. ప్రతి ఆలోచనకు సార్థక్యమున్నది. ఆ సార్థక్యాన్ని — అంటే ఏ ఒకటి రెండు ఆలోచనల సార్థక్యాన్ని మాత్రమే కాదు, ప్రతి ఆలోచన యొక్క సార్థక్యాన్ని — ఆయా ఆలోచనలు తలెత్తునప్పుడే — మనస్సు చూడజాలకపోతే, అప్పుడు, కేవలం ఒక భావనమీద, ఒక ప్రతిమమీద లేదా కొన్ని పదముల సముదాయంమీద మనస్సును కేంద్రీ

కరింప జేయడం ఒక విధమైన ఆత్మసంమోహనమే (self-hypnosis) అవుతుంది. అయితే దానినే అందరు ధ్యానమని పిలుస్తారు.

కాబట్టి మీరు ప్రశాంతంగా కూర్చొని వున్నా, మాట్లాడుతున్నా, ఆడుతున్నా ప్రతి ఆలోచన యొక్క సార్థక్యాన్ని, మీలో కలిగే ప్రతి ప్రతిక్రియను మీరు గమనిస్తున్నారా? అది మీ మెళుకలోకి వస్తున్నదా? ప్రయత్నించేసి చూడండి, మీకే తెలుస్తుంది, మీ ప్రతి ఆలోచన యొక్క గమనాన్ని మీ మెళుకలోనికి తేవడం — మీరు దానిని నిరంతరము గమనిస్తూ వుండడం — ఎంత కష్టమో! దానికి కారణము, ఆలోచనలు ఒకదానిమీద నొకటి అతివేగంగా వచ్చిపడి వేరుకానిపోతూ వుండడం, ప్రోగు పడిపోతూ వుండడం. కాని మీరు ప్రతి ఆలోచనను పరీక్షించి చూడదలచుకొంటే, ప్రతి ఆలోచనలోని విషయాన్ని మీరు నిజంగా చూడదలిస్తే, అప్పుడు మీ ఆలోచనల వేగం తగ్గడం గమనింపగలరు, మీరు వాటిని పరీక్షింపగలరు. ఈ విధంగా ఆలోచనల వేగము తగ్గడము, ప్రతి ఆలోచనను పరీక్షించడము — ఇదే ధ్యాన ప్రక్రియ. మీరది లోతుగా చేయసాగితే, ప్రతి ఆలోచనను మీ మెళుకలోకి తేగల్గితే, అప్పుడు మీ మనస్సు — ఏదైతే యింతవఱకు ఒకదానితో నొకటి ఘర్షణపడుతూ విశ్రాంతి యెరుగని ఆలోచనలతో నిండియున్న ఉగ్రాణముగా, గిడ్డంగిగా (store-house) వున్నదో ఆ మీ మనస్సు — ప్రశాంతించడం, క్రమంగా పూర్ణ నిశ్చలత్వమును పొందడం మీరు గమనింపగలరు. అప్పుడిక తొందరపాటు వుండదు, నిర్బంధముండదు, ఏ విధమైన భయమున్ను వుండదు. ఈ నిశ్చలత్వంలో సత్యమన్నదేదో అది భాసిస్తుంది, సాక్షాత్కరిస్తుంది. అట్టి స్థితిలో సత్యమును దర్శించే వ్యక్తిగా తదనుభవాన్ని పొందే వ్యక్తిగా వేరే 'మీరు' ఉండరు. కాని మనస్సు నిశ్చలము కాగానే ఆ నిశ్చలమైన మనస్సులోనికి సత్యము వస్తుంది. ఎప్పుడైతే మీరు ఉంటారో ఆక్షణమందు అనుభవించేవాడు - భోక్త - వున్నట్లు. మరి అనుభవించే వాడు కేవలం ఆలోచన ఫలితము. ఆలోచించడమే లేనప్పుడు ఆలోచించే వాడెట్లు వస్తాడు?

3. ప్రశ్న:- మన మొక తప్పు చేసి, ఎవరైనా మన తప్పును మనకు చూపించినా, మళ్ళీ మనమదే తప్పును ఎందుకు చేస్తాము?

కృష్ణమూర్తి:- మీరేమనుకొంటారు? మీరు పూలెందుకు కోస్తారు? మొక్కల నెందుకు విరిచివేస్తారు? సామానెందుకు చెడగొట్టుతారు? చిత్తుకాగితాలెందుకు అంతట విరజిమ్ముతారు? ఆ పనులు చేయవద్దని కనీసం ఒక డజను సార్లైనా మీకు ఎవరో ఒకరు తప్పక చెప్పి వుంటారనే నా నమ్మకం. అయినా మీరాపనులెందుకు చేస్తారు? చెప్పేదంతా జాగ్రత్తగా వినండి, మీకే తెలుస్తుంది. మీరాపనులు చేసేటప్పుడు అనాలోచితంగా చేస్తారు; మీ మనస్సు దానిమీద వుండదు. నిజంకాదా? మీరు అసావధానంగా వుంటారు, ఆలోచించరు. మీ మనస్సు నిద్రకు జారుకొంటుంది. అందువల్లనే యిటువంటి స్పష్టంగా బుద్ధిహీనములైన పనులను చేస్తుంటారు. మీరు నిండుతెలివిలో లేనప్పుడు అక్కడ మీ మనస్సు పూర్తిగా లేనప్పుడు ఏవో కొన్ని పనులు చేయవద్దని ఊరక మీకు చెప్పడంలో ప్రయోజనం లేదు. మీరు ఆలోచనాపరులు, నిజమైన ఎఱుక గలవారు, ఆనందముతో చెట్లను, పక్షులను, నదిని, భూమి యొక్క అద్భుత సంపదను సౌందర్యమును అవలోకింపగలవారు. కావడంలో విద్యాబోధకుడు మీకు సహాయపడగల్గినట్లయితే, అప్పుడు మీకేమాత్రము సైగ చేసినా సూచన చేసినా చాలును, వెంటనే గ్రహిస్తారు. ఎందువల్లనంటే అప్పుడు మీ మనస్సు చాలసున్నితంగా వుంటుంది, వెంటనే గ్రహింపగల శక్తి కలిగి వుంటుంది. మీ చుట్టు బయట లోపల వున్న ప్రతిదానిని మీరు అప్రమత్తంగా గమనిస్తూ వుంటారు.

దురదృష్టవశాత్తు మీ సున్నితమైన మనస్సు, మీ సంవేదనశీలత, క్రమంగా నాశనము చేయబడుతుంది. దానికి కారణం పుట్టినప్పటి నుండి చనిపోవువరకు, "ఇది చేయండి, అది చేయకండి" అని అంటూ మీ కెప్పుడూ చెబుతూనే వుండడం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంఘము, మతము, మతగురువు — వీరితో బాటు మీకున్న ఆశలు, ఆకాంక్షలు, అత్యాశలు, ఈర్ష్యాసూయలు — ఇవన్నీ 'ఇది చేయండి

అది చేయకండి' అంటూ చెప్పుతూనే వుంటాయి. ఈ విధి నిషేధ ముల నుండి విముక్తి పొందడంతో బాటు, మీసున్నితమైన మనస్సును అట్లే నిలుపుకోవలె నంటే దానికెంతో విచారశీలత వుండాలి, ఎంతో వివేకము, సానుభూతి వుండాలి. అప్పుడు మీరు సహజంగానే దయా ళురై మనుషులను పీడింపరు, చిత్తుకాగితాలను అంతటా వెదజల్లరు. బాటలో రాయిపడివుంటే, దానిని తీయకుండ దాటుకొని పోరు. మరి విద్యయొక్క ఉద్దేశం, నిజానికి, కొన్ని అక్షరాలను మీ పేర్ల చివర తగిలించుకోవడానికై యిప్పించడం కాదు; మీలో ఈ విచార శీలతను మేల్కొలిపి మిమ్ము సంవేదన శీలురుగా, కోమల హృదయులుగా, నిత్య జాగరూకులుగా అప్రమత్తులుగా, దయాళురుగా వుండునట్లు చేయడమే.

4. ప్రశ్న:- జీవితమంటే యేమిటి? మనమెట్లు సుఖంగా జీవింప గలము?

కృష్ణమూర్తి:- ఒక చిన్నపిల్లవాడినుండి వచ్చిన ఒక చాల మంచి ప్రశ్న — జీవితమంటే యేమిటి? మీరొక వ్యాపారస్థుణ్ణే అడిగినట్లయితే, జీవితమంటే వస్తువుల నమ్మడం, డబ్బు సంపాదించడం అని చెబు తాడు. కారణమేమంటే ప్రొద్దున నుండి రాత్రిదాకా అతడు చేసేపని అదే గనుక. అదే ప్రశ్న ఆశలు, ఆకాంక్షలు గల వాణ్ణే అడిగితే అతడు జీవితమంటే ఆశయ సాధనకోసం, ఆశాసాఫల్యం కోసం, చేసే సంఘర్షణ అని అంటాడు. పదవిని ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకున్న వ్యక్తికి, ఒక సంస్థకు గాని, దేశానికి గాని అధిపతి యైన వానికి జీవితమంటే తాను చేయదలచుకొన్న పనులతో నిండివుంటుంది. కూలివానికి, — ముఖ్యంగా ఈ దేశంలోని కూలి వానికి — జీవితమంటే ఒక్కదినము గూడ విశ్రాంతి యెరుగని ఎడతెగని పని. అతని జీవితంలో కనిపించేవి మాలి న్యము, దైన్యము, కడుపునిండ తిండి లేకపోవడమున్ను.

మరి, యీ పోరాటము, ఈ ప్రయాస, ఈ తిండిలేక వస్తుం డడం, దైన్యమనుభవించడం — వీటన్నింటితో మనిషి సుఖంగా జీవింప

గలడా? జీవింపలేడనేది స్పష్టము. కాబట్టి అతడేమి చేస్తాడు? అతడు ప్రశ్నింపడు, జీవితమంటే యేమిటని అడుగడు. దాని బదులు సుఖమును గూర్చిన తత్త్వవిచారణ మొదలు పెడతాడు. అందులో మునిగిపోతాడు. ఇతరులను తన స్వార్థం కోసం ఉపయోగించుకొంటూనే తాను సర్వ మానవ సౌభ్రాతృత్వము గురించి ఉపన్యసిస్తుంటాడు. జీవాత్మను పరమాత్మను మరి దేనినో కల్పించుకొని, తనకది తుదకు శాశ్వత సుఖాన్ని అనుగ్రహిస్తుందని నమ్ముతాడు. ఇంతకు సుఖమనేది దానికోసం ప్రాకులాడుతున్నంత కాలము చేతికందదు. అదియొక ఆనుషంగిక ఫలము, మరియొక దానితోబాటు వచ్చేడి గౌణఫలము, ప్రధాన ఫలము కాదు. ఎక్కడనైతే మంచితనమున్నదో, ప్రేమ ఉన్నదో, పేరాశ లేదో, మనస్సు ప్రశాంతంగా వుండి సత్యాన్ని అన్వేషిస్తూ వుంటుందో అక్కడ సుఖము తనంతట తానే కోరకుండానే వస్తుంది.

5. ప్రశ్న:- మనలో మనము ఎందుకు కొట్లాడుకొంటాము?

కృష్ణమూర్తి:- వృద్ధులు కూడ ఈ ప్రశ్నను అడుగుతారని అనుకొంటాను, ఏమి అడగరా? మనమెందుకు దెబ్బలాడు కొంటాము? రష్యాకు విరుద్ధంగా అమెరికా, పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా చైనా నిలబడుతున్నాయి, ఎందుకని? మనము మాట్లాడేది శాంతిని గురించి, కాని సిద్ధమయ్యేది యుద్ధానికి. ఎందుకని? నేననుకోవడం, మానవులలో పెక్కుమందికి ఒకరితో నొకరు పోటీపడడమంటే, పోరాడడమంటే ఇష్టమని. ఇది స్పష్టంగా కనిపించే వాస్తవవిషయం. అట్లుగాకపోతే మనము దానిని ఎప్పుడో మానివేసి వుండేవాళ్ళం. పైగా, పోరాడడంలో జీవలక్షణమగు భావావేశముంటుంది. అదికూడ ఒక వాస్తవ విషయమే. మనము సజీవంగా వుండవలెనంటే వివిధ రూపాలలో సంఘర్షణ అవసరమని అనుకొంటాము. కాని అటువంటి జీవితము మిక్కిలి చెరుపు కలిగిస్తుంది. సంఘర్షణ లేకుండా జీవించే మార్గమొకటున్నది. అది కలువ పూవులాంటి జీవితము, వికసించుచున్న పూవులాంటి జీవితము. అది పోరాడదు, దానికి దేనితోను సంఘర్షణ లేదు. అది అట్లా వుంటుంది,

అంతే. దేనికైనా దాని సహజ స్థితియే ఉత్తమమైన స్థితి. కాని మనం అందుకోసంగా చదివింపబడలేదు. మనం చదువుకొన్నది ఇతరులతో పోటీపడడానికి, పోరాడడానికిన్ని. మనం సైనికులుగా, న్యాయవాదులుగా, రక్షకభటులుగా, ప్రొఫెసర్లు (ప్రాచార్యులు) గా, ప్రిన్సిపాలురుగా, వ్యాపారస్థులుగా వుండడం కోసం చదివింపబడ్డాము. అందరు ఎత్తుగా ఆకాశంలో స్వారీ చేయగోరేవారే. మనకందరికీ విజయం కావాలి, సఫలత కావాలి. బయటికి ఎంతో వినయాన్ని అణకువను నటించేవారే ఎక్కువమంది. కాని లోపల, అంతర్గతంగా, నిజమైన వినయము గలవారే సుఖపడేవారు. వారేవరితోను పోరాడరు, పోటీపడరు.

6. ప్రశ్న:- మనస్సు ఇతర మానవులనే గాకుండా తన్ను దాను గూడ దురుపయోగం చేసికొంటుంది, ఎందువలన?

కృష్ణమూర్తి:- దురుపయోగమంటే మన వుద్దేశమేమిటి? పేరాశలు పెట్టుకొన్నది అత్యాశకలది అసూయతో నిండినదైన మనస్సు, అంధవిశ్వాసముల చేతను సంప్రదాయము చేతను బరువెక్కిన మనస్సు, దయాదాక్షిణ్యములు లేనిది ప్రజలను తన స్వార్థంకోసం ఉపయోగించుకొనునట్టిది అగు మనస్సు — అటువంటి మనస్సు తన ఆచరణచేత అనర్థాన్ని సృష్టిస్తుంది. సంఘర్షణతో నిండిన సమాజాన్ని నిర్మిస్తుంది. ఇది తెలిసిన విషయము. మనస్సు తన్ను దాను అర్థము చేసికోనంతవరకు దాని ఆచరణ తప్పక వినాశమునకే దారితీస్తుంది. తన్ను గురించిన జ్ఞానము తనకు లేనంతవరకు మనస్సు వైరమును వృద్ధి పొందిస్తూ వుంటుంది. అందువల్లనే మీ గురించి మీరు స్వయంగా, తెలిసికోవడం చాల అవసరం, కేవలము పుస్తకాలనుండి నేర్చుకోవడమే కాదు. ఆత్మజ్ఞానాన్ని యే పుస్తకమున్ను మీకు బోధింపదు. ఆత్మజ్ఞానమును గురించిన సమాచారమును పుస్తకము అందజేయవచ్చు. కాని దానికిన్ని స్వయంగా ఆచరణలో మిమ్ము మీరు తెలిసికోవడానికిన్ని భేదమున్నది. ఇతరుల తోడి సంబంధమనే అద్దంలో మనస్సు తన్నుదాను చూచుకొన్నప్పుడు ఆ ప్రత్యక్ష దర్శనము ద్వారా ఆత్మజ్ఞానము సిద్ధిస్తుంది.

మరి యీ ఆత్మజ్ఞానము లేనిదే, ప్రపంచంలో మనము సృష్టించిన యీ గందరగోళాన్ని యీ భయంకరమైన దైన్యాన్ని మనము తొలగించలేము.

7. ప్రశ్న:- సాఫల్యము నన్వేషించు మనస్సు, సత్యము నన్వేషించు మనస్సు కంటె వేరైనదా?

కృష్ణమూర్తి:- సాఫల్యము నన్వేషించినా సత్యము నన్వేషించినా మనస్సు ఒకటే. కాని సాఫల్యము నన్వేషించుచున్నంత కాలము అది సత్యమును దర్శింపలేదు. సత్యమును అర్థము చేసికొనడమంటే అసత్యములోని సత్యమును చూడడం మరియు సత్యమును సత్యముగా చూడడం.

3 ఫిబ్రవరి, 1955

11

జీవితములోని ఆనందము

మనుషులు పెద్దవారయ్యేకొద్ది జీవితములోని ఆనందము నంతను పోగొట్టుకొంటున్నట్లుగా కనిపిస్తుంది. అదెందువలన అని మీరెప్పుడైనా ఆశ్చర్యపడలేదా? ప్రస్తుతం మీలో ఎక్కువమంది చిన్నపిల్లలు, చాల వరకు సుఖంగానే వున్నారు. మీకేవేవో చిన్న చిన్న సమస్యలుండవచ్చు, పరీక్షలు కొంత ఆందోళన కలిగించవచ్చు. ఇటువంటి సమస్యలున్నా, మీ జీవితంలో ఒక విధమైన ఆనందమున్నది, ఏమి లేదంటారా? మీరు జీవితాన్ని హృదయ పూర్వకంగా, స్వేచ్ఛగా గ్రహిస్తారు. మీరు దేనిపైనైనా స్వేచ్ఛగా, సంతోషంగా చూస్తారు. మరి మనం పెద్దయ్యే కొలది — మన దృష్టి కందనిదై ఎంతో మహత్త్వము కలిగియున్నదేదో దాని యొక్క ఆనందమయ సందేశమును పోగొట్టుకొంటున్నట్లుగా తోస్తుంది. ఇది యెందువలన? మనలో ఎంతోమంది యుక్తవయస్సు అనబడేది వచ్చేటప్పటికి మనస్సు మొద్దుబారి, అనావృతమగు ఆకాశమును, అద్భుతావహమగు భూమిని, అందలి అందమును, ఆనందమును గమనింప సమర్థులము కాలేక పోతున్నాము; వాటియెడల ఉదాసీనుల మవుతున్నాము. ఇది యెందువలన?

మనలో మనము ఈ ప్రశ్నను వేసికొన్నప్పుడు దానికి అనేక సమాధానాలు మన మనస్సులో మెదులుతాయి. మన మన సొంత పనులలో మనమంత యెక్కువగా మునిగిపోయి వుంటామనేది ఒక సమాధానము. మనమొక వ్యక్తిగా నిలబడాలని సంఘములో ఒక స్థానాన్ని సంపాదించుకోవాలని సంపాదించుకొన్న స్థానాన్ని నిలబెట్టుకోవాలని తంటాలు పడుతుంటాము. మనకు పిల్లలుంటారు; ఇంకా ఇతర బాధ్యతలుంటాయి. అందుకోసం డబ్బు సంపాదించుకోవలసివుంటుంది. ఈ బాహ్యవిషయా

లన్ని మనలను త్వరలోనే క్రుంగదీస్తాయి. దానితో మనము జీవించడంలోని ఆనందాన్ని పోగొట్టుకొంటాము. మీ చుట్టూ వున్న పెద్దల ముఖాలను ఒకసారి చూడండి. వారిలో ఎక్కువమంది ఎంత విచారంగా వున్నారో, ఎంత చింతా క్రాంతులై జబ్బు పడ్డ వాండ్లలాగ వున్నారో, ఎంత ఉదాసీనంగా ఎవరితోనైనా కలియడానికి జంకుతూ దూరంగా ఎట్లా వున్నారో, ఒక్కొక్కసారి చిరచిరలాడుతూ మొగంమీద చిరునవ్వు అనేది లేకుండా ఎట్లా ఉంటారో గమనించి చూడండి. ఎందుకని ఇట్లా వుంటారో మీలో మీరు ప్రశ్నించుకోరా? ఒకవేళ ప్రశ్నించుకొన్నా కేవలమేవో సమాధానాలతో వివరణలతోనే మనం చాలమంది తృప్తిపడిపోతామని అనిపిస్తుంది.

నిన్న సాయంత్రం ఒక పడవను చూశాను. అది యేటి కెదురుగా తెరచాప నెత్తి, పడమట గాలి త్రోస్తూ వుంటే మిక్కిలి వేగంగా పోతూ వుండినది. అది ఒక పెద్ద పడవ; దాని నిండా పట్నం తీసికొనిపోవడం కోసం వంటచెఱకు ఎక్కించబడి వున్నది. సూర్యుడస్తమిస్తూ వున్నాడు, విశాలమైన ఆకాశాని కెదురుగా ఈ పడవ యొక్క సౌందర్యం అద్భుతమైనది. పడవవాడు కేవలం చుక్కాని పట్టుకొని త్రిప్పుతున్నాడు. అందులో ప్రయత్నమూ లేదు, శ్రమా లేదు. చేయవలసిన పనంతా గాలే చేస్తూవున్నది. అదే విధంగా మనలో ప్రతియొక్క వ్యక్తి తన జీవితంలోని సంఘర్షణను, ప్రయాసను వానికి సంబంధించిన సమస్యలను అర్థము చేసికోగల్గితే అప్పుడు మనంగూడ ప్రయత్నరహితంగా, సుఖంగా, ముఖంమీద చిరునవ్వుతో జీవింపగలమని అనుకొంటాను.

దాదాపు మన జీవితమంతా యీ సంఘర్షణతోనే గడిపివేస్తాం. మనం చేసే యీ ప్రయత్నమే యీ పెనుగులాటే మనలను నాశనం చేస్తూవున్నది. మీరు మీ చుట్టూ వున్న పెద్ద వాండ్లను గనక గమనించి చూస్తే వాండ్లల్లో ఎక్కువమంది జీవితము తమలో తమతో, తమ భార్యలతో, భర్తలతో, తమ యిరుగు పొరుగు వారితో, తమ సంఘంతో, పోరాడుతూనే గడిచిపోవడం చూడగలరు. ఈ అంతులేని సంఘర్షణ మన శక్తిని నాశనం చేస్తున్నది. ఆనందమయమైన నిజంగా

సుఖమయమైన జీవితం గడిపేవాడు ఈ పెనుగులాటలో చిక్కుకొనడు. ప్రయత్నరహితంగా జీవించడమంటే ముఠిగిపోవడం కాదు, మీ బుద్ధి మందగించిందని, మీలో చుఱుకు దనం పోయిందని కాదు. పైగా నిజానికి బుద్ధిమంతులు, అద్భుతమైన ప్రజ్ఞ గలవారు మాత్రమే యీ శ్రమ నుండి యీ పెనుగులాట నుండి విముక్తి పొందగల్గినవారు.

కాని చూడండి, ప్రయత్నరహిత స్థితిని గురించి వినగానే మన మట్లా వుందామని కోరుకొంటాము. సంఘర్షణ, నిరోధము లేని స్థితిని సాధింపగోరుకొంటాము. అందుచేత దానిని మనము మన ధ్యేయంగా మన ఆదర్శంగా పెట్టుకొని దానికోసం గట్టి ప్రయత్నం చేస్తాము. కాని మనమెప్పుడైతే అటువంటి ప్రయత్నం చేస్తామో అప్పుడే, ఆ క్షణమందే మనము మన జీవితంలోని ఆనందాన్ని పోగొట్టుకొన్న వాండ్లమౌతున్నాము! మళ్ళీ మనం ప్రయత్నంలోను పెనుగులాటలోను తగులుకొనడం సంభవిస్తుంది. మనంపడే ప్రయాస యొక్క ఉద్దేశంలో తేడా వుండవచ్చు కానీ ప్రయాసపడడంలో తత్త్వతః తేడా వుండదు. ప్రయాస అంతా ఒకటే. మనంపడే ప్రయాస సంఘ సంస్కరణ కోసం కావచ్చు, దేవుని ప్రత్యక్షం చేసికోవడం కోసం కావచ్చు, తనకు తన భార్యకు లేక భర్తకు మధ్యగాని, తనకును తన పొరుగువానికి మధ్యగాని గల సంబంధాన్ని బాగు పరచుకోవడం కోసం కావచ్చు. ఇందుకోసం గంగాతీరాన కూర్చుండి ఎవరో యొక గురువు పాదాలను ఆశ్రయించి వారికి పాదపూజ చేయవచ్చు, ఇంకా యిట్టివి ఎన్నైనా చేయవచ్చు. శ్రమ, పెనుగులాట లేదా ప్రయాస అంటే యిదే. కాబట్టి మనం పడే ప్రయాసకు ఉద్దేశ్యమేమిటి అనేది కాదు ప్రధానం; అసలు ప్రయాసపడడమంటే యేమిటో అర్థం చేసికోవడం ప్రధానం.

మరి, 'ఈ క్షణము దేనికోసమున్ను ప్రయాస పడడం లే'దని మాట వరుస కొక క్షణకాలం పాటు మాత్రమే ఎఱుక గల్గి వుండడం కాకుండ, శాశ్వతంగా ఎట్టి ప్రయాస ఎట్టి ప్రయత్నము లేకుండా వుండడం సాధ్యమా? అట్లుండ గల్గితే అప్పుడు మనస్సు ఉత్తమాధమ

భేదభావము లేని ఆనందమయ స్థితిని పొందగలదు.

మనకున్న కష్టమేమంటే మన మనస్సు తాను నికృష్టమైన దాని నని భావించికొని మరియొక విధంగా వుండడంకోసం మరియొక స్థితి లోనికి మారడంకోసం పరస్పర విరుద్ధములైన తన రకరకాల కోరికలనుండి బయటపడడంకోసం గట్టి ప్రయత్నము చేస్తుంటుంది, పెనుగులాడుతుం టుంది. మనస్సెందువలన ఇంతగా పెనుగులాడుతుందో దానికి కారణాలు మనం వివరించి చెప్పుకోనక్కరలేదు. ఆలోచనా పరుడైన ప్రతివ్యక్తికిని తనకు లోపలనుబయటను ఎందుకింత ఘర్షణ వున్నదో తెలుస్తుంది. మన ఈర్ష్య, మన లోభము, మన ఆశలు, ఆకాంక్షలు, నిర్దయతోగూడిన సామ ర్థ్యమునకు మూలమగునట్టి పోటాపోటీ ఇవన్నీ ఇప్పటి ప్రపంచంలోగాని, రాబోయే ప్రపంచంలో గాని మన పెనుగులాటలకు, మన ఘర్షణలకు కారణములనడం స్పష్టము. కాబట్టి మన పెనుగులాటలకు మన ఘర్ష ణలకు కారణం తెలిసి కోవడం కోసం మనస్తత్వశాస్త్ర గ్రంథములను అధ్యయనం చేయవలసిన అవసరం లేదు. మనకు ప్రధానంగా కావలసిందే మంటే యీ ఘర్షణలనుండి యీ పెనుగులాటలనుండి మన మనస్సు పూర్తిగా విముక్తి పొందగలదేమో తెలిసికోవడమే.

ఇంతకున్ను మనము పెనుగులాడుతున్నామంటే ఆ పెనుగులాట, ఆ సంఘర్షణ మనమున్న ప్రస్తుత స్థితికిని మనముండవలసిన లేదా మనముండగోరిన స్థితికిని మధ్య గల సంఘర్షణ. దీనికిప్పుడు వివరణ లిచ్చుకోవడం, సమాధానాలు చెప్పుకోవడం గాకుండా అసలీ సంఘర్షణ జరిగే తీరునంతను పూర్తిగా అర్థము చేసికోగలమా? అట్లా అర్థం చేసి కోడం వలన ఆ సంఘర్షణయే అంతమవుతుంది! గాలితోబాటు పోతూ వున్న ఆ పడవవలె మనస్సు గూడ ఎట్టి ఘర్షణ లేకుండ వుండగలదా? అసలు సమస్య యిది, అంతేగాని ఘర్షణలేని స్థితిని ఎట్లు సాధించాలి అనేది కాదు. అట్టి ఘర్షణలేని స్థితిని సాధించడం కోసం చేసే ప్రయ త్నమే ఘర్షణ ప్రక్రియ, ఘర్షణ జరిగే తీరు. కాబట్టి అట్టి స్థితి యెన్న టికిని సిద్ధించదు. కాని అంతములేని యీ ఘర్షణలో మనస్సు ఏవిధంగా

చిక్కుకొంటూవుంటుందో ఏ క్షణమున కాక్షణము మీరు గమనించి చూస్తూవుంటే, — దానిని మార్చడం కోసం ప్రయత్నించకుండా — మీరు 'శాంతి' యని పిలిచే ఒకానొక స్థితిని మీ మనస్సులోనికి బలవంతంగా ప్రవేశపెట్టడం కోసం ప్రయత్నించకుండా — వాస్తవంగా ఉన్న స్థితి యేమిటో దానిని మీరు గమనించి చూస్తూ వుంటే అప్పుడు మనస్సులోని ఘర్షణ, దానంతట అదే ఆగిపోవడం మీరు గమనింప గలరు. అట్టి స్థితిలో మనస్సు నేర్చుకోగలిగినది అపరిమితము. అట్లు నేర్చుకోవడమంటే కేవలం సమాచారాన్ని సేకరించడం కాదు, మనస్సు యొక్క పరిధికి అవతలవున్న అద్భుతమైన సంపదలను కనుగొనడము. ఆ సంపదలను దర్శింపగల మనస్సులో ఆనందముంటుంది.

మిమ్ము మీరు పరిశీలించి చూచుకొంటూ వుంటే మీరు ప్రొద్దున నుండి రాత్రిదాకా యెట్లా శ్రమ పడుతూ వుంటారో మీలో ఎంత ఘర్షణ వుంటుందో ఈ ఘర్షణలో మీరెంతగా మీ శక్తిని వృథా చేసి కొంటున్నారో చూచుకోగలరు. దేనికోసం మీరు తంటాలు పడుతున్నారో కేవలం వివరింప ప్రయత్నిస్తే మీరు మీ వివరణలలో దారి తప్పి పోతారు. మీ పోరాటమూ, కొనసాగుతూ వుంటుంది. అట్లుగాక వివరణలు, సమాధానాలు ఇచ్చే బదులు ప్రశాంతంగా మీరు మీ మనస్సును పరిశీలిస్తూ వుంటే — మరి, మీ మనస్సును తనలోని ఘర్షణను తాను ఎట్టి ఆటంకము లేకుండా తెలిసికోనిస్తే — అప్పుడసలు సంఘర్షణమే లేనట్టి ఒక విధమైన స్థితి సిద్ధించడం మీరు చూడగలరు. అందులో అద్భుతమైన ఎఱుక వుంటుంది. ఆ జాగ్రత్ స్థితిలో ఉత్కృష్టము నికృష్టమను భేద భావముండదు. గొప్పవాడు, తక్కువవాడనే తేడా వుండదు. అక్కడ గురువుకు స్థానము లేదు. మనస్సు పూర్తిగా మేల్కొని యుండడం వలన అట్టి అసంగత విషయములన్నీ పోతాయి. పూర్తి మెలకువలో నున్న మనస్సే ఆనందమయమగు మనస్సు.

1. ప్రశ్న:- నేనొక పని చేయుదలచినాను. అందుకోసమై చాల సార్లు ప్రయత్నించినప్పటికిన్ని విజయం పొందలేక పోయినాను. ఇప్పు-

దందుకోసమై ప్రయత్నం చేయడం మానివేయనా, లేక పట్టుదలతో ప్రయత్నం చేస్తూనే వుండనా?

కృష్ణమూర్తి:- విజయం పొందడమంటే ఒక చోటికి వచ్చి చేరడం, ఒక స్థానాన్ని అందుకోవడం. మనము విజయం పొందడాన్ని పూజిస్తాం, పూజించమా? ఒక బీదపిల్లవాడు పెరిగి పెద్దవాడై కోటీశ్వరుడైతే, లేక ఒకమామూలు విద్యార్థి ప్రధానమంత్రి అయితే అతనిని అందరు మెచ్చుకొంటారు, చాల గొప్ప చేస్తారు. అందువలన ప్రతిబాలుడు ప్రతి బాలిక ఏదో యొక విధంగా విజయం సాధించాలని ఆశిస్తారు.

అయితే విజయము లేదా సాఫల్యమంటూ అసలు ఏదైనా వున్నదా? లేక అది ఒక భావన యేనా? ఆ భావన వెంటదవిలి మనిషి దానిని అందుకొన ప్రయత్నిస్తున్నాడా? మీరొక చోటికి వచ్చి చేరిన క్షణమందే మరికొంత దూరంలో, దానికింకా ముందు, మీరు పోయి చేరుకోవలసిన చోటు మరియొకటి కనిపిస్తుంది. ఇట్లా దీనికంతముండదు. ఏదిశలో నైనా సరే మీరు సఫలత పొందడం కోసం ప్రయత్నిస్తూ వున్నంతకాలం మీలో ఘర్షణ, పెనుగులాట, పోరాటము తప్పవు, ఇది నిజంకాదా? మీరొక చోటికి వచ్చి చేరుకొన్నా, మీకు విశ్రాంతి ఉండదు. కారణ మేమంటే, మీరింకా పైపైకి పోగోరుతారు. ఇంకా ఎక్కువెక్కువగా వేటివేటినో పొందగోరుతారు. ఏమి మీకు అర్థమవుతున్నదా? సఫలత కోసం ప్రయత్నం చేయడమంటే ఇంకా ఎక్కువెక్కువగా కావాలని కోరు కోవడం. ఈవిధంగా ఎల్లప్పుడు ఇంకా ఎక్కువ కావాలి, ఇంకా ఎక్కువ కావాలి అని కోరుకొంటూ వుండే మనస్సు తెలివి గల మనస్సు కాదు. అది మధ్యమమైనది, తెలివి తక్కువది. కారణమేమంటే ఇంకా ఎక్కువెక్కువగా కావాలని కోరుకొనే కోరికలో అంతర్నిహితమై సంఘ నిర్దిష్ట మార్గమున జరిగెడి నిరంతర ప్రయత్నము నిరంతర సంఘర్షణము చేరి వుంటుంది.

ఇంతకు సంతుష్టి అంటే యేమిటి? అసంతుష్టి అంటే యేమిటి? అసంతుష్టి అంటే అధికం కోసం సంఘర్షణ — అంటే ఇంకా ఎక్కువె

క్కువగా కావాలని, అందుకోసం ప్రయత్నించడం, పెనగులాడడం. సంతుష్టి అంటే ఆ సంఘర్షణ ఆ పెనుగులాట అంతమవడం. అయితే, అధికం కోసం సంఘర్షణ యెట్లు జరుగుతున్నదో ఆ ప్రక్రియ ఎట్లు సాగుతున్నదో దానిని మనస్సెందుకు కోరుకొంటుందో అవగాహన చేసికోకపోతే మీకు సంతుష్టి లభించదు.

ఉదాహరణకు మీరొక పరీక్షలో తప్పిపోతే, ఆ పరీక్ష మళ్ళీ వ్రాయవలసి వస్తుంది. ఏమి, వ్రాయవలసి రాదా? అసలు పరీక్షలనేవి, ఏవిధంగా చూచినా మిక్కిలి దురదృష్టకరమైనవి. అవి మహత్త్వపూర్ణమైన విషయాన్ని దేనినీ సూచించవు. మీ తెలివి తేటల నిజమైన విలువను గూడ అవి తెలుపవు. పరీక్షలు పాసవడం ప్రధానంగా జ్ఞాపకశక్తిలో గలనేర్పు, అది దాని చమత్కారము. లేదా అది అదృష్టం మీద ఆధారపడిన విషయం. అయినా పరీక్షలు పాసవడానికి మీరు గట్టిగా ప్రయత్నిస్తారు. ఒకవేళ మీరందులో విజయం పొందకపోతే మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తూనే వుంటారు. దైనిక జీవితం లో గూడ మనలో చాలమందికి అట్లే జరుగుతూ వుంటుంది. ఏదో యొక దాని కోసం మనమెప్పుడూ ప్రయత్నిస్తూనే వుంటాము. కాని దేనికోసం మన మింత శ్రమ పడుతున్నామో అది అంత యెక్కువ శ్రమపడవలసినంత ముఖ్యమైనదాయని, క్షణకాలమాగి విచారించము; అది శ్రమకు తగిన విలువ కలదేనా యని మనలో మనమెన్నడును ప్రశ్నించుకోము. అందు వలన దానికి విలువలేదనే విషయాన్ని మనము తెలిసికొన లేకపోయినాం. అందుచేత మన తల్లిదండ్రులు, మన సమాజము, మన గురువులు, దివ్యగురువులు — వీరందరి అభిప్రాయాన్ని ఎదిరించి మనము నిలబడ లేకపోయినాం. 'ఇంతకంటె అధికము' అనే మాటకు గల ప్రాధాన్యమును, దాని పూర్తి అర్థమును మనము బాగా గ్రహించి నప్పుడే, విజయము — అపజయము, సాఫల్యము — వైఫల్యము ఈ విధంగా ఆలోచించడం మానివేయగలము.

పరీక్షలలోనే కాదు, జీవితంలో గూడ అపజయం పొందడమంటే,

తప్పులు చేయడమంటే మనమెంతో భయపడతాం. తప్పు చేయడమంటే చాల భయంకరమైన విషయంగా ఎంచబడుతుంది. ఎందుకంటే, దానికి మనలను విమర్శిస్తారు, తిడతారు. కాని మీరసలు తప్పు ఎందుకు చేయరాదు? ప్రపంచంలో అందరు తప్పులు చేయడం లేదా? మనమొకరం తప్పంటూ చేయకపోతే ప్రపంచమీదారుణమైన గందరగోళ పరిస్థితి నుండి బయట పడుతుందా? మీరు తప్పులు చేయడానికి భయపడేటట్లయితే మీరెన్నటికిని నేర్చుకోలేరు. పెద్దవాండ్లు ఎప్పుడూ తప్పులు చేస్తూనే వుంటారు. కాని మీరు మాత్రం తప్పులు చేయకూడదని మందలిస్తుంటారు. ఆ విధంగా మీలో వుండే చొరవను అణగగొట్టివేస్తారు. ఎందువలన? వారి భయ మేమిటంటే, మీరు ప్రతిదానిని పరిశీలిస్తూ, ప్రశ్నిస్తూ, పరీక్షించి చూస్తూ, తప్పులుచేస్తూ, తుదకు మీరు స్వయంగా తెలివి పొందినవారై, మీ తల్లిదండ్రులు, సంఘము, సంప్రదాయముల అధికారమునుండి విడివడి తప్పించుకొని పోతారేమో యని వారిభయము. అందువల్లనే విజయము పొందడమనే ఆదర్శాన్ని మీ ముందుపెట్టి దానిని అనుసరించమని మీతో చెబుతారు. విజయము గౌరవ ప్రదమైనదిగా లెక్కింపబడడం మీరు గుర్తించగలరు. ఆఖరికి సన్న్యాసి గూడ తన ఆధ్యాత్మిక సాధనలనబడే వాని ద్వారా గౌరవ ప్రదమైన స్థితిని పొందకపోతే, అతని నెవరును గుర్తించరు, అతనినెవరును అనుసరింపరు, అతనికి శిష్యులుండరు.

కాబట్టి మనమెల్లప్పుడును 'విజయము' 'సాఫల్య'మను పదములలోను 'ఇంతకంటె అధిక' మనే పదములోను ఆలోచిస్తూ వుంటాము. గౌరవనీయమగు సమాజమే అధికమనే పదానికి విలువ కట్టుతుంది. అంటే, దానినే మరియొక విధంగా చెప్పితే, సంఘము చాల జాగ్రత్తగా ఆలోచించి ఒక మర్యాదను స్థిరపరుస్తుంది. దానిననుసరించి మీరు పొందినది జయమో అపజయమో నిర్ణయిస్తుంది. కాని మీరు ఏపనైనా మనస్ఫూర్తిగా దానిమీది ప్రేమతో చేయగోరినట్లయితే అప్పుడు మీకు సాఫల్య వైఫల్యములతో సంబంధములేదు. తెలివి గల వ్యక్తి యెవరైనా సరే చేసేది అంతే. కాని దురదృష్టవశాత్తు తెలివి గల వ్యక్తులు,

అంటే ప్రాజ్ఞులు చాల అరుదు. మీకీ విషయాలన్ని ఎవ్వరున్ను చెప్పరు. ప్రాజ్ఞుడు చేయవలసిన దెల్ల యేమంటే యాథార్థ్యమును చూడడం, సమస్యను అర్థం చేసికోవడం — అంటే దాని భావం, సాఫల్యము వైఫల్యము అనునిట్టి పదములలో ఆలోచించకుండడం. మనము చేసే పనిమీద మనకు ప్రేమ లేనప్పుడు మాత్రమే మన మీ సాఫల్య వైఫల్య మనే పదములలో ఆలోచిస్తాము.

2. ప్రశ్న:- మౌలికంగా మనమేల స్వార్థపరులము? మన మెంత నిస్వార్థంగా వుందామని ప్రయత్నించినా, మన స్వప్రయోజనములు అడ్డువచ్చేటప్పటికి కేవలం స్వార్థపరాయణులమై ఇతరుల ప్రయోజ-నములను లెక్క చేయము; వారి అభిరుచుల యెడ ఉదాసీనత వహి-స్తాము.

కృష్ణమూర్తి:- ఎవరైనా తమ్ము దాము స్వార్థపరుల మనిగాని నిస్స్వార్థపరులమనిగాని చెప్పకొన రాదు. ఇది చాలముఖ్యమని నేను అనుకొంటాను. కారణమేమంటే పదములు మనస్సుమీద అసాధారణ మైన ప్రభావాన్ని కలిగివుంటాయి. ఒక మనిషిని 'నీవొక స్వార్థపరుడ' వని అంటే అతనికొక పెద్ద శిక్ష విధించినట్లే. అతనినే ప్రాఫె సరువని పిలిచినారనుకోండి. అప్పుడతనితో మీరు వ్యవహరించే తీరు లోనే తేడా కనబడుతుంది. అతనిని మహాత్ముడవని పిలిచినారను కోండి. వెంటనే అతని చుట్టు ఒక తేజోవలయము మీకు కనిపిస్తుంది. న్యాయవాది, వ్యాపారస్థుడు, గవర్నరు, నౌకరు, ప్రేమ, దేవుడు — ఇటువంటి మాటల యెడల మీ ప్రతిక్రియ లెట్లా వుంటాయో మీరు గమనించి చూచుకొంటే అవి మీనరముల మీదను మీ మనస్సు మీదను ఒక వింత ప్రభావాన్ని కలుగ జేస్తున్నట్లు మీరు స్వయంగా తెలిసికోగలరు. ఏదైనా ఒక విశిష్టమైన వృత్తిని తెలియజేసే పదము మనలో దానికి సంబంధించిన హోదాను జ్ఞాపకానికి తెస్తుంది. కాబట్టి మొట్టమొదట జరగవలసిన పని యేమిటంటే, కొన్ని కొన్ని పదాలతో బాటు కొన్ని కొన్ని భావాలను అనాలోచితంగా జతకలిపే అలవాటు

నుండి మనము విముక్తులం కావాలి. ఏమి, కానక్కరలేదా? స్వార్థమనే పదము ఏదో మిక్కిలి దోషయుక్తమై అపవిత్రమైన దానిని దేనినో సూచిస్తుందని భావించడానికి మన మనస్సు అలవాటు పడింది. అందువలన మీరాపదమును దేని గురించైనా ఉపయోగిస్తే వెంటనే మీ మనస్సు దానిని నిందించ సాగుతుంది. కాబట్టి "మన మెందువలన మౌలికంగా స్వార్థపరుల"మని మీరు ప్రశ్నవేసినప్పుడు ముందుగానే ఆ ప్రశ్నలో నిందాభావము ధ్వనిస్తున్నది.

కొన్ని కొన్ని పదములు వినగానే మీలో నాడీమండలమునకు సంబంధించిగాని, మనోభావములలో గాని, బౌద్ధికంగాగాని — అంగీకార రూపంలోనో తిరస్కారరూపంలోనో లేదా నిందా రూపంలోనో, స్తుతిరూపంలోనో — ప్రతిక్రియలను కలిగిస్తాయి. ఉదాహరణకు మిమ్ములను మీరు అసూయాపరులుగా భావించుకొన్నప్పుడు ఇక దాని గురించిన విచారణకే అవకాశముండదు; వెంటనే ఆ విచారణకు ఆటంక మేర్పడుతుంది. అసూయ అనే సమస్యను లోతుగా పరిశీలించడము ఆగిపోతుంది. అదేవిధంగా చాల మంది తాము మానవ సౌభ్రాతృత్వం కోసమై పని చేస్తున్నట్లు చెప్పుకొంటారు. కాని చేసే పనులన్నీ అందుకు వ్యతిరేకంగా వుంటాయి. అయినా వారి కా విషయమే తెలియదు. దానికి కారణము సౌభ్రాతృత్వమనే పదము వారిలో ఒక విశిష్ట భావాన్ని కలుగజేసివుంటుంది. ఒక ప్రత్యేకమైన అర్థంలో దానిని గ్రహించి వుంటారు. ఆ భావానికి వారప్పుడే లొంగిపోయి వుంటారు. వారింక దానిగురించి విచారణయే చేయరు. ఆ మాట వారి నాడీ మండలము మీదను మనోభావాల మీదను ఎట్టి ప్రభావము చూపిస్తున్నప్పటికిని దానికి ప్రాముఖ్యమీయక అసలు యథార్థ మేమో కనుగొనడానికి వారు బొత్తిగా ప్రయత్నించరు.

కాబట్టి కొన్ని కొన్ని పదములతో సంబద్ధములై వాటితో బాటు కలిగే నిందా ప్రశంసాభావములకు మన మనస్సులో చోటీయకుండా అందరి యథార్థ తత్త్వములను, అందరి వాస్తవికాలను మనము చూడగలమా అనే విషయాన్ని ప్రయోగముల ద్వారా పరీక్షించి తెలిసికొనడం మొట్ట

మొదట చేయవలసిన పని. ఆ విధంగా నిందా ప్రశంసాభావములకు మీ మనస్సులో చోటీయ కుండా మీరు వాస్తవికాలను చూడగలిగినట్లయితే, ఆ చూచే ప్రక్రియలోనే మనస్సు తనకును వాస్తవికాలకును మధ్య కట్టుకొన్న అడ్డుగోడలన్నీ కూలిపోవడం మీరు కనుగొనగలరు.

ప్రజల చేత గొప్పవాడని పిలువబడే ఒక వ్యక్తిని మీరేవిధంగా సమీపిస్తారో, ఊరక మీలో మీరు పరిశీలించి చూచుకోండి. గొప్పవాడనే పదము మిమ్ము ప్రభావితము చేసియున్నది. వార్తా పత్రికలు, పుస్తకాలు, అతని అనుయాయులు — అందరు అతనిని గొప్పవాడని చెప్తుతుంటారు. ఆ మాటలను మీరు నమ్మినారు. లేదా దానికి విరుద్ధమైన అభిప్రాయం మీరు కలిగి వుంటారు. "వీడెంత తెలివి తక్కువ మనిషి, వీడా గొప్పవాడు? కానేకాదు" అని మీరనుకొంటారు. అట్లుగాకుండా మీరు మీ మనస్సును ఇటువంటి బాహ్య ప్రభావాల నుండి విముక్తము చేసికొని కేవలం యథార్థ విషయాలను చూడగల్గితే, వాస్తవమేమిటో చూడగల్గితే అప్పుడు మీరనుసరించే మార్గము వేరుగా వుంటున్నట్లు తెలిసికోగలరు. అదేవిధంగా 'పల్లెటూరి మనిషి' అనే మాట వినగానే దానితో బాటు మనస్సునకు తోచెడి నిర్భర దారిద్ర్యము, మాలిన్యము, మురికి — ఇవి గాని, ఇంకా ఇటువంటివేవైనా సరే మన ఆలోచనలను ప్రభావితము చేస్తాయి. కాని మన మనస్సు వాటి ప్రభావమునకు లొంగక, దానినుండి విముక్తమై దేనినీ నిందించక, దేనినీ ప్రశంసించక కేవలం పరిశీలనాదృష్టితో చూస్తూవుంటే, అప్పుడా మనస్సు స్వాత్మ నిష్ఠముకాదు. అప్పుడిక స్వార్థము నిస్స్వార్థముగా మారడం కోసం ప్రయత్నించడమనే సమస్యే వుండదు.

3. ప్రశ్న:- పుట్టినది మొదలు చచ్చిపోవువరకు వ్యక్తి యెల్లప్పుడు ప్రేమ కోసం పరితపిస్తూ వుంటాడు. అతని కా ప్రేమ లభ్యం కాకపోతే అతడు తక్కిన తన తోడి వారివలె గుండె నిబ్బరము కలిగి ధైర్య విశ్వాసములతో శాంతంగా వుండలేదు. ఎందువలన?

కృష్ణమూర్తి:- అతని తోడి వారికి ధైర్యవిశ్వాసములుంటాయని మీరనుకొంటున్నారా? ఉండవు. వారు గర్వంతో ఠీవిగా నడవవచ్చు, దర్పం చూపవచ్చు. కాని పైకి కనబడే ఆ ధైర్య విశ్వాసాల వెనుక చాలమంది మెదడులు ఖాళీ, వాటిల్లో ఏమీ వుండదు. వారు స్తబ్ధులు, వారి బుద్ధి మట్టము, వారిలో నిజమైన ధైర్యవిశ్వాసాలుండవు. అది సరే, అసలు మనమితరుల ప్రేమ నెందుకు కోరుకొంటున్నాము? మీ తల్లి దండ్రులు, మీ ఉపాధ్యాయులు, మీ స్నేహితులు మిమ్ము ప్రేమించాలని మీరు కోరుకొనడం లేదా? మీరు పెద్దవారైతే మీ భార్య, మీ భర్త, పిల్లలు లేదా మీ గురువు మిమ్ము ప్రేమించాలని కోరుకొంటారు. ప్రేమ కోసమై యీ అంతులేని తపన ఎందుకని? ఇక చెప్పేది జాగ్రత్తగా వినండి. మీరు ప్రేమించరు కాబట్టే మీరితరుల ప్రేమ కోసం తహతహ లాడుతున్నారు. కాని మీరు ప్రేమించ సాగితే ఆ క్షణము నుండి మీ తహతహ అంతమవుతుంది. అప్పటి నుండి ఎవరో యితరులు మిమ్ము ప్రేమిస్తున్నారా లేదా అనే ప్రశ్న వుండదు. దానిని గురించి విచారిం చనే విచారించరు. మీరితరులనుండి ప్రేమను కోరుకొంటున్నంతవరకు మీలో ప్రేమ లేనట్లే. మీలో ప్రేమ లేకపోతే మీరు సౌందర్యహీనులు క్రూరులు. అందువలన ఎవరైనా మిమ్మెందుకసలు ప్రేమించాలి? ప్రేమ లేనిచో మీరు మృతప్రాయులు; మృత పదార్థము ప్రేమను యాచిస్తే అది యింకను మృత పదార్థమే. అట్లు గాక మీ హృదయము ప్రేమతో నిండి వుంటే, అప్పుడు మీరు ప్రేమించమని ఎవరినీ అడగనే అడగరు; ప్రేమభిక్ష పెట్టుమని మీరు మీ భిక్షాపాత్రను ముందుకు చాచరు. ఏమీ లేని వారే తమ పాత్రను నింపమని అడిగేవారు. ప్రేమశూన్యమగు హృదయము ప్రేమకోసమై గురువుల వెంటబడినా, ఇంకా అనేక విధాల ఎంతగా ప్రయత్నించినా, అది యెన్నటికిని ప్రేమతో నింపబడదు.

4. ప్రశ్న:- పెద్దవాండ్లు దొంగతనమెందుకు చేస్తారు?

కృష్ణమూర్తి:- అప్పుడప్పుడు మీరు దొంగిలించరా? ఒక చిన్నపిల్ల వాడు తనకు కావలసిన దానిని వేరే పిల్లవాని దగ్గరినుండి దొంగిలించి

తీసికోవడం మీరెరుగరా? మనం పిల్లలమైనా పెద్దలమైనా జీవితమంతా ఇట్లాగే జరుగుతుంటుంది. అయితే పెద్దవాండ్లు తాము చేసే 'దొంగత నాన్ని ఇంకొంత ఉపాయంగా ఇంకొంత నేర్పుగా అందమైన మాటలు చెబుతూ చేస్తారు. వాండ్లకు ధనం కావాలి, అధికారం కావాలి, హోదా కావాలి. అందుకోసమై వాండ్లు ఇతరుల కన్ను గప్పుతారు, ఉపాయాలు పన్నుతారు, కారణాలు చెప్పి సమర్థించుకొంటారు. వాండ్లు దొంగిలి స్తారు. కాని దానిని దొంగతనమని అనరు. దానికేదో గౌరవనీయ మైన పేరు పెడతారు. మరి, అసలు మన మెందుకు దొంగిలిస్తాము? మొట్ట మొదటిది, ఇప్పుడు సంఘం వున్న తీరును బట్టి చాలమందికి జీవి తావశ్యకములైన వస్తువులు కూడ దొరకకుండ పోతున్నాయి. కొందరికి తగినంతగా తిన తిండి, కట్ట గుడ్డ, ఉండ నీడ లేవు. అందువలన వాండ్లిటువంటి పనులేవో చేస్తారు. వాండ్లు గాకుండ సంఘ వ్యతిరేకు లనబడే వారు కొందరుంటారు. వాండ్లకు తగినంత తిండివున్నా సరే, దొంగతనం చేస్తుంటారు. వాండ్లకు దొంగతనం ఒక వినోదం వంటిది, తాత్కాలికోద్రేకాన్ని కలిగిస్తుంటుంది. అంటే దాని భావం, వాండ్లకు నిజమైన విద్య లభింపలేదని. నిజమైన విద్య అంటే జీవితము యొక్క మహత్త్వమును, దాని అర్థమును తెలిసి కోవడం; అంతేగాని కేవలం పరీక్షలు వ్రాసవడం కోసం పాఠాలు బట్టీ పట్టడం కాదు. ఇది కాకుండా ఉన్నత స్థాయిలో దొంగతన మొకటున్నది — ఇతరుల అభిప్రాయాలను, ఇతరుల జ్ఞానాన్ని దొంగిలించడం. ఇంకా ఇంకా కావాలి అని మనము కోరుతున్నామంటే దాని అర్థం మనం దొంగతనం చేస్తున్నట్లే.

మనమెందువలన ఎల్లప్పుడు అడుగుతూ వుంటాం, యాచిస్తూ వుంటాం, కోరుతూ వుంటాం, దొంగిలిస్తూ వుంటాం? దానికి కారణం మనలో అంతా శూన్యమే; ఆంతరికంగా మానసికంగా మనం ఖాళీ పీపాల వంటి వాళ్ళం. మనలోపల ఏమీలేకపోవడం చేత అంతఃశూన్యులమవడం చేత వస్తువులను దొంగిలించియేకాదు, ఇతర్మలను అనుకరించి కూడ మనలను మనం నింపుకోవడానికి ప్రయత్నిస్తూ వుంటాము. అనుకరణ ఒక విధమైన దొంగతనం. "మీరెందుకును పనికిరారు, మీలో ఏమిన్నీ

లేదు, ఆయన గొప్పవాడు, అందువలన ఆయనను అనుకరిస్తే ఆయన గొప్పతనం లోని కొంతభాగం మీకున్ను దక్కుతుంది". ఇటువంటి భ్రష్టాచారము, మానవజీవితమంతటా మొదటి నుండి తుదివరకు నిండి వుంది. దాని నుండి విముక్తి పొందినవారు ఏ కొద్దిమందో! కాబట్టి ఈ ఆంతరిక శూన్యతను ఎప్పటి కైనా నింప సాధ్యమా? అనేది తెలిసి కోవడం ముఖ్యం. మనస్సు తన్ను దాను నింపుకోడానికి ప్రయత్నిస్తూ వున్నంతకాలము అది ఖాళీగానే వుంటుంది. మనస్సు తనలోని ఖాళీని తనలోని శూన్యతను నింపుకోడానికి చేసే ప్రయత్నమునే మానివేస్తే అప్పుడా శూన్యత కిక అస్తిత్వమే వుండదు. అప్పుడది స్వయంపూర్ణము.

4 ఫిబ్రవరి, 1955

12

సత్యము - మనస్సునకందనిది

మీకు తెలుసా, చాల ప్రశాంతంగా కూర్చుంటే ఎంత బాగుం టుందో! తిన్నగా కూర్చోండి, అటునిటు ఒరగకుండా వంగకుండా, సమ తూకంగా, ఠీవిగా. అట్లా కూర్చోవడం ఎంత ముఖ్యమో ఆ ఆకులులేని చెట్లవైపు చూడడంగూడ అంతే ముఖ్యం. ప్రాతఃకాల కాంతిరేఖలతో తెలుపెక్కిన ఆ నీలాకాశాని కెదురుగా ఆ చెట్లు ఎంత అందంగా నిల బడి వున్నాయో మీరు గమనించారా? ఆకులన్నీ రాలిన వట్టి కొమ్మలు చెట్టుయొక్క అందాన్ని వెల్లడి చేస్తాయి. చెట్లు చిగిరించే వసంత ఋతువులోగాని, ఎండలు కాసే గ్రీష్మ ఋతువులోగాని, ఆకులురాలే శరదృతువు, హేమంత ఋతువులోగాని ఎప్పుడైనాసరే చెట్ల సౌందర్య మద్భుతము. ఋతువులతోబాటు వాటి సౌందర్యముకూడ మారుతూ వుంటుంది. దీనిని గుర్తించడం ఎంత ముఖ్యమో మనము మన జీవిత విధానాలను గూర్చి ఆలోచించడం కూడ అంతే ముఖ్యము.

రష్యాలో వున్నా, అమెరికాలో వున్నా, భారతదేశంలో వున్నా మనమందరము మానవులము. మానవులముగా మన అందరి సమ స్యలు ఒకటే. వాటిలో భేదములేదు. అసలు మనలను మనము హిందువులముగా అమెరికనులముగా, రష్యనులముగా, చైనా వారముగా ఇట్లా వేర్వేరుగా భావించుకోవడం సమంజసమైనపని కాదు. రాజకీయ భేదములు, భౌగోళిక భేదములు, జాతిభేదములు, ఆర్థిక భేదములున్నవ నుట నిజమే. కాని ఆ భేదములకు ప్రాధాన్యమిస్తే పరస్పర విరోధము విద్వేషము పెచ్చు పెరిగిపోతాయి. ప్రస్తుతానికి అమెరికావారు తక్కిన వారికంటె మించి సంపన్నులై అభివృద్ధిలో నుండి యుండవచ్చు — అంటే దాని అర్థం, వారివద్ద నానా యంత్రపరికరాలు, రేడియోలు,

దూరదర్శిని యంత్రాలు*, ఆహారధాన్యాలతో సహా అన్నీ యెక్కువెక్కువగానే వుంటాయి. మరి యీ దేశంలోనో, ఎక్కడ చూచినా ఆకలి చావులు, కశ్మలము, మితిమీరిన జనాభా, నిరుద్యోగము. కాని మనమెక్కడ వున్నా సరే ఎట్లున్నా సరే, మనమందరము మానవులము; మానవులముగా మనం సమస్యలను సృష్టించుకొంటూ వుంటాము. అయితే హిందువులముగా, అమెరికనులముగా, ఆంగ్లేయులముగా లేదా తెల్లవారముగా, నల్లవారముగా, గోధుమరంగువారముగా, పసుపురంగు వారముగా ఇట్లా వేరువేరుగా మనలను మనం భావించుకొనడంచేత, అనవసరంగా మనమధ్య మనం అడ్డుగోడలను నిర్మించుకొంటున్నామనే విషయాన్ని గ్రహించడం చాల ముఖ్యం.

ఇప్పుడు మనకున్న ఒక పెద్ద కష్టమేమిటంటే ప్రపంచమంతట ఆధునిక విద్య యొక్క ప్రధానలక్ష్యం మనలను కేవలం సాంకేతిక నిపుణులముగా తయారుచేయడం. జెట్ విమానాల నెట్లు నిర్మించవలెనో, సిమెంటు రోడ్లనెట్లా వేయవలెనో, కార్లనెట్లా తయారుచేయవలెనో, అత్యాధునికమైన న్యూక్లియర్ జలాంతర్గాముల నెట్లా నడపవలెనో మనం నేర్చుకొంటున్నాం. ఈ సాంకేతిక విద్యలో మునిగిపోయి మనం మానవులమనే మాటనే మరిచిపోతున్నాం. అంటే మనము మనసా కల్పితములైన వస్తువులతో హృదయాలను నింపుకొంటున్నాం. అమెరికాలో స్వయంచాలిత యంత్రము (automation) గంటలకొలది చేయవలసియున్న శారీరిక పరిశ్రమనుండి రానురాను అధికాధిక కార్మికులకు విశ్రాంతి నిప్పిస్తున్నది. త్వరలోనే యీ దేశంలో గూడ ఆ మార్పు రాబోతున్నది. అప్పుడు లభించే యీ తీరిక సమయాన్ని మనమెట్లా ఉపయోగపరచుకోవాలి అనే చాల తీవ్రమైన సమస్య మనల నెదుర్కొంటుంది. వేలకొలది కార్మికులు పనిచేసే పెద్దపెద్ద కర్మాగారాలు బహుశా యే కొద్దిమంది సాంకేతిక నిపుణుల చేతనే నడుపబడవచ్చు. అప్పుడు మిగిలిన కార్మికుల గతి యేమౌతుంది? వారికింక రోజంతా తీరికయే, ఏంచేస్తారు ఆ మిగిలిన కాలమంతా? ఈ సమస్యను మరి తక్కిన

* అనాటి కవి యింకను భారతదేశానికి ప్రచురంగా వచ్చియుండలేదు.

మానవసమస్యలను నేటి విద్యావిధానం లెక్కలోకి తీసికోకపోతే, మన జీవితాలు సారహీనములౌతాయి, నిరర్థకాలవుతాయి.

ఇప్పుడును మన జీవితాలు పూర్తిగా అర్థ రహితములు సారహీన ములే. కాదా? మీకు కళాశాల డిగ్రీ వుండవచ్చు, పెండ్లి చేసికొని ధనవంతులై యుండవచ్చు, తెలివితేటలుండవచ్చు, ఎంతో విషయపరి జ్ఞానముండవచ్చు, అత్యాధునిక గ్రంథములు చదివి యుండవచ్చు. కాని మనఃకల్పితములగు వస్తువులచే మీ హృదయము నింపుకొంటున్నంతవరకు మీ జీవితము సారహీనము సౌందర్య రహితమునగుట తప్పదు. అట్టి జీవితమున కర్థమేమంతయుండదు. మనః కల్పితములగు వస్తువులు హృద యమునుండి కడిగివేయబడినప్పుడే జీవితములోనికి అందము వస్తుంది, అర్థముంటుంది.

చూడండి, ఇదంతా మనందరి వ్యక్తిగత సమస్య; మనకు సంబం ధములేని ఊహాకల్పిత సమస్య కాదు. మానవులమైన మనకు మన ముండే భూమిని గురించిన అందలి వస్తువుల గురించిన జాగ్రత్తయెట్లు తీసికొనవలెనో తెలియకపోతే, మనకు మన పిల్లల నెట్లా ప్రేమించవలెనో తెలియకపోతే, కేవలం మన గురించే మనము చూచుకొంటూవుంటే, కేవలం మన వ్యక్తిగతమైన లేదా మనజాతి యొక్క విజయాభ్యుదయ ములతోనే మనకు సంబంధమైనట్టయితే మనము మన యీ ప్రపంచాన్ని భయంకరంగా తయారుచేస్తాము. మనమాపని అప్పుడే మొదలుపెట్టినాము కూడ. ఒక దేశము చాల సంపన్నమైనది అయితే కావచ్చు. కాని దాని సంపద, మరియొక దేశము ఆకలితో అల్లాడిపోతూ వున్నంత కాలము, విషముతో సమానము. మనమంతా ఒకే మానవజాతి, మనందరికి ఈ భూమిలో భాగమున్నది. ప్రేమపూర్వకమైన శ్రద్ధ చూపిస్తే ఈ భూమి మనకందరికిని సరిపడ తిండి, గుడ్డ, నీడ ఈయగలదు.

కాబట్టి విద్యయొక్క కర్తవ్యము ఏవో కొన్ని పరీక్షలు పాసవడం కోసం మిమ్ము తయారుచేయడం మాత్రమేకాదు, ఈ జీవిత సమస్య నంతటిని అర్థము చేసికొనడంలో మీకు సహాయపడవలెను కూడ. జీవిత

సమస్యయంటే అందులో కామవాంఛ, జీవనాధారాన్ని సంపాదించుకో వడం, సుఖసంతోషాలతో నవ్వుకోడం, గౌరవ కలిగివుండడం, చిత్త శుద్ధి కలిగివుండడం, లోతుగా ఆలోచింపగల్గివుండడం — ఇవన్నీ చేరివుం టాయి. దేవుడనగా నేమిటో కనుగొనడం కూడ మన సమస్యయే, అదే మన జీవితానికి అసలు పునాది. సరియైన పునాది లేనిదే ఇల్లు చాలకాలము నిలబడలేదు గదా. దేవుడు లేక సత్యమననేమో తెలిసి కొనడానికై మనము ప్రయత్నించకపోతే మానవుడెంతో చాతుర్యముతో కనిపెట్టిన నూతన యంత్రపరికరములన్నియ్ను (inventions) అర్థరహిత ములైపోతాయి.

దీనినంతా అర్థము చేసికొనడంలో అధ్యాపకుడు మీకు సహాయపడ గలిగి వుండవలెను. మీరు దీనిని చిన్నతనంలోనే అర్థము చేసికోడానికి ఆరంభింపవలెగాని అరవయ్యేండ్లు వచ్చిన తరువాత కాదు. అరవయ్యేండ్ల వయస్సులో మీరు దేవుణ్ణి కనుగొనలేరు. ఆ వయస్సులో ఎక్కువమంది జీవితంలో అలిసిపోయి వుంటారు. అంతము సమీపించి వుంటారు. మీరు చాల చిన్నపిల్లలుగా వున్నప్పుడే సత్యాన్వేషణ ఆరంభించాలి. మాన వులు తమకు దాము సృష్టించుకొనే రకరకాల తుపానులలో పడిపోకుండ నిలవడం కోసం చిన్నప్పుడే మీరు మీ యింటికి సరియైన గట్టి పునాది వేయ గలిగివుండాలి. అప్పుడు మీరు సుఖంగా జీవింపగలరు. కారణ మేమంటే మీ సుఖమప్పుడు మరి దేనిమీదను ఆధారపడి వుండదు. అది చీరెసారెలమీదను, నగలు నాణ్యములమీదను, కార్లు, రేడియోల లమీదను, ఒకరి ప్రేమమీదగాని తిరస్కారంమీదగాని ఆధారపడివుండదు. మీరు సుఖంగా వుండడానికి కారణము మీదగ్గర ఏదో వుందనికాదు; పదవి, పాండిత్యము, అధికారము, ఐశ్వర్యము వున్నాయనికాదు. మీ జీవి తము స్వతహాగా అర్థవంతమవడమే దానికి కారణము. అయితే ఆ జీవిత సార్థక్యమును, ఏ క్షణమున కాక్షణము మీరు సత్యాన్వేషణ చేస్తూ వున్నప్పుడే పొందగలరు. సత్యము ప్రతిదానిలోను ఉన్నది. అది క్రైస్తవుల చర్చిలో, హిందువుల మందిరంలో, మహమ్మదీయుల మసీదులో లేదా కర్మకాండలలో వెదికితే దొరికేది కాదు.

సత్యమును కనుగొనవలెనంటె, దానిమీద అనేక శతాబ్దాలనుండి పడి పేరుకొనిపోయిన దుమ్మును ఎట్లా దులపవలెనో దానినెట్లా తొలగించవలెనో ముందు మనము తెలిసికోవలసి వుంటుంది. ఇంతకు దయచేసి నామాట వినండి – సత్యాన్వేషణమే నిజమైన విద్య. ఏ కొంచెం తెలివి గలవాడైనా పుస్తకాలు చదివి, సమాచారాన్ని సేకరించి, ఒక హోదా సంపాదించుకొని, దోపిడీ విధానము కొనసాగింపవచ్చు. పరులను తన స్వార్థమునకై ఉపయోగించుకొనవచ్చు. కాని అది విద్యకాదు. ఏవో కొన్ని పాఠ్య విషయాలు చదవడం విద్యలో అత్యల్ప భాగము మాత్రమే. జీవితంలోని అధికభాగంకోసం మనం చదివింపబడలేదు. అందుకు సరియైన మార్గము కూడ మనవద్ద లేదు. ఆ మార్గమును తెలిసికొనడమే విద్య.

ఏ సత్యముతోడి సంబంధముచే మనదైనిక జీవనము, మన రేడియోలు, కారులు, విమానములు — ఇవియన్నియు సార్థకము లౌతున్నాయో, ఆ సత్యము, తనయందు వీటినన్నిటిని కలిగియుండడమే గాక, వీటి కతీతముగా కూడ — అంటే సర్వవ్యాపకమై వుంటుంది. అట్టి సత్యమును దర్శించుటకు సహాయపడునదే విద్య. ఆ విద్య నిజమైన మతమును తెలిసికొనుటతో ఆరంభించవలెను. నిజమైన మతమునకు పురోహితులు పూజారులతోగాని, గుడులు గోపురములతోగాని, తమతమ మతములకు సంబంధించిన పిడివాదములతోగాని, నమ్మకాలతోగాని సంబంధములేదు. నిజమైన మతమంటే నిర్హేతుకమైన ప్రేమ కలిగివుండడం, ఔదార్యము కలిగివుండడం, మంచివాడై వుండడం. అప్పుడే మనము నిజమైన మానవుల మనిపించుకొంటాము. కాని ఆ మంచితనము, ఆ ఔదార్యము, ఆ ప్రేమ సత్యాన్వేషణ ద్వారానే లభిస్తాయి, వేరే మార్గమున లభింపవు.

దురదృష్టవశాత్తు ఈ విశాలమైన జీవితక్షేత్రమంతయు పేరుకు మాత్రము విద్యయైన నేటి విద్యచేత ఉపేక్షింపబడినది. అర్థమేమంత లేని పుస్తకాలలోను, అంతకంటె నిరర్థకములైన పరీక్షలు పాసవడంలోను మీరెల్లప్పుడు నిమగ్నమైవుంటారు. వాటివలన మీకేదైనా ఉద్యోగం దొరకవచ్చు; అదే దానివలన ఉపయోగం. కాని ఇక కొద్దికాలంలో ఎక్కువ

కర్మాగారాలు దాదాపు పూర్తిగా యంత్రముల చేతనే నడపబడతాయి. అందువలన మన తీరిక సమయమెక్కువౌతుంది. ఆ తీరిక సమయాన్ని సరియైన మార్గంలో — అంటే ఏవో ఆదర్శాలను సాధించడంలో గాకుండా మనకిప్పుడేమీ తెలియనిదై బొత్తిగా అజ్ఞాతంగా వుండివున్న మన జీవితంలోని విశాలభాగాన్ని దర్శించి అర్థం చేసికోవడంలో — ఎట్లా వుపయోగించుకోవాలో మనమిప్పటినుండే నేర్చుకోవాలి. నేర్పుగా వాదములు గావిస్తూ వుండే మనస్సుకాదు సర్వస్వము; దానికతీతంగా విశాలమై అప్రమేయమైన దొకటున్నది. అది అత్యంత సుందరమైనది. దానిని మనస్సు గ్రహింపజాలదు, దానికది అర్థము కాదు. అనంతము, అప్రమేయమగు (immensity) నద్దానిలో ఆనందపారవశ్యమున్నది, మహిమ (glory) వున్నది. అందులో జీవించడము మరియు దానియొక్క అనుభూతిని పొందడమే విద్య. అటువంటి విద్య మీకు లేనిచో, మీరు బడివదలి బయటి ప్రపంచములోనికి పోయినప్పుడు, - గడచిన తరముల వారు సృష్టించి పెట్టిన యీ భయంకరమైన గందరగోళాన్ని మీరు శాశ్వతం చేస్తారు.

కాబట్టి ఉపాధ్యాయులారా, విద్యార్థులారా, దీని గురించి మీరంతా ఆలోచించండి. అది బాగాలేదని ఇది బాగాలేదని తప్పులెన్నకండి; సరియైన మతమననేమో విచారణ చేయడానికై, దానిని ప్రేమించడానికై, దాని గురించి పనిచేయడానికై, దానిలో జీవించడానికై ఉపయోగపడే సంస్థ నొకదానిని సృష్టించడంకోసం మీరంతా కలిసి, చేతులు చేతులు కలిపి, పనిచేయండి, అందుకు సహాయపడండి. అప్పుడు జీవితము అద్భుతముగా సుందరము, సుసంపన్నము అవుతుంది. ప్రపంచంలోని బ్యాంకు ఖాతాలన్నీగూడ దానిముందు ఎందుకును కొఱగావు.

1. ప్రశ్న:- మనిషికింత జ్ఞానం ఎట్లా లభించింది? అతడు భౌతికంగా ఎట్లు పరిణతి చెందినాడు? ఇంత గొప్ప శక్తి సామర్థ్యాలు అతనికెక్కడి నుండి వచ్చినవి?

కృష్ణమూర్తి:- "మనిషి కింతజ్ఞానం ఎట్లా లభించింది?" ఇది చాలా తేలిక. మీకు కొంత తెలుసు, దానిని మీరు మీ పిల్లలకు అందజేస్తారు. దానికి వారు మరికొంత జ్ఞానము కలిపి తమ పిల్లలకు అందజేసి కొంటారు. ఈ విధంగా యుగాల కొలది జరుగుతూ వచ్చింది. కొంచెం కొంచెంగా మనము జ్ఞానాన్ని ప్రోగుచేసికొంటూ వుంటాము. మన ముత్తాతలకు నేటి జెట్ విమానాలను గురించిగాని; విద్యుచ్ఛక్తి యొక్క అద్భుత చమత్కారాలను గురించిగాని బొత్తిగా తెలియదు. కాని జిజ్ఞాస, కుతూహలము, ఆవశ్యకత, యుద్ధము, భయము, అత్యాశ — ఇవన్నీ జ్ఞానము క్రమక్రమముగా అభివృద్ధి అవడానికి తోడ్పడినవి.

సరే, మరి యీ జ్ఞానము గురించి వింతవిషయ మొకటున్నది. మీకెంతో తెలిసివుండవచ్చు, ఎంతో సమాచారాన్ని రాసులకొలది మీరు సేకరించివుండవచ్చు. కాని జ్ఞానమేఘముచే ఆవృతమైన మనస్సు తాను సేకరించిన సమాచారముతో బరువెక్కిన మనస్సు సత్యమును దర్శింపజాలదు. నూతనముగా దేనినీ కనుగొనలేదు. ముందే కనిపెట్ట బడిన దానిని దేనినైనా, మనస్సు తన జ్ఞానముయొక్క సహాయముతో ఉపయోగమునకు తేవచ్చును. కాని నూతనముగా కనిపెట్టబడునదేదైనా సరే, అది మౌలికము. అది జ్ఞాననిరపేక్షము — అంటే ఇంతవరకు కూడబెట్టుకొన్న జ్ఞానముతో సంబంధము లేకుండా, అది మనస్సులో తటాలున విచ్చుకొన్నట్లు, బ్రద్దలయినట్లు, భగ్గుమనినట్లు తనంతతానే స్ఫురిస్తుంది. ఇట్టి విస్ఫురణము, ఇట్టి హఠాద్దర్శనము అత్యావశ్యకము. చాలమంది, ముఖ్యంగా ఈ దేశంలో, జ్ఞానభారము చేత, సంప్రదాయ ముచేత, స్థిరాభిప్రాయములచేత, తల్లిదండ్రులు ఇరుగుపొరుగువారు ఏమం టారో అనే భయంచేత ఎంతగా అణగిపోయినారంటే, వారిలోని మనో ధైర్యమంతా నశించిపోయినది. వారు మృతప్రాయులు — జ్ఞానభారము వలన మనస్సునకు కలిగే ఫలితమిది. జ్ఞానము ఉపయోగకరమే; కాని దానితోబాటు మరియొకటి లేకపోతే అది వినాశకరము గూడాను. దీనిని నేటి ప్రపంచ సంఘటనలు రుజువు చేస్తున్నాయి.

ప్రపంచమంతటా ఏమి జరుగుతున్నదో చూడండి. అత్యాశ్చర్య కరములయిన వెన్నో నూతనముగా కనిపెట్టబడినవి — విమానమింకా ఎన్నో మైళ్ళు దూరమున వున్నప్పుడే అది వస్తున్న సంగతిని కని పెట్టి చెప్పగలిగిన రాడారు యంత్రములు, సముద్రము అడుగునకుబోయి ఒక్కసారి గూడ బయటికి రాకుండా నీళ్ళ లోపలనే వుంటూ ప్రపంచమంతను చుట్టిరాగల జలాంతర్గాములు, బొంబాయినుండి వారణాసికి లేదా న్యూయార్కుకు నేరుగా మాట్లాడగల్గడమనే వింత — ఇదంతా జ్ఞానము వలన వచ్చిన ఫలితము. కాని మనలో తప్పక ఉండవలసినది మరియొకటి మనవద్ద లేదు. అందువలన జ్ఞానము దురుపయోగము చేయబడుతున్నది — యుద్ధము, విధ్వంసము, దైన్యము, దుఃఖము, లక్షలకొలది ప్రజలు తిండిలేక బాధపడడము, వాండ్లకు దినమునకొక పూట తిండి — ఒక్కొక్కసారి అదికూడ వుండదు. ఇటువంటి విషయాలన్నీ మీకు బొత్తిగా తెలియనే తెలియదు. మీకు తెలిసినదెల్లా బనారసులోనో, ఢిల్లీలోనో, బొంబాయిలోనో ఏదో ఒక మారుమూల ప్రాంతంలో మీ పుస్తకాలు, మీకున్న చిన్నచిన్న సమస్యలు, మీకు గల చిన్నచిన్న సరసాలున్ను సరదాలున్ను. చూడండి, మనకెంతో జ్ఞానముండవచ్చు. కాని దానితోబాటు ఉండవలసినది మఱియొకటి — దేని సహాయముతో మానవుడు జీవిస్తాడో, దేనిలోనైతే అనందము, మహిమ, పరమసుఖము ఉన్నవో — అది, లేకుండుటవలన మనలను మనము నాశనము చేసికొనబోతున్నాము.

ఇక భౌతికంగా కూడ ఇట్లే జరిగినది. భౌతికంగా మనిషి ఇట్లే క్రమపరిణతి చెందినాడు. మరి అతనికి ఇంత అధికమైన శక్తిసామర్థ్యాలు ఎక్కడినుండి వచ్చినాయి? క్రొత్తక్రొత్త యంత్రములను కనిపెట్టినవారు, క్రొత్తక్రొత్త ప్రదేశాలను పరిశోధించినవారు, వివిధరంగాలలో క్రొత్తక్రొత్త వాటిని వెదికి ప్రకాశమునకు దెచ్చినవారు — ఇటువంటి గొప్పవారందరికి అపరిమితమైన శక్తిసామర్థ్యాలు వుండియుండాలి. కాని మనలో చాలమందికి గల శక్తిసామర్థ్యాలు అత్యల్పము, కాదా? మనం చిన్న పిల్లలముగా వున్నప్పుడు ఆటలాడుకొంటాము, ఎగతాళి చేసికొంటాము,

నాట్యమాడుతాము, పాటపాడుతాము. కాని మనం పెద్దవాండ్లమయ్యే టప్పటికి ఆ శక్తి అంతా త్వరలోనే నశించిపోతుంది. అది మీరు గుర్తిం చలేదా? మనం అలసిపోయి ఉసూరుమనే గృహిణులమన్నా ఔతాము లేదా, ఏదో కార్యాలయానికి, దినంతరువాత దినం, నెల తరువాత నెల పోయి గంటల తరబడి పనిచేస్తూ వుంటాం — కేవలం జీవనాధారం సంపాదించుకోవడం కోసం. అందువలన సహజంగానే మనలో వున్న శక్తి అంతా దాదాపుగా నశిస్తుంది. ఒకవేళ మనలో గనక శక్తి వున్నట్లయితే యీ క్రుళ్ళిన సంఘాన్ని నాశనం చేసివుండే వాళ్ళం. సంక్షోభం తెచ్చి పెట్టే వాండ్లం. అది సంఘాని కిష్టముండదు. కాబట్టి మనలోవుండే ఆ శక్తిని విద్యద్వారా, సంప్రదాయాల ద్వారా, మతమనబడేదాని ద్వారా, సంస్కృతి అనబడేదాని ద్వారా అణచి వేస్తుంది. చూడండి, నిజమైన విద్యయొక్క కర్తవ్యమేమంటే మనలోని శక్తిని మేల్కొలిపి దానిని ప్రజ్వ లింప జేయడం; అది మధ్యలో ఆగిపోకుండ, బలంగా దృఢంగా తీవ్రంగా వుండునట్లు చూడడం; అది తన్నుదాను సహజంగానే అదుపులో వుంచు కొంటూ సత్యాన్వేషణకై స్వయంగా పనిచేయునట్లు చూడడం. అప్పుడా శక్తి అపారము, అనంతము అవుతుంది. అప్పుడది మరి యేమాత్రము దైన్యమును కలిగించదు సరి కదా స్వయంగా నూతన సమాజమును సృష్టిస్తుంది.

నేను చెప్పేదానిని శ్రద్ధగా వినండి, ఏదో లే, యని ప్రక్కకు త్రోసివేయకండి. ఇది చాల ముఖ్యమైన విషయం. ఊరక, అంగీ కరించితిమనిగాని, అంగీకరించలేదనిగాని చెప్పవద్దు. చెప్పుతూ వున్న విషయాలలో సత్యమున్నదా లేదా యని మీ యంతట మీరు తెలిసి కోండి. నిర్లక్ష్యంగా వుండవద్దు; అటు ఉడుకుగానైనా వుండాలి లేదా ఇటు చల్లబడైనా పోవాలి. ఇందులోని సత్యమును మీరు చూచినట్ల యితే, దాని గురించి మీరు నిజంగా వేడెక్కి వున్నట్లయితే, ఆ వేడిమి, ఆ శక్తి వృద్ధిపొంది నూతన సమాజమును నిర్మిస్తుంది. అది కేవలం ప్రస్తుతమున్న సంఘంలోనే తిరుగబడి, ఆ విధంగా తన్నుదాను వ్యర్థము చేసికొనదు. ప్రస్తుత సంఘంలోనే తిరుగబడడమంటే, తానున్న చెఱసాల

గోడలకు రంగుపూసి అలంకరించడమే.

కాగా, మన ప్రస్తుత సమస్య, ముఖ్యంగా విద్యకు సంబంధించినంతవరకు ఏమిటంటే, మనకున్నశక్తి, అది యెంతైనాగానీ, దానిని ఎట్లా నిలబెట్టుకోవాలి, దానికింకా ఎక్కువ ఉత్తేజాన్ని, ఇంకా యెక్కువ తీవ్రంగా ప్రజ్వరిల్లగల వేగాన్ని ఎట్లా కలిగించాలి అని. దీనికెంతో అవగాహన అవసరం కాబోతుంది. ఎందువల్లనంటే అసలు ఉపాధ్యాయులకే సాధారణంగా చాల తక్కువ శక్తి వుంటున్నది. వారు కేవలం తమ జ్ఞానభారంతో క్రుంగిపోయి వున్నారు, తమతమ సొంత సమస్యలలో పూర్తిగా మునిగిపోయివున్నారు. కాబట్టి, యీ సృజనాత్మకశక్తిని మేల్కొల్పడంలో వారు విద్యార్థికి సహాయపడగల స్థితిలో లేరు. అందువలన ఈ విషయాల గురించిన అవగాహన విద్యార్థులకెంత అవసరమో ఉపాధ్యాయులకును అంతే అవసరము.

2. ప్రశ్న:- నేను మతం మార్చుకొంటానని అంటే మా తల్లిదండ్రులకెందుకని అంత కోపం వస్తుంది?

కృష్ణమూర్తి:- మొట్టమొదటిది, వారికి తమ మతమునందు మమకారమెక్కువ. వారి వుద్దేశంలో అదొక్కటే ప్రపంచంలో మతమని పిలవడానికి అర్హమైనది కాకపోయినా, అన్ని మతములకంటె తమ మతమే గొప్పదని మాత్రం తలుస్తారు. అందువలన సహజంగానే మీరు గూడ ఆ మతమునే అనుసరింపవలెనని వారి కోరిక. అంతే గాకుండ మీరుగూడ వారాలోచించినట్లే ఆలోచించాలని, వారి సంప్రదాయాన్ని, వారి జాతిని, వారి తెగను అంటిపెట్టుకొని వుండాలని కోరుకొంటారు. ఇవి కొన్ని కారణాలు. పైగా, చూడండి, మీరు మరియొక మతాన్ని అనుసరించడం మొదలుపెట్టితే, మీ కుటుంబానికి మీరొక కంటకంలాగా తయారై సంకటం తెచ్చిపెడతారు.

కాని మీరొక మతం వదిలిపెట్టి మరియొక మతంలోకి చేరినా ఏమయినట్లు? కేవలం మీరొక చెఱసాలనుండి మరియొక చెఱసాలలోనికి

మారినట్లే కదా? చూడండి, మనస్సు ఒక నమ్మకాన్ని వదలకుండా పట్టుకొని వున్నంతకాలము అది చెఱసాలలో బందీయైవున్నట్లే. మీరు హిందువుగా జన్మించి క్రైస్తవ మతం పుచ్చుకొంటే మీ తల్లిదండ్రులు కోపపడవచ్చు; కాని అది అల్పవిషయము. ఇక్కడ ప్రధానమైన విషయ మేమంటే మీరు వేరొక మతంలోనికి మారినప్పుడు ప్రాతనమ్మకాలను వదిలిపెట్టి, వాటిబదులు క్రొత్త నమ్మకాలను స్వీకరించినట్లు. ఇది మీరు తెలిసికోడం చాలముఖ్యం. మీరింకొంచెం ఎక్కువ చురుకుగా, ఇంకొంత యెక్కువ యిదిగా లేక అదిగా వుండవచ్చు. కాని మీరింకా నమ్మకాల చెఱలో, హఠవాదాల చెఱలోనున్నట్లే.

కాబట్టి మతములు మార్చవద్దు. మార్చడమంటే చెఱసాల నాలుగు గోడలమధ్యనే తిరుగుబాటు చేసినట్లు. దాని బదులు చెఱసాల గోడలను బ్రద్దలుకొట్టి బయటికి వచ్చి దేవుడన ఎవరో, సత్యమననేమో వెదకి తెలిసికోండి. అప్పుడు దానికి అర్థముంటుంది. దానివలన మీకు అపరిమితమైన జీవశక్తి అత్యధికమైన సామర్థ్యము లభిస్తాయి. అంతేగాని కేవలం ఒక చెఱసాల నుండి మరియొక చెఱసాలకు పోవడం, ఏ చెఱసాల మంచిదోయని కలహించడం — ఇదంతా చిన్నపిల్లల చేష్ట.

నమ్మకమనే చెఱసాల నుండి దానిని బ్రద్దలు కొట్టుకొని బయటపడాలంటే పరిణతి చెందిన మనస్సు కావాలి, ఆలోచనాశీలముగు మనస్సు కావాలి. మరియొక చెఱసాలతో పోల్చడంబదులు, తానున్న చెఱసాల యొక్క స్వభావాన్ని అర్థము చేసికోగల మనస్సు కావాలి. దేనినైనా అర్థం చేసికోవాలంటే దానిని మరియొక దానితో పోల్చడం వలన ప్రయోజనం లేదు. పోల్చడంద్వారా అవగాహన కలుగదు. అసలా వస్తువునే పరీక్షించి చూడడంవలన అవగాహన కలుగుతుంది. వ్యవస్థీకృతమైన మతము యొక్క స్వభావమును పరీక్షించి చూచినట్లయితే, అన్ని మతములు — హిందూమతంగాని, బౌద్ధమతంగాని, మహమ్మదీయ మతంగాని, క్రైస్తవమతంగాని, ఇటీవలి కాలంలో మతము యొక్క రూపం ధరించి వచ్చిన సామ్యవాదము (కమ్యూనిజం) గాని, — పరమార్థతః

అన్నీ ఒకేవిధమైనవని మీరు చూడగలరు. చెఱసాలను అర్థము చేసికొన్న క్షణమునుండి — అంటే నమ్మకమునకు, మతవిధులకు, మతగురువులకు సంబంధించిన విషయముల నన్నింటిని స్పష్టంగా చూచి తెలిసికొన్న క్షణమునుండి, మీరింక ఏ మతమునకును చెందరు. ఏలన అసలు నమ్మకమునుండి విముక్తి పొందిన వ్యక్తి మాత్రమే అన్ని నమ్మకములకును అతీతముగా నున్న అప్రమేయమగు దానిని దర్శింపగలడు.

3. ప్రశ్న:- శీలనిర్మాణమునకు నిజమైన మార్గమేది?

కృష్ణమూర్తి:- శీలము కలిగి వుండడమంటే తప్పకుండా అసత్యమున కెదురొడ్డి నిలవగల్గడం, సత్యము నాశ్రయించి దానిని వదలకుండడం. కాని శీలనిర్మాణము మిక్కిలి కష్టమైనపని. ఎందువల్లనంటే మనలో చాలమందికి, తాము స్వయంగా ఏమి ఆలోచిస్తారో అది తెలిసికొనడం కంటె పుస్తకము, ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు, ప్రభుత్వము ఏమి చెబుతున్నారో అది చాల ముఖ్యమని తోస్తుంది. జీవితంలో సుఖం వచ్చినా దుఃఖం వచ్చినా దాని ప్రభావానికి లోనుగాకుండా, తనకు తాను ఆలోచించుకోవడం, సత్యమేదో తెలిసికొని దానిపైన దృఢంగా నిలబడడం — ఇదే శీలనిర్మాణమునకు తోడ్పడునట్టిది.

ఉదాహరణకు, మీకు యుద్ధంలో నమ్మకం లేదు. దానికి కారణం ఎవరో సంస్కర్తగాని, ఎవరో మతప్రవక్తగాని చెప్పడంకాదు. దానిని మీయంతటమీరు ఆలోచించి తెలిసికొన్నారు. మీరు దానిని గురించి పరిశోధన చేసినారు. సమస్యను లోతుగా పరిశీలించి చూచినారు, దానిపైకి మీ ధ్యానమును పోనిచ్చినారు. చంపడం తప్పని తెలిసికొన్నారు. తినడంకోసం చంపినా, ద్వేషము చేత చంపినా, దేశప్రేమ అనబడే దానికోసం చంపినా — దేనికోసం చంపినా, చంపడం చంపడమే. అది తప్పని మీరు దృఢంగా భావిస్తే, దానికోసం జైలుకు పోవలసివచ్చినా, కొన్ని దేశాలలో జరుగుతున్నట్లుగా మీరందుకోసం చంపబడినా, ఏమి జరిగినా సరే, మీరు తెలిసికొన్న ఆ సత్యంకోసం గట్టిగా నిలబడగల్గితే

అప్పుడు మీరు శీలవంతులైనట్లు. అప్పుడు శీలమునకు గల అర్థమే వేరు. అది సంఘముచే అలవాటు చేయింపబడిన శీలముకాదు.

కాని చూడండి, మనలను ఈ దిశవైపు పోవుటకెవ్వరును ప్రోత్స హించరు. అటు అధ్యాపకునికిగాని ఇటు విద్యార్థికిగాని స్వతంత్రంగా ఆలోచించుకొని ఏది సత్యమో తెలిసికోడానికి, ఆ తెలిసికొన్న సత్యముపై నిలబడడానికి, అసత్యమును పోవీడడానికిన్ని తగిన శక్త్యుత్సాహములు లేవు. కాని మీరిది చేయగల్గితే అప్పుడు మీరు ఏ రాజకీయ నాయకునిగాని, ఏ ధార్మిక నాయకునిగాని అనుసరింపరు, అనుసరింపగోరరు. అప్పుడు మీకు మీరే వెలుగవుతారు. మీరు చిన్నపిల్లలుగా వున్నప్పుడే గాకుండ జీవితమంతా ఆ వెలుగును దర్శించడం దానిని పెంపొందించుకొనడమే విద్య.

4. ప్రశ్న:- దేవుని సాక్షాత్కరింప జేసికొనడంలో వయస్సునకు గల ప్రాధాన్యమేమి?

కృష్ణమూర్తి:- వయస్సంటే యేమిటి? మీరు జీవించిన సంవత్స రాల సంఖ్యయా వయస్సంటే? అది ఒక విధమైన వయస్సు. మీరు ఫలానా సంవత్సరంలో పుట్టినారు. ఇప్పుడు మీ వయస్సు పదునైదు, లేదా నలభై లేదా అరవై. మీ శరీరము క్రమంగా ముసలిదై పోతున్నది. అట్లే మనస్సుకు గూడ జీవితమందలి రకరకాల అనుభవాల భారము చేత, దైన్యదుఃఖములచేత, అలసట ఆయాసములచేత ముసలితనము వస్తుంది. అటువంటి మనస్సు సత్యమును దర్శింపలేదు. లేతదై, నిర్మ లమై, అమాయికమైన మనస్సు మాత్రమే సత్యమును దర్శింపగలదు. కాని అమాయికతకు వయస్సుతో సంబంధములేదు. పసిబిడ్డే కాదు అమాయికంగా వుండేది, — ఒకవేళ ఆ పసిబిడ్డ అమాయికంగా ఉండ కపోవచ్చుగూడ; — కాని, అనుభవశేషమును తనలో నిలుపుకోకుండా అనుభవింపగల మనస్సే అమాయికమైన మనస్సు. మనస్సు అనుభవిం పవలసినదే, అది తప్పని సరి. అది ప్రతిదానికిని ప్రతిస్పందింపవలసినదే

— నదికి, జబ్బుపడిన జంతువుకు, దహించడం కోసం తీసికొని పోబడు తున్న మృతశరీరానికి, బాట వెంబడి బరువులను మోసికొని పోతూవున్న పల్లెటూరి బీదప్రజలకు, జీవితమందలి యాతనలకు, దుఃఖములకు — అన్నిటికిని ప్రతిస్పందింపవలసినదే. లేకపోతే ఆ మనస్సు అప్పటికే మృతమైనట్లు. అయితే అనుభవము యొక్క ఆకట్టుకు లోనుగాకుండా అది ప్రతిస్పందింపగలిగి వుండాలి. మనస్సునకు ముసలితనమును తెచ్చి పెట్టేవి — సంప్రదాయము, అనుభవాల నిలవ, జ్ఞాపకాల బూడిద. గత దినపు స్మృతులకు, గతకాలపు సుఖదుఃఖముల కన్నింటికిని ప్రతిదినమును మరణించు మనస్సే నిత్యనూతనము, నిర్మలము, అమాయికమును అయిన మనస్సు. అట్టి మనస్సునకు వయస్సులేదు. అట్టి అమాయికత లేకుండ, మీకు పదేండ్లున్నా, అరవయ్యేండ్లున్నా, దేవుని దర్శింపలేరు.

7 ఫిబ్రవరి, 1955

13

ధార్మిక జీవనము

మనలనందరిని, ముఖ్యంగా ప్రస్తుతం చదువుకొంటూ వుండి, త్వర లోనే బడి విడిచిపెట్టి బయటకు పోయి ప్రపంచాన్ని ఎదుర్కొన వలసి యున్న విద్యార్థులను ఎదుర్కొనే పెక్కు సమస్యలలో సంస్కరణ సమస్య ఒకటి. వివిధ వర్గముల ప్రజలు — సమాజవాదులు, సామ్యవాదులు ఇంకా రకరకాలైన సంస్కర్తలు — ప్రపంచంలో, స్పష్టంగా అవసరమని తెలిసియున్న కొన్ని మార్పులను తేవడానికై శ్రద్ధతో ప్రయత్నిస్తున్నారు. ఏవో కొన్ని శ్రేయోరాజ్యములున్నప్పటికిని ప్రపంచం మొత్తం మీద యింకను ఆకలి చావులు, పస్తులు తప్పడంలేదు. లక్షల కొలది ప్రజ లకు కట్టుకోడానికి తగినంత గుడ్డలేదు, నిద్రపోవడానికి తగినంత స్థలము లేదు. ఇందు కోసం, మరికొంత సంక్షోభము, మరికొంత దుఃఖము, మరికొంత సంఘర్షణ కలిగించ నట్టి సంస్కరణము ద్వారా సమూలా పరివర్తనము తేగలమా? ఎట్లు తేగలము? అసలు సమస్య అదికాదా? దేశచరిత్రను కొంతవరకు చదివి చూస్తే, నేటి రాజకీయాల పోబడిని గూడ గమనిస్తే మనము సంస్కరణమని దేనినంటామో అది యెంత వాంఛనీయమైనా యెంత ఆవశ్యకమైనా, తనతోబాటు ఎల్లప్పుడును సంక్షోభాన్ని, సంఘర్షణను వేరే రూపములలో తప్పకుండా గొని తెస్తుం దని మనకు స్పష్టమవుతుంది. మరి యీ విధంగా వచ్చే సంక్షోభము రాకుండా చేయడానికై ఇంకా ఎక్కువ శాసనములు చేయడం, ఇంకా ఎక్కువ ప్రతిబంధకములు, మరల ప్రతిబంధకములపై ప్రతిబంధకములు అవసరమౌతూ వుంటాయి. సంస్కరణ వలన క్రొత్త సంక్షోభములు ఏర్పడతాయి; వీటిని సరిచేయబోతే మరల మరికొన్ని సంక్షోభములు సృష్టిం పబడతాయి. ఈ విధంగా ఈ విషవలయము కొనసాగుతూనే వుంటుంది. ఇప్పుడు మనమెదుర్కొంటున్న సమస్య యిది. ఈ విధానానికి అంత

మున్నట్లు కనబడదు.

మరి యీ విషవలయాన్ని ఛేదించడ మెట్లాగ? అయితే సంస్కరణ అవసరమన్న విషయాన్ని మాత్రం మరిచిపోకండి. కాని యింకా ఎక్కువ సంక్షోభమును కల్పించకుండా, సంస్కరణ అనేది సాధ్యమా? ఏ కొంచెం ఆలోచనా పరుడగు వ్యక్తియైనా శ్రద్ధ తీసికోవలసిన ప్రధాన సమస్యలలో ఇది ఒకటిగా నాకు కనిపిస్తుంది. ఎటువంటి సంస్కరణ అవసరమనేది కాదు ప్రశ్న. ఏ స్థాయిలో అనేదిన్ని కాదు. మరల మరల సంస్కరణలను గోరుతూ వుండే ఇతర సమస్యలను పుట్టించకుండా, అసలేదైనా సంస్కరణమంటూ చేయడం సాధ్యమా అనేది ప్రశ్న. సంస్కరణల తరువాత సమస్యలు, వాటిని తీర్చడానికి మరల సంస్కరణలు — ఇట్టి అంతములేని యీ క్రమమును, ఈ విషవలయాన్ని, భంగము చేయడంకోసం ఎవరైనా ఏమి చేయాలి? చిన్న బడిలో గాని, పెద్ద విశ్వవిద్యాలయంలోగాని, — ఊహల రూపంలో గాకుండా, మాటలతో సిద్ధాంతములతో గాకుండా, కేవలం తర్కవితర్కములతో గాకుండా, దాని గురించి పుస్తకాలు వ్రాయడం ద్వారా గాకుండా, నేరుగా ఆ సమస్యను ఎదుర్కొనడం ద్వారా దానిని పరిష్కరించే మార్గమేదో తెలిసి కోవడం, తప్పకుండా విద్యయొక్క కర్తవ్యము. సంస్కరణమనే యీ విషవలయంలో మనిషి చిక్కుకొన్నాడు. ఇందులో ఒక సంస్కరణము మరియొక సంస్కరణమునకు దారి తీస్తూనే వుంటుంది. ఇటువంటి యీ విషవలయాన్ని ఛేదించక పోయినట్లయితే, మన సమస్యలకు పరిష్కారముండదు.

మరి యీ విషవలయాన్ని ఛేదించడానికి ఎటువంటి విద్య కావాలి? ఎటువంటి ఆలోచనావిధానము కావాలి? మనం చేసే పనులన్నిటిలోను సమస్యలు వృద్ధిపొందకుండా వుండవలెనంటే మన మెట్లు ఆచరించుకొనవలె? ఒక సంస్కరణము మరియొక సంస్కరణమునకు దారితీయునట్టి యీ జీవితవిధానమునుండి విముక్తినీయగల ఆలోచనా సరళి — అది యేదిశగాపోవునదైనను – ఉన్నదా? దానినే మరియొక విధంగా చెప్పితే, ప్రతిక్రియనుండి పుట్టని ఆచరణమంటూ ఉన్నదా?

అధిక దుఃఖమునకు దారితీయునట్టి యీ సంస్కరణ ప్రక్రియయే అవసరములేని జీవిత విధానమొకటున్నదని, నేననుకొంటున్నాను. దానిని ధార్మిక జీవనమని పిలువ వచ్చును. నిజముగా ధార్మికుడైన వ్యక్తికి సంస్కరణముతో సంబంధము లేదు. సాంఘిక జీవనమందు కేవలమేదో మార్పును తీసికొని రావడంలో అతనికి శ్రద్ధ లేదు. పైగా అతడు సత్యాన్వేషకుడు కాబట్టి అతని సత్యాన్వేషణయే సంఘమును మార్చి వేయగల శక్తి కలది. అందువలన విద్యార్థికి గూడ సత్యాన్వేషణలో తోడ్పడడమే విద్య యొక్క ప్రధాన కర్తవ్యము; కేవలము తత్కాలమందున్న సంఘము యొక్క చట్రములో ఇమడడంకోసం విద్యార్థిని తయారుచేయడం కానే కాదు.

మనం చిన్నవాండ్లముగా వున్నప్పుడే దీనిని అర్థముచేసి కోవడం చాల ముఖ్యమని నేననుకొంటాను. పెద్దవాండ్ల మయ్యేకొలది మనము మన చిన్నప్పటి అల్పములగు వినోదములను వేడుకలను, మన కామ వాంఛలను, క్షుద్రములైన ఆశలను ఆకాంక్షలను క్రమక్రమముగా విడిచి పెట్టసాగినప్పుడు — ప్రపంచమునెదుర్కొంటున్న బ్రహ్మాండమగు సమస్యలను మనము స్పష్టంగా చూడగలుగుతాము. అందుకేమైన ప్రతిక్రియ చేద్దామని, ఏదోవిధంగా పరిస్థితిని మెరుగు పరుద్దామని యెంతో కోరుకొంటాము. కాని మనము సంపూర్ణ ధార్మికులము కానిచో ఇంకా ఎక్కువ సంక్షోభాన్ని, ఇంకా ఎక్కువ దుఃఖాన్ని సృష్టిస్తాము. మరి నిజమైన మతమునకు పూజారులతో, పురోహితులతో, గుళ్ళతో, గోపురములతో, మతమందలి పిడివాదములతో, వ్యవస్థీకృతమగు విశ్వాసములతో ఎట్టి సంబంధమును లేదు. ఇవేవీ నిజమైన మతము కానే కాదు. ఇవన్నీ మనలను ఒక విశేషమైన ఆలోచనా పద్ధతికిని ఒక విశిష్టమైన ఆచరణ విధానానికిన్ని కట్టుబడి వుండునట్లు చేయడానికై సంఘముచే ఉపయోగింపబడు సాధనములు. అవన్నీ మన ఆశలను, భయములను, సులభముగా నమ్మెడి మన స్వభావమును సంఘము తన స్వార్థమునకై ఉపయోగించుకొనెడి సాధనములు. నిజమైన మతమనగా సత్యమును లేదా దేవుని అన్వేషించి కనుగొనడం. ఈ అన్వేషణకు అపరిమితమైన శక్తి

కావాలి, విశాలమగు బుద్ధి వుండాలి, సూక్ష్మ విచారణ చేయగలగాలి. ఈ విధంగా అప్రమేయమగు సత్యమును అన్వేషించడంలోనే సరియైన సంఘసేవ వున్నది. అంతేగాని ఏదో సంఘసంస్కరణమనబడే దానిలో లేదు.

సత్యమును కనుగొన వలెనంటె అఖండమగు ప్రేమ వుండవలె, అన్నింటితోను మనిషికి గల సంబంధమెట్టిదో దానిని గూర్చిన ఎఱుక ఉండవలె. అంటే తన వ్యక్తిగతమగు ప్రగతితోను, తన వ్యక్తిగతమగు కార్యసిద్ధులతోను అతనికి సంబంధము లేదు. సత్యాన్వేషణయే నిజమైన మతము; సత్యాన్వేషణ చేయువాడే ధార్మిక పురుషుడు. అట్టి మానవుడు తన ప్రేమకారణమున సమాజమునకు బాహ్యముగావుంటాడు. అందువలన సమాజము గురించి అతడేమి ఆచరించినా అది, సమాజములోనే వుంటూ దాని సంస్కరణతో సంబంధము పెట్టుకొన్న వాడాచరించెడి దానికి పూర్తిగా భిన్నమైనది. సంస్కర్త క్రొత్త సంస్కృతిని ఎన్నటికిని సృష్టింప లేడు. నిజమైన ధార్మికుడు చేయు సత్యాన్వేషణమే సరిక్రొత్త సంస్కృతిని స్వయంగా సృష్టింప గలుగుతుంది. అదొక్కటే మనకున్న ఆశ. చూడండి, సత్యాన్వేషణ వలన మనస్సులో భగ్గుమని సృజనాత్మకత ప్రజ్వరిల్లుతుంది. అదే నిజమైన క్రాంతి, నిజమైన తిరుగుబాటు. కారణమేమంటే యీ అన్వేషణలో మనస్సు సమాజముయొక్క ఆజ్ఞలు అనుమతుల చేత దూషితమై యుండదు. వాటినుండి విముక్తుడై యున్నందున ధార్మికుడు సత్యమును తెలిసికొనగలడు. ఏక్షణమున కాక్షణము జరిగెడి సత్య దర్శనమే నూతన సంస్కృతిని సృష్టింపగలదు.

అందువలన మీకు సరియైన విద్యాబోధన జరగడము చాల ముఖ్యము. అందు కోసం ముందు మీ అధ్యాపకుడు స్వయంగా సరియైన విద్యను పొందియుండవలెను. అప్పుడతడు విద్యాబోధనను కేవలము తనకొక జీవనాధార సాధనముగా భావింపడు. తానప్పుడు విద్యార్థికి మతసంబంధమైన పిడివాదములను విడిచి పెట్టడంలోను ఏ మతమునకును ఏ నమ్మకమునకును బందీకాకుండా వుండడంలోను తోడ్పడగలడు. మతము యొక్క

ఆధిపత్యము క్రిందనో లేదా కొన్ని ఆదర్శాలను పాటించడం కొఱకో ఒకటిగా చేరిన ప్రజలు సంఘసంస్కరణమీద శ్రద్ధ చూపుతారు. అట్టి సంస్కరణ కేవలము చెఱసాల గోడలను బాగుచేసి అలంకరించడం వంటిది. నిజమైన ధార్మిక పురుషుడే, నిజమైన తిరుగుబాటుదారు, నిజమైన క్రాంతివాది. అందుచేత మనలో ప్రతియొక్కడును నిజమైన ధార్మిక పురుషుడు కావడంలో తోడ్పడడమే విద్యయొక్క ప్రధాన కర్తవ్యము. ఆ మార్గమున పయనించితేనే మనకు విముక్తి కలదు.

1. ప్రశ్న:- సంఘసేవ చేయవలెనని నాకోరిక. కాని దానినెట్లా ఆరంభించ వలెనో తెలియదు.

కృష్ణమూర్తి:- సంఘసేవ ఎట్లా ఆరంభించాలి అనేది కాకుండ, అసలు మీ రెందుకు సంఘసేవ చేయగోరుతున్నారో తెలిసికోవడం చాల ముఖ్యమని అనుకొంటాను. ఎందుకని మీరు సంఘసేవ చేయగోరుతున్నారు? ప్రపంచంలో వుండే దుఃఖాన్ని చూచి — ఆకలి చావులు, రోగాలు, దోపిడీ విధానము, భయంకరమైన దారిద్ర్యము, దాని ప్రక్కన గల బహూశ్వైర్యము యొక్క క్రూరమైన ఉపేక్షాభావము, మానవుల మధ్యగల పరస్పర విరోధము — వీటినన్నిటిని చూచి సంఘసేవ చేయగోరుతున్నారా? అదేనా కారణము? మీ హృదయంలో ప్రేమ వుండడంచేత స్వార్థసిద్ధిని లెక్కచేయక, సంఘసేవ చేయగోరుతున్నారా? లేక మీనుండి మీరు తప్పించుకొని పారిపోవడం కోసం సంఘసేవ మీకొక సాధనమా? మీ కర్థమవుతున్నదా నేను చెప్పేది? ఉదాహరణకు, పూర్వాచారం ప్రకారం చేసే వివాహములోని అసౌందర్యమును చూచి, అందలి చెడును చూచి, "నేను పెండ్లి చేసికోను" అని చెప్పి, దాని బదులు సంఘసేవలో మునిగి పోదలచినారా? లేక సంఘసేవ చేయండని బహూశా మీ తల్లిదండ్రులు మిమ్ము ప్రేరేపించియున్నారా? లేక మీరొక ఆదర్శాన్ని పాటించదలచుకొన్నారా? మీరు చేసే సంఘసేవ మీ నుండి మీరు తప్పించుకొని పారిపోవడాని కొక సాధనంగా వున్నట్లయితే, లేక సంఘముగాని, నాయకుడు గాని, మతగురువు గాని

లేదా మీయంతటట మీరే నిర్దేశించుకొన్న ఆదర్శాన్ని మీరు కేవలం పాటిస్తున్నట్లయితే అప్పుడు మీరు చేసే సంఘసేవ ఏదైనా సరే అది మరికొంత దుఃఖాన్ని మరికొంత దైన్యాన్ని కలిగిస్తుంది. అట్లుగాక మీ హృదయంలో ప్రేమ వున్నట్లయితే, మీరు సత్యాన్వేషణ చేస్తూవున్నట్ట యితే, ఆ విధంగా మీరు నిజమైన ధార్మిక పురుషులైనట్లయితే, మీలో పేరాశ లేకపోతే, కార్యసిద్ధి ప్రధానమై దానికోసం మీరు ప్రాకులాడుతూ వుండకపోతే, మీయీ మంచి గుణం వలన పేరుప్రతిష్ఠలు రావాలని కోరుకోకపోతే, — అప్పుడు మీరు జీవించే జీవితమే సంఘములో సమూల పరివర్తనమును గొనితేవడంలో తోడ్పడగలదు.

ఇది అర్థంచేసికోవడం చాల ముఖ్యమని నేను అనుకొంటాను. ఇప్పుడు మీలో ఎక్కువ మంది చిన్న పిల్లలు. ఈవిధంగా మనం చిన్నపిల్లలంగా వున్నప్పుడు మనమేదో చేద్దామని అనుకొంటాం. సంఘ సేవ అనేది అందరు చెప్పకొంటూవుంటే మీరును వింటారు. దాని గురించి పుస్తకాలు వివరిస్తాయి, వార్తాపత్రికలు ప్రచారంచేస్తాయి. సంఘ సేవకులకు శిక్షణనివ్వడంకోసం పాఠశాలలుంటాయి. ఇంకా ఇట్లే ఏవేవో వుంటాయి. కాని చూడండి, ఆత్మజ్ఞానము లేకుండా అంటే మిమ్ము మీరు అర్థంచేసికోకుండా, మీకితరులతో గల సంబంధాలను అర్థం చేసికో కుండా మీరు చేసే సంఘసేవ యేదైనా సరే నోటిలో బూడిదలాగా నిరుపయోగమవుతుంది, పీడాకరమవుతుంది.

సంతోషియైన మానవుడే నిజమైన క్రాంతివాది; ఆదర్శవాదీ కాదు, దీనుడైన పలాయనవాదీ కాదు. సంతోషియైన మానవుడంటే ఎంతో ఆస్తి గలవాడు కాదు, ఏవేవో వస్తువులు గలవాడు కాదు. సంతోషి యైన మానవుడంటే నిజమైన ధార్మిక పురుషుడు. అతని జీవితమే సంఘసేవ. కాని అసంఖ్యాకమైన మామూలు సంఘసేవకులలో మీరును ఒకరైనట్లైతే, మీ హృదయము శూన్యముగా వుంటుంది. మీరు మీధ నాన్ని ఇతరులకు ఇచ్చి వేయవచ్చుగాక, ఇతరులను ఒప్పించి వారిచేత వారిధనాన్ని గూడ ఇప్పింప వచ్చుగాక, అద్భుతములైన సంస్కరణలను

మీరు సాధింప వచ్చుగాక; అయినను మీ హృదయము శూన్యమై మీ మనస్సు ఊహలతో సిద్ధాంతములతో నిండివున్నంత కాలము మీ జీవితము నిరానందము, నిరుత్సాహ పూరితము, పరిశ్రాంతము. కాబట్టి మొట్ట మొదట మిమ్ము మీరు అర్థము చేసికోండి. అప్పుడా ఆత్మజ్ఞానమునుండి సమ్యగాచరణము సహజంగా సిద్ధిస్తుంది.

2. ప్రశ్న:- మనిషి ఎందువలన మొండిదేటి, దయావిహీనుడౌతాడు?

కృష్ణమూర్తి:- అది చాలా తేలిక, కాదా? విద్య కేవలము పుస్తక జ్ఞానాన్ని అందజేయడము విద్యార్థిని ఉద్యోగానికి తయారుచేయడమే తన కర్తవ్యముగా ఎంచుకొన్నప్పుడు, కేవలము ఆదర్శాలను అతనిముందుంచి, స్వార్థమును సంపాదించుకొనుటయందే శ్రద్ధ చూపుమని బోధించినప్పుడు, మనిషి మొండిదేటి, దయావిహీనుడవడంలో సందేహము లేదు. చూడండి, మనలో చాల మంది హృదయాలలో ప్రేమ లేదు. మన మెప్పుడు మిలమిల మెఱసెడి నక్షత్రాలవైపు ప్రేమతో చూడము. గుసగుసలాడెడి నీళ్ళను చూచి ఆనందించము. జలజల ప్రవహించు సెలయేటి నీటిపై వెన్నెలల లాస్యాలు తిలకించము. ఆకాశములో ఎత్తుగా నెగిరెడి పక్షిని గూడ గమనించము. మన హృదయవీణ మూగవోయినది, అందులోనుండి సంగీతము వినిపించదు. మనకెప్పుడును తీరిక లేదు. మన మనస్సులు మానవకోటి సముద్ధరణకై వేసెడి పెద్ద పెద్ద ప్రణాళికలతో, ఉన్నతాదర్శ భావనలతో నిండియుంటాయి. అందులో మరిదేనికిని చోటులేదు. సౌభ్రాతృత్వము గురించి మనము నోటితో బాహాటముగా ప్రకటిస్తూ వుంటాము. కాని మన కంటిచూపు దానిని ప్రత్యాఖ్యానము చేస్తూ వుంటుంది. అందువలన మనకు బాల్యమందే సరియైన విద్యాబోధన జరగడం చాల ముఖ్యము. అప్పుడు మన మనస్సులు, మన హృదయములు విశాలములై సంవేదనాశీలములై సున్నితములై సోత్కంఠములై వుంటాయి. కాని మనలోనికి భయముచేరినప్పుడు ఆ ఉత్కంఠ, ఆ శక్తి, హఠాత్తుగా ప్రజ్వరిల్లెడి ఆ అవగాహన — అవన్నీ నాశనమై పోతాయి. మనలో చాల మంది భయపీడి

తులే. మనము మనతల్లి దండ్రులకు, మన ఉపాధ్యాయులకు, మత గురువుకు, ప్రభుత్వానికి, మన పై యజమానికి — అందరికీ భయపడతాము. అసలు మనలను చూచి మనమే భయపడుతూ వుంటాము. అందువలన మనకు జీవితమే భయంకరము అంధకారమయము. మనిషి నిర్దయుడగుటకు ఇదే కారణము.

3. ప్రశ్న:- మనస్సున కేది తోస్తే అది చేయకుండా నిగ్రహించుకొంటూనే, మనిషి తన స్వతంత్రమునకు దారివెదకికొన గలడా?

కృష్ణమూర్తి:- మనము బాల్యకౌమార దశలలో వున్నప్పుడే కాదు, జీవిత పర్యంతము, వాస్తవంగా మనమేమి చేయగోరుతామో తెలిసికొనడం చాల కష్టమైన పనులలో నొకటని మీకు తెలుసునా? అసలు మీరు త్రికరణ శుద్ధిగా, ఆసక్తితో ఏమి చేయగోరుతారో మీ యంతట మీరు తెలిసికోకపోతే, తుదకు మీకు బొత్తిగా ఆసక్తి లేనిపని యేదో చేస్తూ కాలం వెళ్ళ బుచ్చవలసి వస్తుంది. అప్పుడు మీ జీవితము దుర్గతి పాలౌతుంది. మీ జీవితంలో ఆనందము లేకపోవడంచేత సినిమాలలోనో, త్రాగుడులోనో, అసంఖ్యాకమైన పుస్తకాలు చదవడంలోనో, ఏదో యొక సంఘసంస్కరణ కార్యములోనో — ఇటువంటివాటిల్లో చిత్త విక్షేపము కొఱ కై ప్రయత్నిస్తారు.

అందువలన మీ తల్లిదండ్రులు, మీరున్న సంఘము మిమ్ము ఏపనైనా చేయుమని కోరితే వారి మాటను పట్టించుకోకుండా, నిజంగా మీరు మీ జీవితమంతా ఆసక్తితో చేయగోరిన పని యేదో తెలిసికోవడంలో అధ్యాపకుడు మీకు సహాయపడ గలడా? అసలిదే నిజమైన ప్రశ్న, కాదా? ఎందువల్లనంటే, మీరు మనః స్ఫూర్తిగా, ప్రేమతో ఏపని చేయగోరుతారో దానిని మీరు తెలిసికోగల్గినట్టయితే అప్పుడు మీరు స్వతంత్రమానవులు; అప్పుడు మీలో దానికి కావలసిన సామర్థ్యము, మనోధైర్యము, చొరవ వుంటాయి. కాని, మీరు నిజంగా దేనిని ప్రేమతో చేయగలరో తెలిసికోకుండా మీరు న్యాయవాదులో, రాజకీయనాయకులో

లేక ఇంకేదేదో అయినట్లయితే అప్పుడు మీకు సుఖముండదు, ఇతరులకు సుఖ ముండదు. ఆ వృత్తియే మిమ్ము మీరు నాశనం చేసికోడానికి, ఇతరులను నాశనంచేయడానికిన్ని సాధన మవుతుంది.

మీరు ప్రేమతో ఏపని చేయగోరుతున్నారో మీయంతట మీరు తప్పక తెలిసికోవాలి. సంఘంలో ఇమిడిపోవడం కోసమై అందుకు తగిన వృత్తిని ఎన్నుకొందామని ఎప్పటికిని అనుకోకండి. అట్లా అనుకొంటే మీరిష్టపడే వృత్తియేదో మీరెన్నటికిని తెలిసికోలేరు. మీరేదైనా పనిని ప్రేమతో చేయగోరితే, అప్పుడిక ఎన్నుకొనే సమస్యే లేదు. ఏపని మీదనైనా మీకు ప్రేమ వుంటే, మీరాప్రేమనే తనపని తాను చేసికోనివ్వండి. అప్పుడది యేమి చేసినా, అది సరియైన పనే అవుతుంది. కారణమేమంటే, ప్రేమ ఫలితంకోసం ప్రాకులాడదు; అనుకరణలలో చిక్కుకోదు. కాని మీరు ప్రేమించని పనికోసం మీ జీవితాన్ని అర్పిస్తే, మీ కెన్నటికిని విముక్తి వుండదు.

మనస్సున కేదితోస్తే అదిచేయడం, ప్రేమించిన పనిని చేయడంకాదు; ఆ పనిని ప్రేమతో చేస్తున్నట్లుకాదు. నిజంగా ఏపనిని మీరు ప్రేమతో చేయగోరుతున్నారో దానిని తెలిసి కొనవలెనంటే ఎంతో అన్వేషణ, ఎంతో లోచూపు అవసరం. కేవలం జీవనాధారము సంపాదించుకోడానికి అవసరమనే దృష్టితో మీరేపనినీ ఆరంభించకండి. కాని దేనిని మీరు ప్రేమతో చేయగలరో తెలిసికో గల్గినట్లయితే జీవనాధారమును గూర్చిన సమస్య దానంతట అదే తీరుతుంది.

4. ప్రశ్న:- పవిత్రమైన జీవితంగడిపేవారు మాత్రమే భయరహితులుగా వుంటారనేది నిజమా?

కృష్ణమూర్తి:- పవిత్రత, పాతివ్రత్యము, ఇంద్రియనిగ్రహము, సౌభ్రాతృత్వము, అహింస — ఇటువంటి ఆదర్శములను పెట్టుకోవద్దు; వాటి కర్థము లేదు. ధైర్యంగా వుండడం కోసం ప్రయత్నించవద్దు; అది కేవలం భయానికి ప్రతిక్రియ మాత్రమే. నిర్భయంగా వుండాలంటే అపారమగు

అంతర్దృష్టి వుండాలి; భయము అది పనిచేసే తీరు, దానికిగల కారణము — వీటిని గూర్చి పూర్తి అవగాహన వుండాలి.

చూడండి, మీరు భద్రతను కోరుకొంటూ వున్నంతకాలము భయ ముంటుంది — వివాహములో భద్రత, ఉద్యోగములో భద్రత, మీ పదవిలో, మీ బాధ్యతలో — జవాబు దారీలో — భద్రత, మీ ఉద్దేశములలో మీనమ్మకాలలో భద్రత, ప్రపంచంతో మీకుగల సంబం ధములో భద్రత, లేదా దేవునితో మీకుగల సంబంధములో భద్రత. ఏక్షణమందైతే మనస్సు, ఏరూపంలోనైనా సరే, ఏ స్థాయిలోనైనా సరే, భద్రతకోసం తన సంతృప్తికోసం ప్రయత్నిస్తుందో, ఆక్షణమునుండి తప్పని సరిగా భయముంటుంది. అందుచేత ఈ భయము పనిచేసే తీరు ఎఱిగియుండడం, దానిని అర్థము చేసికొనడం చాలముఖ్యము. ఇది పవి త్రత అని పిలువబడే దానికి సంబంధించిన విషయము కాదు. ఏ మన స్సైతే హెచ్చరిక గలిగి జాగరూకమై గమనిస్తూ వుంటుందో, ఏమనస్సైతే భయవిముక్తమో ఆమనస్సే అమాయికమైన మనస్సు. మరి అమాయిక మైన మనస్సు మాత్రమే సత్యమును పరమార్థమును, దేవుని అర్థము చేసికో గలదు.

దురదృష్టవశాత్తు ఈ దేశమునందు, ఇతరదేశములందువలె, ఆద ర్శములు అత్యధిక ప్రాముఖ్యమును వహించి యున్నాయి. ఆదర్శమంటే ఉండగోరిన స్థితి. "నేను అహింసావాదినై యుండాలి. నేను మంచి వాడనై యుండాలి" — ఇట్లాగా ఆదర్శము -- అంటే ఉండగోరిన స్థితి — ఎప్పటికిని చాలదూరమందు ఎక్కడనో వుంటుంది. అది ప్రస్తుతముండే స్థితికాదు. నిజానికి ఆదర్శములనేవి మనకొక శాపము వంటివి. కారణమేమంటే మీరు వాస్తవికాలను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు ఆదర్శములు అడ్డువచ్చి మిమ్మి సరిగా సరళంగా తిన్నగా ఆలోచించు కోనీయవు. ఆదర్శము అనగా ఉండగోరిన స్థితి అంటే దానిభావము ప్రస్తుతమున్న స్థితి నుండి తప్పించుకొని పారిపోవడం. ప్రస్తుతమున్న స్థితి ఒక తథ్యము, ఒక వాస్తవికము; దానికి మీరు భయపడుతుంటారు

— మీ తల్లిదండ్రులు ఏమంటారో అని, ప్రజలేమనుకొంటారో అని మీరు భయపడుతుంటారు. సంఘానికి భయపడతారు. వ్యాధికి భయపడతారు, మృత్యువుకు భయపడతారు. మరి మీరున్న ప్రస్తుత స్థితిని యథాతథంగా ఎదుర్కొంటే - అది మీకు దుఃఖమును కలుగజేస్తూ వున్నాసరే - దాని వైపు పరిశీలనగా లోతుగా మీమనోదృష్టిని సారించి చూస్తే దానిని మీరు అర్థము చేసికొంటే అప్పుడు మీ మనస్సు మిక్కిలి తేలిక పడుతున్నట్లు తేటదేరుతున్నట్లు గమనింపగలరు, ఆ విధంగా మనస్సు తేటదేరినప్పుడు భయము అంతర్ధానమవుతుంది. దురదృష్టవశాత్తు ఆదర్శములకు సంబంధించిన అసంగతములగు సిద్ధాంతములలో మనకు బోధన జరిగినది. కాని వాటి అన్నింటి ఉద్దేశమును ఒకటే - చేయవలసిన పనిని మరి యొకనాటికి వాయిదా వేయడమే. కావున అవి అన్నియు అర్థరహితములు, యుక్తియుక్తములు కావు.

ఉదాహరణకు, అహింస అనే ఆదర్శము మీకున్నది. కాని మీరు అహింసాపరులా? కాదు. కాబట్టి మీలోవున్న హింసనెందుకు ఎదుర్కొనరు? మీరున్న వాస్తవ పరిస్థితి నేల చూచుకొనరు? మీలో వున్న దురాశను, మీలో వున్న పేరాశను, మీరనుభవించు ఇంద్రియసుఖములను, మీ చిత్త విక్షేపములను పరిశీలించి చూచుకొని, వాటినన్నిటిని అర్థము చేసికొనసాగితే, అప్పుడు ప్రగతి కొరక సాధనంగా, ఆదర్శ సిద్ధికొరక సాధనంగా మీరూహించిన కాలము అంతమవడాన్ని మీరు గమనింప గలరు.

చూడండి, మనస్సు తాను సాధింపదలచిన దానిని సాధించడం కోసం అవసరమని కాలమును కల్పించుకొంటుంది. అందు వలన అట్టి మనస్సు ఎన్నటికిని ప్రశాంతముగా నిశ్చలముగా ఉండజాలదు. నిశ్చలమైన మనస్సు — దానివెనుక వేలకొలది సంవత్సరాల అనుభవాల రాసులు ఉన్నప్పటికిన్ని — అది అమాయికమైనది, నిర్మలమైనది, నిత్యనూతనమైనది. అందువలన అట్టిమనస్సు పరస్పర సంబంధములో తన యునికి వలన తలెత్తిన సమస్యలను తాను సులువుగా పరిష్కరించుకొనగలదు.

5. ప్రశ్న:- మనిషి తనకోరికలకు తాను బలి అవుతున్నాడు; అవి అనేక సమస్యలను సృష్టిస్తుంటాయి. అతడు కోరికలు లేని స్థితిని ఎట్లు సాధించుకొనగలడు?

కృష్ణమూర్తి:- కోరికలు లేని స్థితిని సాధింప గోరుకొనడం కేవలం మనస్సు చేసెడి కుయుక్తి. కోరికవలన దుఃఖము కలగడం చూచి, ఆ దుఃఖము నుండి తప్పించుకోవడం కోసం మనస్సు 'కోరిక లేని స్థితి'ని ఆదర్శంగా ఊహించికొని, "ఆ యాదర్శాన్ని ఎట్లా సాధించుకోగలను?" అని అడుగుతుంది. అప్పుడు జరిగే దేమిటి? కోరికలు లేకుండా వుండడంకోసం మీరు కోరికలను అణచుకోవడం మొదలు పెడతారు; ఏమి అట్లా చేయరామీరు? మీరు కోరిక యొక్క గొంతు పిసుకుతారు, దానిని అణచివేసి చంపడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు కోరికలులేని స్థితిని సాధించితిమని అనుకొంటారు — ఇదంతా వట్టి అబద్ధం, కేవలం భ్రాంతి.

కోరిక అంటే యేమిటి? అది ఒక శక్తి కాదా? మీ శక్తిని మీరు ఎప్పుడైతే అణగగొట్టుకొంటారో ఆ క్షణమే మిమ్మును మీరు ఉత్సాహ శూన్యులుగా, జీవము లేని వారినిగా చేసివేసికొన్నారు. అదే జరిగినది భారత దేశంలో! ధార్మిక పురుషులని చెప్పబడే వారందరు తమతమ కోరికల నిట్లే అణచివేసికొన్నారు. అట్లా చేయకుండా ఆలోచనాపరులై విముక్తి పొందినవారు చాలా కొద్ది మంది మాత్రమే!! కాబట్టి కోరికలను చంపుకోడంకాదు ముఖ్యము, కోరిక అనే శక్తిని అర్థముచేసికొని, దానిని సరియైన మార్గమున ఉపయోగించుకోవడం ముఖ్యం.

చూడండి, మీరు చిన్న పిల్లలుగా వున్నప్పుడు మీలో శక్తి పొంగి పొరలుతూ వుంటుంది — కొండలను దాటుదామని, చుక్కలను చేరుకొందామని. అది మీలో కోరికలను పుట్టిస్తుంటుంది. అప్పుడు సంఘము ప్రవేశించి మీరాశక్తిని చెఱసాల నాలుగు గోడల మధ్యనే పట్టిబంధించి వుంచమని ఆదేశిస్తుంది. ఆ చెఱసాలనే మర్యాద అని, గౌరవనీయత అని పేరుపెట్టి పిలుస్తుంది. విద్య ద్వారా, అనేక రూపములైన అదుపుల ద్వారా, అనుమతుల ద్వారా ఆ శక్తి క్రమేపి అణగద్రొక్కి వేయబడు

తుంది. కాని అసలు మీకు కావలసినది ఇంకా ఎక్కువ శక్తి, తక్కువ శక్తి కాదు. కారణమేమంటే, అపారమైన శక్తి గనక లేకపోతే, మీరు సత్యమును ఎన్నటికిని కనుగొనలేరు. కాబట్టి శక్తిని ఎట్లా అణచి వేసికోవాలి, ఎట్లా తగ్గించుకోవాలి అనేది కాదు ప్రశ్న. దానినెట్లా నిలుపుకోవాలి, ఎట్లా వృద్ధి పొందించు కోవాలి, నమ్మకము యొక్క గాని, సంఘము యొక్క గాని ఆదేశములతో సంబంధము లేకుండా ఆ శక్తినెట్లా స్వతంత్రముగను అవిచ్ఛిన్నముగను ప్రవర్తింపజేయాలి అనేది ప్రశ్న. అట్లా చేయగలిగితే, అదే సత్యముదిశగా, దేవుని దిశగా చేసెడి పయనమవుతుంది. అప్పుడు శక్తికి గల అర్థమే వేరుగా వుంటుంది. ప్రశాంతమగు సరస్సులో ఒకరాతిని విసరినప్పుడు వలయములు వలయము లుగా అలలు పుట్టి, ఆగి పోకుండా విశాలమవుతూ వ్యాపిస్తాయి. అట్లే సత్యము దిశగా శక్తిచేయు పయనము నూతన సంస్కృతి తరంగము లను సృష్టిస్తుంది. అప్పుడా శక్తి అనంతము, అప్రమేయము. ఆ శక్తియే దేవుడు.

8 ఫిబ్రవరి, 1955

ప్రశ్నల సూచి